www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

Joyalukkas
World's favourite jeweller
Shop online @ www.joyalukkas.com

శనివారం | 12-1-2019 | పేజీలు: 18 + 20 | వెల: రూ. 6.50 | సంపుటి: 59 సంచిక: 268 | శ్రీవిళంబినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: షష్ఠి రా. 10.05 తదుపరి సప్తమి; నక్షత్రం: పూర్వాభాద్ర ఉ. 8.44 తదుపరి ఉత్తరాభాద్ర; వర్జ్యం: రా. 7.17-9.02; దుర్ముహూర్తం: ఉ. 6.54-8.22; అమృతఘడియలు: తె. 5.50 మొదలు; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.54; సూర్యాస్తమయం: 5.54 | విజయవాడ సిటీ*

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai



పరంజ్యోతి

సహజ ధర్మాలు పాటిస్తేనే ఆనందం



ఈ చరాచర జగత్తులో భగవంతుడు అన్నింటికీ కొన్ని సహజ ధర్మాలు, హద్దులు, నియమ నిబంధనలు ఏర్పర చాడు. ఈ విషయంలో ప్రకృతే మనకు పరమ గురువు. నీరు ఎప్పుడూ పల్లానికే ప్రవహిస్తుంది. మంచు తెల్లగా, చల్లగా ఉంటుంది. శిలలు కఠినంగానే ఉంటాయి. వాయువు చలిస్తూనే ఉంటుంది. సూర్య చంద్రాదులు క్రమం తప్పకుండా క్షణం తేడా రాకుండా వెలుగును అందిస్తూనే ఉంటారు. ఋతుచక్రం క్రమబద్ధంగా పరిభ్ర మిస్తూనే ఉంటుంది. అందువల్లనే భూమి, దానిపై నివ శించే జీవ జాతులు క్షేమంగా ఉన్నాయి. నీరు, నిప్పు, గాలి వంటి పంచభూతాలు వాటి ధర్మాలను విడనాడవు. అవి హద్దు మీరితే ప్రళయమే. పశుపక్ష్యాదులు, మృగజాతులు కూడా వాటి సహజ ధర్మాలను అతిక్రమించవు. ప్రాణాల నైనా విడుస్తాయిగాని గోజాతి మాంసాహారం ముట్టుకోదు. పెద్దపులులు పరమాన్నం, పులిహోరల రుచి చూడవు. ఒక రీతి, రివాజు లేకుండా వ్యవహరించవు. సాధారణంగా అనారోగ్యం పాలుగావు. వాటికి వైద్యశాలలు అవసరం లేదు, చికిత్సలు చేయించుకోవు, వైద్యులకు లక్షల కొద్దీ బిల్లులు చెల్లించి కష్టాల పాలుగావు. ఇందుకు ప్రధాన కారణం.. అవి దైవశాసనాన్ని అనుసరించి వాటి ధర్మాను సారం ప్రవర్తించడమే. నిత్య జీవితంలో నియమనిబంధ నలు పాటించడమే. భూమ్మీద ఉన్న సకల జీవరాశుల లోనూ.. ఎన్నో తెలివి తేటలుగల్గి, విచక్షణ జ్ఞానం కలిగిన మానవుడు మాత్రమే సహజధర్మాలను మరచి ప్రవర్తించి కష్టాల పాలవుతున్నాడు. ఆనందానికి దూరమవుతు న్నాడు. మానవుడు పాటించని సహజధర్మాల్లో ప్రధానమైనది.. ఆహార విహారాదులలో విచ్చలవిడితనం. తాత్కాలిక సుఖాలకు ప్రాధాన్యత యిస్తూ, దీర్ఘకాలిక ఫలితాలను అంచనా వేసుకోకపోవడమే ఇందుకు కారణం. రెండోది.. మానవ ధర్మాలను అతిక్రమించడం. భగవంతుడు మాన వులకు కొన్ని ధర్మాలను నిర్దేశించాడు. వాటిని పాటిస్తూ పోతే మానవ జీవన స్రవంతి హాయిగా ఉంటుంది. మనం సుఖంగా, ఆనందంగా ఉంటాం. ఏమిటా ధర్మాలంటే.. సత్యం, అహింస, ప్రేమ, దయ, క్షమ, పరోపకారం వంటి సద్గుణాలు. ఈ సద్గుణాలే మానవుల సహజ లక్షణాలు. స్వార్థం, అసత్యం, హింస, అధర్మ ప్రవర్తన వంటివి మని షికి అసహజ, అస్వాభావిక లక్షణాలు. దేవుడు మనిషికి మాత్రమే ఇచ్చిన విచక్షణను మంచికి ఉపయోగించ కుండా ఇతరులకు కీడు చేసేందుకు (పరపీడనకు), స్వలా భానికి వినియోగించుకునేందుకు ఈ దుర్లక్షణాలన్నీ ఉపక రిస్తాయి. వీటి బారిన పడకుండా.. దైవ శాసనాన్ననుస రించి మన సహజ ధర్మాలను పాటిస్తూ, అసహజ లక్షణా లను విసర్జిస్తూ పోతే సుఖసంతోషాలతో జీవించగలు గుతాం. మనం ఆనందంగా ఉంటూ సాటివారిని ఆనం దంగా ఉంచగల్గుతాం.

- మాదిరాజు రామచంద్రరావు, 93933 24940

లోకం తీరు



చలికాలం

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
శ్రీకాకుళం	16.0	28.0
హైదరాబాద్	16.3	29.4
అనంతపురం	17.6	32.4
గుంటూరు	18.2	29.9
విజయవాడ	19.6	29.1
నెల్లూరు	20.0	30.0

మంచు ముసుగులో కోస్తా

విశాఖపట్నం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కోస్తాలో శుక్రవారం తెల్లవారుజాము నుంచి ఉదయం పది గంటల వరకు అనేకచోట్ల దట్టంగా మంచు కురిసింది. శివారు, ఏజెన్సీ ప్రాంతాల్లో ఈ మంచు మరింత ఎక్కువగా ఉంది. సముద్రం నుంచి తేమగాలులు వీస్తుండడం, ఇంకా ఉత్తరాది నుంచి చల్లని గాలులు కొనసాగడం, ఈ సీజన్‌లో రాత్రి వాతావరణం చల్లబడడంతో మంచు కురుస్తోందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. మరో రెండు, మూడు రోజుల వరకు మంచు కొన సాగుతుందని పేర్కొన్నారు. విశాఖ ఏజెన్సీలోని చింతపల్లిలో 9.5, అరకులోయలో 10 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



మీలో ఠాక్రే రక్తం ఉంటే.. కేబినెట్‌కు గుడ్‌బై చెప్పేవారు

బీజేపీ అధ్యక్షుడు అమిత్‌ షా మిమ్మల్ని దారుణంగా అవమానిస్తున్నారు. ఇంకా మీరు మహారాష్ట్ర ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్నారు. మీలో బాలసాహెబ్ (బాల ఠాక్రే) రక్తం ప్రవహిస్తుంటే.. ఆ తెగువ చూపి తర్వాతి రోజే మహారాష్ట్ర ప్రభుత్వం నుంచి వైదొలిగేవారు

- జయంత్ పాటిల్, మహారాష్ట్ర ఎన్సీపీ అధ్యక్షుడు



హైవేలపై లోపాల మలుపులను సరిదిద్దేందుకు రూ.20 వేల కోట్లు

హైవేలపై ప్రమాదకర మలుపుల వద్ద లోపాలు సరిచేసేందుకు రూ.20,000 కోట్లు ఖర్చు చేస్తున్నాం. ప్రమాదాలకు ప్రధాన కారణాల్లో ఇంజనీరింగ్ తప్పిదాలు ఒకటి. అటువంటి 'బ్లాక్ స్పాట్ల'ను ఇప్పటికే గుర్తించాం. అవసరమైన చోట అండర్‌పాస్‌లు, ఫ్లైఓవర్లు నిర్మిస్తాం.

- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

త్రీడీ పరికరంతో 'కీమో' చింతలు దూరం!

లాస్‌ఏంజెల్స్, జనవరి 11: కీమోథెరపీ పేరు చెబితే కేన్సర్ రోగులు భయపడుతూ ఉంటారు. జుట్టు ఊడిపోతుంది. వికారం, గుండెపోటు వంటి ఇబ్బందులు చికాకు పెడతాయి. అయితే కీమోథెరపీ వల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ లేని కొత్త త్రీడీ ప్రింటెడ్ పరికరాన్ని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. మోతాదు మించిన కీమోథెరపీ ఔషధాలు శరీరంలో ఇతర అవయవాలకు వ్యాపించకుండా కట్టడి చేస్తుంది.

ఏఐతో గర్భాశయ కేన్సర్ గుర్తింపు

వాషింగ్టన్, జనవరి 11: గర్భాశయ కేన్సర్‌తో చాలా మంది మహిళలు ప్రాణాలు కోల్పోతున్నారు. దీనిపై సరైన అవగాహన లేకపోవడం ఒక కారణమైతే.. ఆ వ్యాధి లక్షణాలను ముందుగానే గుర్తించే వ్యవస్థ లేకపోవడం మరో కారణం. అయితే కేన్సర్‌కు దారితీసే పరిస్థితులను వైద్యనిపుణులకంటే మెరుగ్గా కనిపెట్టే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)ను అమెరికాకు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ సంస్థ అభివృద్ధి చేసింది. దీనికి ఆటోమేటెడ్ విజువల్ ఎవల్యూషన్ అనే పేరు పెట్టారు. 9,400 మంది మహిళలపై 18 ఏళ్లుగా పరీక్షలు చేసి.. గర్భాశయ కేన్సర్‌కు ముందు పరిస్థితులను పక్కాగా అంచనా వేసి ఆ డేటాను ఏఐలో నిక్షిప్తం చేశారు. ఈ వివరాల ఆధారంగా వ్యాధి లక్షణాలకు ముందున్న పరిస్థితిని సరిగ్గా తెలుసుకోవచ్చనని శాస్త్రవేత్తలు తెలిపారు.

హరివిల్లును నేలకు దించి..

- ముగ్గులతో ముస్తాబైన విజయవాడ
- 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ముత్యాల ముగ్గుల పోటీ
- సంప్రదాయానికి పట్టం: మంత్రి ఉమా





ముగ్గుల పోటీల్లో రాష్ట్రస్థాయి విజేతలు మంజుల(తమిళనాడు); గౌతమి(కర్నూలు); సృజన(పశ్చిమ గోదావరి); విజయలక్ష్మి(గుంటూరు) చెక్కులు అందజేస్తున్న కృష్ణా కలెక్టర్ దంపతులు, జడ్పీచైర్‌పర్సన్ గద్దె అనురాధ, కనకదుర్గ గుడి ఈవో కోటేశ్వరమ్మ, ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ వక్కలంక రమణ

విజయవాడ, జనవరి 11(ఆంధ్రజ్యోతి): బెజవాడకు ముందుగానే సంక్రాంతి కళ వచ్చింది. తెలుగువారి తొలి పండగ జరుపుకొనేందుకు అందమైన ముగ్గులతో ముస్తాబయింది. 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ఆధ్వర్యంలో సంతూర్ గోల్డ్ ముత్యాల ముగ్గుల ఫైనల్స్ పోటీలు, టేస్ట్ పార్టనర్ గోల్డ్‌డ్రాప్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్ సెల్, హెల్త్ పార్టనర్ అమృత బిందు సహకారంతో విజయవాడ ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం సందడిగా ముగ్గుల పోటీలు జరిగాయి. రాష్ట్రంలోని 13 జిల్లాలతో పాటు తమిళనాడు, కర్ణాటక నుంచి 15 మం ది మహిళలు పాల్గొన్నారు. రంగుల హరివిల్లును కళ్ల ముందు సాక్షాత్కరింపజేసేలా భిన్న ఆకృతులతో రంగవల్లులను తీర్చి దిద్దారు. ముత్యాలముగ్గులు దిద్ది జిల్లాల్లో విజేతలుగా నిలిచిన వారికి రాష్ట్ర స్థాయిలో ఈ పో టీలు నిర్వహిం చారు. మంత్రి దేవినేని ఉమామహేశ్వ రరావు ప్రత్యేక అతిథిగా పాల్గొని పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలతో మహిళల్లో దాగిన ప్రతిభను 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' వెలుగులోకి తెస్తోందని మంత్రి అన్నారు. సంప్రదాయాలను కాపాడాలన్న ఉద్దేశంతో 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' మేనేజింగ్ డైరెక్టర్ రాధాకృష్ణ ప్రతి జిల్లాలోనూ ఈ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. విభజనానంతరం రాష్ట్రస్థాయి పోటీలను విజయవాడలో ఐదోసారి నిర్వహిస్తున్నారన్నారు. నగరీకరణ పెరుగుతున్నా సంప్రదాయ మూలాలను మరచిపోకూడదని మంత్రి ఉమా తెలిపారు. ముగ్గులు వేయడానికి ఎంతో నైపుణ్యం ఉండాలని ముఖ్యఅతిథి కృష్ణాజిల్లా కలెక్టర్ లక్ష్మీకాంతం అన్నారు. సృజనాత్మక శక్తితోపాటు ఓర్పు, నేర్పు అవసరమని, ఈ సుగుణాలన్నీ సొంతమైన స్త్రీలు ముత్యాల ముగ్గుల ద్వారా త మ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తుంటారని చెప్పారు. 'ఆంధ్రజ్యోతి' యాజమాన్యం కృషి అభినందనీయమన్నారు. 15 ఏళ్లుగా ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామని, ప్రస్తుతం 13 జిల్లాల స్థాయిలోని 83 కేంద్రాల్లో పోటీలు నిర్వహించి, జిల్లాకు ఒకరు చొప్పున ఎంపికచేసి వి జయవాడలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించామని 'ఆంధ్రజ్యోతి' అసిస్టెంట్ ఎడిటర్ వక్కలంక రమణ తెలిపారు. పోటీలకు విచ్చేసిన వారికి అభినందనలు తెలిపారు. ఈ పోటీలకు దుర్గ గుడి ఈవో వీ కోటేశ్వరమ్మ, కృష్ణాజిల్లా జడ్పీ ఛైర్‌పర్సన్ గద్దె అనురాధ తదితరులు అతిథులుగా హాజరయ్యారు.

విజేతలు వీరే..

సందడిగా సాగిన ముగ్గుల పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు అబ్బూరి రత్నలక్ష్మి, భారత మహిళా మండలి జీవితకాల సభ్యురాలు అబ్బినేని కాత్యాయని వ్యవహరించారు. గుంటూరు జిల్లా నరసరావుపేటకు చెందిన మార్కాపురం విజయలక్ష్మి ప్రథమ బహుమతి గెలుచుకొన్నారు. ఆమెకు రూ.30వేల నగదు ప్రోత్సాహకాన్ని అందించారు. ద్వితీయ బహుమతికి ముగ్గురిని ఎంపిక చేశారు. కర్నూలుకు చెందిన ఆర్ గౌతమి, పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన సీహెచ్ సృజన, తమిళనాడు నుంచి వచ్చిన టీ మంజుల రెండో స్థానంలో నిలవగా, ఒక్కొక్కరికీ రూ.10 వేలు ప్రోత్సాహకాన్ని అందించారు. అలాగే, పోటీల్లో పాల్గొన్న మిగతా 11 మందికి, ఒక్కొక్కరికి రూ. మూడు వేలు ప్రోత్సాహకాన్ని ఇచ్చారు.

ఈ సంతోషాన్ని మరువలేను



13 జిల్లాల నుంచి మేటి మహిళలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. వారందరినీ దాటుకుని ప్రథమ బహుమతి అందుకోవ డం జీవితంలో మరిచిపోలేను. చాలా ఆనందంగా ఉంది"

- విజయలక్ష్మి, ప్రథమ బహుమతి విజేత

మంచి పోటీ ఉంది..



"ఐదేళ్లుగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముగ్గుల పోటీ ల్లో పాల్గొంటున్నాను. 2017లో రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి సాధించాను. ఈ ఏడాది ద్వితీయ బహుమతి రా వడం చూస్తే ఈ పోటీలకు పెరుగుతున్న ఆదరణ ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది"

- ఆర్ గౌతమి, ద్వితీయ బహుమతి విజేత

హ్యాపీగా ఉంది



''నాలు గే ళ్లు గా 'ఆంధ్ర జ్యోతి-ఏ బీ ఎన్' ముగ్గుల పోటీల్లో పాల్గొంటు న్నాను. ఈ ఏడాది రాష్ట్రస్థాయి లో ద్వితీయ బహుమతి గెలుచుకోవడం సంతోషాన్నిచ్చింది. ఫైనల్స్ నిర్వహించిన తీరు బాగుంది. ముందుందు కూడా ఈ పోటీల్లో పాల్గొంటాను."

- సృజన, ద్వితీయ బహుమతి విజేత

కన్సొలేషన్ నుంచి ద్వితీయానికి..



"గత సంవత్సరం జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రోత్సాహక బహుమతి సాధించాను. ఈ ఏడాది ద్వితీయ బహుమతి రావడం ఆనందంగా ఉంది. వచ్చే ఏడాది ప్రథమ బహుమతి సాధిస్తానన్న నమ్మకం ఉంది. ముగ్గుల పోటీలు నిర్వహిస్తుండటంతో సంక్రాంతికి ముందే పండగ వాతావరణం కనిపించింది"

- మంజుల, ద్వితీయ బహుమతి విజేత

మా ఉద్యోగాలను క్రమబద్ధీకరించండి

- పర్యాటక శాఖ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ డిమాండ్

అమరావతి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): పర్యాటకశాఖలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సి. రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సంస్థలో 90 మంది పర్మినెంట్ ఉద్యోగులు ఉండగా, 640 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు, 550 మంది ఔట్ సోర్సింగ్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారన్నారు. అభ్యర్థనను పరిగణనలోకి తీసుకుని సిబ్బందిని క్రమబద్ధీకరించాలన్నారు.

ప్లాట్‌ఫాం టికెట్ ధర రెట్టింపు

విజయవాడ, జనవరి 11(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ రద్దీని సొమ్ము చేసుకోవడానికి దక్షిణ మధ్య రైల్వే సిద్ధమైంది. ప్రధాన స్టేషన్లలో ప్లాట్‌ఫాం టికెట్ ధరలను రెట్టింపు చేసింది. విజయవాడ, రాజమండ్రి, నెల్లూరు రైల్వేస్టేషన్లలో టికెట్ ధరను రూ.10నుంచి రూ.20కి పెంచారు. ఈనెల 20 వరకు అమల్లో ఉంటుంది.

అంతర్ జిల్లా టీచర్ల బదిలీకి ఓకే

అమరావతి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): అంతర్ జిల్లా టీచర్ల బదిలీకి సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారు. ఆయా ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేసి, డిప్యుటేషన్‌పై తిరిగి పాత పాఠశాలల్లోనే విధులు నిర్వహించేలా పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక సీఎస్ పంపిన ఫైలుపై ఆయన శుక్రవారం సంతకం చేశారు. బదిలీ కానున్నవారంతా ఇప్పుడు ఉత్తర్వులు అందుకున్నా, ఏప్రిల్ 23వరకు ప్రస్తుత స్కూళ్లలో పని చేస్తారని, ఆ తర్వాత కోరుకున్న ప్రదేశానికి వెళ్లవచ్చని ఎమ్మెల్సీ ఎ.ఎస్. రామకృష్ణ తెలిపారు.

ఏడుగురు ఐపీఎస్‌లకు పదోన్నతులు

- ఏడీజీలుగా రవిశంకర్, బాలసుబ్రమణ్యం, ఉజాలా, విశ్వజిత్

అమరావతి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పలువురు ఐపీఎస్ అధికారుల పదోన్నతులకు లైన్ క్లియర్ అయింది. ఐజీ, డీఐజీ, ఎస్పీ ర్యాంకు అధికారుల ప్రమోషన్లపై డీజీపీ ఠాకూర్ కసరత్తు పూర్తి చేశారు. పదోన్నతుల కమిటీ ఆమోదించడంతో ఫైలు సీఎం వద్దకు చేరింది. సీఎం సంతకం కాగానే ఐపీఎస్ పదోన్నతుల జీవో జారీ అవుతుంది. ఐపీఎస్ అధికారుల్లో 1991 బ్యాచ్‌కు చెందిన రవిశంకర్ అయ్యన్నార్(పీఅండ్ఎల్), కె.టి.ఉజాలా(హోంగార్డ్స్), కుమార్ విశ్వజిత్(ఎస్ఎల్‌పీఆర్‌బీ), బాలసుబ్రమణ్యం(కమిషనర్, రవాణాశాఖ) ఐజీ ర్యాంకు నుంచి అడిషన ల్ డీజీలుగా పదోన్నతి పొందనున్నారు. ప్రస్తుతం గ్రేహౌండ్స్ డీఐజీగా ఉన్న 2001 బ్యాచ్ ఐపీఎస్ అధికారి వినీత్ బ్రిజ్‌లాల్‌కు ఐజీగా పదోన్నతి లభించబోతోంది. శ్రీకాకుళం, విజయనగరం ఎస్పీలుగా పనిచేస్తున్న 2005 బ్యాచ్ ఐపీఎస్‌లు త్రివిక్రమ్ వర్మ, పాలరాజు డీఐజీలు కాబోతున్నారు. మూడేళ్లుగా విశాఖపట్నం రేంజ్ డీఐజీగా పనిచేస్తోన్న శ్రీకాంత్‌ను అక్కడి నుంచి బదిలీ చేసే అవకాశముంది. ఏలూరు రేంజ్ డీఐజీ రవికుమార్ మూర్తి ఈ నెలాఖరులో పదవీ విరమణ చేయబోతున్నారు. దీంతో ఏలూరు రేంజ్ డీఐజీని కూడా కొత్తగా నియమించాల్సి ఉంది.

22 మంది డిప్యూటీ కలెక్టర్లకు సీనియారిటీ

మరో 22 మంది డిప్యూటీ కలెక్టర్(డీసీ)లకు సీనియారిటీ ఖరారు చేస్తూ రెవెన్యూ శాఖ ప్ర త్యేక ప్రధాన కార్యదర్శి మన్మోహన్‌సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. 22 మందిలో 13 మంది డీసీలకు రిటైరైన తర్వాత సీనియారిటీ ఖరారవ్వడం విశేషం.

చరిత్రాత్మక వంతెనకు నేడే శ్రీకారం

- భారీ నీటిశుద్ధి ప్లాంట్‌కూ సీఎం శంకుస్థాపన
- రెండు ప్రాజెక్టుల విలువ రూ.2,127 కోట్లు

అమరావతి/పవిత్ర సంగమం(ఇబ్రహీంపట్నం), జనవరి 11(ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర రాజధాని అమరావతి నిర్మాణంలో కీలకమైన మరో రెండు ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం శ్రీకారం చుట్టబోతున్నారు. వీటిల్లో ఒకటి అమరావతిని కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నం వద్ద పవిత్ర సంగమ ప్రదేశానికి కలిపే ఐకానిక్ వంతెన కాగా.. రాజధాని వాసులకు నాణ్యమైన మంచినీటిని అందించేందుకు ఉద్దేశించిన భారీ పథకం రెండోది. అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) ఆధ్వర్యంలో మొత్తం రూ.2127.65 కోట్లతో నిర్మించే ఈ రెండింటికీ పవిత్ర సంగమ ప్రదేశం వద్ద శనివారం ఉదయం 10 గంటలకు సీఎంశంకుస్థాపన చేయనున్నారు. ఐకానిక్ వంతెన శంకుస్థాపన ఏర్పాట్లను మంత్రి దేవినేని ఉమామహేశ్వరారావు, జిల్లా కలెక్టర్ లక్ష్మీకాంతం తదితరులు శుక్రవారం పరిశీలించారు.



ప్రతిపాదిత ఐకానిక్ వంతెన నమూనా

ఐకానిక్ అనుసంధానం

ఉద్దండరాయునిపాలెం నుంచి ఇబ్రహీంపట్నం వద్ద పవిత్ర సంగమ ప్రదేశాన్ని కలుపుతూ 3.2 కిలోమీటర్ల పొడవు, 125 మీటర్ల వెడల్పుతో ఐకానిక్ వంతెనను ఏర్పాటు చేస్తున్నారు. ఇది పూర్తయితే మచిలీపట్నం-హైదరాబాద్, ఇబ్రహీపట్నం-జగదల్‌పూర్ హైవే (ఛత్తీస్‌గఢ్)ల మీదుగా అమరావతికి వయా విజయవాడ వచ్చే వాహనాలకు 40 కి.మీ. దూరం, 2 గంటల ప్రయాణ సమయం తగ్గుతుంది. ట్రాఫిక్ రద్దీ నుంచి విజయవాడకు ఉపశమనం కలుగుతుంది. రాజధాని స్టార్టప్ ఏరియాతోపాటు సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టులకు రాకపోకలు సాగించే వారికి ఇది ఎంతో సౌకర్యంగా ఉంటుంది. మొత్తం 6 వరుసలతో ఏర్పాటయ్యే వంతెన నిర్మాణ వ్యయం రూ.1387 కోట్లు. 2.72 కిలోమీటర్లు మేర పిల్లర్లు ఉంటాయి. 480 మీటర్లు కేబుల్‌పై ఆధారపడి వంతెన ఉంటుంది. కూచిపూడి నృత్యభంగిమను తలపించే ఫైలాన్ 170 మీటర్ల ఎత్తుతో దేశంలోనే అత్యంత ఎత్తయినదిగా పేరొందనుంది. దీనికి నిర్మించబోయే ఫైల్స్ లోతు నదిలో 40 నుంచి 50 మీటర్ల వరకూ ఉంటుంది. ఇరువైపులా 2.50 మీటర్ల వెడల్పుతో ఫుట్‌పాత్‌లు ఉంటాయి. అంతర్గత జలరవాణా మార్గంగా అభివృద్ధి చెందనున్న కృష్ణానదిలో భవిష్యత్‌లో ప్రయాణించే భారీ సరుకు పడవలకు ఎటువంటి ఇబ్బందులు ఎదురుకాని రీతితో వంతెనను డిజైన్ చేశారు. ఎల్ అండ్ టీ దీనిని రెండేళ్లలో పూర్తి చేస్తుందని భావిస్తున్నారు.

35 లక్షల మందికి సరిపడేలా..!

అమరావతిలో 2050 నాటికి 35 లక్షల మంది ఉంటారని అంచనా వేస్తున్నారు. వారికి అవసరమైన 950 ఎం.ఎల్.డి(మిలియన్ లీటర్స్ పర్ డే)ల కృష్ణా నది నీటిని అధునాతన పద్ధతుల్లో శుద్ధి చేసి అందించేందుకు రూ.740.65 కోట్లతో భారీ నీటిశుద్ధి ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం వెంకటపాలెం వద్ద ఉన్న మంతెన సత్యనారాయణరాజు ప్రకృతి ఆశ్రమానికి సమీపంలో కృష్ణానదిలో 13 మీటర్ల వ్యాసార్థంతో ఉండే 2 ఇన్‌టేక్ వెల్ కం రా వాటర్ పంప్‌హౌస్‌లను ఏర్పాటు చేస్తారు. అక్కడి నుంచి నదీజలాలను 2,000 మిల్లీమీటర్ల వ్యాసార్థం, 2.1 కిలోమీటర్ల పొడవైన రా వాటర్ ట్రాన్స్‌మిషన్ మెయిన్ వ్యవస్థ ద్వారా కృష్ణాయపాలెం వద్ద ఏర్పాటు చేసే నీటి శుద్ధి ప్లాంట్ (ప్లేట్ సెటిలర్)కు చేరుస్తారు. ఈ పథకం కాంట్రాక్ట్‌ను ఎన్.సి.సి. సంస్థ దక్కించుకుంది. ఏడాదిన్నరలో ఇది పూర్తవ్వాల్సి ఉంది.

సాహసమే..



చుట్టూ పచ్చదనంతో నిండిన గిరిశిఖరాలు.. ఆ శిఖరాల నుంచి.. నల్లని బండరాళ్ల మీదుగా పాలనురగలు కక్కుతూ జాలువారే జలపాతం.. మరోవైపు ఎముకలు కొరికే చలి.. ఇలాంటి వాతావరణంలో కొండ మీద నుంచి జలపాతం పక్కగా తాళ్లతో దిగడం నిజంగా సాహసమే!!. ఇదీ.. ప్రస్తుతం విశాఖ ఏజెన్సీలో ప్రముఖ పర్యాటక కేంద్రమైన అనంతగిరి మండలం కటికి జలపాతం వద్ద నెలకొన్న సందడి. శుక్రవారం ఇక్కడ ప్రపంచ స్థాయి ర్యాపెలింగ్ (తాళ్లతో కిందకి దిగడం) పోటీలు ప్రారంభమయ్యాయి. నాలుగు రోజుల పాటు ఈ పోటీలు జరగనుండగా, 11 దేశాల నుంచి సుమారు 150 మంది ఔత్సాహికులు పాల్గొనే అవకాశముంది.

- అనంతగిరి



www.andhrajyothy.com
విజయవాడ సిటీ
ఆంధ్రజ్యోతి



శనివారం | 12-1-2019

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai

పెన్షన్ 2 వేలు!

వచ్చే నెల నుంచే ఇస్తాం.. జనవరిదీ కలిపి రూ.3 వేలు

వృద్ధులకు నేనిచ్చే సంక్రాంతి కానుక ఇది

ఏప్రిల్ నుంచి వైద్యానికి 5 లక్షలు: సీఎం

సీఎం వరాల వెల్లువ



జన్మభూమి సభలో సీఎం చంద్రబాబుతో విద్యార్థినుల సెల్ఫీ

సంక్షేమ సంక్రాంతి!

పండగ చేసుకోండి!

అన్నిరకాల పింఛన్లు రెట్టింపు



సిద్ధమవుతున్న మరిన్ని వరాలు

పాడి పశువుకు 30 వేల బీమా

ఇంటింటికీ స్మార్ట్ ఫోన్ పంపిణీ

డ్వాక్రా మహిళలకు మరో 10వేలు

ఆటోలు, ట్రాక్టర్లపై పన్నులన్నీ రద్దు

15

సంక్రాంతికి ముందే 'సర్కారు సంబరాలు' తీసుకొచ్చింది. రాష్ట్ర ప్రజలకు వరాల మీద వరాలు ప్రకటించేందుకు సిద్ధమైంది. 'సంక్షేమ అస్త్రాలకు' ఎన్నికల ముందు మరింత పదును పెడుతోంది. వృద్ధుల నుంచి దివ్యాంగుల వరకు... నేత నుంచి గీత దాకా... పాడిరైతు నుంచి ఆటో డ్రైవర్ వరకు అనేక వర్గాల వారికి లబ్ధి చేకూర్చేలా 'సంక్షేమ సంక్రాంతి' తెస్తోంది. 'ఎన్టీఆర్ భరోసా' కింద అందిస్తున్న అన్నిరకాల సామాజిక పింఛన్లను రెట్టింపు చేశారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం 'జన్మభూమి' సభలో అధికారికంగా ప్రకటించారు. అలాగే... అతి త్వరలో ప్రతి పేద కుటుంబానికి ఉచితంగా స్మార్ట్‌ఫోన్ అందించాలని భావిస్తున్నారు. పాడికీ అండగా ఉండేలా పశువులకూ బీమా కల్పించాలని యోచిస్తున్నారు. రైతుకు అదనపు ఆదాయాన్ని ఇచ్చే పాడి పశువు చనిపోతే రూ.30 వేలు చెల్లిస్తారు. డ్వాక్రా మహిళలకు 'పసుపు కుంకుమ' కింద అదనంగా రూ.10వేలు చెల్లించాలని భావిస్తున్నారు. ఇక... వ్యవసాయంలో రైతులు విరివిగా ఉపయోగించే ట్రాక్టర్లు, బడుగులు ఉపాధి కోసం ఉపయోగించే ఆటోలపై అన్నిరకాల పన్నులను రద్దు చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది.

ఏప్రిల్ నెలాఖరులో **ఎంసెట్!** 13

నేడు 'సెట్స్' షెడ్యూల్

విడుదల చేయనున్న మంత్రి గంటా

అంతర్ జిల్లా టీచర్ల **బదిలీకి ఓకే** 2

ఐకానిక్ బ్రిడ్జికి **నేడే శ్రీకారం**

వీసా భరోసా

హెచ్1బీతో అమెరికా పౌరసత్వం!

త్వరలో నిబంధనల సరళీకరణ.. నైపుణ్యం ఉన్నవారికి చాన్స్

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన.. ప్రవాసీలకు ఊరట

హెచ్1బీ వీసాదారుల్లో అనిశ్చితికి తెరపడే అవకాశం 14



హెచ్1బీ... దక్కడమే గగనం. అలాంటి వీసాకు స్థిరత్వం వస్తే.. ఏకంగా అమెరికాలో పౌరసత్వానికి వీలు కల్పిస్తే..! ఆ మాట వలస విధానంపై నిత్యం రుసరుసలాడే డొనాల్డ్ ట్రంప్ నోటి వెంట వస్తే..? ఊహకు కూడా అందనిది... ఇప్పుడిది వాస్తవరూపం దాల్చే అవకాశాలు కన్పిస్తున్నాయి. వేల మంది టెకీల్లో కొత్త ఆశలు చిగురించే ప్రకటన ఇది.. అమెరికాలో శాశ్వత పౌరసత్వం కోసం కళ్లు కాయలు కాచేలా చూస్తున్న లక్షల మందికి తీయని కబురు ఇది!



వైదొలగిన వర్మ!

ఉద్యోగానికి రాజీనామా

2017లోనే రిటైరయ్యా 14

అగ్నిమాపక డీజీగా సరిపోను

రాజీనామా లేఖలో వ్యాఖ్యలు


'గోడ' గొడవ

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యవహారశైలి విచిత్రమైనది. 'గోడ కట్టడానికి సరేనంటారా, లేక ప్రజలను పస్తులుంచమంటారా?' అని విపక్షంతో యుద్ధానికి దిగాడాయన. అమెరికా –మెక్సికో సరిహద్దు గోడ విషయంలో ఆయన ధోరణి దేశాధ్యక్షుడి స్థాయికి తగినట్టుగా లేదు. ఇరవైరోజులుగా దేశం పాక్షికంగా స్తంభించిపోతే, వ్యవస్థలన్నీ వరుసగా నిర్వీర్యమైపోతుంటే, ఆయన మాత్రం తన 'అద్భుతమైన, ఎత్తయిన గోడ' కోసం దేశంలో అత్యయిక స్థితి ప్రకటించడానికి సైతం సిద్ధమంటున్నారు. అడ్డుగోడకు అవసరమైన ఐదు బిలియన్ డాలర్ల మంజూరుకు సంబంధించి ఇప్పటికే విపక్ష డెమొక్రాట్లతో పలుస్థాయిలో జరిగిన చర్చోపచర్చలు విఫలమై, ప్రభుత్వ పాక్షిక స్తంభనకు దారితీసింది. మూతబడుతున్న ప్రభుత్వ శాఖలను తిరిగి తెరిపించేందుకు ప్రతినిధుల సభ నిధుల మంజూరుకు ఆమోదముద్ర వేసింది. బిల్లుకు అధ్యక్షుని ఆమోదం తప్పనిసరి కనుక ప్రతినిధుల సభ స్పీకర్‌తో అధ్యక్షుడి ముఖాముఖి సమావేశం ఏర్పాటైంది. 'బిల్లుమీద సంతకం చేస్తే గోడ కట్టడానికి అవసరమైన నిధులు ఇస్తారా?' అన్న ట్రంప్ ప్రశ్నకు నాన్సీ పెలోసీ 'నో' అనగానే, 'మీతో మాట్లాడటం టైమ్ వేస్ట్' అని ట్రంప్ చర్చలనుంచి బయటకు వచ్చేశారు. 'ఇస్తారా, చస్తారా?' అంటున్న ట్రంప్ తాను పాలకుడిననీ, ప్రజలకు జవాబుదారీనన్న విషయాన్ని మరిచిపోయినట్టు ఉన్నారు.

ఎవరిమీదో ఆగ్రహంతో తన ప్రజలను ఇక్కట్ల పాల్జేస్తున్నారు ట్రంప్. డెమొక్రాట్లను సాధించలేక ప్రజలను శిక్షిస్తున్నారు. పాలన పాక్షికంగా నిలిచిపోయి పదిలక్షలమంది ఉద్యోగులకు వేతనాలు రాని స్థితిలో సైతం అధ్యక్షుడికి ఉన్న అపరిమితమైన అధికారాలను దుర్వినియోగం చేయడానికే ఆయన ప్రాధాన్యం ఇస్తున్నారు. డెమొక్రాట్ల చేత బలవంతంగా వారు వ్యతిరేకిస్తున్న గోడ నిర్మాణానికి ఒప్పించడానికి ట్రంప్ ఒక అమానవీయమైన పరిస్థితిని వాడుకుంటున్నారు. ప్రతినిధుల సభ మధ్యంతర నిధులను ఆమోదించినప్పటికీ తాను మాత్రం సంతకం చేయనని ఆయన ముందే ప్రకటించడంతో సెనేట్‌లో ఆధిపత్యం ఉన్న రిపబ్లికన్లు బిల్లు తొక్కిపెట్టేశారు. సెనేట్ సరేనన్నా అధ్యక్షుడు మొండికేస్తే బిల్లు ప్రయోజనం నెరవేరదన్నది అటుంచితే, రిపబ్లికన్లు సైతం ప్రజల పక్షాన కాక ట్రంప్ వెనుక నిలవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. ట్రంప్‌తో గొడవెందుకనో, రాజకీయ కారణాలతోనో వారు ఈ పనిచేసి ఉండవచ్చును కానీ, ఒక ప్రధాన రాజకీయపక్షం ప్రజలకోసం కాక ఒక వ్యక్తికోసం ఇలా ప్రవర్తించడం అప్రదిష్ట తెచ్చేదే. సెనేట్ సభ్యులు రాజ్యాంగబద్ధంగా కాక, రాజకీయంగా వ్యవహరిస్తున్నారన్నది వాస్తవం. ప్రతినిధుల సభ ఆమోదించిన బిల్లును సెనేట్ ఆమోదించడమో, తిరస్కరించడమో చేయవలసి ఉండగా చర్చకు కూడా రానివ్వకపోవడం విచిత్రం. సెనేట్‌లో ఎంతమంది రిపబ్లికన్లు బిల్లు ఆమోదానికి సానుకూలంగా ఉన్నారన్న లెక్కలు అటుంచితే, కనీసం బిల్లుకు సరేనని అధ్యక్షుడికి పంపివుంటే పార్టీ పరువు కొంతైనా మిగిలేది. బిల్లును ట్రంప్ అడ్డుకుంటే, అది అధ్యక్షుడికీ విపక్షానికీ మధ్య యుద్ధంగా మాత్రమే ప్రజల దృష్టిలో మిగిలేది. గోడ నిధుల కేటాయింపునకూ, ప్రభుత్వశాఖల బడ్జెట్‌కూ మధ్య లంకె పెడుతూ ట్రంప్ ఆరంభించిన ఈ యుద్ధానికి సుదీర్ఘ చరిత్ర ఉన్న పార్టీ అండగా నిలవడం దురదృష్టకరం.

విపక్షాన్ని ఇరకాటంలోకి నెట్టేసి, దానిని విలన్‌గా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు ట్రంప్. భద్రత పేరిట ఆయన దేశ చరిత్రలోనే రెండవ అతిపెద్ద ప్రతిష్ఠంభనను సృష్టించారు. గోడ ఖర్చు మొత్తం మెక్సికోతో కక్కిస్తానని నిన్నమొన్నటి వరకూ గర్జించారు. ఇప్పుడది అసాధ్యమని తేలిపోవడంతో ఎన్నికల హామీ నెరవేర్చుకోవడానికి తన ప్రజల సొమ్ము మీద పడ్డారు. అవసరమైతే అధ్యక్ష అధికారాలు ప్రయోగించి దేశ రక్షణ నిధులు వాడేస్తానని కూడా హెచ్చరిస్తున్నారు. గోడ నిర్మాణం అమెరికా విలువలకు, ఘనచరిత్రకు అప్రదిష్ట తెచ్చిపెడుతుందనీ, గోడలు కట్టినంత మాత్రాన వలసల నివారణ పూర్తిగా సాధ్యం కాదనీ, మెక్సికో వలసదారులను నిలువరించడానికి ప్రత్యామ్నాయ మార్గాలు అనేకం ఉన్నాయని డెమొక్రాట్లు అంటున్నారు. ఇందుకు సంబంధించి కొన్ని ప్రతిపాదనలతో వారు చర్చలకు సిద్ధపడ్డారు. కానీ, 'గోడ'తో ముడివడిన తన వ్యక్తిగత ప్రతిష్ఠకు మాత్రమే ట్రంప్ ప్రాధాన్యం ఇస్తున్నారు. డెమొక్రాట్ల మద్దతు లేకుండా గోడ అసాధ్యమని ట్రంప్‌కు తెలుసు. ట్రంప్ ప్రతిపాదనకు సరేననకుంటే ఆయన గోడదిగడనీ, ఈ ప్రతిష్ఠంభన తొలగదనీ డెమొక్రాట్లకు తెలుసు. ఉభయులూ దేశశ్రేయస్సు పేరిట ప్రజలను శిక్షిస్తున్న విచిత్ర ఘట్టం ఇది.

జ్ఞాన విప్లవకారుడు



"వేదవాని కష్టంతో పైకి వచ్చి వారి బాగోగులను పట్టించుకోని ప్రతివాడు దేశద్రోహి. సంపద సృష్టికర్తలైన శ్రామికులే ఈ దేశ ఆశాకిరణాలు' – ఈ వ్యాఖ్యలు చదువగానే వర్గసంఘర్షణ సిద్ధాంత ప్రవక్త కార్ల్‌మార్క్స్ నిర్దేశించిన మార్గంలో నూతన ప్రజాస్వామిక సమాజాన్ని నిర్మిస్తామనే విప్లవకారులు చేసినవి అని అనుకుంటారు. జడప్రాయంగా ఉన్న సమాజాన్ని మృతప్రాయంగా ఉన్న వ్యవస్థకు కొత్త ఊపిరిపోసి, కొత్త నెత్తురు ఎక్కించిన పునరుజ్జీవన, జాతీయోద్యమ, విప్లవోద్యమ కేంద్రస్థానమైన బెంగాల్ మాగాణంలో ఉద్భవించిన వివేకానందుడు ఘోషించిన మాటలవి. 18, 19 శతాబ్దాల్లో స్తబ్ధమైన భారతీయ సమాజాన్ని మేల్కొల్పడానికి రాజారామ్‌మోహన్‌రాయ్, కేశవచంద్రసేన్, దయానందసరస్వతి సారథ్యంలో కొనసాగిన సంస్కరణోద్యమాన్ని వివేకానందుడు గొప్ప ముందడుగు వేయించాడు. 'జ్ఞాన పిపాసే మోక్షానికి సాధన' అన్న ఉపనిషత్తులను హేతువాదం, వివేకం, మానవవాదాలు మేధో హృదయాలుగా ఉన్న బౌద్ధ ధర్మాన్ని, ఇంకా అనేక పాశ్చాత్య చింతనా ధోరణులను స్ఫూర్తిగా తీసుకొని స్పష్టమైన దృక్పథంతో కార్యాచరణతో సమత జ్ఞాన విప్లవాన్ని వివేకానందుడు ఆరంభించాడు. 1863 జనవరి 12న కలకత్తా నగరంలో మధ్య తరగతి కుటుంబంలో వివేకానందుడు జన్మించాడు. బాల్యం నుండే విద్యా, క్రీడల్లో చురుకుగా రాణించాడు. 1883లో కలకత్తా ప్రెసిడెన్సి కాలేజీ నుండి పట్టభద్ర పట్టా పుచ్చుకున్నాడు. తత్వ శాస్త్రం పై ఇష్టంతో పాశ్చాత్య తత్వచింతనా పరులైన జాన్ స్టువర్ట్ మిల్, హెర్బర్ట్ స్పెన్సర్, హెగెల్ దర్శనాలను యువ వివేకానందుడు శ్రద్ధగా అధ్యయనం చేసాడు. తనలో తీవ్రమవుతున్న జ్ఞాన పిపాసకు, దైవము, మానసమాజం పై వస్తున్న అనేక సందేహాలను 'మానవ సేవే మాధవసేవ" అని ప్రవచించిన రామకృష్ణ పరమహంస దగ్గర నివృత్తి చేసుకొని, ఆయన శిష్యుడిగా మారాడు. ప్రజల మధ్య జీవించి వారి కష్టసుఖాలను తెలుసుకొని, బాధల నుంచి వారిని విముక్తి చేసేవారే చరిత్రలో నిర్మాతలుగా, తత్వవేత్తలుగా మిగిలిపోతారు. ఈ వెలుగులో 1888 నుండి 1892 వరకు వివేకానందుడు ఆసేతు హిమాచలం పర్యటించాడు. తన కాలపు ప్రజలు విద్యకు, విజ్ఞానానికి దూరంగా మూఢవిశ్వాసాలకు ,దారుణ సాంఘిక దురాచార కబంధహస్తాల్లో నలిగిపోవడం చూసాడు. ఉపనిషత్తులు, జైన, బౌద్ధ మతాలు విలసిల్లి ప్రపంచానికి శతాబ్దాలపాటు జ్ఞాన కాంతులు ప్రసరించిన భారతదేశం కాల వైపరీత్యాలకు లోనై ఔన్నత్యాన్ని కోల్పోయిందని వివేకానందుడు గ్రహించాడు. శ్రామికులు, స్త్రీల పట్ల అంతులేని వివక్షత కొనసాగుతుందని, యువత నిస్తేజంగా మారిపోయిందని, నైతికంగా, భౌతికంగా భారత జాతి నిర్వీర్యం అయిందని గ్రహించాడు. భారతీయ మూలాల నుండి నిజమైన వేదాంత దృక్పథాన్ని రూపొందించి, జాతి, మత పరమైన అన్ని రకాల అధిపత్యాలను, రూపుమాపే ప్రజాస్వామిక సిద్ధాంతంగా మార్చాడు. 1893లో చికాగో నగరంలో ప్రపంచ మత సదస్సుకు హాజరై భారతీయ తత్వసారాన్ని అద్భుత రీతిలో తెలియజేసి, ప్రపంచాన్ని ఆకట్టుకున్నాడు. 1894 నుంచి 1897 వరకు అనేక పశ్చిమ దేశాలలో పర్యటించి, వేదాంత సారాన్ని బోధిస్తూ, భారతదేశాన్ని పేదరికం, అజ్ఞానం నుంచి ఉద్ధరించడానికి సహాయ సహకారాలను వివేకానందుడు అభ్యర్థించాడు. కలకత్తా, మద్రాసు నగరాలలో ఆశ్రమాలను, విద్యాలయాలను స్థాపించాడు. సమస్త సామాజిక రుగ్మతలను రూపుమాపడానికి, సౌఖ్యమైన భౌతిక మానసిక వికాస జీవనానికి తోడ్పడే నాగరికత సంస్కృతులను పెంచడానికి విద్య, విముక్తిదాయినిగా పనిచేస్తుందని, పశ్చిమ దేశాల అనుభవం నుంచి వివేకానందుడు గ్రహించాడు. తన దైన విద్యాతత్వ శాస్త్రాన్ని రూపొందించి, విద్యావ్యాప్తికి కృషి చేశాడు. మనిషి లో నిగూఢమై ఉన్న పరిపూర్ణత్వాన్ని వ్యక్తం చేయించేది విద్య అని వివేకానందుడు నిర్వచించాడు. జీవితాన్ని నిర్మించడమూ, సద్గుణ సంపన్నులైన మనుషులను రూపొందించడమూ విద్య ఆశయాలుగా ఆయన పేర్కొన్నాడు. విద్యలో సమాన అవకాశాలను కల్పించిన ప్రాచీన నలంద, తక్షశిల, విక్రమశిల, వల్లభి విద్యలయాల సుసంపన్న మహత్తర సంప్రదాయాన్ని పునఃప్రతిష్ఠింపచేయాలని, ప్రభుత్వము, పౌర సమాజం విద్యను అందించడమే ప్రథమ కర్తవ్యంగా చేపట్టాలని ప్రజలను చైతన్యవంతం చేశాడు. ఆ నాటి సమాజంలో వ్యవస్థీకృతమైన రుగ్మతలను ఎదిరించడం సంస్కరించడం వంటి వివేకానందుడి విప్లవాత్మక భావాలు ఇప్పటికీ ప్రాసంగికతను కలిగివున్నాయి. పునరుద్ధరణవాద, తిరోగమన, విచ్ఛిన్నకర శక్తుల, సామాజిక బాధ్యత లేని పెట్టుబడుదారీ శక్తుల ప్రాబల్యంతో పేదరికం, అశాంతి, అసహనం నెలకొన్న ప్రస్తుత సమాజాన్ని మానవత్వం వైపు మళ్ళించడానికి వివేకానందుని కృషిని కొనసాగించడమే మార్గం.

> **వ్యవస్థీకృతమైన రుగ్మతలను ఎదిరించడం, సంస్కరించడం వంటి వివేకానందుడి విప్లవాత్మక భావాలు ఇప్పటికీ ప్రాసంగికతను కలిగివున్నాయి. పునరుద్ధరణవాద, తిరోగమన, విచ్ఛిన్నకర శక్తుల ప్రాబల్యంతో పేదరికం, అశాంతి, అసహనం నెలకొన్న ప్రస్తుత సమాజాన్ని మానవత్వం వైపు మళ్ళించడానికి వివేకానందుని కృషిని కొనసాగించడమే మార్గం.**

(నేడు వివేకానందుడి జయంతి)


■ అస్నాల శ్రీనివాస్

పేదల కోసమేనా ఈ పదిశాతం?

■ పి. చిదంబరం



'పళని' పలుకు



> **గత 4 సంవత్సరాల 7 నెలల కాలంలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి విద్యా ఉద్యోగాలలో రిజర్వేషన్ కల్పించడానికి మోదీ ప్రభుత్వం ఎటువంటి ప్రాధాన్యమివ్వలేదు. మరో 60 రోజుల్లో, రాబోయే సార్వత్రిక ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ కానున్న తరుణంలో 124వ రాజ్యాంగ సవరణ బిల్లుకు ఎందుకు అంత ప్రాధాన్యమివ్వడం జరిగింది?**

సార్వత్రిక సమరానికి తుది సన్నాహాలు ఆరంభమయ్యాయి. ఎన్నికలకు సర్వ విధాల సర్వసన్నద్ధంగా ఉండాలనే దృక్పథంతో నరేంద్ర మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తున్నట్టు స్పష్టంగా కన్పిస్తోంది. అధికార పక్షం వారు అటువంటి నిర్ణయానికి వచ్చినట్టు తేటతెల్లం చేస్తున్న నిదర్శనాలు రోజురోజుకు అమితంగా కన్పిస్తున్నాయి. 124వ రాజ్యాంగ సవరణ బిల్లు విషయంలో జరిగిన హడావుడే ఇందుకొక తాజా రుజువు. 124 వ రాజ్యాంగ సవరణ బిల్లును జనవరి 7న రూపొందించారు. జనవరి 9న పార్లమెంటు ఉభయ సభలూ ఆ బిల్లును ఆమోదించాయి.

భారత రాజ్యాంగాన్ని రచించడానికి ఎంత కాలంపట్టిందో గుర్తు చేసుకోండి. 1951లో భారత రాజ్యాంగానికి మొదటి సవరణ బిల్లు రూపొందించి, ఆమోదించడానికి కూడా ఎంత కాలం పట్టిందో కూడా జ్ఞాపకం చేసుకోండి. ఆ మొదటి సవరణలోనే 'దేశ పౌరులలో సామాజికంగా, విద్యా పరంగా వెనుకబడిన వర్గాలు లేదా షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తరగతుల' వారికి 'ప్రత్యేక ఏర్పాటు' అనే భావనను ప్రవేశ పెట్టడం జరిగింది. ఈ 'ప్రత్యేక ఏర్పాటు' పదబంధమే 'రిజర్వేషన్'గా ప్రజానీకంలో సుప్రసిద్ధమయింది.

పార్లమెంటరీ కమిటీ నిశిత పరిశీలన, విస్తృతస్థాయిలో ఎలాంటి బహిరంగ చర్చ లేకుండానే, కేవలం 48 గంటలలో రూపొందించి, పార్లమెంటుచే అత్యంత శీఘ్రగతిన ఆమోదింపచేయడం జరిగిందన్నది 124వ సవరణపై సర్వత్రా వచ్చిన విమర్శ. మరి, లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మూడో వంతు సీట్లను మహిళలకు రిజర్వ్ చేసే సంకల్పంతో ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లు 2008 నుంచి పార్లమెంట్ ఆమోదం కోసం ఎదురుచూస్తూనే వున్నది!

124 వ రాజ్యాంగ సవరణ బిల్లు యోగ్యతలను అలా వుంచి, ఆ బిల్లును అంత హడివుడిగా ఆమోదించడాన్ని చూస్తే భారతీయ జనతాపార్టీ, నరేంద్ర మోదీ ప్రభుత్వం ఎంతగా భయాందోళనల్లో ఉన్నదీ విశదమవుతుంది. భవిష్యత్తు పై భయంతో ఈ ప్రభుత్వం ఇంకా పలు చర్యలు చేపట్టనున్నది. రైతులకు నగదు బదిలీ వాటిలో ఒకటి.

సరే, ఇపుడు 124వ రాజ్యాంగ సవరణ బిల్లు యోగ్యతలను చూద్దాం. సవరణ బిల్లు లక్ష్యాలు, కారణాలను ఇలా పేర్కొన్నారు: 'దేశ పౌరులలో ఆర్థికంగా వెనుకబడిన వారు ఉన్నత విద్యా సంస్థలలో ప్రవేశించలేకపోతున్నారు; ప్రభుత్వ ఉద్యోగాలను పొందలేకపోతున్నారు. ఆర్థిక స్థితిగతులు సరిగా లేని కారణంగానే ఆర్థికంగా అభివృద్ధి చెందిన వారితో వారు పోటీపడలేకపోతున్నారు' ఏ రాజకీయ పార్టీ కూడా , 124 వ సవరణకు ప్రాతిపదికగా ఉన్న ఈ నియమాన్ని వ్యతిరేకించదు (2014 లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ తన మానిఫెస్టోలో ఆర్థికంగా వెనుక బడిన వర్గాలవారికి విద్యా ఉద్యోగాలలో రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చింది). 124వ రాజ్యాంగ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఎల్లెడలా వ్యక్తమయిన నిరసన ఆ బిల్లుకు రూపకల్పన జరిగిన సూత్రబద్ధ ప్రాతిపదికపై ఎంతమాత్రమూ కాదు. ఆ వ్యతిరేకతకు ఇతర సహేతుక కారణాలు ఉన్నాయి. అవి:

(1) గత 4 సంవత్సరాల 7 నెలల కాలంలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి విద్యా ఉద్యోగాలలో రిజర్వేషన్ కల్పించడానికి మోదీ ప్రభుత్వం ఎటువంటి ప్రాధాన్యమివ్వలేదు (ట్రిపిల్ తలాక్ బిల్లుకు మోదీ ప్రభుత్వం ఎంత ప్రాధాన్యమిచ్చిందో మరి చెప్పనవసరం లేదు) . అయితే మరో 60 రోజుల్లో, రాబోయే సార్వత్రిక ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ కానున్న తరుణంలో ఈ సవరణ బిల్లుకు ఎందుకు అంత ప్రాధాన్యమివ్వడం జరిగింది? (2) ' కుల, మత, లింగ వివక్షలకు తావులేదు' అని నిర్దేశిస్తున్న అధికరణ 15కు ప్రతిపాదిత క్లాజులు 6 (ఎ), 6 (బి) లు వాస్తవానికి అదే అధికరణకు చెందిన క్లాజులు 4, 5 మాత్రమే. అయితే ఒక ముఖ్యమైన మార్పు చేశారు. అధికరణ 15 (5) ప్రకారం రిజర్వేషన్లను ' చట్టరీత్యా ' (బై లా) కల్పించాలి. అయితే కొత్త క్లాజులో 'చట్ట రీత్యా 'అనే పదాన్ని తొలగించారు. దీని వల్ల ప్రభుత్వం కార్యనిర్వాహక ఆదేశాల ద్వారా పాఠశాలలు, కళాశాలల్లో రిజర్వేషన్లను అమలు చేయగలుగుతుంది. (3) 'ప్రభుత్వోద్యోగాలలో అందరికీ సమాన అవకాశాలు' కల్పించాల నిర్దేశిస్తున్న అధికరణ 16కు ప్రతిపాదిత 5 వ క్లాజు వాస్తవానికి అదే అధికరణపు (ప్రస్తుతమున్న) 4వ క్లాజే. అయితే ఇక్కడా ఒక ముఖ్య మార్పు చేశారు. అధికరణ 16 (4), ప్రభుత్వోద్యోగాలలో సరైన ప్రాతినిధ్యం లేని సామాజిక వర్గాలవారికి రిజర్వేషన్లు కల్పించాలని పేర్కొంది. కొత్త క్లాజులో ' ప్రభుత్వోద్యోగాలలో సరైన ప్రాతినిధ్యం లేని సామాజిక వర్గాలు' అనే మాటలను తొలగించారు. మరి ఈ మార్పులు న్యాయబద్ధమేనా? ఏదైనా ఒక సామాజిక వర్గానికి ప్రభుత్వోద్యోగాలలో సరైన ప్రాతినిధ్యంలేని పక్షంలో మాత్రమే ఆ సామాజిక వర్గానికి ప్రభుత్వోద్యోగాలలో రిజర్వేషన్లు కల్పించాలని సుప్రీంకోర్టు గతంలో వెలువరించిన తీర్పుల్లో స్పష్టం చేసింది. అంతేగాక కేవలం ఆర్థికంగా వెనుకబాటుతనమే రిజర్వేషన్లకు ప్రమాణం కారాదని కూడా సర్వోన్నత న్యాయస్థానం ఆ తీర్పుల్లో స్పష్టంగా పేర్కొంది. ప్రస్తుత రాజ్యాంగ సవరణకు పూర్వపు రాజ్యాంగ నియమాల ప్రకారం సుప్రీం కోర్టు ఆ తీర్పులను వెలువరించడం జరిగింది. రాజ్యాంగాన్ని సవరించేందుకు ప్రభుత్వం తప్పనిసరిగా ఆ తీర్పులను పరిగణనలోకి తీసుకోవలసివుంది. ప్రస్తుత సవరణ లక్ష్యాలకు అనుగుణంగా ఆ తీర్పులను అధిగమించవలసివున్నది. కానీ అలా జరగలేదు.

పేదలు ఎవరో నిర్ణయించేందుకు నిర్దేశించిన ప్రమాణాలపై విమర్శలు వెల్లువెత్తాయి. ప్రభుత్వ ప్రతినిధి చెప్పిన వివరాల ఆధారంగా ఆ ప్రమాణాలు ఏమిటో జనవరి 8న అన్ని దినపత్రికలు, టీవీ ఛానెల్స్ వెల్లడించాయి. 8 లక్షల రూపాయల వార్షిక ఆదాయమున్న కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి పేదవాడుగా ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రమాణానికి నిర్దిష్ట మినహాయింపులను కూడా పేర్కొన్నది. 8లక్షల రూపాయల ఆదాయ పరిమితి నిర్ణయానికి రావడానికి ఆధారపడిన సమాచార మేమిటో వెల్లడించాలని ప్రతిపక్షాలు డిమాండ్‌చేశాయి. అయితే ప్రభుత్వం ఎటువంటి వివరణా ఇవ్వలేదు. లభ్యమవుతున్న విశ్వసనీయ సమాచారం ప్రకారం దేశ జనాభా (125 కోట్లు)లో 95 శాతంమంది ప్రభుత్వం కొత్తగా కల్పించిన 10 శాతం రిజర్వేషన్లకు అర్హులవుతారు ! అంటే ఇంచు మించు భారతీయులందరూ పేదవారే. పది శాతం రిజర్వేషన్లకు అర్హత ప్రమాణానికి ప్రభుత్వం ఇచ్చిన మినహాయంపులు కొద్ది మందికే వర్తిస్తాయి. 124 వ రాజ్యాంగ సవరణ బిల్లు ప్రకారం దాదాపుగా ప్రతి ఒక్కరూ పేదవాడే అవుతున్నాడు. ప్రభుత్వోద్యోగాలలో అవకాశాలను పొందలేకపోతున్నవారు ఈ పేదలలో అతి పేదలు మాత్రమే ! మరి ఇటువంటివారు నిజంగా ఈ రాజ్యాంగ సవరణ వల్ల ప్రయోజనం పొందుతారా? ఆర్థికంగా వెనుకబడిపోయినవారిలో మరీ వెనుకబడిన 20 శాతంమందిని మాత్రమే పేదవారుగా పరిగణించేవిధంగా పేదరికాన్ని నిర్వచించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. అలా నిర్వచించని పక్షంలో ఈ కొత్త రిజర్వేషన్ల న్యాయబద్ధత, నైతికతను సందేహించవలసి వుంటుంది.

ఇక ఈ పది శాతం రిజర్వేషన్ల నుంచి మన పేదలు పరిపూర్ణంగా ప్రయోజనం పొందే అవకాశమున్నదా అన్నది ఒక పెద్ద ప్రశ్న. మెరుగైన మౌలిక సదుపాయాలు లేకపోయినా, ఉత్కృష్ట బోధనా నైపుణ్యాలు గల ఉపాధ్యాయులు కొరవడినా పాఠశాలలు, కళాశాలల్లో సీట్లను మరింతగా పెంచేందుకు ప్రభుత్వానికి ఎటువంటి అభ్యంతరమూ, ఇబ్బందీ ఉండబోదు. విద్యావకాశాలు పెరుగుతాయి నిజమే. పేద కుటుంబాల బాలబాలికలూ, యువతీయువకులు లబ్ధి పొందుతారు. మరి ఉద్యోగాల మాటేమిటి? ముఖ్యంగా ప్రభుత్వ వ్యవస్థలు, సంస్థల్లో ఉద్యోగాలు ఉన్నాయా? ప్రభుత్వ వ్యవస్థను అన్ని స్థాయిలలో– కేంద్ర, రాష్ట్ర, మునిసిపల్, పంచాయత్, ప్రభుత్వ రంగ సంస్థలు– విస్తరింపచేసేందుకు ప్రభుత్వం సంకల్పించిందా? కేంద్ర ప్రభ్వుత్వం ఆధ్వర్యంలోని ప్రభుత్వరంగ సంస్థల్లో ఉద్యోగుల సంఖ్య 2014 మార్చిలో 16, 90, 741 నుంచి 2017 మార్చిలో 15, 23, 586కి తగ్గిపోయింది. మరి ఈ పరిస్థితుల్లో కొత్త రిజర్వేషన్లను పేదలకు ప్రయోజనకరంగా అమలుపరచడం ఎలా సాధ్యమవుతుంది? 124వ రాజ్యాంగ సవరణ బిల్లును నిశితంగా పరిశీలిస్తే అర్థమయ్యేది ఏమిటి? అది, పేదలకు రిజర్వేషన్ సదుపాయాలను కల్పించడానికి కాక మోదీ ప్రభుత్వం అధికారంలో కొనసాగేలా తనను తాను కాపాడుకునేందుకు ఉద్దేశించినదని విశదం కావడం లేదూ?

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

తెలుగుజాతి కీర్తి పతాక ఎన్టీఆర్

బెనారస్ హిందూ యూనివర్శిటీలో 1972–75 మధ్య కాలం నేను ఎంఎస్ సర్జరీ చదివిన రోజులు. మమ్మల్నందరినీ మద్రాసీలనేవాళ్లు. మాది ఆంధ్ర ప్రదేశ్, మేము తెలుగు వాళ్లం అన్నప్పటికీ అక్కడి వారి దృష్టిలో తెలుగువాళ్లు, ఆంధ్రప్రదేశ్ మొత్తం మద్రాసీ కిందే లెక్క. ఇంత గుర్తింపు లేని దారుణ జాతి అనునిత్యం చాలా బాధ కలిగేది. మనం కూడా ప్రత్యేక రాష్ట్రంగా, జాతిగా ఎప్పుడు గుర్తించబడుతామని ఎదురుచూసే వాడ్ని. అది 1982 నాటికి అన్న ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ స్థాపనతో సాధ్యం అయింది. అప్పటికి నేను నర్సరావుపేటలో పేరొందిన వైద్యుడిగా సమాజంలో అవినీతి, స్వార్థం, ఆశ్రితపక్షపాతం పెచ్చరిల్లి అభివృద్ధి, సంక్షేమం లేని ఆంధ్రప్రదేశ్‌ని చూశాను.



ఈ నా భావాలే తెలుగుదేశం పార్టీలో చేరటానికి ప్రేరణ కలిగించాయి. అన్న ఎన్టీఆర్ 60 సంవత్సరా వయస్సు వరకు సినిమా రంగానికి సేవ చేసి, తన ఉన్నతికి కారణమైన ప్రజలకు సేవ చేయాలని సంకల్పించారు. ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని ఢిల్లీ నడివీధుల్లో తాకట్టు పెట్టిన ఆనాటి రాజకీయ వ్యవస్థకి వ్యతిరేకంగా టిడిపిని స్థాపించారు. వారి అనుచరుడిగా ప్రారంభమైన నా రాజకీయ జీవితం ఎన్నో ఒడిదుడుకులున్నప్పటికి ఇప్పటికి కొనసాగుతుంది. అప్పుడు ఎన్టీఆర్, తరువాత చంద్రబాబు అనుచరుడిగా అనేక ఎత్తు పల్లాలు ఈ 35 సంవత్సరాల రాజకీయ జీవితంలో చూశాను. తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీకగా ఎన్ టి ఆర్ ఎలా ఆవిర్భవించిందీ వివరించే చిన్న ప్రయత్నమే ఈ వ్యాసం.

1982 మార్చి 29. నందమూరి తారక రామారావు రాజకీయ రంగప్రవేశం. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం. రాష్ట్ర చరిత్రలో ఒక మహోజ్వల అధ్యాయం ప్రారంభం. అంతా కొత్త. పార్టీ కొత్త. మనుషులు కొత్త. వాతావరణం కొత్త. తెలుగుదేశం పార్టీ నిర్మాణంలో ఎన్టీఆర్ అధికంగా ఆధారపడింది నూతన నాయకత్వంపైన, యువ నాయకత్వంపైన, అందుకే రాష్ట్రంలో కొత్త తరం రాజకీయాలకు, కొత్త తరహా రాజకీయాలకు తెరలేచింది. ఎన్టీఆర్ పార్టీ ఏర్పాటు చేసేనాటికి రాష్ట్ర శాసన సభకు ఎన్నికలు ఆసన్నమయ్యాయి. ఒకవైపు పార్టీ నిర్మాణం కొనసాగిస్తూనే ఆయన జనంలోకి వెళ్లారు. మహానాడుల రూపంలో జనాన్ని తన దగ్గరకు రప్పించుకునే బదులు ఆయనే జనం దగ్గరకు వెళ్లే వినూత్న కార్యక్రమం చేపట్టారు. ఈ విషయంలో కూడా ఆయనది పాత పద్ధతులకు భిన్నమే. జన సమీకరణలు లేవు, భారీ బహిరంగ సభలు లేవు, వేదికలు అంతకంటే లేవు. కనపడిన ప్రతి గ్రామంలోనూ దారిపక్కన ఒక సభ. జూన్ నుంచి ప్రారంభించి అలలు అలలుగా ఆయన పర్యటనలు ప్రారంభించారు. ఈ పర్యటనల కోసం ఆయన పాత చెవర్లెట్ వ్యాన్‌ను ఒక దానిని సిద్ధం చేసుకున్నారు. దానికి చైతన్యరథం అని పేరు పెట్టారు. చైతన్య రథంలోనే ఆయన పని, పడక అంతా. గెస్ట్ హౌస్‌లు లేవు. ఎవరి ఇళ్లలోనూ విందులు, విశ్రాంతులు లేవు. ఆయన వాహనం, ఆఫీసు, విశ్రాంతి గృహం అన్నీ ప్రచార రథమే. ఎన్టీఆర్ పెట్టిన చైతన్యరథ ఒరవడిని, ఆ తరువాత దేశవ్యాప్తంగా అన్ని పార్టీలూ అనుసరించాయి. రకరకాల పేర్లతో రథాలు బయలుదేరాయి.

శిల్పి చేతిలో పడగానే రాయి రత్నమయినట్టు, ఎన్టీఆర్ చేయి పడితే దేనికయినా మహారాజ యోగమే! ప్రచార రథం నుంచి వినిపించడానికి ఆయన రెండు పాటలను ఎంపిక చేసుకున్నారు. మొదటిది మా తెలుగుతల్లికి మల్లెపూదండ – శంకరంబాడి సుందరాచారి వ్రాసినది. రెండవది వేములపల్లి శ్రీకృష్ణ వ్రాసిన 'చేయెత్తి జైకొట్టు తెలుగోడ' పాట! తెలుగు ప్రజలు మరిచిపోయిన పాటలు రెండు ఎన్టీఆర్ స్పర్శతో తిరిగి జీవం పోసుకుని తెలుగు నేల నాలుగు చెరగులా మార్మోగాయి. ఈ పాటలు పొలిమేరల్లో వినపడితే చాలు, పరిసర గ్రామాల ప్రజలు పరుగు పరుగున రహదారులపైకి, కూడళ్లలోకి చేరుకునే వారు. ఎన్టీఆర్ రూపాన్ని చూసి, ఆయన ప్రసంగాన్ని విని కేరింతలు కొట్టేవారు. ఆయన రాక కోసం గంటల తరబడి నిరీక్షణ. ఎన్నికల ప్రచార సమయంలో అయితే నిమిషాలు, గంటలు కాదు, పూటలు, రోజులే ఆలస్యం. అయినా జనం వేచి ఉండేవారు. తెలుగుదేశం పిలుస్తోంది రా! కదలిరా! అంటే జనం ఆయన వెంట పరుగులు పెట్టేవారు. ఆంధ్రదేశ రాజకీయాలలో అది ఒక కొత్త కెరటం, కొత్త శకం. పార్టీ పెట్టిన తొమ్మిది నెలలలోనే అనూహ్య విజయం. మూడింట రెండు వంతుల మెజారిటీ! సమకాలీన రాజకీయాలు ఎన్నడూ ఎరుగని, కలలోనయినా ఊహించని ఒక సంచలనం! ఒక అద్భుతం! ఎన్టీఆర్ ముఖ్యమంత్రి! వెగటు పుట్టించే ఢిల్లీ పెత్తనంతో విసిగిపోయిన తెలుగుజాతికి పెద్ద రిలీఫ్!

ఎన్టీఆర్ జీవితంలో నీతి, నిజాయితీ, క్రమశిక్షణ ప్రధాన పాత్ర వహించాయి. ఆయన ఒక్కోసారి కణకణలాడే నిప్పు కణికను తలపించేవారు. రాజకీయాలలోను, పరిపాలనలో కూడా అంతర్లీనంగా ఈ లక్షణాలు పని తీరులో అడుగడుగునా ప్రతిఫలించేవి. ఆరుకోట్ల ఆంధ్రుల ఆశలు, ఆశయాలకు ప్రతిరూపంగా అధికారంలోకి వచ్చిన తాను, ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయరాదని, రాజీపడరాదని, ముక్కుసూటిగా వ్యవహరించాలని ఆయన ప్రగాఢంగా విశ్వసించారు. "35 ఏళ్లు సినీ నటుడిగా నన్ను ఆదరించారు. ఈనాడు ముఖ్యమంత్రిగా నన్ను అందలం ఎక్కించారు. ఇంతకంటే ఒక వ్యక్తికి ఏమి కావాలి? తెలుగు ప్రజల ఆశలను సఫలం చేయడం, ఆత్మగౌరవాన్ని నిలబెట్టడం, ప్రపంచపటంపై తెలుగు పతాకం ఎగురవేయడం నా ఆశయం! అందుకోసమే అహర్నిశలూ పాటుపడతాను. అందుకే ఈ జీవితం అంకితం"– అని ఎన్టీఆర్ ఉద్వేగంతో అనేవారు. ఎన్టీఆర్ ఒక స్వాప్నికుడు, భావుకుడు! అదే సమయంలో ఆచరణశీలి! ఆయనది అరుదయిన వ్యక్తిత్వం. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడంతోనే తన జీవిత లక్ష్యం నెరవేరిందని తృప్తి చెందలేదు, విశ్రమించలేదు. అధికార వైభవం మత్తులోపడి కొట్టుకుపోలేదు. ఆయన దినచర్య ఎప్పటివలెనే! ప్రతి గంటకు వేలకొద్దీ పారితోషికం చేసుకునే సినీ జీవితంలో కాలం విలువ ఏమిటో తెలిసిన వ్యక్తి. అందువల్ల ప్రజాజీవితంలో కూడా కాలానికి అంతే విలువనిచ్చారు. రాజకీయాలలో, పరిపాలనలో నైతిక విలువలను, క్రమశిక్షణను తేవడం తమ ప్రథమ లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆవేశం లేనిదే ఎన్టీఆర్ లేరు. క్రమశిక్షణ నా ఊపిరి అని ఆయన అనేవారు. ఉదయం వేళ అత్యవసర ప్రభుత్వ కార్యకలాపాలు, పార్టీ వ్యవహారాలు! ఆ తరువాత సచివాలయం! సాయంత్రం తిరిగి ఇంట్లో పార్టీ వ్యవహారాలు! రాత్రి 9 గంటల కల్లా నిద్ర! ఇది ఆయన సాధారణ దినచర్య! ఎన్టీఆర్ పని చేసినన్ని గంటలు అంతకు ముందు మరే ముఖ్యమంత్రీ చేయలేదేమో! తెల్లవారు ఝామున అయిదు గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు 14 – 15 గంటల పాటు పనిలో నిమగ్నమయ్యేవారు.

> **నందమూరి తారక రామారావు ఒక మహోద్యమం. స్వాతంత్ర్యోద్యమం తరువాత మళ్లీ అంతటి మహోద్యమాన్ని ఆంధ్రదేశం చూడటం ఎన్టీఆర్ హయాంలోనే! ధన రాజకీయాలు అంతరించి జన రాజకీయాలు ఆయనతోనే ఆవిర్భవించాయి. ఎన్టీఆర్ మరణంతో బడుగుజనాల దేవుడు అంతర్ధానమయ్యాడు. మరణంలోనూ, జీవితంలోనూ ఆయన ఒక మహా యోద్ధ! ఒక కర్మయోగి! చరిత్ర పురుషుడు. తెలుగు జాతి ఔన్నత్యానికీ, ఆత్మగౌరవానికి, సమర్థతకీ ప్రతీక.**

తెలుగు ప్రజలకు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఒక ప్రత్యేక పరిగణన, ఒక ప్రత్యేక గుర్తింపు, గౌరవం ప్రపంచంలో రామారావు వల్ల లభించాయి. కాంగ్రెసు పాలన నుంచే కాదు, తమిళనాడు నీడ నుంచి కూడా ఆంధ్రప్రదేశ్ దేదీప్యమానంగా బయట పడింది. దేశ విదేశ పత్రికలన్నీ ఎన్టీఆర్ గురించి, ఆయన విజయాలను గురించి, వ్యక్తిత్వాన్ని గురించి పరిశోధనాత్మక వ్యాసాలు, ప్రత్యేక కథనాలు ప్రచురించాయి. తెలుగుజాతి నుంచి, తెలుగు భాష, చరిత్ర సంస్కృతి గురించి ప్రపంచానికి తొలిసారిగా తెలిశాయి. విదేశీ జర్నలిస్టులకు హైదరాబాదు గమ్యస్థానంగా మారింది. ఇందిరా గాంధీని ఓడించిన ఘనుడిగా కీర్తి ప్రతిష్ఠలు! ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ తొలిసారిగా ఢిల్లీలో అడుగుపెడితే అందరి దృష్టి ఆయనపైనే! వినడమే కాని ప్రత్యక్షంగా చూడని ఢిల్లీ జర్నలిస్టులు ఆయన చుట్టూ మూగారు. దేశ విదేశీ జర్నలిస్టులు స్పెషల్ ఇంటర్వ్యూలు, గోష్ఠులు జరిపారు. ప్రెస్‌క్లబ్ ఆయనను గౌరవించింది. ఛిన్నాభిన్నమైన ప్రతిపక్షాలకు ఎన్టీఆర్ ఒక ఆశాకిరణం. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా జాతీయ ప్రతిపక్షాలన్నింటిని ఒకే వేదికపైకి తేవాలన్న ఆలోచనకు అంకురం ఆనాడే ఆయన మనసులో పడింది. దాని ఫలితమే కాంక్లేవ్‌లు. నేటి ఫ్రంట్‌లకు తొలి రూపమే ఈ కాంక్లేవ్‌లు. విజయవాడలో జరిగిన ప్రతిపక్షాల తొలి కాంక్లేవ్ దేశంలో కొత్త సమీకరణలకు నాంది పలికింది. దేశంలో సంకీర్ణ రాజకీయాలకు ఆయన చొరవ, ధైర్య సాహసాలే కారణం. నేటికీ దేశానికి అదే సంకీర్ణ రాజకీయం గొప్ప తరుణోపాయంగా, తారక మంత్రంగా నిలవడం విశేషం. జాతీయ రాజకీయాలపైన అతి స్వల్ప కాలంలో తనదయిన ప్రత్యేక ముద్ర వేశారు. అనతికాలంలోనే ప్రాంతీయ పార్టీకి చెందిన జాతీయ నాయకుడిగా ఎన్టీఆర్ ఎదిగారు.



వినూత్న పద్ధతులలో రాజకీయ రథాన్ని ప్రజాబాట పట్టించడంలోనే కాదు, పరిపాలనను కొత్తపుంతలు తొక్కించడంలో కూడా ఆయన నూతన ఒరవడి సృష్టించారు. తెలుగువారి ఆత్మగౌరవాన్ని తట్టిలేపారు. దేశ విదేశాలలో చాటిచెప్పారు. తెలుగునాట పరిపాలన పరంగా, సమాజ పరంగా, రాజకీయంగా అనేక సంస్కరణలకు ఆద్యుడయ్యారు. పంచాయతీ రాజ్ వ్యవస్థను సమూలంగా సంస్కరించారు. మండల వ్యవస్థను వ్యవస్థీకృతం చేశారు. మునసబు, కరణాల వ్యవస్థను రద్దు చేశారు. విద్యా రంగంలో ప్రతిభకే పట్టం కట్టారు. అన్నింటికి మించి మహిళలకు ఆయన ఇచ్చిన గౌరవాభిమానాలు అనుపమానం. మహిళలను ఎప్పుడూ ఆయన తెలుగింటి ఆడపడుచులుగా సంబోధించేవారు. వారికి ఆస్తిలో సమాన హక్కు కల్పించటం ఒక విప్లవాత్మక చర్య. అదే విధంగా రిజర్వేషన్లు. రాజకీయాలలో అయితే ఒక కొత్త పర్వం మొదలైందని చెప్పవచ్చు. బిసిలకు ముఖ్యంగా ఆధిపత్యవర్గాల నుంచి విముక్తి, అదే విధంగా ఇతర వెనుకబడిన వర్గాలకు కూడా! ఆయన చొరవ, సాహసం కారణంగా ఒక తరానికి తరమే కొత్త నాయకత్వం ఆవిర్భవించింది. ఆనాడు మొలకెత్తిన మొలకలే ఈ నాడు రెండు తెలుగు రాష్ట్రాలలో ఇంతింతై మహావృక్షాలుగా ఎదిగాయి. బడుగు బలహీన వర్గాలలో నాయకత్వ ప్రతిభ వెలికి వచ్చింది. ఆ విధంగా చూస్తే ఎన్టీఆర్‌ను ఒక గొప్ప రాజకీయ సామాజిక సంస్కర్తగా చెప్పుకోవాలి. ధన స్వామ్య రాజకీయాలను, ప్రజాస్వామ్య రాజకీయాలుగా, పైరవీల పరిపాలనను, ప్రజా సుపరిపాలనగా మలచిన ఘనుడు ఆయన! అందుకే ఆయనకు ఈనాటికీ ఇంతటి జనాదరణ. ఆయన భౌతికంగా అంతర్ధానమై రెండు దశాబ్దాలు గడిచినా, ఆయన కీర్తికాయం పదిలం. ఆయన ఆనాడే తీసుకున్న అనేక నిర్ణయాల ప్రభావం ఈ నాటికీ చెక్కుచెదరనిది.

కాబట్టే 1996 జనవరి 18న ఆయన అకస్మాత్తుగా కన్ను మూసిన నాడు యావత్తు ప్రజానీకం మూగగా రోదించింది. బడుగుల అన్నం గిన్నె చెదిరింది. సినీ సుయోధునునికి తెలుగు కళారంగం ఘనంగా నివాళులర్పించింది. కారణ జన్ముడని కీర్తించింది. సమాజమే దేవాలయం, పేదవాడే దేవుడని నిరంతరం దరిద్ర నారాయణుల నామస్మరణ చేసిన బడుగుల దేవుడికి అశేష జనవాహిని అశ్రునయనాలతో జోహార్లు అర్పించింది. ఎన్టీఆర్ అమర్ రహే అంటూ దిక్కులు పిక్కటిల్లేలా నినాదాలు. ఎన్టీఆర్ అంతిమయాత్రలో లక్షలాది మంది పాల్గొన్నారు. ఆయన మరణం తరువాత ఒక మహాజ్వాల, ఒక మహా ప్రభంజనం ఆగిపోయిన నిశ్శబ్దం. నటుడిగా ఎన్ని విభిన్న పాత్రలలో తెలుగువాడి గుండెను తట్టిలేపారో, దైవ సమానుడిగా నిలిచారో, రాజకీయ నాయకుడిగా కోట్లాది పేద ప్రజల జీవితాలలో అదే విధంగా వెలుగులు నింపారు. ప్రజల నామమే ఆయన ఎల్లప్పుడూ జపించారు. కష్టానికి సుఖానికి జనం మధ్యకే వెళ్లారు. జనం మీదనే ఆధారపడ్డారు. జనమూ ఆయనను విశ్వసించారు. అభిమానులు ఆరాధించారు. ఆయన తనను రాజర్షిగా చెప్పుకునేవారు. నిజంగానే అధికారం ఉన్నా, లేకపోయినా రాజర్షిగానే, రాజీలేనితోనే ఆయన జీవన యానం సాగిపోయింది. అంతటి వైవిధ్యం, విస్తృతి కలిగిన వ్యక్తులు ఆంధ్రులలో లేరు. నందమూరి తారక రామారావు ఒక మహోద్యమం. తెలుగుజాతి పౌరుషానికి ప్రతీక! కీర్తిపతాక! స్వాతంత్రోద్యమం తరువాత మళ్లీ అంతటి మహోద్యమాన్ని ఆంధ్రదేశం చూడటం ఎన్టీఆర్ హయాంలోనే! ధన రాజకీయాలు అంతరించి జన రాజకీయాలు ఆయనతోనే ఆవిర్భవించాయి. ఎన్టీఆర్ మరణంతో బడుగుజనాల దేవుడు అంతర్ధానమయ్యాడు.

ఆయన జాతీయ పదవులేవీ అధిష్ఠించలేదు. కాని దేశ ప్రజల హృదయపీఠాలపై అధివసించారు. జాతీయ నాయకులకే నాయకుడయ్యారు. అందుకే యావజ్జాతి ఆ మహానటుడిని, మహానాయకుడిని ఈనాటికి స్మరించుకుంటున్నది. ఆంధ్రదేశాన్నే కాదు, యావత్ భారత జాతినే ఒక ఊపు ఊపిన రాజకీయ ప్రభంజనం ఎన్టీఆర్. ఒక ప్రాంతీయ నాయకునిగా అంతటి జాతీయ ప్రాభవం పొందడం ఎన్టీఆర్‌కే సాధ్యం. ఎన్టీఆర్ జీవితమే ఒక సంఘర్షణ. రాజకీయాలలో, ప్రజా జీవితంలో నిరంతరం ఆయన నీతి కోసం పోరాడారు. సమాజం కోసం పోరాడారు. బడుగుల కోసం పోరాడారు. నిబద్ధతతో పోరాడారు. అందుకే మరణంలోనూ, జీవితంలోనూ ఆయన ఒక మహా యోద్ధ! ఒక కర్మయోగి! చరిత్ర పురుషుడు. తెలుగు జాతి ఔన్నత్యానికీ, ఆత్మగౌరవానికి, సమర్థతకీ ప్రతీక.

■ డాక్టర్ కోడెల శివప్రసాద్,
ఆంధ్రప్రదేశ్ శాసన సభాపతి

జన్మభూమిలో వైసీపీ, టీడీపీ శ్రేణుల బాహాబాహీ

▸ పెద ఓగిరాలలో రాళ్లు రువ్వుకున్న ఇరువర్గాలు


అడ్డుకున్న పోలీసులతో మాట్లాడుతున్న పార్థసారథి

పెదఓగిరాల (ఉయ్యూరు), జనవరి 11 : కృష్ణాజిల్లా ఉయ్యూరు మండలం పెద ఓగిరాల గ్రామంలో జరిగిన జన్మభూమి సభలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. టీడీపీ, వైసీపీ వర్గాలు బాహాబాహీకి దిగాయి. పరస్పర దూషణలతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీంతో పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాలను శాంతింపజేశారు. తొలుత జన్మభూమి గ్రామసభకు ఎమ్మెల్యే బోడె ప్రసాద్, ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్ హాజరయ్యారు. అనంతరం వైసీపీ నాయకుడు కె.పార్థసారథి పెద్ద ఎత్తున అనుచరులను వెంటబెట్టుకుని గ్రామసభకు వచ్చేందుకు ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వైసీపీ కార్యకర్తలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. అదే సమయంలో గ్రామసభ ముగించుకుని బోడె ప్రసాద్ అటుగా వచ్చారు. దీంతో వైసీపీ కార్యకర్తలు ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎమ్మెల్యే వర్గీయులు కూడా సారథికి వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఇరువర్గాలు తిట్టుకుంటూ, రాళ్లు రువ్వుకుంటూ కొట్టుకునేందుకు సిద్ధమవ్వడంతో పోలీసులు జోక్యం చేసుకుని సర్దిచెప్పారు.

శ్రీవిద్యానికేతన్‌లో సంక్రాంతి సంబరాలు


సంక్రాంతి సంబరాల్లో మోహన్‌బాబు

చంద్రగిరి, జనవరి 11: సంస్కృతి సంప్రదాయాలకు నిలువుటద్దం సంక్రాంతి పండుగ అని సినీనటుడు, శ్రీవిద్యానికేతన్ విద్యాసంస్థల చైర్మన్ మోహన్‌బాబు అభిప్రాయపడ్డారు. చిత్తూరు జిల్లా చంద్రగిరి మండలం ఎ.రంగంపేటలోని విద్యానికేతన్‌లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మోహన్‌బాబు, ప్రముఖ చిత్రకారుడు గురజాల రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీవిద్యానికేతన్ విద్యా సంస్థలోని సుమారు 600 మంది విద్యార్థినులకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గురజాల రమేష్ తాను గీసిన చిత్రాన్ని మోహన్‌బాబుకు అందజేశారు.

టీటీడీలో సినీ, రాజకీయ నాయకుల జోక్యాన్ని తొలగించండి

▸ ముఖ్యమంత్రికి శ్రీవారి సేన వ్యవస్థాపకురాలు జ్యోతిర్మయి లేఖ

విజయవాడ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానంలో సినీ, రాజకీయ నాయకుల జోక్యాన్ని తొలగించి వెంకటేశ్వరస్వామి రుణం తీర్చుకోవాలని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, శ్రీవారి సేన వ్యవస్థాపకురాలు కొండవీటి జ్యోతిర్మయి ముఖ్యమంత్రి చంద్రబాబుకు సూచించారు. ఈ మేరకు ఆమె ముఖ్యమంత్రికి బహిరంగ లేఖ రాసినట్లు సెంట్రల్ ట్రస్ట్ చైర్మన్ కేవీవీ రావు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అలిపిరి ఘటనలో చంద్రబాబు ప్రాణాలు కాపాడిన వెంకటేశ్వర స్వామి రుణాన్ని ఆ విధంగా తీర్చుకోవచ్చని జ్యోతిర్మయి తన లేఖలో పేర్కొన్నారు.

వచ్చేది వైసీపీ ప్రభుత్వమే!

▸ అధికారంలోకి వచ్చిన 6 నెలల్లో 1.50 లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్

▸ గ్రామానికో ఉద్యాన, వ్యవసాయ ఉద్యోగం

▸ వైసీపీ అధ్యక్షుడు జగన్ హామీ


సమస్యలను జగన్‌కు వివరిస్తున్న విద్యార్థినులు

రైల్వేకోడూరు రూరల్, జనవరి11: చంద్రబాబును మరో మూడు నెలలు భరిస్తే వచ్చేది తమ ప్రభుత్వమేనని వైసీపీ అధ్యక్షుడు జగన్ అన్నారు. ఆరు నెలల్లోపు నోటిఫికేషన్ ఇచ్చి లక్షా 50 వేల ఉద్యోగాలు కల్పిస్తామని హామీఇచ్చారు. తమకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని 17 రోజులుగా రిలే నిరాహారదీక్షలు చేస్తున్న రైల్వేకోడూరు మండలం అనంతరాజుపేట డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ ఉద్యాన కళాశాల విద్యార్థులు.. శుక్రవారం తిరుపతి నుంచి రోడ్డుమార్గంలో కడపకు వస్తున్న జగన్‌ను అడ్డుకున్నారు. యూనివర్సిటీ పెట్టినప్పటి నుంచి ఉద్యానశాఖలో ఉద్యోగాలు లేవని, అయినా రాష్ట్రంలో ఇష్టానుసారంగా ప్రైవేటు ఉద్యాన కళాశాలలకు అనుమతులిచ్చేశారని విద్యార్థులు ఆరోపించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. 'ఈ ప్రభుత్వానికి ఏం చెప్పినా వినే పరిస్థితి లేదు. మరో 3 నెలల్లో ఎన్నికలొస్తాయి. ఏప్రిల్‌లో మన ప్రభుత్వం రాగానే ప్రతి గ్రామానికీ ఒక అగ్రికల్చర్, ఒక హార్టికల్చర్ ఉద్యోగాలు కల్పిస్తాం' అని హామీ ఇచ్చారు. దీంతో 17 రోజులుగా దీక్ష చేస్తున్న ఉద్యాన విద్యార్థులు దీక్షలను విరమించి పండుగ సెలవులకు ఇళ్లకు వెళ్లిపోయారు.

జాతీయస్థాయి మేళాలకు పంపుతాం

▸ అర్హత కలిగిన సంఘాలకు అవకాశం ఇస్తామన్న అధికారులు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

అనంతపురం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అర్హత కలిగిన చేతివృత్తులు, హస్తకళలకు సంబంధించిన స్వయం సహాయక సంఘాలను జాతీయస్థాయి మేళాలకు పంపుతామని సెర్ప్ లైవ్లీహుడ్ డైరెక్టర్ నీలకంఠారెడ్డి తెలిపారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'కడుపు కొడుతున్న సెర్ప్!' అనే కథనంపై ఆయన స్పందించారు. త్వరలో జరగబోయే సెర్ప్ ఎగ్జిబిషన్లకు మన రాష్ట్రం తరఫున ఎంపిక చేసిన వారిని ప్రభుత్వ అనుమతితో పంపుతామన్నారు. డ్వాక్రా మహిళల ఉత్పత్తులకు మార్కెటింగ్ కోసం ఆన్‌లైన్ ద్వారా అమ్ముకోవడానికి ఈ-మహిళా అనే బ్రాండ్‌తో అవకాశం కల్పిస్తున్నామని ఆయన చెప్పారు.



రెండు మూడేళ్ల క్రితం వరకు అవి వ్యవసాయ భూములు. ఇప్పుడు ఎక్కడ చూసినా భారీ గేటెడ్ కమ్యూనిటీ కాలనీలు ,అపార్ట్‌మెంట్‌లు, గ్రూప్ హౌస్‌లు, మల్టీప్లెక్స్ భవనాలు. విజయవాడ తూర్పు శివారు ప్రాంతంమైన పెనమలూరు వైపు నెలకొన్న రియల్టీ జోష్‌పై

ఈ వారం ప్రత్యేక స్టోరీ.

పెనమలూరు స్థిరాస్తి జోరు

ఎకరా రూ. 15 కోట్లు.. భారీగా పెట్టుబడులు పెడుతున్న ఎన్ఆర్ఐలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

పెనమలూరు.. విజయవాడ తూర్పు శివారు ప్రాంతం. రెండేళ్ల క్రితం ఇక్కడ, ఎక్కడ చూసినా పచ్చటి పొలాలు. ఇప్పుడు ఈ ప్రాంతంలో స్థిరాస్తి రంగం కొత్తపుంతలు తొక్కుతోంది. పొలాలన్నీ గేటెడ్ కమ్యూనిటీ కాలనీలు, అపార్ట్‌మెంట్లు, గ్రూప్ హౌస్‌లు లేదా మల్టీప్లెక్స్ భవనాలుగా మారిపోతున్నాయి. నగర శివారును ఆనుకుని ఉన్న తాడిగడప, కానూరు ప్రాంతాలు ఇప్పటికే విజయవాడతో పోటీ పడుతున్నాయి. ఇప్పుడు వీటిని కలుపుకుని పోరంకి, గంగూరు, పెనమలూరు వైపు స్థిరాస్తి రంగం భారీగా అభివృద్ధి చెందుతోంది.

కలిసొస్తున్న అంశాలు

విజయవాడ నగరానికి ఒక వైపు కృష్ణానది, మరోవైపు కొండలు. దీంతో ఉత్తర, దక్షిణ ప్రాంతాల వైపు కంటే తూర్పు, పశ్చిమ దిక్కుల వైపు మాత్రమే నగరం విస్తరిస్తూ అభివృద్ధి చెందుతోంది. బెజవాడకు కూతవేటు దూరంలోనే నవ్యాంధ్ర రాజధాని అమరావతి ఏర్పాటవుతోంది. దీంతో విజయవాడ శివారు ప్రాంతాల్లోనూ రియల్టీ రంగం పరుగులు తీస్తోంది. ఒకప్పుడు గ్రామీణ ప్రాంతమైన పెనమలూరు ఇప్పుడు నగర స్వరూ



పాన్ని సంతరించుకుంటోంది. జిల్లాకు చెందిన ప్రవాసుల (ఎన్ఆర్ఐ) చూపంతా ఇప్పుడు ఈ ప్రాంతంపై పడింది. వీరు ఈ ప్రాంతంలో భూములు కొనుగోలు చేసి అపార్ట్‌మెంట్లు నిర్మించి అద్దెలకు ఇస్తున్నారు.

చుక్కలంటిన ధరలు

తాడిగడప, కానూరు, పెనమలూరు ప్రాంతాల్లో రెండేళ్ల క్రితం ఎకరా రూ.6 కోట్ల వరకు ఉండేది. ఇపుడు అవే భూములు ఎకరా రూ.14 కోట్ల నుంచి రూ.15 కోట్ల వరకు పలుకుతున్నాయి. విజయవాడ నుంచి మచిలీపట్నానికి రెండు వరుసలుగా ఉన్న 65వ నెంబర్ జాతీయ రహదారిని నాలుగు వరుసల రహదారిగా అభివృద్ధి చేస్తున్నారు. మచిలీపట్నానికి 65 కిలోమీటర్ల దూరం వరకు ఈ రోడ్డు విస్తరణ పనులు ఇప్పటికే 90 శాతం పూర్తయ్యాయి. విజయవాడకు సమాంతరంగా పెనమలూరు వైపు స్థిరాస్తి రంగం అభివృద్ధి చెందటానికి జాతీయ రహదారి ప్రధానంగా దోహదం చేస్తోంది. దీంతో పెనమలూరును దాటి కంకిపాడు వరకు జాతీయ రహదారి వెంబడి నిర్మాణ రంగం జోరందుకుంటోంది.

డొంక రోడ్ల స్థానంలో సిమెంట్ రోడ్లు

రెండేళ్లలో చూస్తుండగానే ఈ ప్రాంతాలు నగరీకరణ దిశగా అడుగులు వేస్తున్నాయి. దీనికి తోడు ఈ ప్రాంత స్థానిక గ్రామ పంచాయతీల దగ్గర వందల కోట్ల రూపాయల నిధులు ఉన్నాయి. ఈ నిధులతో ఆయా గ్రామ పంచాయతీల పాలక వర్గాలు, మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేశాయి. అందులో భాగంగా గ్రామాల్లో భారీ స్థాయిలో సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపట్టారు. దీంతో పెనమలూరులో ఒకప్పటి డొంకలు కూడా కనిపించకుండా పోయాయి. డొంకరోడ్ల స్థానంలో 80 అడుగుల సిమెంట్ రోడ్లు పడ్డాయి



కాలనీలు

జాతీయ రహదారి వెంబడి ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున నివాస భవనాలు వెలుస్తున్నాయి. అవి కూడా గేటెడ్ కమ్యూనిటీ కాలనీలు కావటంతో ఈ ప్రాంతానికి ప్రత్యేకత ఏర్పడింది. భారీ కార్పొరేట్ సంస్థలు.. ఇక్కడ గేటెడ్ కమ్యూనిటీ కాలనీలు ఏర్పాటు చేస్తున్నాయి. ఈ కారణంగా తాడిగడప, పోరంకి, కానూరు, గోసాల, గంగూరు ప్రాంతాలలోని రహదారి వెంబడి ఉన్న పంట పొలాల్లో నిర్మాణ రంగం విస్తరిస్తోంది. పంట పొలాలన్నీ కాలనీలుగా రూపాంతరం చెందుతున్నాయి. పొలాల నడుమ భారీ అపార్ట్‌మెంట్ సౌధాలు కనిపిస్తున్నాయి.



ట్రిపుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్లకే ఫుల్ డిమాండ్

బడా ప్రాజెక్టుల్లో 80 శాతం ఇవే ఫ్లాట్లు

ఎక్కువ స్థలంలో తక్కువ నిర్మాణ వ్యయం

(హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి)

నిన్న మొన్నటి వరకు డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్లకే ఎక్కువ డిమాండ్ ఉండేది. బిల్డర్లు దానికనుగుణంగానే నిర్మాణాలు చేసేవారు. ప్రస్తుతం ట్రెండ్ పూర్తిగా మారిపోతోంది. ట్రిపుల్ బెడ్‌రూంలు, ఆపైన ఉండే ఫ్లాట్లకు డిమాండ్ పెరుగుతోంది. ఆర్థిక స్థోమత పెరగడంతో పాటు ప్రస్తుత, భవిష్యత్ అవసరాలు ఇందుకు ప్రధాన కారణం. దీంతో బిల్డర్లు కూడా అలాంటి ఫ్లాట్లనే ఎక్కువగా నిర్మిస్తున్నారు. సామాన్యులు, మధ్యతరగతి వారి కోసం మాత్రమే, అక్కడక్కడ టూ బెడ్‌రూమ్ ఫ్లాట్లను నిర్మిస్తున్నారు. హైదరాబాద్ మహా నగర అభివృద్ధి సంస్థ (జీహెచ్ఎంసీ) పరిధిలో నిర్మిస్తున్న వెంచర్లలో 80 శాతం 3,4,5 బెడ్‌రూమ్‌లతో కూడిన అపార్ట్‌మెంట్లే ఎక్కువగా ఉన్నాయి. విజయవాడ, అమరావతి, విశాఖల్లోనూ ఇదే ట్రెండ్. రాష్ట్ర విభజన తర్వాత రెండు రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు డబుల్ బెడ్ రూమ్ గృహాలు నిర్మించి ఇస్తున్నాయి. దీంతో ఎగువ మధ్యతరగతి ప్రజలు కూడా ట్రిపుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్లు కొనేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

మౌలిక వసతులు

పెద్ద ప్రాజెక్టుల్లో మూడు పడక గదుల ఫ్లాటుతో పాటు అదనంగా కల్పిస్తున్న వసతులు కొనుగోలుదారులను అమితంగా ఆకర్షిస్తున్నాయి.

- ప్రశాంతమైన వాతావరణంలో రకరకాల ఆటలు ఆడుకునేందుకు ప్రత్యేకంగా విశాలమైన ప్రాంగణాలు.
- పురుషులకు, మహిళలకు విడిగా స్విమ్మింగ్‌పూల్స్, ఔట్‌డోర్, ఇండోర్ బ్యాడ్మింటన్ కోర్టులు, స్క్వాష్, టెన్నిస్ కోర్టులు.
- అందుబాటులో యాంఫీ థియేటర్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు.
- ప్రతి బ్లాకులో విడిగా విజిటర్ల లాబీ, ఇండోర్ గేమ్స్, జాగింగ్ ట్రాక్‌లు.
- అత్యుత్తమ ప్రాంతంలో ప్రాజెక్టులను తీర్చిదిద్దడం.

తక్కువ నిర్మాణ వ్యయం

నగరాలు, పట్టణాల్లో ట్రిపుల్ బెడ్‌రూమ్ ఫ్లాటు అంటే సుమారు 1400 ఎస్ఎఫ్‌టీ నుంచి ప్రారంభమై 2000 ఎస్ఎఫ్‌టీ వరకు ఉంటోంది. ఇందులో బెడ్‌రూమ్‌లు, వంట గది, హాలు, ఇతర అవసరాల కోసం వారి వారి అభిరుచులకు అనుగుణంగా నిర్మాణాలు చేయించుకుంటున్నారు. దీంతో బిల్డర్లు ఎక్కువ విస్తీర్ణాన్ని తక్కువ నిర్మాణ వ్యయంలోనే కొనుగోలుదారులకు అందిస్తున్నారు.

సొంతింటి కల

సొంతింటి కల అంటే ఇప్పుడు చాలా మంది ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నారు. కొనుగోలు ప్రారంభంలోనే ఎక్కువ విస్తీర్ణాన్ని కొనుగోలు చేయడం వల్ల భవిష్యత్తులో అది అన్ని విధాలుగా ఉపయోగపడుతుందనే అభిప్రాయం చాలా మందిలో ఉంది. ముఖ్యంగా ఇద్దరు పిల్లల దంపతులకు, ప్రస్తుతం టూ బెడ్‌రూమ్ ఫ్లాటు సరిపోయినా, భవిష్యత్తులో ఏమాత్రం సరిపోదు. ఇద్దరు పిల్లలు పెద్దవారైతే వారికే చెరొక బెడ్ రూమ్ అవసరం ఏర్పడుతుంది. ఇక తరచూ వచ్చే బంధుమిత్రులు, శుభకార్యాలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరుపుకోవాలంటే, విశాలమైన ఫ్లాట్లే అనుకూలంగా ఉంటాయని కొనుగోలుదారులు భావిస్తున్నారు.

విలువ పెరిగే అవకాశం

ఇప్పుడు ఎక్కువ విస్తీర్ణంతో కూడిన ట్రిపుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్ కొనుగోలు చేస్తే, భవిష్యత్తులో దాని విలువ మరింత పెరిగేందుకు అవకాశం ఉంది. ఇలా అన్ని విధాలుగా ఆలోచించి ఎక్కువ విస్తీర్ణంతో ఉన్న ఫ్లాట్లను కొనుగోలు చేసే వారి సంఖ్య ఇప్పుడు బాగా పెరిగింది. బ్యాంకులు కూడా వారి ఆర్థిక స్థోమతను బట్టి, ఎంత కావాలంటే అంత హోమ్ లోన్ ఇచ్చేందుకు అంగీకరిస్తున్నాయి. ఇలా అన్ని విధాలుగా అనుకూలమైన వాతావరణం ఉండడంతో నగరాల్లో ట్రిపుల్ బెడ్‌రూమ్, అంతకు మించిన ఫ్లాట్లకు ఫుల్ డిమాండ్ ఏర్పడింది.

ఇసుకతోనే ఇళ్లు పదిలం



మార్కెట్లో పెరిగిన డిమాండ్

అందుబాటులోకి ఇసుక ర్యాంపులు

దిగొస్తున్న ఇసుక ధరలు

నిర్మాణాల్లో ఇసుకకు ఉన్న ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. చిన్న భవనమైనా, పెద్ద భవనమైనా ఇసుక లేనిదే పూర్తి కాదు. ప్రస్తుతం మార్కెట్లో అనేక రకాల ఇసుకలు లభిస్తున్నాయి. ఇందులో ఏ ఇసుక మంచిది? కొనుగోలు చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు మీ కోసం..

హైదరాబాద్ సిటీ, (ఆంధ్రజ్యోతి)

గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలు, నగరాల వరకు ప్రస్తుతం ఎక్కడ చూసినా నిర్మాణాలన్నీ కాంక్రీట్ మయం. దీంతో ఇసుకకు డిమాండ్ పెరిగింది. వ్యక్తిగత ఇళ్లు, అపార్ట్‌మెంట్లతో పాటు పలు ప్రాజెక్టులు, అభివృద్ధి పనులకూ ఇసుక తప్పనిసరి. వర్షాకాలం టన్ను రూ. 2,700 వరకు పలికిన ఇసుక, ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లో రూ.1,200 నుంచి రూ.1,400 మధ్య లభిస్తోంది. గోదావరి, కృష్ణ నదుల్లో నీటి ప్రవాహం తగ్గడంతో 2 తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో ఇసుక ర్యాంపులు పెద్దఎత్తున అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ (టీఎస్ఎండీసీ) రోజూ 35,080 క్యూబిక్ మీటర్ల ఇసుకను విక్రయిస్తోంది. ఏపీలోనూ ప్రస్తుతం ఇసుక సరఫరా సమృద్ధిగా ఉంది. అయినా కొంతమంది దళారులు నదుల ఇసుక పేరుతో, ఫిల్టర్ ఇసుకను కొనుగోలుదారులకు అంటగడుతున్నారు.

నదుల ఇసుకే బెటర్

నదుల్లో నిత్యం నీటి ప్రవాహం ఉంటుంది. దాంతో ఇసుకలోని జిగురు పూర్తిగా తొలగిపోయి స్వచ్ఛంగా తయారవుతుంది. ఎలాంటి నిర్మాణం కోసం అయినా నదుల్లో దొరికే ఇసుకను ఉపయోగించవచ్చు. హైదరాబాద్‌లో లభించే ఇసుక, కృష్ణా, గోదావరి, మంజీర, నదులతో పాటు రంగారెడ్డి, వరంగల్, కర్నూల్, మహబూబ్‌నగర్, నిజామాబాద్, కరీంనగర్ తదితర ప్రాంతాల్లోని వాగుల నుంచి తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. ప్రస్తుతం టీఎస్ఎండీసీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని జయశంకర్‌భూపాలపల్లి, పెద్దపల్లి, నల్లగొండ, మంచిర్యాల, భద్రాద్రి కొత్తగూడెం, వనపర్తి జిల్లాల పరిధిలో 24 వరకు ఇసుక ర్యాంపులను ఏర్పాటు చేసి విక్రయాలు జరుపుతున్నారు.

ఇసుకలో రకాలు

నదుల్లో దొరికే ఇసుకలో కొంత దొడ్డుగా ఉంటుంది. దీన్ని స్లాబ్, ఫిల్లర్ల నిర్మాణంలో వాడుతున్నారు. సన్నగా ఉండే ఇసుకను ప్లాస్టరింగ్‌కు వినియోగిస్తున్నారు. నదుల్లో దొరికే ఇసుక జలజలా జారుతుంది. ప్రస్తుతం దొడ్డుగా ఉండే ఇసుకను టన్నుకు రూ.1200ల వరకు విక్రయిస్తుండగా, ప్లాస్టరింగ్, ఇతర డిజైన్ల కోసం వినియోగించే సన్న ఇసుక ప్రస్తుతం టన్నుకు రూ.1300 పైన పలుకుతోంది. వర్షాకాలంలో ఇదే ఇసుక టన్ను రూ.2700ల వరకు పలికింది. చాలా మంది కాళేశ్వరం ర్యాంపు నుంచి వచ్చే సన్న ఇసుకకు ప్రాధాన్యతిస్తున్నారు.

ఫిల్టర్ ఇసుక యమ డేంజర్

మట్టిని నీటితో పలుమార్లు కడిగితే తయారయ్యే ఇసుకను ఫిల్టర్ ఇసుక అంటారు. నిర్మాణాలకు ఎట్టి పరిస్థితుల్లో ఈ ఇసుకను ఉపయోగించకూడదు. ప్రభుత్వం కూడా ఫిల్టర్ ఇసుకను నిషేధించింది. అయినా కొంత మంది నగర శివారు ప్రాంతాల్లో ఫిల్టర్ ఇసుకను తయారు చేస్తున్నారు. హైదరాబాద్ శివార్లలోని పటాన్ చెరు, మేడ్చల్ ప్రాంతాల్లో ఈ దందా ఎక్కువగా నడుస్తోంది. ఈ ఇసుకతో ప్లాస్టింగ్ చేసిన స్లాబ్‌లు, నిర్మించిన కొద్ది రోజులకే పగుళ్లు ఇస్తాయి. ఫ్లోరింగ్ కోసం రాళ్ల కింద బెడ్ వేసేందుకు తప్పించి, మిగతా ఎలాంటి నిర్మాణాలకు ఈ ఫిల్టర్ ఇసుక ఉపయోగపడదు.

రోబో ఇసుక

దేశంలోని అన్ని ప్రాంతాల్లో నదుల ఇసుక లభించదు. కొన్ని మహానగరాల్లో ఇసుక డిమాండ్, సప్లయ్ మధ్య తీవ్ర వ్యత్యాసం ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకొని కొన్ని ప్రాంతాలలో యంత్రాల ద్వారా ఇసుకను తయారు చేస్తున్నారు. దీనిని రోబో సాండ్ అంటారు. రాళ్లను మిషన్‌ల్లో గ్రైండ్ చేసి డస్ట్‌ను వేరు చేస్తారు. ఈ విధంగా పలుమార్లు నీటితో కడుగగా రోబో ఇసుక తయారవుతుంది. నదుల్లో దొరికే ఇసుకకు, రోబో ఇసుకకు రంగులో మాత్రమే కొద్దిగా తేడా ఉంటుంది. సైజు, బలంలో మాత్రం ఏలాంటి తేడాలుండవు. ఢిల్లీ, గుజరాత్ తదితర ప్రాంతాల్లో ఈ రకమైన ఇసుక వినియోగం అధికంగా ఉంది. హైదరాబాద్‌లోనూ రోబో ఇసుక వినియోగించే అవకాశాలున్నాయి.

నాణ్యతే కీలకం

భవనాలు పది కాలాల పాటు పదిలంగా ఉండాలంటే, నిర్మాణ సమయంలోనే మంచి ఇసుకను ఎంచుకోవాలి. నాణ్యత లేని ఇసుకను వినియోగిస్తే, త్వరలోనే ఆ భవనాలకు పగుళ్లు వచ్చే అవకాశాలున్నాయి. కొద్ది సంవత్సరాలకే కూలిపోయినా ఆశ్చర్యం లేదు. సముద్రపు ఇసుకను, ఫిల్టర్ ఇసుకను నిర్మాణాలకు ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపయోగించకూడదు. రెండు తెలుగు రాష్ట్రాల్లో అనేక నదులున్నా, కృష్ణా-గోదావరి నదుల నుంచే ఎక్కువ ఇసుక అందుబాటులో ఉంది. తెలంగాణలో అయితే కేవలం కృష్ణా, గోదావరి నదుల నుంచి ఇసుక తవ్వకాలకు మాత్రమే అనుమతులు ఉన్నాయి. ఆయా నదుల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక ర్యాంపుల ద్వారా విక్రయాలు జరుపుతున్నారు. నదుల సమీపంలోని రైతులు, తమ భూముల్లోకి వచ్చిన ఇసుక మెట్టలను తొలగించుకునేందుకు, టీఎస్ఎండీసీతో ఒప్పందాలు చేసుకుంటున్నారు. దీంతో పెద్ద ఎత్తున ఇసుక అందుబాటులో ఉంటోంది.




స్టోన్ డస్ట్‌తో నిర్మాణాలు

పెద్ద పెద్ద గుట్టలను తొలిచి వివిధ సైజుల్లో రాళ్లు, కంకర తయారు చేసే క్రమంలో పెద్దఎత్తున స్టోన్ డస్ట్ వస్తుంది. ఇసుకతో పోలిస్తే దీని ధర తక్కువ. ప్రస్తుతం టన్ను ఇసుక రూ.1,200 నుంచి రూ.1,400 వరకు ఉంటే ట్రాక్టర్ లోడు స్టోన్ డస్ట్ రూ.500కే లభిస్తోంది. ఈ డస్ట్‌తోనే సిమెంట్ ఇటుకలను తయారు చేస్తున్నారు. వీటిని షెడ్డుల నిర్మాణంలో అధికంగా ఉపయోగిస్తున్నారు. ఇసుక కొనలేని సామాన్య ప్రజానీకం ఎక్కువగా ఈ స్టోన్ డస్ట్‌నే ఉపయోగిస్తున్నారు.



రైతుకు వరం

రాష్ట్రం నుంచి ఆరు దేశాలకు వివిధ రకాల కూరగాయలు, పండ్లు ఎగుమతి చేయడానికి ఉద్యానవన శాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఎగుమతులు పెరిగితే రైతులకు మెరుగైన ధరలు వస్తాయనే ఆలోచనతో ఉద్యానవన శాఖ అధికారులు అంతర్జాతీయ మార్కెట్లో ఎగుమతిదారులతో ఒప్పందాలు చేసుకుంటున్నారు.



ఆరు దేశాలకు మన కూరగాయలు!

మల్లవోలులో ప్యాకింగ్ కేంద్రం ● రైతులకు మెరుగైన ధర... నాణ్యత పెంపుపై దృష్టి



ప్రస్తుతం హైదరాబాద్ విమానాశ్రయం నుంచి ఏపిలోని 13 జిల్లాల్లో పండే కూరగాయలు, పండ్లు, పూలు, ఇతర వ్యవసాయోత్పత్తులు విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. నెల రోజుల నుంచి విశాఖ విమానాశ్రయం ద్వారా రైతులు నేరుగా సింగపూర్ మలేషియా, ఐరోపా దేశాలకు ఎగుమతులు చేయడం ప్రారంభించారు. రాష్ట్రంలోని విశాఖ, గన్నవరం విమానాశ్రయాల ద్వారా కూరగాయల ఎగుమతికి కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. దీనితో ఏపి రైతులు కూరగాయలను ఎగుమతి చేసేందుకు ముందుకొస్తున్నారు.

మన రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి ఇటలీ, స్వీడన్, రొమేనియా, బెల్జియం, ఫ్రాన్స్, ఇండోనేసియాలకు కూరగాయలు, పండ్లు, పూలు, ఇతర ఆహార ఉత్పత్తులను ఎగుమతి చేయడానికి వివేశానో అనే సంస్థ ముందుకు వచ్చింది. ఈ సంస్థ ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లో వివిధ దేశాలకు కూరగాయల ఎగుమతులు, దిగుమతులను నిర్వహిస్తోంది. ఈ సంస్థ సిఇవో అనురాధ సుబ్రహ్మణ్యం, అంతర్జాతీయ ఎగుమతుల విభాగం సీనియర్ అధికారి భరతపూడి శ్రీనివాస్‌లు గుంటూరులోని ఉద్యానవన శాఖ రాష్ట్ర కమిషనర్ చిరంజీవి చౌదరితో చర్చించారు. రాష్ట్రం నుంచి బెండకాయలు, కొత్తిమీర, మునక్కాయలు, కాకరకాయలు, అల్లం, పచ్చిమిరప, ఆనపకాయలు, మామిడి కాయలను తొలిదశలో ఎగుమతులు చేయడానికి ఈ సంస్థ అంగీకరించింది. ఒక్కో పంట వారానికి టన్ను చొప్పున విదేశాలకు ఎగుమతులు చేస్తామన్నారు. నెలకు 40-50 మెట్రిక్ టన్నుల చొప్పున ఏడాదికి 500-600 మెట్రిక్ టన్నులు అంతర్జాతీయ మార్కెట్లో తమ సంస్థ ద్వారా ఎగుమతి చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆమె చెప్పారు. కృష్ణా, విజయనగరం జిల్లాల నుంచి బెండకాయలు; పాడేరు నుంచి అల్లం; గుంటూరు నుంచి పచ్చిమిరప, కొత్తిమీర; ప్రకాశం జిల్లా నుంచి మునగ, కాకర; చిత్తూరు, కడప నుంచి మామిడి; తూర్పుగోదావరి నుంచి ఆనపకాయలు ఎగుమతి చేయడానికి అవకాశం ఉన్నట్లు ఉద్యానవన శాఖ అధికారులు ఎగుమతి సంస్థల దృష్టికి తెచ్చారు.

ఏపిలో కూరగాయలు, పండ్లు, పూలు, ఇతర ఆహారోత్పత్తులను ఎగుమతి చేయడానికి కృష్ణా జిల్లాకు చెందిన మల్లవోలు ఫుడ్ పార్క్‌లో రూ. 6 కోట్లతో పాకింగ్ యూనిట్ ఏర్పాటు చేయడానికి అంతర్జాతీయ ఎగుమతిదారులు ముందుకొచ్చారు. ఈ పాకింగ్ యూనిట్‌కు మౌలిక వసతులు కల్పిస్తామని కమిషనర్ తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లో ఏపి నుంచి కూరగాయల ఎగుమతులకు అనుమతులు వస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ఎగుమతిదారులు అంతర్జాతీయ మార్కెట్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తారు. రసాయనిక అవశేషాలు లేని కూరగాయలను పండిస్తారు. రైతులు పండించిన కూరగాయలు, వ్యవసాయ, ఆహార ఉత్పత్తులలో నాణ్యతను లాబుల్లో పరీక్ష చేయిస్తారు. నాణ్యత ఉన్నట్లు నిర్ధారించాక గన్నవరం, విశాఖ విమానాశ్రయాల ద్వారా ఎగుమతి చేస్తారు. అంతర్జాతీయ ఎగుమతులు ప్రారంభమైతే కూరగాయల్లో నాణ్యత పెరుగుతుంది. ఇతర దేశాల్లో ఎగుమతులు, అనుబంధ ఉత్పత్తులలో సాంకేతిక పరిజ్ఞానంపై ఇక్కడ రైతుల్లో అవగాహన పెంచుతారు. **- ఆంధ్రజ్యోతి, గుంటూరు**

ఏడాదికి 600 మెట్రిక్ టన్నులు



తొలిదశలో ఏడురకాల కూరగాయలు, మామిడి పండ్లు ఎగుమతులు చేస్తాం. ఏడాదికి 600 మెట్రిక్ టన్నులు విదేశాలకు పంపుతాం. వారానికి ఒక్కో పంటను ఒక మెట్రిక్ టన్ను ఎగుమతి చేసేలా ఏర్పాట్లు చేశాం. దేశంలో కూరగాయల పంటలు, వాణిజ్య పంటలకు ఏపిలోని గుంటూరు కేంద్రంగా ఉంది. అందుకే మా సంస్థ ఇక్కడ నుంచే ఎగుమతులు చేసేందుకు ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకుంటోంది. **- అనురాధ సుబ్రహ్మణ్యం, వివేశానో సిఇవో**

రైతుల్లో మరింత అవగాహన



అంతర్జాతీయ మార్కెట్‌లో రైతులు నేరుగా కూరగాయలు ఎగుమతి చేసే విధంగా అవగాహన కల్పిస్తాం. పురుగు మందుల అవశేషాలు లేని కూరగాయలకు డిమాండ్ ఎక్కువుంది. అదేవిధంగా కూరగాయలతో అనుబంధ ఉత్పత్తులను తయారుచేసే వ్యవస్థను బలోపేతం చేస్తాం. అనుబంధ ఉత్పత్తులపై రైతుల్లో అవగాహన పెంచితే ఎక్కువ ధర వస్తుంది. ప్రభుత్వం ఎగుమతులకు సంబంధించిన అన్ని అంశాల్లో పూర్తి సహకారం అందిస్తోంది. **- భరతపూడి శ్రీనివాస్, అంతర్జాతీయ ఎగుమతుల కో ఆర్డినేటర్**

రైతులకు మంచి లాభాలు



మన దేశంలో కూరగాయల ఉత్పత్తిలో ఏపి ముందంజలో ఉంది. మన రైతులు పండించిన కూరగాయలను కొన్ని సంస్థలు ఎగుమతి చేసి పెద్ద ఎత్తున లబ్ధి పొందుతున్నాయి. అందుకే ప్రభుత్వం రైతులనే ఎగుమతిదారులుగా చేయడానికి ప్రాధాన్యత ఇస్తోంది. రైతు ఉత్పత్తిదారుల సంఘాలను బలోపేతం చేస్తున్నాం. విశాఖ, గన్నవరం విమానాశ్రయాల నుంచి కూరగాయల ఎగుమతులకు కేంద్రం ఆమోదం తెలిపింది. దీనితో దశల వారీగా రైతులను ఎగుమతిదారులుగా చేయడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. **- చిరంజీవి చౌదరి, ఉద్యానవన శాఖ కమిషనర్**

వినూత్నం



గాలిలో సేద్యం!

● మట్టి లేకుండా టెక్నాలజీతో సాగు

● ఆహారపు కొరత తీర్చేందుకు నైజీరియన్ యత్నం

వ్యవసాయం చేయాలంటే సారవంతమైన నేల కావాలి. అందులో పోషకాలున్న మట్టి ఉండాలి. అలాంటిది మట్టి లేకుండా వ్యవసాయం చేయడమంటే?.. సుసాధ్యమే అంటున్నారు నైజీరియా దేశస్థుడు. ఆహారపు కొరతను తీర్చేందుకు గాలిలో పంటలు పండిస్తున్నారు శామ్సన్ ఓగ్బోలేజ.

నైజీరియాలో ప్రజలకు అవసరమైన ఆహారంలో సగం కూడా దొరకని పరిస్థితి. కష్టపడేవారున్నా పంటలు పండించేందుకు సరైన భూమి అందుబాటులో లేదు. అక్కడి ప్రజలకు అవసరమైన ఆహారపదార్థాలు పండించాలంటే 7.85 కోట్ల హెక్టార్ల సాగు భూమి కావాలి. కానీ 3 కోట్ల హెక్టార్ల భూమి మాత్రమే వ్యవసాయానికి అనుకూలంగా ఉంది. ఉన్న దాంట్లో అందరికీ సరిపోయేలా పంటలు పండించడం ఎలా అని ఆలోచించిన శామ్సన్ ఆధునిక సాగుకు శ్రీకారం చుట్టారు. మట్టి అవసరం లేకుండా గాలిలో సాగు చేసే టెక్నాలజీని నైజీరియాలో అమల్లోకి తీసుకొచ్చారు. గాలిలో వ్యవసాయం ఏంటి అనుకుంటున్నారా? అదే ఎయిరోఫోనిక్స్. మరోవిధంగా చెప్పాలంటే అర్బన్ ఫామింగ్! మట్టి స్థానంలో ఖనిజ పోషకాలు, నీటిని ఉపయోగించి సాగు చేయడమన్న మాట. 2014లో అర్బన్ ఫామింగ్ పద్ధతిలో వ్యవసాయం చేయడం ప్రారంభించారు. ప్రస్తుతం టెక్నాలజీ సాయంతో ఆహారాన్ని ఉత్పత్తి చేయడంతో పాటు ఆహార భద్రత కల్పించాలనే ఉద్దేశంతో రెండేళ్ల క్రితం పీఎస్ న్యూట్రాసెటికల్స్ అనే సంస్థను స్థాపించారు. దీని ద్వారా నైజీరియా వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. భవిష్యత్తు తరాలకు ఆహారపు కొరత లేకుండా చూసే లక్ష్యంతో ముందడుగు వేశారు శామ్సన్.



ఎయిరోఫోనిక్స్ అంటే..


మట్టి అవసరం లేకుండా మొక్కలను గాలి లేదా తేమ కలిగిన వాతావరణంలో పెంచడమే ఎయిరోఫోనిక్స్. ప్లాస్టిక్ పైపులు, డబ్బాల్లో పోషకాలతో కూడిన నీటిలో మొక్కలను పెంచుతారు. ఈ పద్ధతిలో ఆకులు, వేర్లను వేరుచేసేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తారు. మొక్కలకు అవసరమైన ఎరువులను నీటి ద్వారా అందిస్తూ పెరిగేలా చూస్తారు. సాధారణంగా మట్టిలో వ్యాధికారకాలు ఉంటాయి. వీటి వల్ల పంటలకు వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. ఈ పద్ధతిలో మట్టే లేదు కాబట్టి అలాంటి సమస్య లేదు. దిగుబడి కూడా ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. ఏడాది మొత్తం ఎలాంటి పంటలైనా సాగు చేయొచ్చు. స్మార్ట్ సెన్సర్ టెక్నాలజీని వ్యవసాయ రంగంలో ప్రవేశపెట్టారు శామ్సన్. ఈ నైజీరియన్ స్ఫూర్తితో ఈ తరహా సేద్యం విశ్వవ్యాప్తం అవుతుందని ఆశిద్దాం. **- సెంట్రల్ డెస్క్**



అమ్మానాన్న.. తోట!

మిద్దెతోట

ఒంటరిగా ఉంటున్న తల్లిదండ్రులకు మిద్దెతోట లేదా పెరటితోట గొప్ప ఆరోగ్యమార్గం. పిల్లలు ఎంత దూరంలో ఉన్నా తరచూ తల్లిదండ్రుల దగ్గరకు వెళ్లి వారిలో మిద్దెతోట, పెరటితోట పెంపకం పట్ల ఆసక్తి రగిలించాలంటున్నారు ప్రముఖ మిద్దెతోటల నిపుణులు **తుమ్మేటి రఘోత్తమరెడ్డి.**



చదువులు, ఉద్యోగాలు, వ్యాపారాల పేరుతో చాలామంది పిల్లలు తల్లిదండ్రులకు దూరంలో ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అందువలన మానవ జీవితంలో అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. చాలామంది తల్లిదండ్రులు గ్రామాలలో ఉంటే, పిల్లలు పట్టణాల్లో ఉంటున్నారు. మరెందరో తల్లిదండ్రులు పట్టణాలలో ఉంటే వారి పిల్లలు విదేశాలలో ఉంటున్నారు. రెండు తరాల మధ్య రిలేషన్స్ కమ్యూనికేషన్ విషయంలో చాలా గ్యాప్ వస్తోంది. ఇది కనపడని విషాదం. వినపడని దుఃఖం. అన్నీ ఉన్నా కూడా, ఏదో వెలితి మనసును కోస్తూ ఉంటుంది. ఆ విషాదం కొనసాగి, మానసిక దుస్థితికి దారితీస్తుంది. మానసిక దుస్థితి చిరకాలం కొనసాగితే, శారీరక దుస్థితికి దారితీస్తుంది. తత్ఫలితంగా అనేక వ్యాధులు ప్రారంభం అవుతాయి. అలాంటి మానసిక, శారీరక సమస్యలతో సతమతం అవుతున్న ఒంటరి తల్లిదండ్రులకు మిద్దెతోట లేదా పెరటితోట చక్కని పరిష్కారం. ఎంత పని ఒత్తిడిలో ఉన్నవారైనా ప్రతి నెల తప్పనిసరిగా తల్లిదండ్రుల వద్దకు వెళ్ళాలి. వారితో రెండు రోజులు గడపాలి. ప్రపంచంలో అన్ని వ్యాపకాల కంటే, మొక్కల పెంపకం అత్యుత్తమ వ్యాపకం. అలా తల్లిదండ్రుల దగ్గరికి వెళ్లినపుడు వారిని కూరగాయలు, పండ్ల మొక్కల పెంపకం వైపు మళ్లించాలి. ఇవాళ మనమే సొంతంగా కూరగాయలను, పండ్లను ఎందుకు ఉత్పత్తి చేసుకోవాలో, వారిని ఎడ్యుకేట్ చేయాలి. మార్కెట్లో దొరుకుతున్న కూరగాయల్లో, పండ్లలో, ఇతర ఆహారపదార్థాల్లో ఏ మేరకు పురుగు మందుల అవశేషాలు ఉంటున్నాయో తెలియజెప్పాలి. ఆ అవశేషాలు మన కడుపులోకి వెళ్లి ఎన్ని వ్యాధులకు కారణం అవుతున్నాయో వివరించాలి. వారు కూరగాయలను సొంతంగా పండించుకునేలా చూడాలి. అవసరమైన సహాయం చెయ్యాలి. మొక్కల పెంపకం పట్ల ఇదివరకే ఆసక్తి ఉన్నవారు ఉంటారు. వారికి అవసరమైన ఏర్పాట్లు చెయ్యాలి. వారు పెద్దవారు కనుక బరువైన పనులు చేసుకోలేరు కనుక మనం సహాయం చెయ్యాలి. పలుగు, పార పుచ్చుకుని మడులను ఏర్పాటు చెయ్యాలి. ఎరువులు కలపాలి. విత్తనాలను తెచ్చివ్వాలి. చీడపీడల పట్ల అవగాహన కల్పించాలి. పిల్లలు తోటలను నిర్మించి పెడితే, తల్లిదండ్రులు వాటిని నిర్వహించుకుంటారు. తద్వారా అనేక లాభాలు కలుగుతాయి. తల్లిదండ్రులకు తోట పని చెయ్యడం వల్ల వారి శరీరాలకు వ్యాయామం కలుగుతుంది. దాంతో పాటు మానసిక ప్రశాంతత కలుగుతుంది. తద్వారా వారి పిల్లలకు ఎన్నో సమస్యల నుండి విముక్తి కలుగుతుంది. అందువల్ల పిల్లలు తల్లిదండ్రుల వద్దకు వెళ్లి, వారికి అవసరమైన ఏర్పాట్లు చేయడం వల్ల భవిష్యత్తరానికి ఉత్తమ విలువలను నేర్పినవారు అవుతారు. మనం ఏ విలువలను ఆచరిస్తే, మనకు అవే ఫలితాలు ప్రాప్తిస్తాయి.



ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దులో వున్న ఆ గ్రామం కూరగాయలు, ఆకుకూరలకు చిరునామాగా మారింది. వాణిజ్య పంటల సాగుకు స్వస్తిచెప్పి, నిత్యం ఆదాయాన్ని ఇచ్చే కూరగాయల సాగు చేస్తున్నారు పశ్చిమగోదావరి జిల్లా సీతారామనగరం గ్రామ రైతులు. నెలకు ఎకరాకు 15 వేల దాకా ఆదాయం పొందుతున్న ఆ ఆకుకూరల గ్రామం చూద్దాం రండి.

ఇదో ఆకుకూరల పల్లె!



నెలకు ఎకరాకు 15 వేల ఆదాయం | గ్రామం అంతా ఆకుకూరలు, కూరగాయల సేద్యం

ఆ గ్రామంలో అడుగుపెడితే చాలు ఎక్కడ చూసినా పచ్చదనాలు పరుచుకుంటాయి. ప్రతి ఇంటి పెరట్లో నారుమడులు కనిపిస్తాయి. దశాబ్దాలుగా ఆ గ్రామ రైతులు కూరగాయలు, ఆకుకూరలు మాత్రమే పండిస్తున్నారు. అభివృద్ధికి చిరునామాగా కనిపించే ఆ గ్రామం పశ్చిమగోదావరి జిల్లా కుక్కునూరు మండలం శివారుగ్రామం సీతారామనగరం. కిన్నెరసాని వాగు సమీపంలో వుంది. వాగు దాటితే ఆవలి తీరం అంతా తెలంగాణ ప్రాంతమే. నాణ్యమైన, రుచికరమైన ఆకుకూరలు, కూరగాయలకు ఈ గ్రామం పెట్టింది పేరు. గ్రామంలోని 150 కుటుంబాలు వ్యవసాయం మీదే ఆధారపడి జీవిస్తాయి. ప్రతి ఒక్కరూ రేయింబవళ్లు కష్టపడి పనిచేస్తారు. కొందరు పొలం పనులు చూసుకుంటే, మరికొందరు పండించిన పంటను తెలంగాణలోని వివిధ మండలాలకు తీసుకెళ్లి విక్రయిస్తారు.

గతంలో ఈ గ్రామానికి చెందిన రైతులు వాణిజ్య పంటలే సాగు చేసేవారు. దాంతో నష్టాలే ఎదురయ్యాయి. పత్తి, మిర్చి సాగులో ఒక ఏడాది లాభాలు వస్తే, రెండేళ్లు నష్టాలు వచ్చేవి. మరోవైపు గోదావరి వరదలు వారి ఆశల మీద నీళ్లు చల్లేవి. ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లో సేద్యం అసాధ్యంగా మారింది. ఏటా పెట్టుబడుల కోసం బ్యాంకులు, వ్యాపారుల చుట్టూ తిరిగి ఎలానో సాగు చేసే వారు. చివరకు నష్టాలు మూటకట్టుకుని అప్పులపాలయ్యేవారు. దీంతో వారి ఆలోచనా విధానం మారింది. తక్కువ పెట్టుబడితో ఎప్పటికప్పుడు ఆదాయం వచ్చే ఆకుకూరల సాగు చేస్తే మేలనిపించింది.

విజయగాథ

ముందుగా ఓ పదిమంది రైతులు ఆకుకూరల సాగు ఆరంభించారు. లక్షల పెట్టుబడి పెట్టి ఏడాది అంతా టెన్షన్ పడేకంటే ఆకుకూరల సాగుతో కొంత ఆదాయం నెలరోజుల్లోనే చేతికి వస్తుండటంతో క్రమేపీ 100కి పైగా కుటుంబాలు ఆకుకూరల సేద్యం వైపు మళ్లాయి.

సీతారామనగరం గ్రామంలో నారుమడుల ద్వారా అన్నిరకాల ఆకుకూరలను సాగుచేస్తున్నారు. ప్రధానంగా తెల్లతోటకూర, నల్లతోటకూర, గోంగూర, బచ్చలికూర, చుక్కకూర, పాలకూర, మెంతికూర, పుదీన, కొత్తిమీరను ఎక్కువగా సాగు చేస్తారు. అలాగే పచ్చిమిర్చి, టమాట, పొట్లకాయ, బీర, సొర, బెండ, దొండకాయ తదితర కూరగాయలు కూడా కొంతమేర సాగుచేస్తున్నారు. ప్రతి రోజు సాయంత్రం పండించిన ఆకుకూరలు, కూరగాయలు కోసి మరుసటిరోజు అమ్మకానికి సిద్ధమవుతారు. భద్రాచలం నుంచి ప్రత్యేకంగా ఉదయం 5 గంటలకే ఆర్టీసి బస్సు సీతారామనగరం వస్తుంది. రైతులంతా ఆ బస్సులో కూరగాయలు, ఆకుకూరలు తీసుకుని తెలంగాణలోని బూర్గంపాడు, మోరంపల్లి బంజరు, సారపాక, భద్రాచలం, పాల్వంచ తదితర ప్రాంతాలకు వెళ్లి స్వయంగా అమ్ముతారు. అలాగే కుక్కునూరు మండలంలో జరిగే పలు సంతలకు వెళ్లి ఆకుకూరలను విక్రయిస్తారు. మరికొందరు వాహనాలపైన ఇంటింటికీ తిరుగుతూ అమ్మకాలు సాగిస్తారు.

తక్కువ వ్యవధిలో పంట చేతికి రావడంతో పాటు, నిత్యం ఆదాయం వచ్చే కూరగాయలు, ఆకుకూరల సాగుతో సీతారామనగరం ప్రజలు జీవితాలు సాఫీగా సాగిపోతున్నాయి. ఆకుకూరలు, కూరగాయల సాగు ద్వారా వాతావరణం అనుకూలిస్తే ఎకరాకు 15 వేల వరకు ఆదాయం లభిస్తున్నట్లు రైతులు తెలిపారు. పండిన పంటను స్వయంగా మార్కెట్ చేసుకోవడంతో వీరికి దళారీల బెడద ఏమాత్రం లేదు. ప్రభుత్వం సహకరించి మార్కెటింగ్ సౌకర్యం కల్పించడంతో పాటు సాగులో మెళకువలు నేర్పితే సీతారామనగరం కూరగాయలు, ఆకుకూరల సాగులో ఆదర్శంగా నిలుస్తుందనడం నిస్సందేహం. **- ఆంధ్రజ్యోతి, కుక్కునూరు**

ఓ వైపు చదువు.. మరో వైపు సేద్యం



గ్రామంలో చాలామంది ఓ పక్క చదువుకుంటూనే మరోవైపు ఆకుకూరల సేద్యంలో కుటుంబానికి సహకరిస్తారు. ప్రభుత్వ సహకారం అందడం లేదు. మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తే గ్రామ రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. మేమే పండించి, మేమే మార్కెట్ చేసుకోవడం వల్ల శ్రమ ఎక్కువ అవుతోంది. **- నిమ్మల మౌనిక**

ఇంటిల్లిపాదీ సాగులో



గ్రామంలో ఎక్కువ కుటుంబాలు ఆకుకూరల సాగుపైనే ఆధారపడి జీవిస్తున్నాయి. కుటుంబంలోని ప్రతి ఒక్కరూ శ్రమిస్తారు. మిగిలిన కుటుంబ సభ్యులు ఆకుకూరల మడులు చూసుకుంటుంటే మగవారు పంటను విక్రయిస్తారు. సాయంత్రం ఇంటిల్లిపాదీ పొలం పనిలో నిమగ్నమవుతాం. **- పొనుగుపాటి వెంటేశ్వరావు**

జీవనోపాధికి ఇబ్బంది లేదు



వాతావరణం అనుకూలిస్తే ఎకరానికి రూ.15 వేలకు పైగా లాభం వస్తుంది. అధిక వర్షాలు, చీడపీడలు సోకితే ఒక్కోసారి నష్టం వస్తుంది. కుటుంబం గడవడానికి ఢోకా లేదు. **- ఎండి అజ్మీరా**

సలహా

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతాంగం వివిధ పంటలకు ఏవిధమైన సస్యరక్షణ చర్యలు చేపట్టాలో సూచిస్తున్నారు ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు.

శనగపచ్చ పురుగుకు చెక్



శనగ పంట కొన్ని ప్రాంతాల్లో శాఖీయ దశలోనూ, మరికొన్ని ప్రాంతాల్లో పూత, కాయ దశలోనూ ఉంది. శాఖీయ పెరుగుదల దశలో పచ్చరబ్బరు పురుగు, పూత, పిందె దశలలో శనగపచ్చ పురుగు ఆశించి నష్టం కలగజేస్తాయి. పచ్చరబ్బరు పురుగు నివారణకు క్వినాల్‌ఫాస్ 2.0 మిల్లీలీటర్లు లేదా స్పైనోసాడ్ 0.35 మి.లీ. లేదా థయోడికార్బ్ 1.0 గ్రా. లేదా ఎసిఫేట్ 1.0 గ్రా. ఒక లీటరు నీటికి కలిపి పది రోజుల వ్యవధిలో మార్చి మార్చి పిచికారీ చేసి నివారించాలి. శనగపచ్చ పురుగు పంట కాయ దశలో ఎక్కువగా ఆశిస్తుంది. కాయలపై గుండ్రటి రంధ్రాలను చేసి తల లోపలికి పెట్టి గింజలను తినివేసి అధిక నష్టం కలగజేస్తుంది. దీని నివారణకు సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలి. రసాయనిక మందులైన క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేక క్వినాల్‌ఫాస్ 2.0 మి.లీ. లేక థయోడికార్బ్ 1.5 గ్రా. లేక స్పైనోసాడ్ 0.35 మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

చెరకు : ఇటీవలి కాలంలో బాగా ప్రాచుర్యం పొందుతున్న నారు మొక్కలతో చెరకు సాగుకు జనవరి మాసం చాలా అనుకూలం, శ్రేయస్కరం. చెరకు పంటలో ముచ్చెలు మొలిచిన తరువాత పంట ఎదిగే దశలో కలుపును నివారించడానికి ఎకరాకు 'మెట్రు బ్యుజిన్' 400 గ్రాములు, 2,4-డి సోడియం సాల్ట్ 800 గ్రా. 200 లీటర్ల నీటికి చొప్పున కలిపి చెరకు నాటిన 20-25 రోజులకు పిచికారీ చేయాలి.



ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
శనివారం ● 12 జనవరి 2019

సంక్రాంతికి ప్రతీ ముంగిట్లో ఒకవైపు రంగవల్లికలు వెలిగి పోతుంటే, మరోవైపు ప్రతీ వంటిల్లూ పిండివంటలతో ఘుమ ఘుమలాడుతుంటాయి. పండగ ప్రత్యేక వంటకాలైన బెల్లం పొంగలి, సగ్గుబియ్యం వడల నుంచి నువ్వుల లడ్డూ, పూర్ణం బొబ్బట్ల దాకా అన్నింటినీ చిన్నాపెద్దా తేడా లేకుండా అందరూ ఆస్వాదిస్తారు. అలాంటి కొన్ని రుచుల రంగవల్లికలు మీ కోసం...



వంటిల్లు

రుచుల రంగవల్లికలు!

నువ్వుల లడ్డు

కావలసినవి: నువ్వులు - ఒక కప్పు, నెయ్యి - మూడు టేబుల్‌స్పూన్లు, నీళ్లు - అర కప్పు, బెల్లంతరుగు - ఒక కప్పు, యాలకులు - ఐదు (పొడిలా చేసి).

తయారీ:

- పాన్‌లో నువ్వులు వేసి (నూనె వేయకుండా) బంగారువర్ణంలోకి వచ్చేదాకా సన్నని మంటపై వేగించాలి.
- నీళ్లు, బెల్లం తరుగు ఒక పాన్‌లో పోసి బెల్లం పాకం తయారుచేయాలి.
- వేగించిన నువ్వులను ఆ పాకంలో వేసి బాగా కలపాలి. అందులో నెయ్యి, యాలకులపొడిని కూడా వేసి కలపాలి. తర్వాత స్టవ్ మీద నుంచి కిందికి దించాలి.
- ఈ మిశ్రమాన్ని నిమ్మకాయ సైజులో ఉండల్లా చుడితే, సంక్రాంతి స్పెషల్ నువ్వుల ఉండలు రెడీ.

శెనగపిండి హల్వా



కావలసినవి: శెనగపిండి - ఒక కప్పు, నెయ్యి - అర కప్పు, చక్కెర - ఒక కప్పు, యాలకులపొడి - అర టీస్పూను, నీళ్లు - రెండున్నర కప్పులు, బాదంపప్పు - రెండు టేబుల్‌స్పూన్లు (చిన్నముక్కలుగా కట్ చేసి).

తయారీ:

- సాస్‌పాన్‌లో నీళ్లు పోసి చక్కెర, యాలకుల పొడి అందులో వేసి సన్నని మంటపై మరిగించాలి.
- పాన్‌లో నెయ్యివేసి అది వేడెక్కిన తర్వాత అందులో శెనగపిండి వేసి బంగారువర్ణంలోకి వచ్చేదాకా వేగించాలి.
- శెనగపిండిలో చక్కెర పాకాన్ని కొద్దికొద్దిగా పోస్తూ కలుపుతుండాలి.
- మంటను చిన్నది చేసి మూడు నిమిషాలు దాన్ని స్టవ్ మీద ఉడికించాలి.
- పాకంలోని నీటిని శెనగపిండి మెల్లగా పీల్చుకుంటుంది. తర్వాత దానిని చల్లారనివ్వాలి. హల్వా మృదువుగా ఉండేలా చూసుకోవడం మరవొద్దు.
- రెడీ అయిన శెనగపిండి హల్వాపై నేతిలో వేగించిన జీడిపప్పును చల్లాలి.
- ఈ హల్వాను వేడిగా తింటే ఎంతో రుచికరంగా ఉంటుంది.

పూర్ణం బొబ్బట్లు

కావలసినవి:

పిండిముద్ద తయారీ: మైదా - ఒక కప్పు, పసుపు, ఉప్పు - ఒక్కొక్కటీ చిటికెడు, నూనె, నీళ్లు - ఒక్కొక్కటీ మూడు టేబుల్‌స్పూన్లు.

పూర్ణం: శెనగపప్పు, బెల్లం- ఒక్కొక్కటీ ముప్పావు కప్పు, కొబ్బరి - పావుకప్పు.

తయారీ:

- మైదా, ఉప్పు, పసుపు, నూనె, నీళ్లు వేసి మెత్తటి పిండిలా కలపాలి. రెడీ అయిన పిండిముద్దలో మరో టేబుల్‌స్పూను నూనె వేసి కలిపి మూతపెట్టి మూడుగంటలు అలాగే ఉంచాలి. ఇలా చేస్తే పిండి మృదువుగా తయారవుతుంది.
- పాన్‌లో శెనగపప్పు వేగించాలి. తర్వాత ప్రెషర్ కుక్కర్‌లో శెనగపప్పు తగినన్ని నీళ్లు పోసి ఐదు విజిల్స్ వచ్చేదాకా ఉడికించాలి.
- ఉడికిన శెనగపప్పు (నీళ్లు ఉండకుండా జాగ్రత్తపడాలి), బెల్లం, కొబ్బరిని మిక్సీలో వేసి కచ్చాపచ్చాగా గ్రైండ్ చేయాలి.
- మైదాపిండిని నిమ్మకాయ సైజులో ఉండలుగా చేయాలి.



- అరటి ఆకు తీసుకుని దానిపై నూనె రాసి పిండితో చేసిన ఉండని ఆకులో పెట్టి పూరి పరిమాణంలో ఒత్తాలి.
- ఈ పూరీ మధ్యలో పూర్ణం పెట్టి నాలుగు అంచులను మడవాలి.
- తర్వాత ఈ ఉండల్ని వృత్తాకారంలో ఒత్తాలి.
- సన్నని మంటపై తవా పెట్టి అది వేడెక్కిన తర్వాత టీస్పూను నెయ్యి వేసి పూర్ణం బొబ్బట్లను రెండు వైపులా బంగారు వర్ణంలోకి వచ్చేదాకా కాల్చాలి.
- అలా ఒత్తిపెట్టుకున్న మైదా పూరీలన్నింటి మధ్యనా పూర్ణం పెట్టి వాటిని పలచగా ఒత్తి తవా మీద కాల్చాలి. ఈ వేడి బొబ్బట్లపై నెయ్యి రాసుకుని తింటే కమ్మగా బాగుంటాయి.

బెల్లం పొంగలి



కావలసినవి: బియ్యం - అరకప్పు, పెసరపప్పు - రెండు టేబుల్ స్పూన్లు, బెల్లం - అర కప్పు, నీళ్లు- రెండున్నర కప్పులు, పాలు - అర కప్పు, లవంగాలు - రెండు, యాలకులు - 5 (పొడి చేసి), జాజికాయపొడి - చిటికెడు, నెయ్యి - పావు కప్పు.

తయారీ:

- ఒక బౌల్‌లో బియ్యం, పెసరపప్పు పోసి నీళ్లతో బాగా కడగాలి. అందులో పాలు, రెండు కప్పుల నీళ్లు పోసి మెత్తగా ఉడికించాలి.
- చిన్న పాన్‌లో కొద్దిగా నెయ్యి వేసి జీడిపప్పును వేగించాలి. అందులోనే ఎండుద్రాక్ష, లవంగాలను కూడా వేగించి ఒక ప్లేటులో పోసి పక్కన పెట్టుకోవాలి.
- ఇంకో పాన్ తీసుకుని అందులో బెల్లంతోపాటు అరకప్పు నీళ్లు పోసి బెల్లం పాకం తయారుచేయాలి. ఈ పాకాన్ని ఫిల్టర్ చేసి పక్కన పెట్టుకోవాలి.
- అన్నం, పెసరపప్పు మెత్తగా అయితే అందులో బెల్లం పాకం వేసి బాగా కలపాలి. పొంగలి నోరూరించేలా మంచి రంగులోకి వచ్చేంత దాకా అందులో కొద్ది కొద్దిగా నెయ్యి వేస్తుండాలి.
- రెడీ అయిన పొంగలిలో జాజికాయ, యాలకులపొడి వేసి మిగిలిన నెయ్యి కూడా అందులో వేసి బాగా కలపాలి. చివరిగా నేతిలో వేగించిన జీడిపప్పు, ఎండుద్రాక్ష, లవంగాలను పొంగలిలో కలపాలి. ఈ బెల్లం పొంగలిని పిల్లలు ఇష్టంగా తింటారు.

సగ్గుబియ్యం వడలు



కావలసినవి: సగ్గుబియ్యం - ఒక కప్పు, బంగాళాదుంపలు - రెండు, పచ్చిమిర్చి - రెండు (చిన్నముక్కలుగా చేసి), పల్లీలు - అర కప్పు, జీలకర్ర - అర టీస్పూను, నిమ్మరసం - రెండు టీస్పూన్లు, కారం, ధనియాల పొడి, జీలకర్ర పొడి - ఒక్కొక్కటీ అర టీస్పూను, ఉప్పు - ఒక టీస్పూను (రాళ్ల ఉప్పు కూడా వాడొచ్చు), నూనె - వేగించడానికి సరిపడా.

తయారీ:

- ముందురోజు రాత్రి సగ్గుబియ్యాన్ని నీళ్లల్లో నానబెట్టి పొద్దున్నే వడగట్టాలి. బంగాళాదుంపల మీదున్న తొక్కను తీసేసి ఉడకబెట్టి మెత్తగా చేయాలి.
- బౌల్ తీసుకుని అందులో సగ్గుబియ్యంతోపాటు బంగాళాదుంప మిశ్రమాన్ని వేయాలి.
- పల్లీలను వేగించి కచ్చాపచ్చాగా ఉండేలా పొడి చేయాలి. ఈ పొడితో పాటు కారం, ధనియాల పొడి, జీలకర్ర పొడి, ఉప్పు వేసి కలపాలి. అందులో తరిగిపెట్టుకున్న పచ్చిమిర్చి ముక్కలు, జీలకర్ర, నిమ్మరసాన్ని వేసి కలపాలి.
- ఈ మిశ్రమాన్ని బాగా కలిపి దానితో నిమ్మకాయ సైజులో ఉండలు చేసి వడల్లా వొత్తాలి.
- బాండీలో నూనె పోసి రెడీ చేసి పెట్టుకున్న సాబుదానా వడలను సన్నని మంటపై వేగిస్తే లోపలికంటా అవి ఉడుకుతాయి.
- ఈ వడలను పెరుగు, కొత్తిమీర చట్నీతో లేదా టొమాటో కెచప్‌తో తింటే రుచికరంగా ఉంటాయి.

తిరుప్పావై

కోరేది ఆ భాగ్యాన్నే!


ఇరవయ్యెనిమిదో పాశురం

క఼ఱవైగళ్ పిన్ శెన్రు క్కానమ్ శేర్ న్దుణ్బోమ్,
అఱివొన్రు మిల్లాద వాయ్ క్కులత్తు ఉన్దన్నై
పిఱవి పె ఱున్దనై పుణ్ణియమ్ నాముడైయోమ్
కు ఱైవొన్రు మిల్లాద గోవిన్దా! ఉన్దన్నోడు
ఉఱవేల్ నమక్కి ఙ్గొళిక్క వొళియాదు
అఱియాద పిళ్ళైగళోమ్, అన్బినాల్ ఉన్దన్నై
చిఱు పేరళైత్తనవుమ్ శీఱి యరుళాదే
ఇఱైవా నీ తారాయ్ పఱైయేలో రెమ్బావాయ్!

గోపికలు ఈ పాశురంలో తమ అమాయకత్వాన్నీ, జ్ఞానరాహిత్యాన్నీ కృష్ణునికి నివేదించి శరణు కోరుతున్నారు. "స్వామి! మేము జీవిక కోసం ఆవులను, గేదెలను కాచుకునే గొల్లపిల్లలం. మా భాగ్యవశాన నీవు మా కులంలో జన్మించావు. నందనందనుడా! చనువుతో, తెలియనితనంతో నిన్ను 'ఒరే', 'ఏరా', 'సఖుడా', 'నేస్తుడా' అని సంబోధించాం. కోపగించుకోవద్దు తండ్రీ! నీవు శేషివి... మేము శేషీభూతులం. శేషత్వ జ్ఞానం మాలో లేకపోయినంత మాత్రాన నీ శేషత్వం లేకుండా పోదు కదా! వైకుంఠధామం నుండి మమ్మల్ని ఉద్ధరించడానికి దిగివచ్చిన నువ్వు మా మీద దయ ఉంచి 'నిత్యకైంకర్యం' అనే పురుషార్థాన్ని అనుగ్రహించు" అని వేడుకుంటున్నారు.

గోపికలు తనను లౌకికమైన వరాలను అర్థిస్తున్నారంటూ మునుపటి పాశురంలో కృష్ణుడు "గొల్ల పిల్లలారా! మీ మనసులు స్థిరంగా లేవు. మీరు నానుంచి నశ్వరమైన సౌఖ్యాలను కోరుతున్నారా, అంతకన్నా ఉన్నతమైన వాటినా?" అని అడిగాడు. గోపికలకు తమ ప్రార్థనలోని అస్పష్టత అప్పుడు అర్థమైంది. "హే భగవాన్! లోక సహజంగా అడిగే సంభావనలను కోరుతున్నామని నీకు అనిపించి ఉండవచ్చు. కానీ మేము త్రికరణశుద్ధితో నిన్ను అర్థించేది నీ శాశ్వత కైంకర్యభాగ్యం మాత్రమే!" అని చెప్పుకున్నారు. భగవానుడు ప్రసన్నుడై, తన మహావిభూతిని దర్శింపజేసి వారిని కృతార్థులను చేశాడు. తాము సర్వేశ్వరుడైన కృష్ణుణ్ణి యాదవ బాలునిగా భావించి, చిన్ననాటి నుంచి అతిచనువు తీసుకొని, అతడితో వ్యవహరించిన తీరుకు గోపికలు క్షమాపణలు కోరుతున్నారు.

"శ్రీకృష్ణా! పరిపూర్ణుడవు నీవని తెలియక గాఢమైన ప్రణయ భావనతో, అభిమానంతో నీ పట్ల చనువుగా ఉన్నాం. కుడి చేతికీ, ఎడమ చేతికీ వ్యత్యాసం తెలియని వాళ్ళం.. పశు



చిత్రం: కేశవ్ https://www.facebook.com/keshav61/

వులను కాచుకునే అజ్ఞులం. సాక్షాత్ సిద్ధోపాయమే నీవని గ్రహించేందుకు కావలసిన, శాస్త్రనిర్దేశితాలైన జ్ఞానసంపత్తి, భక్తి, అనుష్ఠానం, ఆచారం, విద్వత్తు ఏవీ మాకు లేవు. ఆకించజ్ఞం, నైచ్యం, నీ సౌలభ్య, పరత్వ, శేషత్వ జ్ఞానాలు మాలో లేవు. తెలియనితనంతో చేసిన అపరాధాలను మన్నించి, నీ పాదపద్మ యుగళాన్ని మేం చేరుకొనే దారి చూపించు. నిన్ను శరణు వేడుతున్నాం" అని ప్రార్థన చేశారు.

ముందటి పాశురంలో శ్రీవైష్ణవుని దినచర్య ప్రాముఖ్యాన్ని (ఇజ్యా కాలం) ఆండాళ్ అన్యాపదేశంగా వర్ణించింది. ఇక్కడ పంచకాల ప్రక్రియలలో నాలుగు, అయిదు భాగాలైన స్వాధ్యాయ, యోగాల వైశిష్ట్యాన్ని ప్రస్తావిస్తోంది. స్వాధ్యాయ సమయంలో పాలిచ్చే పాడి పశువుల వంటి భాగవతులను (భక్త జనులను) ఆశ్రయించి వారివద్ద దివ్యసూక్తులను అధ్యయనం చెయ్యాలి. అలా చేసి హృదయంలో భగవానుని సౌలభ్య, స్వామిత్వ, పరత్వ స్పృహను జాగృతం చేసుకోవాలి. ఈ విధంగా పంచకాల ప్రకియలు పాటిస్తూ భగవానుణ్ణి శ్రీవైష్ణవుడు ఆరాధించడమే ఇక్కడ ఆండాళ్ బోధిస్తున్న శ్రీసూక్తి!

ఆండాళ్ తిరువడిగళే శరణం!

● శ్రీదేవీ మురళీధర్


గుడ్ ఫుడ్

పోషకాల దుంప!

చక్కెర, స్టార్చ్ ఎక్కువగా ఉంటాయి కాబట్టి చిలగడదుంపలు తినడానికి వెనుకాడతాం! కానీ వీటిలో ఎంతో విలువైన పోషకాలుంటాయి. ఆరోగ్యానికి మేలు చేసే ఆ పోషకాలు ఏవంటే...

ఒక కప్పు ఉడకబెట్టిన చిలగడదుంప తింటే ఒక రోజుకి సరిపడా 'సి' విటమిన్ అందుతుంది. అంతే పరిమాణంలో 'ఎ' విటమిన్ కూడా దక్కుతుంది.

- చలి, జ్వరాలు విజృంభించే చలికాలంలో ఈ విటమిన్లు పుష్కలంగా ఉండే చిలగడదుంపలు తినడం ఎంతో అవసరం.
- ఈ దుంపల్లో చర్మపు బిగువుకు అవసరమైన మేంగనీసు, పొటాషియం ఖనిజ లవణాలు కూడా ఉంటాయి. యాంటీఆక్సిడెంట్లు కూడా ఎక్కువే!
- పొట్టు తీయకుండా ఉడికించిన చిలగడదుంపలు తినడం ద్వారా 950 మిల్లీగ్రాముల పొటాషియం దొరుకుతుంది. ఈ ఖనిజ లవణం రక్తంలో అదనంగా ఉన్న ఉప్పును బయటకి వెళ్లగొట్టడం ద్వారా రక్తపోటును అదుపులో ఉంచుతుంది.



ఇలా కూడా తినొచ్చు:

చిలగడదుంపలను ఉడకబెట్టి తినడమే కాకుండా వేర్వేరు పద్ధతుల్లో రుచిగా వండుకుని తినొచ్చు.


చిప్స్: తోలు తీసి, సన్నగా తరిగి బేక్ చేయవచ్చు లేదా వేయించవచ్చు.

ఫ్రైస్: తోలు తీసి, ముక్కలు తరిగి వేయించవచ్చు.

ఉడికించిన ముద్ద: దీన్ని కేకుల తయారీలో వాడవచ్చు.

కట్‌లెట్స్: వీటి తయారీలో బంగాళాదుంపలకు బదులు చిలగడదుంపలు వాడవచ్చు.

ముత్యాలముగ్గు



25-10 చుక్కలు
మధ్యచుక్కలు

కె.వి.పద్మాదేవి
భీమవరం, పశ్చిమగోదావరి జిల్లా.



21 చుక్కలు
1 వచ్చే వరకు

గొరిట్యాల తిరుమల
బాలాజీనగర్, కరీంనగర్



22 చుక్కలు
10 వరుసలు
10 వచ్చే వరకు

ఎస్. మల్లీశ్వరీ దేవి
ఎమ్మిగనూరు.



19 చుక్కలు
10 వచ్చే వరకు
మధ్యచుక్క

ప్రతిభ
నవాబుపేట
మహబూబ్‌నగర్



చూడగానే ఆకట్టుకునే రూపం. పిల్లలందరికీ ఎంతో ఇష్టమైన బొమ్మ. వచ్చే మార్చి 9న 60వ పుట్టినరోజు జరుపుకోనున్న బార్బీ పిల్లలను అలరించడానికి ఎన్నో రూపాల్లో వచ్చింది. మరి ఆ విశేషాలు మీరూ చదవండి.

బార్బీ బొమ్మకు 60 ఏళ్లు!



● మనందరం పుట్టిన రోజు జరుపుకుంటాం కదా! మరి మనకెంతో ఇష్టమైన బార్బీ బొమ్మ పుట్టినరోజు ఎప్పుడో తెలుసా! మార్చి 9. బార్బీ బొమ్మ పూర్తి పేరు బార్బరా మిల్లిసెంట రాబర్ట్స్.

● అమెరికాకు చెందిన బొమ్మల తయారీ కంపెనీ మ్యాటెల్ యజమానురాలు రూత్ హ్యాండ్లర్ బార్బీని తయారుచేశారు. 1959 మార్చి 9న న్యూయార్క్‌లో జరిగిన అమెరికన్ అంతర్జాతీయ బొమ్మల ప్రదర్శనలో బార్బీ బొమ్మను ప్రపంచానికి పరిచయం చేశారామె.

● ఒకరోజు రూత్ కూతురు బార్బరా పేపర్‌తో చేసిన బొమ్మలతో ఆడుకుంటే చూసి, కూతురు కోసం చక్కని బొమ్మ చేయాలనుకుంది రూత్. యూరప్ వెళ్లినప్పుడు అక్కడ చూసిన కామిక్ బొమ్మ 'బైల్డ్ లిల్లీ' రూత్‌ను బాగా ఆకట్టుకుంది. బొమ్మలంటే బాగా ఇష్టపడే కూతురికి ఆ బొమ్మను బహుమతిగా తీసుకెళ్లింది. తరువాత తను కూడా అలాంటి బొమ్మను తయారుచేయాలనుకుంది. అలా పోనీ హెయిర్ స్టయిల్, తెలుపు, నలుపు రంగు స్విమ్మింగ్ డ్రెస్ వేసి బార్బీ బొమ్మకు రూపమిచ్చారామె. తన కూతురు బార్బరా పేరు వచ్చేలా బార్బీ అని పేరు పెట్టింది.

● మానవుడు చంద్రుడిపై కాలు మోపడానికి నాలుగేళ్ల ముందే (1965)లో అంతరిక్షంలోకి వెళ్లొచ్చింది బార్బీ. మూడుసార్లు (1965, 1985, 1994) అంతరిక్షంలోకి వెళ్లొచ్చిన తొలి బొమ్మ కూడా బార్బీనే. టీవీ ప్రకటనల్లో కనిపించిన తొలి బొమ్మ కూడా.

● బార్బీ జీవితకథను ర్యాండమ్ హౌస్ బుక్ సిరీస్ 1960లో పుస్తకంగా తీసుకొచ్చింది. ఈ పుస్తకంలో బార్బీ అమ్మానాన్న జార్జ్, మార్గరేట్ పేర్లు కూడా ఉన్నాయి. కానీ, వీరి బొమ్మలను మ్యాటెల్ తయారుచేయలేదు.

● బార్బీ బొమ్మది పెద్ద కుటుంబం. బార్బీకి ఏడుగురు తోబుట్టువులున్నారు. వారి పేర్లు స్కిప్పర్, టోడ్, టుట్టి, స్టాసీ, కెల్లీ, చెల్సియా, క్రిస్సీ. 1968లో విడుదలైన క్రిస్టీ బొమ్మ తొలి అమెరికన్ ఆఫ్రికన్ బార్బీ బొమ్మగా గుర్తింపు పొందింది.

● 15 వేలకు పైగా బార్బీ బొమ్మలను సేకరించి గిన్నిస్ బుక్ రికార్డు సాధించింది జర్మనీకి చెందిన బెట్టినా డార్ఫ్‌మాన్.









● తెల్లని జుట్టు, నీలి కళ్లు, చక్కగా డ్రెస్ వేసి ఉన్న బార్బీ బొమ్మ పిల్లలకు, అమ్మాయిలకు బాగా నచ్చేసింది. దాంతో మొదటి ఏడాదే మూడు లక్షలకు పైగా బార్బీ బొమ్మలు అమ్ముడయ్యాయి. మొదటగా బార్బీ బొమ్మను మూడు డాలర్లకు అమ్మారు. ఇప్పటికీ ప్రతి మూడు సెకన్లకు ఒక బార్బీ బొమ్మ అమ్ముడవుతుంది. బార్బీ బొమ్మ 11.5 ఇంచుల పొడవుంటుంది.

● 150 దేశాల్లో బార్బీ బొమ్మలు అమ్ముడవుతున్నాయి. ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా 5 కోట్ల 80 లక్షలకు పైగా బార్బీ బొమ్మల అమ్మకాలు జరుగుతున్నాయి. కోక-కోలా, మెక్‌డొనాల్డ్స్ బ్రాండ్లకు ఉన్నంత పేరు బార్బీ బొమ్మకూ ఉందంటే ఈ బొమ్మకు ఎంత పాపులారిటీ ఉందో అర్థం చేసుకోవచ్చు.

● 1992లో పాదాల వరకు ఉన్న వెంట్రుకలతో బార్బీ బొమ్మను విడుదల చేశారు. ఎక్కువగా అమ్ముడైన బార్బీ బొమ్మగా ఇది పేరు సంపాదించింది. బార్బీ డ్రీమ్ హౌస్ 1962లో వచ్చింది. ప్రతి రెండు సెకన్లకు ఒక బార్బీ డ్రీమ్ హౌస్ అమ్ముడవుతుంది. బార్బీ బొమ్మ యూట్యూబ్ ఛానల్‌కు 5 లక్షల మంది సబ్ స్క్రైబర్స్ ఉన్నారు.

● తొలిరోజుల్లో 17 ఏళ్ల అమ్మాయిల ఫ్యాషన్ మోడల్‌గానే బార్బీకి పేరుండేది.


●ఆరోగ్యానికి హానిచేస్తుందనే కారణంతో బార్బీ బొమ్మను దుబాయ్‌లో మొదట్లో నిషేధించారు.

● అమ్మాయిల ఆత్మవిశ్వాసానికి సంకేతంగా బార్బీ బొమ్మ ఉంటుంది. మహిళలకు తమకు నచ్చినట్లుగా ఉండే స్వేచ్ఛ ఉంటుందని, వారు ఏదైనా చేయగలరలనే సందేశాన్ని ఇస్తుందీ బొమ్మ. మోడల్, డ్యాన్సింగ్ గర్ల్, ఉద్యోగిని.. ఇలా వివిధ రూపాల్లో ఉన్న బార్బీ బొమ్మలను గమనిస్తే మనకు ఈ విషయం అర్థమవుతుంది.

● 200 రకాల కెరీర్ సింబల్‌గానూ బార్బీ వచ్చింది.

ఎలా పనిచేస్తుంది?

చీకట్లో బయటకు వెళ్లాలంటే ఒకప్పుడు లాంతర్లు తీసుకెళ్లేవారు. ఇప్పుడైతే వాటి స్థానంలో బ్యాటరీతో నడిచే టార్చిలైట్లు వచ్చేశాయి. టార్చిలైట్ ఎలా పనిచేస్తుందో తెలుసుకుందాం.



టార్చిలైట్

● టార్చిలైట్‌లో నాలుగు ప్రధాన భాగాలు ఉంటాయి. అవి బ్యాటరీలు, బల్బు, గొట్టం, స్విచ్. టార్చ్‌లో రెండు లేదా మూడు బ్యాటరీలను వాడతారు. బ్యాటరీ గొట్టానికి బల్బు అమర్చి ఉంటుంది.

● స్విచ్ నొక్కినప్పుడు రెండు బ్యాటరీ సెల్స్ మధ్య తాకిడి ఏర్పడుతుంది. గొట్టంలోని ధనధృవం, రుణధృవం కలుసుకోవడం ద్వారా కాంతి ప్రసారమై బల్బు వెలుగుతుంది.

● ధనధృవం నుంచి విద్యుత్తు రుణధృవానికి ప్రవహించడం వల్ల బల్బు వెలిగి, విద్యుత్ ప్రవాహంలో ఒక సర్క్యూట్ పూర్తి అవుతుంది. స్విచ్‌ను నొక్కినప్పుడు బ్యాటరీలోని ధనధృవం అదమబడి విద్యుత్ ప్రవహించేందుకు వీలు కలుగుతుంది.

● టార్చిలైట్‌లో కాంతి పరావర్తనం చెంది ఎక్కువ దూరం ప్రసరించేందుకు వీలుగా బల్బుకు దిగువన రిఫ్లెక్టర్ ఉంటుంది. ఈ విధంగా టార్చిలైట్ పనిచేస్తుంది.

డైలీ సుడోకు - 423

7				5		9	6	3
					6		2	
9	1			3				
6							9	
		2				4		
	3							2
				1			3	8
	6		2					
8	7	4		9				6

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. నిలువుగా, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి. ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.


సుడోకు- 422 సమాధానం

7	3	1	5	8	9	6	4	2
8	9	4	1	6	2	3	7	5
2	6	5	3	7	4	8	1	9
3	4	9	6	5	8	7	2	1
5	7	8	4	2	1	9	6	3
6	1	2	7	9	3	4	5	8
4	5	3	9	1	6	2	8	7
9	8	7	2	4	5	1	3	6
1	2	6	8	3	7	5	9	4

లాగుడు బండి చేసేద్దాం..

కావలసిన వస్తువులు:
- ఆకుపచ్చ, పసుపుపచ్చ రంగుల్లో ఉన్న మందమైన కాగితం.
- తేలికపాటి అట్టముక్క.
- పెన్సిల్
- కత్తెర
- దారపు ముక్కలు
- జిగురు

తయారుచేయు విధానం:
- (ఏ) బొమ్మలో చూపించిన విధంగా పసుపుపచ్చ కాగితంతో బండి అడుగు భాగాన్ని కత్తిరించి (బి) బొమ్మలో చూపినట్టుగా అతికించుకోవాలి.
- బండిపై భాగాన్ని ఆకుపచ్చ కాగితంతో తయారుచేసుకొని జిగురుతో (బి)కి అతికించుకోవాలి.
- తేలికపాటి అట్టముక్కను నాలుగు చక్రాలుగా కత్తిరించుకొని, వాటిని (బి)కి నాలుగువైపులా అతికించాలి లేదా సన్నని పిన్నులతో గుచ్చాలి.
- బండి ముందు భాగంలో రెండు చిన్న రంధ్రాలు చేసి వాటి నుంచి దారాన్ని లాగాలి.
- బండిపై మీకు నచ్చిన డిజైన్లను అలంకరించుకోవచ్చు.



కిడ్ సైంటిస్ట్!

కనుక్కోండి?

1. ఇతనో కూరగాయల వ్యాపారి. ఏఏ కూరగాయలు అమ్ముతాడో ఇక్కడున్న క్లూ ద్వారా చెప్పండి చూద్దాం.
2. అమ్మాయి కోసం పువ్వు కొనడానికి తాతయ్య బయలుదేరాడు. పువ్వు దొరికిందా? ఇంకొద్ది దూరం వెళ్లాలా?
3. ఏరు అవతల ఇళ్లు ఉంది చూశారు కదా. వాళ్లు ఇటు వచ్చిన దారి కనుక్కోండి?
4. ఇందాక ఇటునుంచ ఒక రాకెట్ వెళ్లడం అమ్మాయి చూసింది. మీకు కనిపిస్తుందేమో చూడండి.
5. ఇక్కడ మొత్తం అయిదు షూలున్నాయి. ఎక్కడెక్కడో గుర్తించండి?
6. ఇక్కడ పిల్లలతో కలిపి ఎన్ని పక్షులున్నాయి?
7. తాతయ్యకు టీ కావాలట. వేడివేడి టీ, స్పూను, టీ కప్పు ఎక్కడెక్కడున్నాయి?



జవాబులు


కనుక్కోండి?
1. క్యారెట్ 2. గొడుగులో
4. చెట్టుమీద కాగితం రాకెట్ 5. తాతయ్య కాళ్లకు రెండు, అమ్మాయి కాలుకు ఒకటి, సీతాకోకచిలుకలో రెండు.
6. నాలుగు. రెండు పెద్దవి. రెండు చిన్నవి.
7. చెట్టులో స్పూను, అమ్మాయి గౌనులో టీ కెటిల్, ఇంటి గేటులో కప్‌సాసర్.

అరటిపండు అలా.. ఎలా!

చేసియండి!

కావలసినవి:
అరటిపండు, సూది, దారం.

విధానం:
- అరటిపండు చివరి భాగంతో మొదలుపెట్టండి. సూదిని అరటిపండు తొక్కలోంచి బయటకు తెచ్చి ఒక అంగుళం తరువాత పైకి తీయాలి. మళ్లీ సూదిని పండు లోపలికి దూర్చి , ఒక అంగుళం తర్వాత పైకి తేవాలి. ఇలా చేస్తూపోతే దారం అరటిపండును కుట్టేసినట్టు చుట్టుకుపోతుంది. చివరికి సూదిని మొదటి రంధ్రం నుంచి బయటకు తీయాలి. అప్పుడు దారం రెండు కొసలు పట్టకొని నెమ్మదిగా లాగాలి.
- అరటిపండును లోపల ముక్కలుగా కోసి, దారం మొదటి రంధ్రం లోంచి బయటకు వస్తుంది. ఇదే విధంగా రెండు సెం.మీ. దూరంలోనూ చేసి, పండును ముక్కలుగా కత్తిరించవచ్చు.
- ప్రేక్షకుడికి అరటిపండు ఇచ్చి, పరీక్షచేసుకోమని చెప్పి, మరొకరిని పిలిచి అరటిపండును ఒలవమనండి. ముందే ముక్కలుగా కోసి ఉన్న అరటిపండును చూసి అతడితో పాటు మిగతా ప్రేక్షకులు కూడా ఆశ్చర్యపోతారు.



కథ



నవ్య ఆంధ్రజ్యోతి సకల



ప్రతిభ

'నమో వెంకటేశా...' అంటూ ఆపదమొక్కులవాడిని సుమధుర కంఠంతో అర్చించిన అమర గాయకుడు ఘంటసాల. ఆ తరాన్ని భక్తి పారవశ్యంలో ముంచెత్తిన అదే పాట ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో సరికొత్తగా సమ్మోహితులను చేస్తోంది. అయితే పాడింది ఘంటసాల వెంకటేశ్వరరావు కాదు... బుర్రి వెంకటేశ్వర్లు! ఆ పాట వింటుంటే అచ్చం ఆ గాన గంధర్వుడి గాత్రాన్ని పుణికిపుచ్చుకున్నాడా అన్నంతగా వీనుల విందు చేస్తోంది. సంగీతంలో ఓనమాలు కూడా దిద్దని సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) వాసి వెంకటేశ్వర్లు గాత్రం వెనక గాథ ఇది...

గ్రామీణ ఘంటసాల!

కూలి పనులతో పొట్ట పోసుకునే వెంకటేశ్వర్లు 'నమో వెంకటేశా..' అంటూ పాడిన వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఆ వీడియోను జనాలు పదే పదే వింటున్నారు. విన్నవాళ్లంతా 'అచ్చం ఘంటసాల గొంతే' అంటూ కితాబిస్తున్నారు. షేర్ చేస్తున్నారు. వెంకటేశ్వర్లు పాట పాడుతుంటే ఎక్కడ గమకాలు గతి తప్పవు. అపశబ్దం అసలే పలకదు! అలాగని వెంకటేశ్వర్లుకు సంగీతంలో పీహెచ్‌డీలు లేవు. కచేరీల అనుభవం లేదు. అసలు సంగీతంలో ఓనమాలే తెలియవు. కటిక పేదరికంలో పుట్టి, పగలంతా కాయకష్టం చేసి, రాత్రి బళ్లో కిరోసిన్ దీపం కింద చదివిన పెద్దబాల శిక్ష తప్ప పెద్దగా చదువుకున్నదీ లేదు. నలుగురు చెల్లెళ్లు, తమ్ముడు. వెంకటేశ్వర్లు అందరిలోకి పెద్ద. తండ్రి ఘంటసాల గారి మీద ఇష్టంతో కొడుక్కి వెంకటేశ్వర్లు అని పేరు పెట్టుకున్నారు.



పనీ పాటలే తెలుసు...

"నా చిన్నతనంలో నాన్న, మేనమామలు ఇద్దరూ ఘంటసాల పాటలు, పద్యాలు పాడేవారు. పదేళ్ల వయసు నుంచే అవి వినీ వినీ నాకూ అలవాటయ్యింది. అప్పట్లో జనరంజనిలో ఘంటసాల పాటలు వచ్చేవి. అవి వింటూ పనులు చేసుకునేవాళ్లం. మా ఇంట్లో ఘంటసాల పాటల పుస్తకం పెద్దది ఉండేది. అందులో చూసి ఇంట్లో పాటలు పాడుకునేవాడిని. ఇప్పుడయితే సెల్‌ఫోన్‌లో పాటలు పెట్టుకొని పని చేస్తుంటాను. వాటిని వింటూ పాడుతూ సాధన చేస్తుంటాను. పెద్దగా చదువుకోకపోయినా ఒకటికి పదిసార్లు వినడం వల్ల కష్టమైన పదాలను ఎలా పలకాలో తెలుసుకునేవాడిని. బంధువుల ఇళ్లల్లో శుభకార్యాలప్పుడు పాటలు పాడేవాడిని. నా భార్య, కుటుంబ సభ్యులు, స్నేహితులు బాగా ప్రోత్సహించేవారు. ఊరి జనం పద్యాలు, పాటలూ అడిగి మరీ పాడించుకునేవారు. పాత పాటలు పాడుతాను. ఇప్పటి పాటలు రావు" అంటూ ఘంటసాల పాటతో తన అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.



కుటుంబ సభ్యులతో వెంకటేశ్వర్లు

అదే తొలి గుర్తింపు...

"నాకు పదేళ్ల వయసున్నప్పుడే అమ్మకు పక్షవాతం వచ్చింది. బడికి పోలేదు. రాత్రి బడికి వెళ్లి పెద్దబాల శిక్ష చదువుకున్నాను. ఊళ్లో ఉన్నప్పుడు సూర్యాపేటలో మట్టి ఇటుకలు చేసేవాళ్లం. పని దొరక్క పొట్ట చేతబట్టుకొని పదేళ్ల క్రితం కుటుంబంతో హైదరాబాద్ వచ్చాను. మేడ్చల్‌లో విజ్ఞాన్ స్కూల్లో వాచ్‌మెన్‌గా పనిచేసేవాడిని. ఆగస్టు 15కు 'భారతమాతకు జేజేలు' పాట పాడాను. టీచర్లు "బాగా పాడావు" అని మెచ్చుకుని బహుమతి ఇచ్చారు. అదే నా పాటకు దక్కిన మొదటి గుర్తింపు. ఇప్పటికీ పని చేసుకుంటూనే పాటలు పాడటం నేర్చుకుంటున్నాను" అని తన పాటల ప్రస్థానాన్ని వివరిస్తారు వెంకటేశ్వర్లు.

జూనియర్ ఘంటసాల...

"చిన్నప్పటి నుంచి ఘంటసాల పాటలు మధురంగా అనిపించాయి. ఆయన పాడిన ఏ పాటైనా, పద్యమైనా ఇష్టంగా వినేవాడిని. ఏసుదాస్, బాల సుబ్రహ్మణ్యం సార్ల పాటలు కూడా పాడతాను. కానీ ఘంటసాల పాటలంటే ప్రాణం. ఓ రోజు పొలం పని దగ్గర కాల్వ తీస్తుంటే రాజేష్ అనే వ్యక్తి సెల్‌లో వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టాడు. అలా నా పాట సోషల్ మీడియా ద్వారా ప్రపంచానికి పరిచయమైంది. అప్పుడు చాలా సంతోషం అనిపించింది. నేను కూడా సంగీతం నేర్చుకోవాలి. ఇంకా ఎదగాలి అనిపిస్తుంది. కానీ ఆర్థిక పరిస్థితి సహకరించడం లేదు. భవిష్యత్తులో ఎవరైనా సహాయం చేస్తారేమో"అని ఆయన ఎదురుచూస్తున్నారు.

ఇంత గుర్తింపు వస్తుందనుకోలేదు...

"నా పాటకు ఇంత గుర్తింపు దక్కుతుందనుకోలేదు. ఇంతమంది అభినందిస్తుంటే చెప్పలేనంత ఆనందంగా ఉంది. భవిష్యత్తులో నాదైన శైలిలో పాటలు పాడతాను" అని చెబుతున్నారు వెంకటేశ్వర్లు. అతని పాట విన్నవాళ్లు, అతడి కష్టం చూసినవాళ్లు 'పనీ ఉంది.. పాటా ఉంది.. జీవితంలో పైకొస్తావ్ వెంకటేశ్వర్లు' అంటూ ఇచ్చే అభినందనలు ఫలించి ఆయన గొప్ప గాయకుడిగా రాణించాలని కోరుకుందాం!

● దండేల కృష్ణ

ఫొటోలు: రవికిరణ్ రెడ్డి, మేడ్చల్

లిక్విడ్ లిప్‌స్టిక్ వేసుకుందామిలా...


పండుగలు, ఫంక్షన్ల వేళ అందానికి హంగులద్దుతాం. లిప్‌స్టిక్ రకాల్లో లిక్విడ్ లిప్‌స్టిక్ మీ పెదాలకు సరికొత్త లుక్ ఇస్తుంది. లిక్విడ్ లిప్‌స్టిక్ మిగతా వాటికన్నా చిక్కని రంగులో ఉండి, ఎక్కువ సమయం నిలిచి ఉంటుంది. కాకపోతే ఈ లిప్‌స్టిక్ రాసుకునేటప్పుడు ఓపికతో పాటు ఈ విషయాలు గుర్తుంచుకోవాలి.

టైమ్ తీసుకోవాలి: నిజానికి లిప్‌స్టిక్ వేసుకోవడానికి అయిదు సెకన్లు చాలు. లిక్విడ్ లిప్‌స్టిక్‌ను అలా. హడావిడిగా వేసుకోవడం కూడా కుదరదు. కాబట్టి కొంచెం సమయం కేటాయించి చక్కగా అవుట్‌లైన్ గీసుకొని, ఫినిషింగ్ ఇవ్వండి.

మేకప్ వేసుకోవాలి: లిక్విడ్ లిప్‌స్టిక్ గాఢమైన రంగుతో ఉంటుంది. కాబట్టి ముఖానికి మేకప్ లేకుండా ఈ లిప్‌స్టిక్ అప్లై చేయకూడదు. లిప్‌స్టిక్‌కు మ్యాచ్ అయ్యే రంగును చెంపలకు మేకప్‌గా వేసుకుంటే మంచి లుక్ వస్తుంది.

ఎక్కువ వద్దు: ఒక్కసారి వేసుకుంటే సరిపోతుంది. లిప్‌స్టిక్ ఎక్కువ కాకుండా చూసేందుకు పెదాలపై అప్పటికే ఉన్న లిప్‌స్టిక్‌ను పూర్తిగా తొలగించండి. అప్పుడే లిక్విడ్ లిప్‌స్టిక్ రాసుకోవడం తేలికవుతుంది.

తేమ, మృతకణాలు: పెదాల మీది మృతకణాలను తొలగించుకోండి. పెదాలు తేమగా ఉంచుకునేందుకు లిప్‌బామ్ రుద్దుకోవాలి. తర్వాత లిక్విడ్ లిప్‌స్టిక్ వేసుకోండి. ఒకవేళ లిప్‌స్టిక్ వేసుకోవడం సులువు కానప్పుడు మళ్లీ లిప్‌బామ్ రాస్తే, పెదాలకు తేమ అంది లిస్‌స్టిక్ వేసుకోవడం సులువవుతుంది.



బ్యూటీ

ముందుగా కింది పెదవికి లిక్విడ్ అప్లై చేయండి. తరువాత రెండు పెదాలను దగ్గర చేయండి. పైపెదవి మీద లిప్ బ్రష్‌తో లైనింగ్ గీసుకోండి. లిప్‌స్టిక్ ముదురు రంగులో కనిపించేందుకు లిప్‌లైనర్ ఉపయోగించండి.

అధ్యయనం



తల్లి బరువు నిర్ణయిస్తుంది!

పిల్లల ఆరోగ్యం, జీవనవిధానం అనేవి తల్లితండ్రుల మీద ఆధారపడిన అంశాలు. గర్భంతో ఉన్నప్పుడు అధిక బరువు ఉన్న తల్లులకు పుట్టే పిల్లలు పెద్దయ్యాక స్థూలకాయులుగా మారే అవకాశాలు ఎక్కువని నార్వేకు చెందిన ఒక యూనివర్సిటీ పరిశోధకులు తేల్చారు. 4424 మంది తల్లులు, పిల్లల మీద చేసిన ఈ అధ్యయనంలో వెల్లడైన విషయాలివి..

- జన్యుపరమైన కారణాలతో పాటు తల్లి బరువు కూడా పిల్లల బాడీమాస్‌ఇండెక్స్‌ను (బీఎమ్ఐ) నిర్ణయిస్తుంది.
- శారీరక శ్రమ తక్కువగా చేసే తల్లులకు పుట్టిన పిల్లలు ఊబకాయులయ్యే అవకాశం ఎక్కువ.
- తల్లులు తక్కువ బరువుతో ఉండడం కూడా పిల్లల బరువు మీద ప్రభావం చూపుతుంది.
- తల్లి రెండు నుంచి ఆరు కిలోల వరకు బరువు కోల్పోతే, పిల్లల బరువు కూడా తగ్గిపోతుంది. అయితే తండ్రి బరువు తగ్గినా, పెరిగినా ఆ ప్రభావం పిల్లల మీద ఉండదు.
- విద్యావంతులైన కుటుంబాలకు చెందిన వారిలో బాడీమాస్‌ఇండెక్స్ తక్కువగానూ, చదువుకోని కుటుంబాలకు చెందిన వారిలో బీఎమ్ఐ ఎక్కువగానూ ఉన్నట్లు తేలింది. ప్రెగ్నెంట్‌గా ఉన్నప్పుడు తల్లి బరువు కోల్పోవడం లేదా తగ్గడం అనేది పిల్లల శరీర బరువు మీద ప్రభావం చూపుతుంది.

'సైరా' సెట్టింగులు!



ఆంగ్లేయుల పాలనను ధిక్కరించిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి కథతో తెరకెక్కుతోన్న చిత్రం 'సైరా నరసింహారెడ్డి'. చిరంజీవి కథానాయకుడు. కొణిదెల ప్రొడక్షన్ కంపెనీ పతాకంపై ఈ చిత్రాన్ని రామ్‌చరణ్ నిర్మిస్తున్నారు. నయనతార, తమన్నా నాయికలు. సురేందర్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం కోసం ప్రస్తుతం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం రోడ్డులోని ఘాట్ కంచె భూముల్లో భారీ సెట్టింగ్ పనులు కొనసాగుతున్నాయి. ఆలయ ముఖద్వారం, మంటపాలు, రథాలు, పూజా సామాగ్రి, దుకాణాల సెట్టింగులను రూపుదిద్దుతున్నారు. మరో నాలుగైదు రోజులు సెట్టింగ్ పనులు కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ చిత్రంలో సుదీప్, జగపతిబాబు, విజయ్‌సేతుపతి కీలక పాత్రల్లో నటిస్తున్న సంగతి తెలిసిందే.

-ఆంధ్రజ్యోతి (చౌటుప్పల్ రూరల్)

సమంత... సక్కనైందే!





చక్కనమ్మ సమంత చిక్కితేనే కాదు.. వయసు మళ్ళినా అందంగానే ఉంటుందని అందరూ అనుకున్నారు. 'ఓ బేబీ' చిత్రంలో 70 ఏళ్ల బామ్మ పాత్రలో ఆమెను చూడొచ్చనుకున్నారు. 'ఎంత సక్కగున్నావే' అనే ట్యాగ్‌లైన్‌కు తగ్గట్టే ఉంటుందని భావించారు. అలాంటి వారందరికీ ఓ ముఖ్యాంశం. ఈ చిత్రంలో బామ్మ పాత్రలో సమంత నటించడం లేదు. ఆమె ఇందులో యువతిగా నటిస్తున్నారు. బామ్మగా లక్ష్మి కనిపిస్తారు. కొరియన్ చిత్రం 'మిస్ గ్రానీ' ఆధారంగానే 'ఓ బేబీ' తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. ఒరిజినల్‌లోనూ ఈ రెండు పాత్రల్లోనూ ఒక్కరే నటించలేదు. పడుచుప్రాయంలో ఒకరు నటిస్తే, వృద్ధురాలి పాత్రను ఇంకొకరు పోషించారు. ఒరిజినల్‌లో ఉన్న ఎసెన్స్ దెబ్బతినకుండా తెలుగు ప్రేక్షకులకు అందివ్వాలనే తాపత్రయంతో దర్శకురాలు నందినిరెడ్డి కూడా ఆ పాత్రలకు ఇద్దరు ఆర్టిస్టులను సెలక్ట్ చేశారట. ప్రోస్థెటిక్ మేకప్ కూడా అందుకే వద్దనుకున్నారట. ఈ చిత్రం షూటింగ్ సగం పూర్తయింది. నటి లక్ష్మికి సంబంధించి రెండు షెడ్యూళ్లను తెరకెక్కించారు. దాదాపుగా ఆమె పాత్ర చిత్రీకరణ పూర్తయినట్టే. ప్రస్తుతం జరుగుతున్న షెడ్యూల్ ఈ నెల 22 వరకు కొనసాగుతుంది. తదుపరి షెడ్యూల్ ఫిబ్రవరిలో ఉంటుంది.

యన్.టి.ఆర్... జీవితాన్ని చూసినట్టుంది!

- కృష్ణ

"నందమూరి బాలకృష్ణ నటించిన 'యన్.టి.ఆర్ కథానాయకుడు' చూశా. చాలా బావుంది. సినిమా చూసినట్టు కాకుండా... జీవితాన్ని చూసినట్టు అనిపించింది. బాలకృష్ణ వందశాతం ఎన్టీఆర్‌గారిలా కనిపించారు. వేసిన గెటప్స్ అన్నిటిలోనూ బావున్నారు" అని ఘట్టమనేని కృష్ణ అన్నారు. నందమూరి తారక రామారావు జీవిత చరిత్ర ఆధారంగా రూపొందిన బయోపిక్ తొలి భాగం 'యన్.టి.ఆర్



కథానాయకుడు'. ఎన్టీఆర్ పాత్రను బాలకృష్ణ పోషించారు. క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహించిన ఈ చిత్రం బుధవారం విడుదలైంది. ప్రత్యేకంగా చిత్రాన్ని వీక్షించిన కృష్ణ, విజయ నిర్మల చిత్రబృందంపై ప్రశంసలు కురిపించారు. విజయ నిర్మల మాట్లాడుతూ "ఎన్టీఆర్‌గారి 'పాండు రంగ మహత్యం'లో కృష్ణుడిగా నటించా. అప్పుడు నా వయసు 12 ఏళ్ళు. ఇప్పుడీ బయోపిక్ చూస్తుంటే... ఎన్టీఆర్‌గారిని చూస్తున్నట్టుంది. బాలకృష్ణగారు అంత అద్భుతంగా నటించారు" అన్నారు. నరేశ్ విజయకృష్ణ మాట్లాడుతూ "ఎన్టీఆర్ బయోపిక్ ప్రకటించినప్పుడు... 'నాకు నటించే అవకాశం వస్తుందా?' అనుకున్నా. నాకు ఫోన్ చేసి బీఏ సుబ్బరావుగారి పాత్రలో నటించాలన్నప్పుడు, షూటింగ్ చేస్తున్నప్పుడు చాలా సంతోషించా. ఓ ప్లానింగ్‌తో సకాలంలో సినిమాను పూర్తి చేసిన క్రిష్, ఈ చిత్రంతో లెజెండరీ దర్శకుడు అయ్యారు. బాలకృష్ణ నాకు మంచి మిత్రుడు. తనతో మంచి అనుబంధం ఉంది. ఈ చిత్రంతో బాలకృష్ణ మహా నటుడిగా అవతరించారు" అన్నారు. కృష్ణ కుమారుడు, కథానాయకుడు మహేశ్‌బాబు సహా పలువురు చలన చిత్ర ప్రముఖులు 'యన్.టి.ఆర్ కథానాయకుడు' చిత్రంపై ప్రశంసలు కురిపించారు.



బాలకృష్ణ, దర్శకుడు క్రిష్‌కు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభినందనలు

ప్రతి అమ్మాయికీ కనెక్టయ్యే కథ!



- కీర్తి సురేశ్

"తెలుగులో 'మహానటి' తర్వాత నేను చేస్తున్న చిత్రమిది. ప్రతి అమ్మాయికి కనెక్టయ్యే కథతో రూపొందుతోన్న ఈ మహిళా ప్రధానమైన చిత్రంలో నటిస్తుండటం చాలా సంతోషంగా ఉంది" అని కీర్తి సురేశ్ అన్నారు. ఆమె ప్రధాన పాత్రధారిగా ఈస్ట్ కోస్ట్ ప్రొడక్షన్స్ పతాకంపై మహేశ్ కోనేరు నిర్మించనున్న చిత్రం గురువారం హైదారాబాద్‌లో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత బివిఎస్ఎన్ ప్రసాద్, దర్శకుడు వెంకీ అట్లూరి కెమెరా స్విచ్చాన్ చేయగా, హీరో నందమూరి కల్యాణ్‌రామ్ క్లాప్ ఇచ్చారు. దర్శకుడు హరీశ్ శంకర్ గౌరవ దర్శకత్వం వహించారు. నిర్మాత మహేశ్ కోనేరు మాట్లాడుతూ "లేడీ ఓరియెంటెడ్ చిత్రమిది. మహిళలకు కనెక్ట్ అవుతుంది. ప్రతి అమ్మాయి తన జీవితంలో ఎక్కడోచోట ఎదుర్కొన్న సందర్భాల సమాహారమే చిత్రకథ. ఈ చిత్రంతో నరేంద్రను దర్శకుడిగా పరిచయం చేస్తున్నాం" అన్నారు. నరేంద్ర మాట్లాడుతూ "అన్ని భావోద్వేగాలున్న కథ కుదిరింది. 2016 నుండి ఈ కథపై పని చేస్తున్నా. కీర్తి సురేశ్‌గారు తప్ప మరెవరూ ఈ కథకు సూట్ కారు. ఇండియాలో 25 శాతం... అమెరికాలో 75 శాతం చిత్రీకరణ చేస్తాం. ఫిబ్రవరిలో చిత్రీకరణ ప్రారంభిస్తాం. ఏప్రిల్‌లో అమెరికా షెడ్యూల్ ప్లాన్ చేస్తున్నాం" అన్నారు.

ఎవరూ సంప్రదించలేదు!

- కంగనా రనౌత్



"ఒకే రోజు రెండు చిత్రాలు విడుదలైనా మనకేం ఇబ్బందులు రావు. వాటికి తగిన థియేటర్లు మన దగ్గరున్నాయి" అని అన్నారు కంగనా రనౌత్. ఆమె నటించిన 'మణికర్ణిక' ఈ నెల 25న విడుదల కానుంది. ఇటీవల ఈ చిత్రంలోని పాట విడుదలై అందరి దృష్టిని ఆకర్షించింది. దీని గురించి కంగనా రనౌత్ మాట్లాడుతూ "గతంలో నేను చిన్న చిత్రాల్లో నటించాను. కానీ 'మణికర్ణిక' చాలా పెద్దది. భారీ చిత్రం అని అనగానే బడ్జెట్ పరంగా చెబుతున్నానని అనుకోవద్దు. టెక్నికల్ పరంగానూ ఇది గొప్ప సినిమా. తొలిసారి నేను శంకర్, ఎహసాన్, లాయ్‌తో కలిసి పనిచేశా. వాళ్లు ఏడెనిమిది మంచి పాటలు ఇచ్చారు. ప్రతి పాటా ఆణిముత్యం అవుతుంది. నాతో పాటు ఈ సినిమాకు పనిచేసిన వారందరూ బాలీవుడ్‌లో చాలా గొప్పవారే. ప్రసూన్ జోషితో పనిచేయడం మంచి అనుభవం. చాలా పదాలకు ఆయన దగ్గర అర్థాలు తెలుసుకున్నాను" అని అన్నారు. 'తాఖరే' సినిమా విడుదల గురించి ప్రస్తావిస్తూ "మా సినిమా విడుదల రోజునే 'తాఖరే' విడుదల అవుతోంది. ఈ విషయం గురించి నేనెప్పుడూ ఒత్తిడి ఫీలవ్వలేదు. మరో సినిమా వస్తున్నంత మాత్రాన మా చిత్రం విడుదలను వాయిదా వేసుకోవాలని కూడా అనుకోలేదు. వాయిదా వేసుకోమనీ మమ్మల్ని ఎవరూ సంప్రతించలేదు" అని అన్నారు.

'లక్ష్మీస్ ఎన్టీఆర్'లో పార్వతి!



రామ్‌గోపాల్ వర్మ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'లక్ష్మీస్ పార్వతి'. ఇందులో లక్ష్మీ పార్వతిగా కన్నడ కథానాయిక యజ్ఞ శెట్టి నటిస్తున్నారు. ఆమె ఫస్ట్ లుక్‌ను శుక్రవారం సాయంత్రం ట్విట్టర్‌లో విడుదల చేశారు. వర్మ 'కిల్లింగ్ వీరప్పన్'లో వీరప్పన్ భార్య ముత్తులక్ష్మి పాత్రలో నటించారీమె. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతున్నట్టు సమాచారం. ఇప్పటికే ఈ సినిమాలో రెండు పాటలు 'వెన్నుపోటు', 'ఎందుకు' విడుదల చేశారు.

గాళ్‌ఫ్రెండ్‌తో కారు కడిగించాలా?



శ్రుతీ హాసన్ ప్రియుడు మైఖేల్ కోర్సలే మగవాళ్ళకు ఓ సలహా ఇచ్చారు! అదీ గాళ్‌ఫ్రెండ్స్ చేత కారు కడిగించే విషయంలో! "మగవాళ్ళకు ఓ టిప్! కారు బాగా దుమ్ము పట్టిందా? తప్పనిసరిగా కారు కడగాల్సిందేనని అనుకుంటున్నారా? అయితే... మీ గాళ్‌ఫ్రెండ్‌ని కారు దగ్గరకు తీసుకు వెళ్ళండి. బిగ్ సోప్ బ్రష్ (కారు కడిగే సోప్ బ్రష్) చేతిలో పెట్టి... దీన్ని ఉపయోగిస్తే భలే సరదాగా ఉంటుందని చెప్పండి. పని పూర్తయిపోతుందంతే!" అని మైఖేల్ కోర్సలే అన్నారు. శ్రుతీ హాసన్ చేత శుక్రవారం ఆయన కారు కడిగించారు. ప్రస్తుతం ఈ ప్రేమ పక్షులిద్దరూ అమెరికాలోని లాస్ ఏంజిల్స్‌లో ఉన్నారు. స్నేహితులతో కలిసి క్రిస్మస్, న్యూ ఇయర్ సెలబ్రేట్ చేసుకున్నారు. ఇప్పుడు ఓ తమిళ టీవీ షోకి శ్రుతీ హాసన్ వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు.

ఆపరేషన్ సక్సెస్

నటుడు, నిర్మాత, దర్శకుడు రాకేశ్ రోషన్‌కు గొంతు కాన్సర్ అని ఆయన తనయుడు హృతిక్ రోషన్ ప్రకటించగానే అభిమానులు ఆందోళన చెందారు. అయితే భయపడాల్సిన అవసరం లేదనీ, కాన్సర్ ప్రాథమిక దశలోనే ఉందనీ, ఆపరేషన్ చేస్తే నయమవుతుందని కూడా హృతిక్ వెల్లడించారు. తండ్రి ఆస్పత్రిలో ఉండటంతో తన 45వ పుట్టిన రోజుని కుటుంబ సభ్యుల మధ్య నిరాడంబరంగా జరుపుకొన్నారు హృతిక్. ఆ మర్నాడే విజయవంతంగా ఆపరేషన్ చేయించుకొని రాకేశ్ రోషన్ ఇంటికి వచ్చేశారు. తండ్రితో ఉన్న ఫొటో ట్యాగ్ చేసి 'కాన్ట్ స్టాప్.. ఓన్ట్ స్టాప్.. వుయ్ బిగిన్ ఎగైన్ అండ్ ఎగైన్' అని ట్వీట్ చేశారు హృతిక్. రాకేశ్ రోషన్‌కు సర్జరీ జరుగుతున్న సమయంలో భార్య, తనయుడు హృతిక్, కుమార్తె సునైనా, సోదరుడు రాజేశ్ రోషన్ పక్కనే ఉన్నారు. ఇదిలా ఉంటే 'క్రిష్' చిత్రానికి సీక్వెల్‌గా 'క్రిష్ 4' చిత్రం నిర్మించే సన్నాహాల్లో ఉన్నారు రాకేశ్ రోషన్. మధ్యలో అనారోగ్యం కారణంగా ప్రీ ప్రొడక్షన్ వర్క్‌కు కొంత బ్రేక్ పడినప్పటికీ, మరి కొన్ని రోజుల్లో మళ్లీ వర్క్ మొదలుపెట్టనున్నారు. ఇందులో హీరోగానే కాకుండా విలన్‌గా కూడా హృతిక్ నటించనున్నారు. 2020 క్రిస్మస్‌కు ఈ సినిమాను విడుదల చేయాలని తండ్రీకొడుకుల ఆలోచన.



బతకడానికి... యుద్ధం!



తనిష్క

'ఇక్కడ యుద్ధం చేయాలి. గెలవడానికి కాదు. బతకడానికి' అనే ట్యాగ్‌లైన్‌తో తెరకెక్కుతోన్న చిత్రం 'భైలంపూడి'. తారా క్రియేషన్స్ పతాకంపై బ్రహ్మానందరెడ్డి నిర్మిస్తున్నారు. హరీశ్ వినయ్, తనిష్క తివారి జంటగా నటిస్తున్నారు. అనిల్ పిజి రాజ్ దర్శకుడు. ఈ చిత్రంలోని 'పిల్లల దేవుడు' అనే పాటను బాలీవుడ్ నాయిక మైరా అమితి ఇటీవల విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ "కెమెరామేన్‌గా నా కెరీర్‌ను మొదలుపెట్టి ఇప్పుడు దర్శకత్వం చేస్తున్నాను. 'భైలంపూడి' అనే గ్రామంలో జరిగే కథ ఇది. ప్రేమ, రాజకీయ నేపథ్యంలో సాగుతుంది. ప్రతి పాత్రా ఎంతో సహజంగా ఉంటుంది" అని అన్నారు. నిర్మాత మాట్లాడుతూ "అందరూ కొత్తవారైనా ఎంతో సహజంగా నటించారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి" అని అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సుభాష్ ఆనంద్, పాటలు: రామారావు.

ఈ ఏడాది 3 కొత్త యాపిల్ ఐఫోన్లు!

యాపిల్ ఇంక్ ఈ ఏడాదిలో మూడు కొత్త ఐఫోన్ మోడళ్లను మార్కెట్లోకి విడుదల చేయాలన్న సన్నాహాల్లో ఉన్నట్టు తెలుస్తోంది. వీటిలో ఒక ఫోన్‌ను ఎల్‌సీడీ స్ర్కీన్‌తో తీసుకువచ్చే అవకాశం ఉందని సమాచారం. అంతేకాకుండా కెమెరాల్లో కొత్త ఫీచర్లను జోడించాలని యాపిల్ భావిస్తోందని తెలుస్తోంది. చైనాలో డిమాండ్ తగ్గిన కారణంగా కంపెనీ రాబడులు తగ్గవచ్చని యాపిల్ ఇటీవలే ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఇన్వెస్టర్లలో ఆందోళన మొదలైంది. ఈ నేపథ్యంలో అమ్మకాలు పెంచుకునేందుకు కొత్త మోడళ్లను తీసుకురావడంపై యాపిల్ దృష్టిసారించినట్టు వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనం పేర్కొంది.



“ క్లౌడ్ కిచెన్‌ల ద్వారా రూ.40కే ఇంటికే సిద్ధం చేసిన ఆహారాన్ని అందించాలని భావిస్తున్నాం. ఇది మేము చేపడుతున్న మరో వ్యాపార ప్రాజెక్టు.

- కిశోర్ బియానీ, సీఈఓ, ఫ్యూచర్ గ్రూప్

రూ.40కే భోజనం

ప్రతి నగరంలో క్లౌడ్ కిచెన్‌లు

- ఫుడ్ డెలివరీ వ్యాపారంలోకి ఫ్యూచర్ గ్రూపు
- సీఈఓ కిశోర్ బియానీ వెల్లడి

శంభు కలాన్ (పంజాబ్): రూ.40కే భోజనం, రూ.10కు రెండు సమోసాలు. అది కూడా 'ఫ్యూచర్ పే' యాప్ ద్వారా ఆర్డర్ చేసిన వెంటనే మీ ఇంటి దగ్గర డెలివరీ. బిగ్‌బజార్ పేరుతో దేశ వ్యాప్తంగా రిటైల్ మాల్స్ నిర్వహిస్తున్న ఫ్యూచర్ గ్రూపు త్వరలో ఫుడ్ డెలివరీ వ్యాపారంలోకి ప్రవేశిస్తోంది. ఆ సంస్థ సీఈఓ కిశోర్ బియానీ ఈ విషయం వెల్లడించారు. ఇందు కోసం దేశంలోని ప్రధాన నగరాలు అన్నిటిలో ఫ్యూచర్ గ్రూపు త్వరలో క్లౌడ్ కిచెన్‌లు ఏర్పాటు చేయబోతోంది. 'ఇందుకోసం ప్రతి నగరంలో క్లౌడ్ కిచెన్‌లు ఏర్పాటు చేస్తాం. వాటి నుంచి తాజా ఆహారాన్ని కస్టమర్లకు సరఫరా చేస్తాం. దీనికి సంబంధించి ముందు ముందు మరింత కార్యాచరణను మీరే చూస్తారు' అని బియానీ చెప్పారు.

ముందుగా రైస్ మీల్స్

ఈ క్లౌడ్ కిచెన్‌ల ద్వారా ముందుగా బియ్యంతో చేసిన భోజనాన్ని అందించాలని ఫ్యూచర్ గ్రూపు భావిస్తోంది. అతి త్వరలోనే ఈ క్లౌడ్ కిచెన్‌ల ఏర్పాటు ప్రారంభమవుతుందని బియానీ చెప్పారు. ఫ్యూచర్ పే యాప్ ద్వారా, ఫ్యూచర్ గ్రూపు ఈ రెడీ టు ఈట్ ఆహార పదార్థాలు అందించబోతోంది. 'ముందు బియ్యంతో చేసిన భోజన పదార్థాలు సిద్ధం చేస్తున్నాం. ఆహార పదార్థాలు వండడం మొదలుకుని డెలివరీ వరకు అంతా మా నెట్‌వర్క్ ద్వారానే జరుగుతుంది. దీంతో వినియోగదారులు రూ.10కే రెండు సమోసాలు పొందవచ్చు' అని బియానీ చెప్పారు. మన దేశ ప్రజలు వినియోగించే అన్ని రకాల ఆహార పదార్థాలు అందించాలన్నది తమ కోరిక అన్నారు. ఇప్పటి ఫుడ్ డెలివరీ రంగంలో విపరీతమైన పోటీ ఉంది. జొమాటో, స్విగ్గీ, ఊబర్ ఈట్, ఫుడ్‌పాండా వంటి సంస్థలు ప్రధాన నగరాల్లో ఈ సేవలు అందిస్తున్నాయి. ముందు ఖాతాదారులను సంపాదించడమే లక్ష్యంగా ఈ కంపెనీలు నష్టాలకు సిద్ధపడి హోటళ్లు, రెస్టారెంట్ల రుచులను వినియోగదారులకు ఇంటి దగ్గరే డెలివరీ చేస్తున్నాయి.

ఫుడ్ బజార్ కోసం ఫ్యూచర్ గ్రూపు ఇప్పటికే దేశ వ్యాప్తంగా బియ్యం, పిండి మిల్లులు ఏర్పాటు చేసింది. సొంత బ్రాండ్ల పేరుతో వాటిని విక్రయిస్తోంది. ఈ నెట్‌వర్క్ మొత్తాన్ని ఉపయోగించుకోవడం ద్వారా ఫుడ్ డెలివరీ వ్యాపారంలో ఉండే, తక్కువ లాభాల సమస్యను అధిగమించాలని భావిస్తోంది. ప్రస్తుతం ఉన్న ఫుడ్ డెలివరీ యాప్‌లు స్విగ్గీ, ఊబర్ ఈట్, జొమాటోలకు తమ ఫుడ్ డెలివరీ వ్యాపారం పోటీ కాదని కిశోర్ బియానీ చెప్పారు.

క్లౌడ్ కిచెన్ అంటే ?

నిర్వాహకులే ఆహారాన్ని వండి ప్యాక్ చేసి, నేరుగా తుది వినియోగదారులకు వారి ఇంటి దగ్గర అందిస్తారు. ఖాతాదారులు కూర్చుని తినేందుకు ఈ వంటశాలల దగ్గర ఎలాంటి ఏర్పాట్లు ఉండవు. ఒక విధంగా చెప్పాలంటే ఇది ప్రస్తుతం పట్టణాలు, నగరాల్లో నడుస్తున్న కేటరింగ్ వ్యాపారాన్ని పోలి ఉంటుంది.


పంపిణీలో రూ.1,000 కోట్ల పెట్టుబడి

దేశంలోని 38 సమీకృత ఆహార పంపిణీ కేంద్రాలను ఒకే ఛత్రం కిందకి తేవడం ద్వారా ఇండియా ఫుడ్ గ్రిడ్ ఏర్పాటు చేసేందుకు ఫ్యూచర్స్ సప్లై చెయిన్ సొల్యూషన్స్ రూ.1,000 కోట్లు ఇన్వెస్ట్ చేస్తుంది. దీనితో దేశం యావత్తు ఆహార పంపిణీ విభాగం ఒకే గొడుగు కిందకు వస్తుంది. అత్యంత సంక్లిష్టంగా ఉన్న ఆహార, ఎఫ్‌ఎంసీజీ వ్యవస్థను కొత్త పుంతలు తొక్కించే లక్ష్యంతో ఈ ప్రాజెక్టు చేపట్టామని ఫ్యూచర్స్ గ్రూప్ సీఈఓ కిశోర్ బియానీ తెలిపారు. దేశంలోని ఏ ఆహార పంపిణీదారైనా చిన్న, పెద్ద తేడా లేకుండా ఇందులో భాగం కావచ్చునని ఆయన చెప్పారు.

దీని వల్ల ఆహారం, కిరాణా, ఎఫ్‌ఎంసీజీ సరకులు సరైన సమయానికి, సమర్థవంతంగా పంపిణీ చేసే వీలు కలుగుతుందని ఆయన అన్నారు. ఇందు కోసం దేశంలోని 38 ప్రాంతాలను గుర్తించామని, ప్రతి కేంద్రంలోనూ ఒక భారీ పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు.

చిన్న వ్యాపారస్తులకు బీమా పథకం

టర్నోవర్‌ను బట్టి రూ.10 లక్షల వరకు ప్రమాద బీమా కవరేజీ



న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ సరికొత్త పథకంపై ప్రభుత్వం దృష్టిసారిస్తోంది. ఇందులో భాగంగా జీఎస్‌టీ కింద నమోదు అయిన చిన్న, మధ్యతరహా వ్యాపారస్తులకు భద్రతను ఇచ్చే బీమా పథకాన్ని తీసుకురావాలని భావిస్తోంది. ఈ పథకం ద్వారా ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజనా పథకం (పీఎంఎస్‌బీవై) మాదిరిగా అందుబాటు ధరల్లోనే ప్రీమియంతో ప్రమాద బీమా కవరేజీని అందించాలని భావిస్తున్నట్టు ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వర్గాలు తెలిపాయి. టర్నోవర్ ఆధారంగా చిన్న వ్యాపారస్తులు రూ.10 లక్షల వరకు ప్రమాద బీమా కవరేజీని పొందే అవకాశం ఉండనుంది. ఈ పథకానికి ప్రభుత్వం ఆమోదం లభిస్తే ఈ నెల చివరి వరకే ప్రకటన వెలువడనుంది. పీఎంఎస్‌బీవై కింద ప్రస్తుతం వార్షికంగా రూ.12 చెల్లిస్తే రూ.2 లక్షల ప్రమాద బీమా కవరేజీ లభిస్తోంది. ఈ పథకం 18-70 ఏళ్ల మధ్య వయస్కులకు అందుబాటులో ఉంది. బ్యాంకులో సేవింగ్స్ ఖాతా కలిగిన వారు ప్రతి సంవత్సరం మే 31వ తేదీకి ముందే బీమా మొత్తాన్ని ఆటో డెబిట్ చేసుకునేందుకు గాను అనుమతి వ్వాల్సి ఉంటుంది. కాగా వ్యాపారస్తులు రాయితీలతో ఫైనాన్స్ పొందే సదుపాయం కల్పించాలని కూడా ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలుస్తోంది. కంప్యూటరీకరణతోపాటు తమ వ్యాపారాన్ని మరింతగా మెరుగుపరచుకునే వారికి ఈ సదుపాయం కల్పించాలన్నది ప్రభుత్వ ఆలోచన. మహిళా ఆంత్రప్రెన్యూర్లను ప్రోత్సహించే ఉద్దేశంతో ప్రత్యేక విధానాన్ని కూడా రూపొందిచాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం. 59 నిమిషాల్లోనే రుణ మంజూరుతోపాటు కార్మిక చట్టాల్లో సడలింపులు కల్పించిన ప్రభుత్వం పర్యావరణ నిబంధనలను సరళతరం చేసింది.

17 నెలల కనిష్ఠానికి పారిశ్రామికోత్పత్తి

న్యూఢిల్లీ : గత ఏడాది నవంబరు నెలలో పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) పదిహేడు నెలల కనిష్ట స్థాయికి పడిపోయింది. కన్స్యూమర్, క్యాపిటల్ గూడ్స్ రంగాల్లో ఉత్పత్తి గణనీయంగా పడిపోవటంతో నవంబరు నెలలో పారిశ్రామికోత్పత్తి 0.5 శాతంగా నమోదైందని కేంద్ర గణాంక శాఖ (సీఎస్ఓ) డేటా వెల్లడించింది. 2017, నవంబరులో నెలలో పారిశ్రామికోత్పత్తి రేటు 8.5 శాతంగా ఉంది. కాగా 2017, జూన్‌లో ఐఐపీ 0.3 శాతంగా నమోదైంది. పదిహేడు నెలల తర్వాత ఐఐపీ ఇంత కనిష్ఠానికి పడిపోవటం ఇదే తొలిసారి. కాగా 2018, అక్టోబరులో వృద్ధి రేటును 8.1 శాతం నుంచి 8.4 శాతానికి ప్రభుత్వం సవరించిన సంగతి విదితమే. మరోవైపు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-నవంబరు కాలంలో పారిశ్రామికోత్పత్తి వృద్ధి రేటు 3.2 శాతం నుంచి 5 శాతానికి పెరిగింది. ఐఐపీలో తయారీ రంగం వాటా 77.63 శాతంగా ఉంది. నవంబరు నెలలో ఈ రంగంలో ఉత్పత్తి 10.4 శాతం నుంచి ఏకంగా 0.4 శాతానికి పడిపోయింది. మరోవైపు మైనింగ్ రంగంలో వృద్ధి మాత్రం 1.4 శాతం నుంచి 2.7 శాతానికి పెరిగింది. విద్యుదుత్పత్తి రంగం కూడా అదే జోరును కనబరిచింది. ఈ రంగంలో వృద్ధి 3.9 శాతం నుంచి 5.1 శాతానికి పెరిగింది.

ఎన్‌టీపీసీ రూ.4,000 కోట్ల సమీకరణ

న్యూఢిల్లీ: ఎన్‌టీపీసీ దీర్ఘకాలిక రుణ పత్రాల (బాండ్స్) జారీ ద్వారా, శుక్రవారం రూ.4,000 కోట్లు సమీకరించింది. రూ.500 కోట్ల సమీకరణ కోసం ప్రైవేట్ ప్లేస్‌మెంట్ పద్ధతిలో కంపెనీ ఈ బాండ్స్ జారీ చేసింది. సబ్‌స్క్రిప్షన్ ప్రారంభమైన 10 నిమిషాల్లోనే రూ.12,520 కోట్ల మొత్తానికి ఆఫర్లు అందాయి. దీంతో ముందు అనుకున్న రూ.500 కోట్లతో పాటు గ్రీన్ షూ ఆప్షన్ కింద మరో రూ.3,500 కోట్ల మొత్తానికి ఎన్‌టీపీసీ ఆమోదం తెలిపింది. ఈ బాండ్లను బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో నమోదు చేస్తారు. ఎన్‌టీపీసీ బాండ్స్ జారీతో శుక్రవారం పది సంవత్సరాల కాల వ్యవధి ఉండే ప్రభుత్వ రుణ పత్రాలపై వార్షిక రాబడులు 8.3 శాతానికి తగ్గాయి.

సిటీ బ్యాంక్‌కు రూ.3 కోట్ల జరిమానా

ముంబై: బ్యాంక్ డైరెక్టర్లకు సంబంధించిన ఫిట్ అండ్ ప్రాపర్ క్రైటీరియా ఆదేశాలను పాటించని సిటీ బ్యాంక్ ఇండియాకు భారత రిజర్వు బ్యాంక్ రూ.3 కోట్ల జరిమానా విధించింది. రెగ్యులేటరీ నిబంధనలను పాటించడంలో లోపాలుండటం వల్లనే ఈ చర్యకు ఉపక్రమించినట్టు తెలిపింది. కాగా నో యువర్ కస్టమర్ లేదా యాంటీ మనీలాండరింగ్ నిబంధనల ఉల్లంఘనకు సంబంధించి 2013 జూలైలో సిటీ బ్యాంక్‌కు హెచ్చరిక లేఖను ఆర్‌బీఐ జారీ చేసింది. అమెరికాకు చెందిన సిటీ బ్యాంక్‌కు భారత్‌లో 35 శాఖలు, 541 ఏటీఎంలున్నాయి.

మొబైల్స్ కొనుగోళ్లపై సెలెక్ట్‌లో ఆఫర్లు



హైదరాబాద్ : మొబైల్ రిటైల్ సంస్థ సెలెక్ట్.. హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో షోరూమ్‌ను ప్రారంభించింది. సంస్థ వైస్ ప్రెసిడెంట్ విజయానంద్ ఈ షోరూమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెలెక్ట్ షోరూమ్‌లో అన్ని బ్రాండ్స్.. మొబైల్, టాబ్లెట్స్, గాడ్జెట్స్‌తో పాటు టీవీలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. షోరూమ్ ప్రారంభం సందర్భంగా ప్రతి మొబైల్ కొనుగోలుపై కచ్చితమైన బహుమతిని అందిస్తున్నట్లు తెలిపారు. మొబైల్ విక్రయాలతో పాటు ఎక్స్ఛేంజ్ ఆఫర్, రిపేర్, సర్వీస్ సేవలను అందించనున్నట్లు చెప్పారు. సెలెక్ట్ ను స్థాపించిన ఆరు నెలల వ్యవధిలోనే తెలంగాణ, ఏపీ, మహారాష్ట్రల్లో స్టోర్ల సంఖ్య 50కి చేరుకుందని విజయానంద్ తెలిపారు.

పదేళ్లలో దేశంలోనే ఏపీ అగ్రగామి

సీఎం చంద్రబాబు

మంగళగిరిలో వాగ్దేవి టెక్నో పార్క్‌కు శంకుస్థాపన



మంగళగిరిలో వాగ్దేవి టెక్నో పార్క్‌కు శంకుస్థాపన చేసిన సీఎం చంద్రబాబు

మంగళగిరి : మరో పదేళ్లలో ఆంధ్రప్రదేశ్.. దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా అవతరిస్తుందని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. శుక్రవారం నాడిక్కడ కాజ వద్ద సాహితీ గ్రూప్ అభివృద్ధి చేస్తున్న వాగ్దేవి టెక్నో పార్క్, మల్టీప్లెక్స్ భవన సముదాయానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ నగరాలకు దీటుగా రాజధాని అమరావతిని నిర్మిస్తున్నామన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, పాలనలో పారదర్శకత, అభివృద్ధిలో రాష్ట్ర కీలకంగా ఉండటమే కాకుండా 2029 నాటికి దేశంలోనే అగ్రగామిగా అవతరించనుందని ముఖ్యమంత్రి తెలిపారు. కాగా అమరావతి సమీపంలో సాహితీ గ్రూప్ ఏర్పాటు చేయనున్న టెక్నో పార్క్ ఈ ప్రాంతానికి మరింత పేరు తీసుకువస్తుందని భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అమరావతి విజయంలో సాహితీ ప్రాజెక్ట్ కూడా భాగస్వామిగా ఉంటుందన్నారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వాగ్దేవి టెక్నో పార్కు బ్రోచరును ఆవిష్కరించి టీజర్‌ను విడుదల చేశారు. కాగా 16 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో వాగ్దేవి ఐటీ పార్క్, మల్టీప్లెక్స్ భవనాలను నిర్మిస్తున్నట్లు సాహితీ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీ నారాయణ చెప్పారు. మొత్తం నలభై ఎకరాల్లో నివాస, వాణిజ్య, ఎంటర్‌టైన్‌మెంట్, రిక్రియేషన్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఐటీ పార్క్ ద్వారా ఆరు వేల మందికి ప్రత్యక్షంగా, మరో వెయ్యి మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సాహితీ గ్రూప్ డైరెకర్, సినీ నటుడు జగపతి బాబు, సినీ నటి రమ్యకృష్ణ, డైరెక్టర్లు, ఎస్ పూర్ణచంద్రరావు, కె శ్రీనివాస రావు, పట్టాభి, విద్యాసాగర్, తెలంగాణ టీడీపీ అధ్యక్షులు ఎల్ రమణ, మాజీ ఎంఎల్‌ఏ ఎస్ఎం జియావుద్దీన్ పాల్గొన్నారు.

గ్రాము రూ.3,214

మలి విడత పసిడి బాండ్ల ధర



ముంబై: మలి విడత పసిడి బాండ్ల ధరను గ్రాముకు రూ.3,214గా నిర్ణయించారు. శుక్రవారం ఆర్‌బీఐ విడుదల చేసిన ప్రకటన ప్రకారం.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2018-19)లో ఐదో విడత పసిడి బాండ్ల జారీ ప్రక్రియ ఈనెల 14న మొదలై 18న ముగియనుంది. పసిడి బాండ్ల కోసం డిజిటల్ చెల్లింపులు జరిపేవారికి గ్రాముకు రూ.50 చొప్పున రాయితీ లభించనుంది. కాబట్టి వారికి గ్రాము రూ.3,164కే లభిస్తుందని ఆర్‌బీఐ తెలిపింది. పసిడి బాండ్లను బ్యాంకులు, స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌తోపాటు ఎంపిక చేసిన తపాలా కార్యాలయాలు, స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల ద్వారా విక్రయించనున్నారు. లోహ రూపంలో బంగారం కొనుగోళ్లను నిరుత్సాహపరిచేందుకు 2015 నవంబరులో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకంలో భాగంగా బాండ్లను యూనిట్ల రూపంలో జారీ చేయనున్నారు. కనీసం ఒక గ్రాము (యూనిట్) కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఒక వ్యక్తి ఏదేని ఆర్థిక సంవత్సరంలో ఈ పథకం ద్వారా గరిష్ఠంగా 500 గ్రాములు కొనుగోలు చేయవచ్చు. ఈ పరిమితిని హిందూ అవిభాజ్య కుటుంబానికి (హెచ్‌యూఎఫ్) 4 కిలోలు, ట్రస్టులు లేదా అదే తరహా ఇతర సంస్థలకు 20 కిలోలుగా నిర్ణయించారు.

ఇన్ఫీ బంపర్ బొనాంజా!

రూ.8,260 కోట్ల బైబ్యాక్.. షేర్‌కు రూ. 4 డివిడెండ్

న్యూఢిల్లీ: దేశంలో రెండో అతిపెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీ ఇన్ఫోసిస్ తన షేర్‌హోల్డర్ల కోసం భారీ బొనాంజా ప్రకటించింది. రూ.8,260 కోట్ల విలువైన సంస్థ షేర్లను తిరిగి కొనుగోలు (బైబ్యాక్) చేయనున్నట్లు ఇన్ఫీ తెలిపింది. అంతేకాదు, వాటాదారులకు ఒక్కో షేరుపై రూ.4 చొప్పున మొత్తం రూ.2,107 కోట్ల విలువైన ప్రత్యేక డివిడెండ్ చెల్లించనుంది. తన వద్దనున్న మిగులు నిల్వల్లోంచి రూ.13,000 కోట్లను పలు మార్గాల్లో షేర్‌హోల్డర్లకు కేటాయించనున్నట్లు గత ఏడాది ఏప్రిల్‌లో ఇన్ఫోసిస్ ప్రకటించింది. ఆ ప్రణాళికలో భాగంగా గత జూన్‌లో రూ.2,633 కోట్ల (డివిడెండ్ డిస్ట్రిబ్యూషన్ ట్యాక్స్‌తో కలిపి) విలువైన ప్రత్యేక డివిడెండ్ చెల్లించింది. మిగిలిన రూ.10 వేల కోట్లకు పైగా సొమ్మును తాజాగా ప్రకటించిన బైబ్యాక్, స్పెషల్ డివిడెండ్ రూపంలో పంచనుంది. డివిడెండ్ రికార్డు తేదీని ఈనెల 25గా, చెల్లింపుల తేదీని 28గా ఖరారు చేసినట్లు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో సంస్థ పేర్కొంది.

రెండో బైబ్యాక్

గత ఏడాది చివరినాటికి కంపెనీ పెయిడ్-అప్ క్యాపిటల్‌లో 2.36 శాతం వాటాకు సమానమైన 10,32,50,000 షేర్లను తిరిగి కొనుగోలు చేయాలని సంస్థ బోర్డు నిర్ణయించింది. స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల ద్వారా ఓపెన్ మార్కెట్ నుంచి ఈ షేర్లను కొనుగోలు చేయనుంది. ఒక్కో షేరుకు గరిష్ఠంగా రూ.800 చెల్లించనున్నట్లు సంస్థ తెలిపింది. ఇన్ఫోసిస్‌కు చెందిన అమెరికన్ డిపాజిటరీ షేర్ (ఏడీఎస్) హోల్డర్లు కూడా బైబ్యాక్ సందర్భంగా తమ వాటా షేర్లను విక్రయించవచ్చు.

త్రైమాసిక లాభంలో 30% క్షీణత



ఇన్ఫోసిస్ ఆర్థిక ఫలితాలు మార్కెట్ వర్గాల అంచనాలను అందుకోలేకపోయాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2018-19)లో మూడో త్రైమాసికాని(అక్టోబరు-డిసెంబరు)కి కంపెనీ లాభం దాదాపు 30 శాతం తగ్గి రూ.3,610 కోట్లకు పరిమితమైంది. గత ఆర్థిక సంవత్సరం (2017-18) లో ఇదే కాలానికి లాభం రూ.5,129 కోట్లుగా నమోదైంది. 2018 డిసెంబరుతో ముగిసిన మూడు నెలల్లో ఇన్ఫోసిస్ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 20.3 శాతం వృద్ధి చెంది రూ .21,400 కోట్లకు చేరుకుంది. అంతక్రితం ఏడాదిలో ఇదే సమయానికి ఆర్జించిన ఆదాయం రూ.17,794 కోట్లుగా ఉంది. 2018-19లో స్థిర కరెన్సీ ఆధారిత రాబడి వృద్ధి అంచనాను 6-8 శాతం నుంచి 8.5-9 శాతానికి పెంచింది సంస్థ. నిర్వహణ మార్జిన్ అంచనాను మాత్రం యధాతథంగా (22-24 శాతం) కొనసాగించింది. స్థిర కరెన్సీ ఆధారంగా మూడో త్రైమాసికంలో కంపెనీ ఆదాయం రెండంకెల (10.1 శాతం) వృద్ధి నమోదు చేసుకుందని ఇన్ఫోసిస్ సీఈఓ, ఎండీ సలీల్ పరేఖ్ అన్నారు.

రూ.950 కోట్ల టర్నోవర్

- ఈ ఏడాదికి లివ్‌ఫాస్ట్ బ్యాటరీస్ లక్ష్యం
- మార్కెట్లోకి ఇన్వర్టర్ బ్యాటరీలు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆటోమోటివ్ బ్యాటరీలు, ఇన్వర్టర్ బ్యాటరీలు, ఇన్వర్టర్ల తయారీ సంస్థ లివ్‌ఫాస్ట్ బ్యాటరీస్ లిమిటెడ్.. స్టెబిలైజర్లు, సౌర ఆధారిత బ్యాటరీల్లోకి కార్యకలాపాలు విస్తరించేందుకు సిద్ధమవుతోంది. శుక్రవారం నాడిక్కడ తెలంగాణ, ఏపీ రాష్ట్రాల మార్కెట్లోకి కొత్త శ్రేణి ఇన్వర్టర్లను విడుదల చేసిన సందర్భంగా కంపెనీ సీఈఓ గురుప్రీత్ భాటియా మాట్లాడుతూ కార్యకలాపాల విస్తరణలో భాగంగా కొత్త ఉత్పత్తుల విభాగంలోకి అడుగుపెట్టాలని చూస్తున్నట్లు చెప్పారు. కాగా ఎలక్ట్రిక్ వాహనాలకు డిమాండ్ పెరుగుతూ వస్తుండటంతో లిథియం అయాన్ బ్యాటరీల తయారీలోకి అడుగుపెట్టాలనే యోచనలో ఉన్నట్లు భాటియా తెలిపారు. ఇప్పటికే ఇ-రిక్షాలకు సంబధించిన బ్యాటరీలను ఉత్పత్తి చేస్తున్నామని ఆయన చెప్పారు. ఇన్వర్టర్ బ్యాటరీ విభాగంలో మొత్తం 18 ఉత్పత్తులు ఉన్నాయని, వీటి ధరలు రూ.11,000 నుంచి రూ.15,000 వరకు ఉన్నాయని చెప్పారు. దేశీయంగా ఆటోమోటివ్, ఇన్వర్టర్ బ్యాటరీ మార్కెట్ సుమారు రూ.25,000 కోట్లుగా ఉందని, ఇందులో అసంఘటిత రంగం వాటానే అత్యధికంగా ఉందని ఆయన పేర్కొన్నారు. అయితే జీఎస్‌టీ కారణంగా సంఘటిత రంగంలోని కంపెనీలకు లబ్ధి చేకూరిందని చెప్పారు. ఇన్వర్టర్ బ్యాటరీ, ఆటోమోటివ్, ఇన్వర్టర్, ఇ-రిక్షా బ్యాటరీ మార్కెట్లో లివ్‌ఫాస్ట్ వాటా 15 శాతంగా ఉందని ఆయన తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ టర్నోవర్ రూ.950 కోట్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నట్లు భాటియా చెప్పారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నాటికి టర్నోవర్‌ను రూ.2,000 కోట్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

జీఎస్‌టీ పరిమితి పెంపుపై ఫిక్కీ హర్షం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): చిన్న, మధ్య స్థాయి వ్యాపార సంస్థలకు వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) పరిధిలోకి వచ్చే పరిమితిని పెంచడంపై ఫిక్కీ హర్షం వ్యక్తం చేసింది. చిన్న వ్యాపారులకు టర్నోవరు పరిమితిని జీఎస్‌టీ కౌన్సిల్ రూ.20 లక్షల నుంచి రూ.40 లక్షలకు పెంచింది. కౌన్సిల్ తీసుకున్న నిర్ణయాల్లో ఇది ఎంతో కీలకమైందని ఫిక్కీ ప్రెసిడెంట్ సందీప్ సొమానీ తెలిపారు. కాంపొజిషన్ స్కీము పరిధిలోకి వచ్చే సంస్థల వార్షిక టర్నోవరు పరిమితిని రూ.కోటి నుంచి రూ.1.5 కోట్లకు పెంచారు.

భారత్‌కు ఏడీబీ నిధులు పెంపు

2019కి రూ.31,500 కోట్లు

న్యూఢిల్లీ: ఈ ఏడాది (2019) భారత్‌కు ఇచ్చే ఫండింగ్‌ను 450 కోట్ల డాలర్ల (రూ.31,500 కోట్లు)కు పెంచనున్నట్టు ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ తెలిపింది. ఇందులో 350 కోట్ల డాలర్లు ప్రభుత్వంవైపు, 100 కోట్ల డాలర్లు ప్రైవేటు రంగానికి ఉంటుందని పేర్కొంది. భారత ఆర్థిక వ్యవస్థ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 7.3 శాతం వృద్ధిని సాధించే అవకాశం ఉందని, వచ్చే ఆర్థిక సంవత్సరంలో 7.6 శాతం వృద్ధిని నమోదు చేసుకోవచ్చని అంచనా వేసింది. పెట్టుబడులు పుంజుకోవడంతోపాటు జీఎస్‌టీ స్థిరత్వం వల్ల రాబడులు పెరగడానికి దోహదపడనున్నట్టు తెలిపింది. గత ఏడాదిలో 303 కోట్ల డాలర్ల సావరిన్ రుణాన్ని భారత్‌కు అందించేందుకు ఏడీబీ కమిట్‌మెంట్‌ను ఇచ్చింది. కాగా నిధులు అందించే అంశం ప్రాజెక్టుల సంసిద్ధతను బట్టి ఆధారపడి ఉంటుందని ఏడీబీ ఇండియా కంట్రీ డైరెక్టరేట్ కెనిచి యొకొయమా తెలిపారు. భారత్ రానున్నకాలంలో మరింత మెరుగ్గా వృద్ధిని నమోదు చేసుకునే అవకాశాలే కనిపిస్తున్నాయని ఏడీబీ సీనియర్ ఎకనామిక్స్ ఆఫీసర్ అభిజిత్ సేన్ గుప్తా తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధం (ఏప్రిల్-సెప్టెంబరు)లో భారత ఆర్థిక వ్యవస్థలో 7.6 శాతం వృద్ధి నమోదైంది. వస్తుసేవల పన్ను, పెద్ద నోట్ల రద్దు వంటి వాటి ప్రభావాలు తగ్గిపోయాయని, చమురు ధరల్లో తగ్గుదల గృహాల వ్యయాలు పుంజుకోవచ్చని ఏడీబీ చెబుతోంది.

బిగ్ 'సి' సంక్రాంతి ఆఫర్లు

హైదరాబాద్: ప్రముఖ మొబైల్ రిటైల్ విక్రయ సంస్థ బిగ్ 'సి'.. సంక్రాంతి సందర్భంగా వినూత్న ఆఫర్లు ప్రకటించింది. ఎంపిక చేసిన మొబైల్స్ కొనుగోళ్లపై విలువైన బహుమతులు అందజేయనున్నట్లు కంపెనీ ప్రతినిధి తెలిపారు. అంతేకాదు, తమ షోరూంలో మొబైల్ కొనుగోలు చేసేవారికి సున్నా శాతం వడ్డీతోపాటు డౌన్ పేమెంట్, ప్రాసెసింగ్ ఫీజు లేని రుణ సదుపాయం కల్పిస్తున్నామని అన్నారు. కంపెనీ సంక్రాంతి ఆఫర్లు..

- సామ్‌సంగ్ గెలాక్సీ జే6, జే6+, ఏ7 మోడళ్ల కొనుగోలుపై అన్ని ప్రముఖ బ్యాంకుల 10 శాతం క్యాష్‌బ్యాక్, బజాజ్ ఫైనాన్స్ ఈఎంఐ, టీవీఎస్ క్రెడిట్ వారి ఈజీ ఈఎంఐ.
- ఒప్పో ఎఫ్9 ప్రో కొనుగోలుపై రైస్ కుక్కర్ ఉచితం.
- అన్ని వివో మోడల్స్‌పై సర్‌ప్రైజ్ గిఫ్ట్.
- రూ.1590 విలువైన కార్బన్ కే3 బూమ్ మ్యాక్స్ కొనుగోలుపై రూ.2,500 విలువ చేసే పెడెస్టల్ ఫ్యాన్ ఉచితం.
- ప్రతి మొబైల్ కొనుగోలుపై ఖచ్చితమైన బహుమతి.

కర్ణాటక బ్యాంక్ లాభం రూ.140 కోట్లు

న్యూఢిల్లీ: మంగుళూరు కేంద్రంగా పని చేసే కర్ణాటక బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంలో రూ.140.41 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సం ఇదే కాలంతో పోలిస్తే ఇది 60.7 శాతం ఎక్కువ. వడ్డీ ఆదాయం పెరగడం బ్యాంక్‌కు బాగా కలిసొచ్చింది. గత ఆర్థిక సంవత్సరం (2017-18) మూడో త్రైమాసికంలో రూ.451.48 కోట్లున్న వడ్డీ ఆదాయం, ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.487.95 కోట్లకు పెరిగింది. ఇదే సమయంలో బ్యాంక్ స్థూల మొండి బకాయి (జీఎన్‌పీఏ)లు 3.96 శాతం నుంచి 4.45 శాతానికి, నికర ఎన్‌పీఏలు 2.85 శాతం నుంచి మూడు శాతానికి పెరిగాయి.

హెటెరో నుంచి బ్రెస్ట్ కేన్సర్ ఔషధం

న్యూఢిల్లీ: 'హర్‌టాబ్' బ్రాండ్ పేరుతో భారత మార్కెట్లోకి మరో బ్రెస్ట్ కేన్సర్ జనరిక్ టాబ్లెట్లు విడుదలయ్యాయి. హైదరాబాద్‌నకు చెందిన ఔషధ సంస్థ హెటెరో.. 250 ఎంజీ డోసేజ్‌లో ఈ టాబ్లెట్లను విడుదల చేసింది. ఈ టాబ్లెట్ల జనరిక్ పేరు 'లపాటినిబ్'. కేప్‌సిటాబిన్ లేదా లెట్రోజోల్ మందులతో కలిపి ఈ టాబ్లెట్లను వాడితే తుది దశలో ఉన్న బ్రెస్ట్ కేన్సర్ రోగుల్లోనూ కేన్సర్ కణాల ఎదుగుదల తగ్గుతుందని తెలిపింది. హెటెరో హెల్త్‌కేర్ లిమిటెడ్ ద్వారా కంపెనీ 'హర్‌టాబ్' బ్రాండ్ జనరిక్ టాబ్లెట్లను మార్కెట్ చేస్తుంది

పిరామల్ ఎంటర్‌ప్రైజెస్ రూ.5,000 కోట్ల సమీకరణ

ముంబై: అజయ్ పిరామల్ సారథ్యంలోని పిరామల్ ఎంటర్‌ప్రైజెస్ కంపెనీ, దీర్ఘకాలిక రుణ పత్రాల (బాండ్స్) జారీ ద్వారా గత నెల రోజుల్లో రూ.5,000 కోట్లు సమీకరించింది. సగటున 9.5 శాతం వడ్డీ ఉండే ఈ రుణ పత్రాలను, బ్యాంకులు, మ్యూచువల్ ఫండ్ సంస్థలే ఎక్కువగా కొనుగోలు చేసినట్టు కంపెనీ తెలిపింది. ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ ఆర్థిక సంక్షోభం తర్వాత ఎన్‌బీఎఫ్‌సీ కంపెనీల్లో మదుపు చేసేందుకు ఇన్వెస్టర్లు వెనుకాడుతున్నారు. అయినా పిరామల్ ఎంటర్‌ప్రైజెస్ కంపెనీ ఇంత భారీ మొత్తంలో నిధులను బాండ్స్ ద్వారా సేకరించడం విశేషం. ఇదే సమయంలో పిరామల్ గ్రూపునకే చెందిన పిరామల్ క్యాపిటల్ అండ్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ బాండ్స్ జారీ ద్వారా, మరో రూ.4,000 కోట్లు సమీకరించింది.

ఎవరెడీలో ప్రమోటర్ల వాటా అమ్మకం

కోల్‌కతా: ఎవరెడీ ఇండస్ట్రీస్ ఇండియా లిమిటెడ్ (ఈఐఐఎల్) ఈక్విటీలో కొంత వాటాను వ్యూహాత్మక భాగస్వాములకు అమ్మేందుకు బీఎం ఖైతాన్ నాయకత్వంలోని విలియంసన్ మగర్ గ్రూపు సిద్ధమైంది. ఇందుకోసం కోటక్ మహీంద్ర బ్యాంక్‌ను సలహాదారుగా నియమించింది. ఈఐఐఎల్ ప్రధానంగా డ్రై సెల్ బ్యాటరీలు, ఫ్లాష్‌లైట్లు తయారు చేస్తుంది. ఖైతాన్‌లకు ప్రస్తుతం ఈఐఐఎల్ ఈక్విటీలో 45 శాతం వాటా ఉంది. గత ఆర్థిక సంవత్సరం రూ.1,450 కోట్లున్న ఈఐఐఎల్ టర్నోవర్, ఈ ఆర్థిక సంవత్సరం రూ.1,600 కోట్లకు చేరుతుందని అంచనా. ఎవరెడీ ఈక్విటీలో తమ వాటాను పూర్తిగాకాకుండా కొంత మాత్రమే వ్యూహాత్మక భాగస్వామికి విక్రయిస్తామని విలియంసన్ మగాన్ గ్రూపు స్పష్టం చేసింది.

మార్కెట్లకు 'టీసీఎస్' దెబ్బ

రెండో రోజూ నష్టాల్లోనే ముగింపు




ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో రోజు నష్టాల్లోనే ముగిశాయి. మార్కెట్ నష్టాలకు దేశీయ ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) కారణమైంది. తృతీయ త్రైమాసికంలో టీసీఎస్ పనితీరు అంచనాలకు భిన్నంగా ఉండటం మార్కెట్లపై ప్రభావం చూపించింది. మార్కెట్లు ఆరంభంలో గరిష్ఠ స్థాయిలో ప్రారంభమైనప్పటికీ ఆ తర్వాత ఆ జోరును నిలబెట్టుకోలేకపోయాయి. కార్పొరేట్ ఆర్థిక ఫలితాలు ఆశించిన స్థాయిలో ఉండకపోవచ్చన్న అంచనాలతో ఇన్వెస్టర్లు అమ్మకాలకు మొగ్గుచూపారని మార్కెట్ విశ్లేషకులు తెలిపారు. శుక్రవారం నాడు బీఎస్ఈ సూచీ సెన్సెక్స్ తొలుత 36191.87 పాయింట్లతో పటిష్ఠంగా ప్రారంభమైనప్పటికీ మధ్యాహ్నం కల్లా అమ్మకాల ఒత్తిడికి లోనయి చివరకు 99.66 పాయింట్ల (0.27 శాతం) నష్టంతో 36009.84 పాయింట్ల వద్ద స్థిరపడింది. మరోవైపు ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ కూడా 26.55 పాయింట్ల నష్టంతో 10794.95 వద్ద క్లోజైంది. వీక్లీ ప్రాతిపదికన చూస్తే సెన్సెక్స్ 314.74 పాయింట్లు లాభపడగా నిఫ్టీ 67.60 పాయింట్లు పెరిగింది. గురువారం నాడు మార్కెట్ ముగిసిన తర్వాత టీసీఎస్ ప్రకటించిన త్రైమాసిక ఫలితాలు మార్కెట్ అంచనాలను అందుకోకపోవటం దెబ్బతీసిందని సెంట్రమ్ బ్రోకింగ్ తెలిపింది. ఇదే సమయంలో రూపాయి నష్టాల్లో సాగటం, బ్యారెల్ ముడి చమురు ధరలు 62 డాలర్లకు చేరుకోవటం కూడా మార్కెట్లపై ప్రభావం చూపించిందని పేర్కొంది. గురువారం నాడు విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు రూ.344.58 కోట్ల షేర్లను విక్రయించగా దేశీయ సంస్థాగత పెట్టుబడిదారులు (డీఐఐ) రూ.10.98 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేసినట్లు బీఎస్ఈ గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

- ఇండస్‌ఇండ్ బ్యాంక్, టాటా మోటార్స్, యస్ బ్యాంక్, ఎల్ అండ్ టీ 3.26 శాతానికి పైగా నష్టపోయాయి.
- ఐటీసీ, ఓఎన్‌జీసీ, వేదాంత లిమిటెడ్, ఇన్ఫోసిస్, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ దాదాపు 2.02 శాతానికి పైగా లాభపడిన వాటిల్లో ఉన్నాయి.

నష్టాల్లో టీసీఎస్ షేరు

తృతీయ త్రైమాసికంలో టీసీఎస్ ఆర్థిక ఫలితాలు ఆకట్టుకోకపోవటంతో శుక్రవారం కంపెనీ షేరు ఆరంభం నుంచే నష్టాల్లో సాగింది. బీఎస్ఈలో రోజంతా డౌన్‌ట్రెండ్‌లో టీసీఎస్ షేరు ఒక దశలో 2.75 శాతం మేర నష్టపోయి రూ.1,836.10 స్థాయిని తాకింది. చివరకు 2.45 శాతం నష్టంతో రూ.1,841.95 వద్ద క్లోజైంది. కాగా ఎన్ఎస్ఈలో కూడా టీసీఎస్ షేరు 2.38 శాతం నష్టపోయి రూ.1,843.45 వద్ద క్లోజైంది. బీఎస్ఈలో 5.31 షేర్లు ట్రేడవగా ఎన్ఎస్ఈలో 92 లక్షల షేర్లు చేతులు మారాయి.

ఎన్ఎస్ఈ చైర్మన్ చావ్లా రాజీనామా



న్యూఢిల్లీ: నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) బోర్డు చైర్మన్ అశోక్ చావ్లా శుక్రవారం తన పదవికి రాజీనామా చేశారు. ఎయిర్‌సెల్-మ్యాక్సిస్ కేసులో చావ్లాను విచారించేందుకు సీబీఐకి కేంద్రం అనుమతిచ్చిన కొన్ని గంటలకే ఆయన రాజీనామా చేయడం గమనార్హం. చట్టపరమైన తాజా పరిణామాల నేపథ్యంలోనే ఆయన రాజీనామా చేశారన్న ఎన్ఎస్ఈ.. పూర్తి వివరాలు మాత్రం వెల్లడించలేదు. మాజీ ఐఏఎస్ అధికారి అయిన చావ్లా గతంలో పలు ప్రభుత్వ శాఖల్లో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ఆర్థిక శాఖ, పౌరవిమానయన శాఖల కార్యదర్శిగా, కాంపిటీషన్ కమిషన్ ఇండియా(సీసీఐ) చైర్మన్‌గా పనిచేశారు. 2016 మార్చి 28న చావ్లా ఎన్ఎస్ఈ బోర్డు పగ్గాలు చేపట్టారు. యెస్ బ్యాంక్ బోర్డుకూ చైర్మన్‌గా వ్యవహరించిన చావ్లా ఈమధ్యనే రాజీనామా చేశారు.

కియా మోటార్స్‌తో యెస్ బ్యాంక్ జట్టు

న్యూఢిల్లీ: ఫైనాన్స్‌తోపాటు బ్యాంకింగ్ సొల్యూషన్లు అందించేందుకుగాను కియా మోటార్స్‌తో ప్రైవేటు రంగంలోని యెస్ బ్యాంక్ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ రెండింటి మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం మేరకు కియా కారు డీలర్లకు ఫైనాన్స్, బ్యాంకింగ్ సొల్యూషన్లను యెస్ బ్యాంక్ అందిస్తుంది. వీటిలో టర్మ్ లోన్లు, క్యాష్ క్రెడిట్, ఇన్వెంటరీ ఫండింగ్ ఉంటాయి. కస్టమర్లకు కూడా రుణాన్ని అందిస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో తన ప్లాంట్‌ను ఏర్పాటు చేసిన కియా మోటార్స్ ఈ ఏడాదిలోనే తన కార్లను మార్కెట్లోకి తీసుకురాబోతోంది.

టాటా మోటార్స్ గ్రూప్ అమ్మకాల్లో 14 % క్షీణత

న్యూఢిల్లీ: గత డిసెంబరు నెలలో ప్రపంచవ్యాప్తంగా గ్రూప్ అమ్మకాలు (జాగ్వార్ లాండ్ రోవర్ కలిపి) 13.9 శాతం మేర తగ్గి 1,00,551 యూనిట్లకు చేరుకున్నట్టు టాటా మోటార్స్ తెలిపింది. 2017 డిసెంబరులో గ్రూప్ అమ్మకాలు 1,16,677 యూనిట్లుగా ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా మొత్తం టాటా ప్యాసెంజర్ వాహనాల హోల్‌సేల్స్ గత డిసెంబరులో అంతకు ముందు ఏడాది ఇదే నెలతో పోల్చితే 14 శాతం తగ్గి 59,898 యూనిట్లకు చేరాయి. జెఎల్ఆర్ 14,088 వాహనాలను, లాండ్‌రోవర్ 31,386 వాహనాలను విక్రయించాయి.

పెరిగిన విదేశీ మారక నిల్వలు

ముంబై: భారత్ విదేశీ మారక నిల్వలు మరింతగా పెరిగాయి. జనవరి 4వ తేదీతో ముగిసిన వారంలో విదేశీ మారక నిల్వలు 268 కోట్ల డాలర్లు పెరిగి 39,608.4 కోట్ల డాలర్లకు చేరుకున్నాయి. కరెన్సీ ఆస్తులతోపాటు బంగారం నిల్వలు పెరగడం వల్ల మొత్తం నిల్వలు పెరిగే అవకాశం ఏర్పడినట్టు భారత రిజర్వు బ్యాంక్ తెలిపింది. క్రితం వారంలో విదేశీ మారక నిల్వలు 11.64 కోట్ల డాలర్లు పెరిగాయి. సమీక్షా వారంలో బంగారం నిల్వల విలువ 46.55 కోట్ల డాలర్లు పెరిగి 2,168.9 కోట్ల డాలర్లకు చేరుకుంది. 2018 జూన్‌తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో ఆర్‌బీఐ 8.46 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేసింది. ప్రస్తుతం ఆర్‌బీఐ వద్ద 566.23 టన్నుల బంగారం ఉంది. ఇక అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) వద్ద భారత్ స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ 146.26 కోట్ల డాలర్లకు తగ్గాయి.

'సుప్రీం' మాజీ న్యాయమూర్తి పర్యవేక్షణలో ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ ఆస్తుల విక్రయం!

ఎన్‌సీఎల్ఏటీ సూచన



న్యూఢిల్లీ: సంక్షోభంలో కూరుకుపోయిన ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ ఆస్తుల బదలాయింపు, విక్రయానికి సంబంధించిన అన్ని ప్రొసీడింగ్స్.. సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి పర్యవేక్షణలో కొనసాగాలని నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్ఏటీ) సూచించింది. కంపెనీని ఆర్థిక కష్టాల నుంచి బయటపడేసేందుకు ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ నూతన యాజమాన్యం ఆస్తుల విక్రయ అంశాన్ని పరిశీలిస్తున్న సంగతి తెలిసిందే. బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ దాదాపు రూ.90,000 కోట్ల మేర రుణాలను చెల్లించాల్సి ఉంది. ఐఎల్ అండ్ ఎఫ్ఎస్‌కు పరిష్కారం కనుగొనేందుకు కార్పొరేట్ ఇన్‌సాల్వెన్సీ రిజల్యూషన్ ప్రక్రియ తరహాలోనే ఆస్తుల మదింపు, బదలాయింపును చేపట్టాల్సి ఉందని జస్టిస్ ఎస్‌జే ముఖోపాధ్యాయ సారథ్యంలోని ఇద్దరు న్యాయమూర్తుల బెంచ్ సూచించింది. ఇందులో భాగంగానే ఐఎల్ అండ్ ఎఫ్ఎస్‌కు సం బంధించిన ఆస్తుల మదింపు, బదలాయింపును పర్యవేక్షించేందుకు సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తిని నియమించాలని ప్రభుత్వానికి, సంస్థకు ఎన్‌సీఎల్ఏటీ బెంచ్ సూచించింది. ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ గ్రూప్‌లో దాదాపు 348 అనుబంధ సంస్థలున్నాయి. కాగా ఈ అనుబంధ సంస్థలకు సంబంధించిన అన్ని ఆర్బిట్రేషన్ ప్రొసీడింగ్స్‌తోపాటు అన్ని వివరాలను ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ అందజేయాలని బెంచ్ ఆదేశించింది. ఈ నెల 25న ఈ కేసులో తదుపరి విచారణను చేపట్టనున్నట్లు తెలిపింది.

సంక్షిప్తంగా...

ఆంధ్రా బ్యాంకు

ఆంధ్రా బ్యాంకు ఎంప్లాయీ స్టాక్ పర్చేజ్ స్కీమ్‌కు బ్యాంకు డైరెక్టర్ల కమిటీ ఆమోదం తెలిపింది. అర్హులైన ఉద్యోగులు ఫిబ్రవరి 11 నుంచి 20 వరకూ షేర్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. కమిటీ నిర్ణయానికి ముందు రెండు వారాలు ఎన్ఎస్ఈలో వ్యాల్యూమ్ వెయిటెడ్ సగటు ధర ఆధారంగా 25 శాతం తక్కువకు ఉద్యోగులకు షేర్లను కేటాయిస్తారు.

క్రెబ్స్ బయోకెమికల్స్

రైట్స్ ఇష్యూ ద్వారా 28.86 లక్షల షేర్లను వాటాదారులకు జారీ చేయడానికి క్రెబ్స్ బయోకెమికల్స్ బోర్డు ఆమోదం తెలిపింది. రూ.10 ముఖ విలువ కలిగిన షేరును రూ.76 ప్రీమియంతో రూ.86 కేటాయిస్తారు.

డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్

హైదరాబాద్‌కు చెందిన ఫార్మా దిగ్గజం డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాలను ఫిబ్రవరి ఒకటిన ప్రకటించనుంది.

బీఎస్ఈలో తెలుగు రాష్ట్రాల కంపెనీల షేర్లు

ACI INFOCOM .65(.65)4
ADITYA SPIN. 7(6.72)326
AGRO TECH FO 600.25(610.3)8422
AISHWARYA TE 2.8(2.86)1014
ALPHAGEO (I) 464(456.8)343
ALU FLUORIDE 119.35(119.4)4362
AMAR RAJA BA 756.1(757.7)36142
ANDHRA BANK 29.5(29.55)10050
ANDHRA CEMEN 5.86(5.9)1625
ANDHRA PETRO 65.45(68.75)141919
ANJANI PORTL 126.5(124.1)1782
ASTRA MICRO 83.45(80.8)103452
AUROB.PHARMA 769.8(775.7)1467469
AVANTEL LTD 231.05(232.3)229
AVANTI FEEDS 376.2(378.45)15241
B.N.RATHI SE 26.45(25.65)1409
BALAJI AMINE 441.9(447.3)1556
BAMBINO AGRO 198.75(190)1106
BARTRONICSIN 7.3(7.37)29276
BCG 3.32(3.28)395185
BHAGIRA.CHEM 427.1(435)2346
BHAGYA INL 34.95(33.8)5365
BHARATFIN 965.7(990.8)23565
BNR UDYOG 15.91(15.6)10
CAMBRIDGE 43.9(44.85)788
CCHHL 7.4(7.56)2120
CCL PRODUCTS 268.9(268.65)582
CELESTIAL 8.24(8.52)2505
CIL SECURITS 17.7(16.25)515
COROM INTER 462.9(460.85)2545
CUBEX TUBING 14.12(14.8)1529
CYBERMATE 2.14(2.14)12092
CYIENT 596(605.35)9140
DANLAW TECH. 103.65(100.45)2139
DECAN CEMENT 390.05(385.5)255
DIAMONPOWER 1.44(1.51)8450
DIVI'S LAB. 1504.35(1516.25)42304
DIVYA.GRANIT 84.4(82.05)207
DQ ENT 8.3(8.05)3930
DR.REDDY'S 2589.8(2599.55)14885
EMPEE SUGARS 1.31(1.37)1041
EVEREST ORG. 115.1(115.5)1130
FACOR ALLOYS 1.94(1.97)81457
GATI LTD. 81.4(82.6)32005
GAYATRI BIO 2.82(2.94)1
GAYATRI PROJ 171.8(173.3)1690
GENNEX LAB 3.61(3.65)74626
GMR INFRASTR 16.7(16.75)793946
GODAVARI DRU 22.7(23)3068
GOLDSTONE EN 15.65(15.95)1700
GRANULES (I) 89.85(90.15)17087
GVK POWERINF 7.7(7.74)120845
HBL P SYS 28.3(28.8)5539
HERITGFOOD 520.8(521.95)719
HIND.FLUROCA 15.65(16.35)22
INCAP LTD. 40(39)2407
IPAPPM 450.9(457)4175
IVRCL LTD .99(1.02)76294
KAKATIYA CEM 195.95(198.85)4743
KALLAM 18.65(18.7)7704
KAVERI SEED 557.4(556.4)23485
KCP LTD 89.85(91.05)1877
KERNEX MICRO 24.4(23.25)2042
KNR CONST 214.45(216.15)16025
KREBS BIOCHM 110.35(108.05)1
LOKESH MACH 45.2(45.65)2942
LOTUS CHOC 23.55(24.1)1919
MADHUCON PRJ 6.63(6.92)1066
MOLD-TEK TEC 44(45)306
MOSCHIP SEMI 23.95(23.4)11028
MSR INDIA 11.77(11.21)1875
N C L IND. 129.25(132.75)2806
NACLIND 27.9(27.9)1150
NATCO PHARM 687.35(685.55)5433
NCC 92.15(92.75)1227593
NEHA INTER. 4.2(4.15)1804
NETTLINX LTD 51.8(51.8)22825
NEULAND LAB. 510.75(503.75)1078
NIHAR INFO 13.99(14.2)1820
NILE LTD. 371.7(372.65)2144
NTL 1.2(1.15)101
OIL COUNTRY 15.7(15.65)1192
OLECTRA 227.35(227.35)11303
PADMALAYA TE 2.45(2.39)1776
PALRED 40.4(42.1)2130
PANYAM CEMEN 13.3(13.58)2574
PENNAR STEEL 39.6(40.9)31239
PITTIENG 64.25(66.65)8649
POKARNA LTD 156.35(155.4)946
PRAJAY ENGS. 8.52(8.7)2004
PREMIER EXPL 236.95(234.5)71
PRSMJOHNSN 86(88)21816
RAIN 116.75(117)42197
RAJ PACKAGIN 27(26.65)1059
REG.CERAMIC 4.29(4.09)1200
RESTILE CER. 3.67(3.75)1482
SAGAR CEM. 642.7(663.25)123
SAMKRG PIST. 190.25(189.25)1696
SANGHI IND. 60.2(60.5)3772
SATVAH.ISPAT 9.21(9.36)9035
SAVEN TECHNO 29.9(28.95)22192
SIBAR AUTO 34.5(34.2)11
SMPL .42(.4)18620
SMS PHARMACE 72.15(70.55)4141
SREE RAYALA 159.55(163.5)1295
STEEL EXCH 14.6(14.65)962
SURANATP 4.61(4.75)516
SURYACHAKRA .34(.35)26725
SURYAMBA SP 70(70.2)220
SURYAVA SPIN 5.2(4.97)10
SURYLAK.COTT 43(42)556
SUVEN LIFE S 224.4(227.1)19024
TAJ GVK HOTL 181.55(180.75)4806
TANLA 30.15(30.3)102705
TRANSCORP IN 22.1(22.8)3915
TRANSGENE BI 4.27(4.07)99584
TRANSPORT CO 303.35(290.9)5372
USHER AGRO 2.2(2.1)3540
VICEROY HOTE 4.75(4.81)35265
VIJAY TEXTIL 44.85(43)775
VIMTA LABS 300.3(274)53088
VIRAT CRANE 35.95(35.95)3101
VIRINCHI 80.9(83.1)12271
VISAKA IND. 439.25(434.75)1568
VISTA PHARMA 27.75(27.2)8345
VIVIMED LABS 34.5(34.55)4906
VST INDUS. 3189.5(3170.85)34
WATERBASE 159.75(161.6)31332
XLENERGY 1.05(1)10
ZEN TECH 75.85(74.05)3885
ZENOTECH 35.3(35.5)757

ఎన్ఎస్ఈ-500


షేర్ల ప్రస్తుత, క్రితం ముగింపు ధరలు, వాణిజ్య పరిమాణం వరుసగా

AARTIDRUGS 605.6(590.8)45435
AARTIIND 1549.7(1546.05)83224
ABAN 75.6(74.25)1344460
ABB 1345.6(1300.6)161056
ABFRL 207.25(212)414801
ABGSHIP 1.95(1.9)10914
ACC 1458.65(1447.8)337374
ADANIENT 151.5(151.1)2254999
ADANIPORTS 377.15(380.25)1829555
ADANIPOWER 50.25(50.5)2933044
ADANITRANS 221.4(215.85)578471
AEGISCHEM 209.95(210.25)76241
AHLUCONT 321.35(321.65)7036
AIAENG 1659.3(1671.1)196617
AJANTPHARM 1159.75(1162.85)141511
AKZOINDIA 1725.45(1747)2121
ALBK 44.55(45.85)4743866
ALLCARGO 110.1(110.2)114778
ALOKTEXT 3.75(3.8)1697706
AMARAJABAT 755.45(755.1)547214
AMBUJACEM 212.85(213.15)1279076
ANANTRAJ 34.85(35.05)312834
ANDHRABANK 29.45(29.6)369369
APARINDS 615.8(625.6)31477
APLLTD 590.3(591.3)21437
APOLLOHOSP 1292.7(1285.4)467514
APOLLOTYRE 225.95(227.25)870820
ARVIND 97.55(98.3)8434749
ASHIANA 118.8(119.55)27604
ASHOKA 130.7(133.4)95270
ASHOKLEY 94.3(95)14986175
ASIANPAINT 1403.65(1396.35)473391
ASTRAL 1174.35(1184.95)17674
ASTRAZEN 1647.2(1573.25)64841
ATUL 3446(3474.9)9620
AUROPHARMA 769.85(776.95)2470794
AXISBANK 666.5(663.25)8330315
BAJAJ-AUTO 2720.95(2725.3)259834
BAJAJCORP 386.6(383.9)219342
BAJAJELEC 484.05(488.25)89920
BAJAJFINSV 6371.65(6371.95)122432
BAJAJHIND 9.2(9.2)1951680
BAJAJHLDNG 3007.35(2969.95)8073
BALKRISIND 886.65(889.1)362890
BALLARPUR 5.45(5.4)2285749
BALMLAWRIE 196.25(197.25)23687
BALRAMCHIN 111.1(109.9)3263233
BANKBARODA 121.15(123.45)13442566
BANKINDIA 103.25(106.1)9438958
BASF 1503.45(1518.55)4472
BATAINDIA 1153.8(1165.5)603904
BBTC 1285.4(1293.35)57015
BEML 891.75(906.7)1468979
BERGEPAINT 325.2(323.9)583955
BFUTILITIE 223.35(226.6)176802
BGRENERGY 60.55(61)16791
BHARATFIN 966.15(990.5)679342
BHARATFORG 481.65(482.35)944881
BHARTIARTL 335.1(337.3)5337767
BHEL 68.55(68.85)7359392
BIOCON 642.5(630.45)1775791
BIRLACORPN 559.15(564.1)16399
BLISSGVS 167.45(167.8)549885
BLUEDART 3252.65(3286.85)2050
BLUESTARCO 609.9(614.65)8119
BOMDYEING 118.15(115.6)1718068
BOSCHLTD 19517.8(19704)11700
BPCL 337.3(335.6)2334810
BRFL 9.3(9.35)44032
BRIGADE 204.55(206.05)41314
CADILAHC 348.3(350)891386
CANBK 278.25(281.05)3039547
CARERATING 1008.85(1013.9)39625
CASTEXTECH 1.2(1.2)214218
CASTROLIND 151.95(151)592572
CCL 269.45(269.3)23579
CEATLTD 1266.85(1265.7)230764
CENTRALBK 36.45(36.1)476162
CENTURYPLY 185(184.55)377173
CENTURYTEX 893.7(890.5)434729
CERA 2535.2(2609.85)2923
CESC 682.05(658.4)1138245
CHAMBLFERT 168.8(163.7)730869
CHENNPETRO 261.2(267.55)459501
CHOLAFIN 1182.15(1194.4)165040
CIPLA 510.2(513.25)2051418
CLNINDIA 406.15(404.35)5958
COALINDIA 232.25(233)2446815
COLPAL 1319.45(1325.9)180499
COROMANDEL 461.65(461.55)71367
CORPBANK 28.7(28.9)97303
COX&KINGS 170(172.05)77735
CRISIL 1649.3(1649.1)9797
CUB 190.75(192.15)566681
CUMMINSIND 843.4(854.75)300970
CYIENT 594.35(606.4)218671
DABUR 421.65(421.15)929656
DBCORP 174.35(177.2)58529
DBREALTY 27.65(29.1)141126
DCBBANK 178.75(177.5)1594854
DCMSHRIRAM 352.35(353.25)23259
DEEPAKFERT 143.65(145.3)113303
DELTACORP 259(258.15)1686929
DEN 70.2(70.2)116010
DENABANK 13.7(13.75)1687735
DHANUKA 431.35(423.85)8772
DHFL 222.45(224.1)3626974
DISHTV 40(39.65)5137486
DIVISLAB 1505.15(1520.45)1149372
DLF 182.15(183.55)4565679
DREDGECORP 453.85(444.5)828983
DRREDDY 2588.15(2600.4)316787
DYNAMATECH 1498.65(1500.25)120
ECLERX 1069.6(1082.2)1519
EDELWEISS 177.45(179.4)1127513
EICHERMOT 20507.6(20556.1)112220
EIDPARRY 224.3(224.95)65272
EIHOTEL 184.3(187.1)38984
ELECTCAST 21.1(21)93244
ELGIEQUIP 261.05(252.5)72797
EMAMILTD 433.05(423.55)348976
ENGINERSIN 123.35(125.45)1074106
EROSMEDIA 84.65(84.2)270465
ESCORTS 753.55(744.65)1539622
ESSDEE 18.6(19.55)44109
ESSELPACK 107.9(107.55)522735
EVEREADY 205(181.7)5420085
EXIDEIND 259.8(261.25)480704
FCONSUMER 44(42.9)1932351
FDC 172.7(174.1)19061
FEDERALBNK 95.4(95.65)4428970
FINCABLES 449.55(449.45)16816
FINPIPE 536.1(535.9)15341
FLFL 390.05(390.2)12247
FORTIS 139.9(139.95)297526
FSL 48.65(47.05)2686212
GAIL 338.6(343.9)2535455
GATI 81.5(82.7)234146
GDL 115.35(116.25)57097
GEPIL 824.6(813.5)4592
GESHIP 320.95(324.95)46930
GET&D 311(312.2)24791
GILLETTE 6499(6495.6)3106
GLAXO 1484.05(1483)12593
GLENMARK 651.3(667.85)1007280
GLOBOFFS 13.75(13.55)13124
GMDCLTD 87.1(87.75)45985
GMRINFRA 16.7(16.75)10788251
GODFRYPHLP 908.25(891.25)227483
GODREJCP 778.95(779.5)483902
GODREJIND 539.95(543.25)966788
GODREJPROP 729.1(735.35)92765
GPPL 91.85(93.4)89247
GRANULES 90.1(90.55)338496
GREAVESCOT 120.55(122)343227
GREENPLY 138(143.5)98450
GRINDWELL 555(551.7)6133
GRUH 242.25(240.55)8638591
GSFC 111.65(112.65)983920
GSKCONS 7486.3(7524.4)6866
GSPL 171.4(170.05)71584
GUJFLUORO 948.7(953.25)42841
GUJGASLTD 669.65(669.7)14952
GULFOILLUB 835.45(842.35)4879
GVKPIL 7.7(7.7)664368
HATHWAY 31.05(31.1)549202
HAVELLS 688.05(688.05)526760
HCC 12.85(13.4)7546809
HCL-INSYS 24.75(24.85)447125
HCLTECH 940.05(935.85)2165684
HDFC 1991.4(1980.1)1814132
HDFCBANK 2111.9(2108.5)1602010
HDIL 27(28.05)4885239
HEIDELBERG 146.4(149.8)54636
HEROMOTOCO 2899.25(2919.5)258996
HEXAWARE 325.15(320.35)2309306
HFCL 24.7(23.15)13302049
HIMATSEIDE 214.3(211.1)22329
HINDALCO 205.85(204)13314252
HINDCOPPER 49.45(49.2)449836
HINDPETRO 233.5(232.9)3189561
HINDUNILVR 1769.4(1786.2)1113837
HINDZINC 273.5(275.95)131281
HMT 19.5(19.45)1910
HMVL 128.6(129.35)24841
HONAUT 21873.2(21938.2)537
HOTELEELA 15.1(15.15)107649
HSIL 245.5(246.8)62290
HTMEDIA 48.05(46.9)1270141
IBREALEST 87.65(88.7)1178414
IBULHSGFIN 816.15(814.25)2607668
ICICIBANK 378.55(379.5)12537973
ICRA 3189.65(3196.45)158
IDBI 63.35(62.7)2772598
IDEA 36.9(37.1)8296822
IDFC 42(42.95)4848665
IFBIND 841.1(832.8)2744
IFCI 14.55(14.65)2256972
IGARASHI 548.35(548.35)5124
IIFL 475.9(475.85)22228
IL&FSTRANS 11.2(11.55)654186
INDHOTEL 140.55(141.3)201340
INDIACEM 87.2(88.1)4060524
INDIANB 253.6(251.65)1032376
INDOCO 220.25(219.8)25142
INDUSINDBK 1515.15(1565.9)3180775
INEOSSTYRO 676.35(688.35)2774
INFRATEL 277.2(285.05)3840134
INFY 683.5(679.7)12281903
INGERRAND 586.05(577.8)6959
INOXLEISUR 249.95(250.1)37192
INOXWIND 74.65(75)24789
INTELLECT 219.85(220.4)91588
IOB 14.55(14.7)360567
IOC 131.2(129.9)7589370
IPAPPM 451.75(457.1)17753
IPCALAB 780.5(782.1)107209
IRB 157.3(157.35)791293
ITC 295.35(289.6)16773035
J&KBANK 36.3(36.7)1311514
JAGRAN 115.2(115.85)63885
JAICORPLTD 111.3(111.25)657115
JBCHEPHARM 300.45(300.65)15488
JBFIND 21.8(21.85)30176
JCHAC 1764.8(1752.7)610
JETAIRWAYS 253.65(242.8)8275325
JINDALPOLY 240.15(240.05)14762
JINDALSTEL 148.8(149.7)9703598
JISLJALEQS 66.9(67.65)3322932
JKCEMENT 700.15(704.65)15227
JKIL 127.15(129.05)321135
JKLAKSHMI 288(295.8)67404
JKTYRE 101(101.7)268730
JMFINANCIL 90.55(88.1)297005
JPASSOCIAT 7.35(7.4)6429877
JPINFRATEC 3.7(3.8)549497
JPPOWER 2(2.05)1893679
JSWENERGY 70.05(69.9)360050
JSWHL 2684.25(2776.15)2521
JUBILANT 729.35(716.95)207255
JUBLFOOD 1237.6(1233.8)1251272
JUSTDIAL 476.65(490.65)1515762
JYOTHYLAB 198.55(201.95)42457
KALPATPOWR 380.8(380.4)29359
KANSAINER 448.65(449.45)64992
KEC 284(288.85)113439
KESORAMIND 81.95(82.15)133284
KIRLOSENG 198.15(200.05)7735
KITEX 109.9(110.4)32286
KOLTEPATIL 258.35(262.45)55461
KOTAKBANK 1223.2(1219.55)2129299
KPIT 210.75(205.25)1514160
KRBL 326.15(292.5)1363842
KSCL 556.8(556.9)399300
KSK 1.55(1.55)732999
KTKBANK 116.1(115.3)11964442
KWALITY 7.85(7.9)885932
L&TFH 141.5(144.3)4639398
LAKSHVILAS 79(79.25)257351
LAOPALA 217.5(216.25)40303
LAXMIMACH 5718.65(5742.65)744
LICHSGFIN 484.1(483.45)856388
LT 1369.6(1392.6)2489197
LUPIN 839.35(838)824260
M&M 727.9(733.2)2215240
M&MFIN 453.05(459.5)1212845
MAGMA 107.8(107.45)62682
MAHINDCIE 239.05(242)29701
MAHLIFE 380.65(389.05)28807
MANAPPURAM 99.1(98.75)2399163
MANPASAND 84.55(85.5)148333
MARICO 381.45(387.1)1498377
MARKSANS 27.8(28.1)569845
MARUTI 7320.5(7391.6)488399
MAYURUNIQ 396.4(393.95)5692
MCLEODRUSS 113.75(112.95)238853
MERCK 3299.2(3347.9)17181
MHRIL 212.75(214.25)199388
MINDACORP 150.05(151.05)47265
MINDTREE 832(812.25)2625463
MMTC 29.5(29)1079545
MOIL 168.05(167.3)63811
MONSANTO 2584.9(2602.8)2178
MOTHERSUMI 161.2(161.95)3927095
MOTILALOFS 688.35(686.4)39131
MPHASIS 899.15(903.55)246122
MRF 66937.25(66700.7)2580
MRPL 70.6(71)699610
MTNL 15.15(15.3)880082
MUTHOOTFIN 537.95(524.55)1436280
NATCOPHARM 689.65(685.7)90058
NATIONALUM 63.2(62.75)1962907
NAUKRI 1595.55(1586)192116
NAVKARCORP 52.6(50.2)752977
NCC 92.15(92.7)14082105
NETWORK18 39.7(39.9)146998
NHPC 25.5(25.55)1127738
NIITTECH 1162.05(1151.95)536949
NITINFIRE 1.8(1.75)34210
NLCINDIA 67.1(67.35)197394
NMDC 92.2(91.1)4129100
NTPC 148(148.1)11316608
OBEROIRLTY 452.4(460.05)99363
OFSS 3637.35(3635.6)10849
OIL 174.55(173.75)558581
OMAXE 212.75(212.9)325592
ONGC 144.65(143.25)7665486
ORIENTBANK 97.6(99)3364603
ORIENTCEM 76.6(78.55)87739
ORISSAMINE 921.8(905.6)13603
PAGEIND 23356(23176.35)44616
PARSVNATH 7.7(8)116363
PCJEWELLER 80.1(80.8)6575661
PEL 2296.85(2305.05)289619
PERSISTENT 547.6(562.3)195258
PETRONET 216.7(214.05)2134238
PFC 107.5(108.05)5921339
PFIZER 2761.15(2748.65)70828
PFS 17.8(17.75)324861
PGHH 9998.5(9995.65)886
PHOENIXLTD 560(568.3)439239
PIDILITIND 1109.25(1115.15)1029534
PIIND 841.95(858.25)84797
PNB 80.65(81.25)12150994
POWERGRID 194.35(195.65)1685132
PRAJIND 152.1(137.9)37003318
PRESTIGE 217.25(220.5)82316
PRSMJOHNSN 86.25(88.15)96819
PTC 91.45(91.75)1050000
PUNJLLOYD 4.05(4.05)421484
PURVA 78.4(82.2)80326
PVR 1644.95(1636.25)404115
RADICO 414.95(410.1)495381
RAIN 116.65(117.15)542769
RAJESHEXPO 569.95(569.4)129557
RALLIS 167.7(167.95)129310
RAMCOCEM 628.35(630.05)178282
RAMCOSYS 266.35(271.75)12156
RATNAMANI 914.3(908.85)1095
RAYMOND 816.1(809.2)284759
RCF 65.65(66.85)1577237
RCOM 13.7(13.85)47896536
RECLTD 124.55(122.85)7779678
REDINGTON 83.5(83.05)88658
RELAXO 757.55(753.5)15375
RELCAPITAL 216.1(217.75)3537032
RELIANCE 1098.05(1107.5)6463903
RELINFRA 307.7(305.95)2519076
RENUKA 11.15(11.3)811855
REPCOHOME 434.25(419.4)1431332
RIIL 335.55(336.75)282284
RKFORGE 514.9(516)7532
RNAVAL 13.55(13.7)605342
ROLTA 7.8(7.85)690543
RPOWER 29.45(29.7)4256436
RTNPOWER 3.55(3.6)1817684
RUCHISOYA 8(8.15)561719
SADBHAV 224(226.65)27743
SADBHIN 95.2(94.5)30592
SAIL 52.2(52.45)7675807
SANOFI 6232.85(6231.4)2082
SBIN 302.75(305.55)12702551
SCHAEFFLER 5667.85(5681.1)6466
SCHNEIDER 99.05(98.75)22966
SCI 46.4(45.25)703250
SHARDACROP 304.3(299.9)25481
SHILPAMED 388.2(384.5)5367
SHK 179.7(175.1)213086
SHOPERSTOP 521.75(526.25)26010
SHREECEM 15913.2(16496.15)47981
SHRIRAMCIT 1639.35(1596.85)7460
SIEMENS 1057.85(1071.05)310999
SIMPLEXINF 194.95(191.15)86187
SINTEX 11.55(11.6)1614408
SITINET 10.45(10.4)12963
SJVN 25.35(24.8)2021000
SKFINDIA 1939.75(1935.3)8487
SMLISUZU 641.7(635.25)2768
SNOWMAN 34.65(34.55)56641
SOBHA 455.2(475.5)208410
SOMANYCERA 365.4(363.5)44395
SONATSOFTW 297.55(298.15)105576
SOUTHBANK 15.7(15.85)13185866
SPARC 183.5(188.1)418270
SREINFRA 34.7(35.75)3324257
SRF 2046.4(2050)346969
SRTRANSFIN 1189.7(1186.35)673078
STAR 480.7(480.05)643711
STCINDIA 135.25(132)339048
SUNDARMFIN 1483.95(1496.4)3525
SUNDRMFAST 513(517.05)35919
SUNPHARMA 444.4(444.6)3778103
SUNTV 588.9(590.05)859286
SUPREMEIND 1112.15(1077.95)106977
SUVEN 224.55(226.5)172851
SUZLON 5.35(5.45)16471318
SWANENERGY 100.5(99.6)303237
SYMPHONY 1118.65(1133.55)3219
SYNDIBANK 39.55(40.45)3412178
SYNGENE 542.95(548.1)46054
TAKE 148.3(148.75)49645
TATACHEM 697.75(699.25)169435
TATACOFFEE 99.2(99.15)640668
TATACOMM 516.7(518.05)343639
TATAELXSI 961.95(969.5)1410190
TATAGLOBAL 211.9(214.15)698106
TATAMOTORS 180.3(185.75)25902974
TATAMTRDVR 95.8(98.05)3921502
TATAPOWER 75(74.9)3214817
TATASPONGE 816.25(833.7)145174
TATASTEEL 474.2(480.4)7540824
TATASTLBSL 38.1(37.2)730400
TBZ 64.7(64.35)42909
TCS 1842.55(1888.55)9209862
TECHM 699.2(694.55)1849817
TEXRAIL 59.3(57.9)429874
THERMAX 1149.9(1144.8)11259
THOMASCOOK 233(233.95)80348
TIDEWATER 5358.2(5370.7)284
TIMKEN 592.3(590.5)17560
TITAN 959.3(966.7)1535995
TNPL 233.05(236.45)22943
TORNTPHARM 1885.7(1856.5)434542
TORNTPOWER 257.4(260.25)1679794
TREEHOUSE 4.5(4.6)3428
TRIDENT 70.95(70.95)1106010
TRITURBINE 112.85(113)31569
TTKPRESTIG 7561.1(7532.9)1008
TTML 3.85(3.95)484944
TV18BRDCST 37.95(38.15)1634418
TVSMOTOR 540.65(540.15)599137
TVSSRICHAK 2421.35(2459.25)1228
TVTODAY 370.75(368.75)14607
UBL 1377(1378.45)259158
UCOBANK 20.85(20.8)812649
UFLEX 267.7(269.25)27819
ULTRACEMCO 3770.2(3818.2)248857
UNICHEMLAB 196.35(195.85)14991
UNIONBANK 93.65(92.8)10264202
UNITECH 2(2.05)3278026
UPL 783.45(773.1)2603033
VAIBHAVGBL 720.05(719)3415
VAKRANGEE 39.7(37.85)3911497
VEDL 196.6(195.45)8245755
VIDEOIND 3.05(3.1)117093
VIJAYABANK 48.95(49.45)635393
VINATIORGA 1570.2(1602.35)10645
VIPIND 505.05(499.1)244385
VOLTAS 542.2(539.35)691132
VRLLOG 276.25(283.55)30476
VSTIND 3174.75(3189.55)835
VTL 1083.35(1088.4)2224
WABAG 313.35(320.35)934580
WABCOINDIA 6382.05(6482.55)3142
WELCORP 137.7(134.05)386776
WELSPUNIND 62.15(61.55)1062571
WHIRLPOOL 1481.7(1468.55)39902
WIPRO 328.7(325.75)1598939
WOCKPHARMA 515.1(517.1)772958
WONDERLA 267.25(265.75)22277
ZEEL 451.05(451.35)2587687
ZEELEARN 34.95(34.8)20921
ZYDUSWELL 1333.05(1332.9)3272

బులియన్

బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	33,220	32,800	---	32,700	32,190
క్రితం ముగింపు	33,340	32,800	33,190	32,750	32,230
22 క్యారెట్లు	30,760	30,040	---	30,310	30,720
క్రితం ముగింపు	30,870	30,300	30,530	30,033	31,760
వెండి (కిలో)	40,300	40,400	---	40,300	42,700
క్రితం ముగింపు	40,600	40,800	40,300	40,500	42,800

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 5.05 — నెక్ (100 గుడ్లు)



హైదరాబాద్	443	చిత్తూరు	453
వరంగల్	445	చెన్నై	460
విజయవాడ	453	నమక్కల్	445
గోదావరి	453	బెంగళూరు	455
విశాఖపట్నం	458	ముంబై	495

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	79	విజయవాడ	82
కరీంనగర్	79	గుంటూరు	83
వరంగల్	79	ఒంగోలు	84
మహబూబ్‌నగర్	79	చిత్తూరు	92
కర్నూలు	79	నెల్లూరు	92
విశాఖపట్నం	80	అనంతపురం	85
గోదావరి	79		

ఎన్టీఆర్ వైద్య సేవల కొనసాగింపు

అమరావతి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్య సేవలను శనివారం నుంచి కొనసాగించేందుకు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అసోసియేషన్(ఆశా) అంగీకరించింది. ఈ నెల 1 నుంచి ఆశా ప్రతినిధులు తమ హాస్పిటల్స్‌లో ఎన్టీఆర్ వైద్య సేవ, ఈహెచ్ఎస్, ఆరోగ్యరక్ష సేవలను నిలిపివేశారు. దీంతో ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్‌తో పాటు మంత్రి ఫరూక్ ఆశా ప్రతినిధులతో చర్చలు జరిపారు. చివరిగా క్లెయిమ్స్‌కు సంబంధించిన బిల్లుల్లో 50% ముందే ఇస్తే తప్ప సేవలు కొనసాగించలేమని ఆశా తేల్చి చెప్పడంతో.. ఆరోగ్యశాఖ అంగీకరించింది. దీంతో శాంతించిన ఆశా ప్రతినిధులు ఎన్టీఆర్ వైద్యసేవలు కొనసాగించేందుకు అంగీకరించారు. అయితే, 15 నాటికి మంత్రి ఫరూక్ ఇచ్చిన హామీ అమలైతేనే వైద్య సేవలు కొనసాగిస్తామని తెలిపారు. ఈహెచ్ఎస్, ఆరోగ్య రక్ష పథకాల్లో ఉన్న సమస్యలను పూర్తిగా పరిష్కరించే వరకు ఆ సేవలు ప్రారంభించలేమని చెప్పారు.

ఏప్రిల్ నెలాఖరులో ఎంసెట్!

అమరావతి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): వివిధ సాంకేతిక, వృత్తివిద్యా కోర్సుల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించే 'ఉమ్మడి ప్రవేశ పరీక్షల(సెట్స్-2019)' షెడ్యూల్ శనివారం విడుదల కానుంది. విజయవాడలో ఉదయం 11గంటలకు మంత్రి గంటా శ్రీనివాసరావు దీన్ని విడుదల చేస్తారు. ఈసారి సెట్స్ నిర్వహణ తేదీలతో పాటు ఏ వర్సిటీలకు బాధ్యతలు అప్పగించాలనే అంశంపై రాష్ట్ర ఉన్నత విద్యా మండలి అధికారులతో ఆయన శుక్రవారం చర్చించారు. తెలంగాణకంటే ముందుగా అంటే ఏప్రిల్ నెలాఖరులో ఏపీ ఎంసెట్ నిర్వహించినట్లు సమాచారం. పరీక్ష నిర్వహణ బాధ్యతను ఈసారి ఆంధ్రా వర్సిటీకి అప్పగించాలన్న ప్రతిపాదన తెరపైకి వచ్చినట్లు తెలిసింది. అయితే త్వరలో సాధారణ ఎన్నికలు జరగనున్నందున ఎలాంటి అపశ్రుతులు దొర్లినా ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందనే అభిప్రాయంతో ఈసారి కూడా జేఎన్‌టీయూకేకు ఆ బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని సమాచారం.

సమాజ వికాసమే ధ్యేయం

- ప్రజలు మార్పు కోరుతున్నారు
- దానికి జనసేనే ఆలంబన
- ఇంటర్‌తో ఆపేసినా.. రోజూ 8 గంటలు చదువుతా
- 25 కిలోల బియ్యం కాదు.. యువతకు పాతికేళ్ల భవిష్యత్ కావాలి
- పశ్చిమ, కృష్ణా నేతలతో పవన్ కల్యాణ్



అమరావతి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): జనసేన సమాజ వికాసం కోసమే పని చేస్తుందని ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అన్నారు. కులం పేరుతో ప్రజలను విడగొట్టదని స్పష్టం చేశారు. 'ప్రజల్లో ఎంతో ఆగ్రహం ఉంది. ముఖ్యంగా మహిళలు మరింత ఆగ్రహంతో ఉన్నారు. దానిని మార్పు కోసం ఉపయోగించుకోవడమే పార్టీ లక్ష్యం' అని తెలిపారు. శుక్రవారం విజయవాడలోని జనసేన కార్యాలయంలో పశ్చిమ గోదావరి, కృష్ణాజిల్లా నేతలతో ఆయన మాట్లాడారు. కులం, మతం, ప్రాంతీయతను నమ్ముకుని తాను రాజకీయాల్లోకి రాలేదని, మానవత్వం కోసం రాజకీయాల్లోకి వచ్చానన్నారు. ఇంకా ఏమన్నారంటే...

సామాజిక వినాశనం తప్పదు..

'మన వ్యవస్థలో కులం బలంగా పెనవేసుకుపోయింది. కులాల ఆలోచనలు, వాటి మధ్య ఘర్షణలను అధిగమించకపోతే సామాజిక వినాశనం తప్పదు. నాయకులంతా కలసి వ్యవస్థను బలహీన పరిచారు. దానిని బలోపేతం చేయడమే జనసేన లక్ష్యం. ప్రజలు మార్పు కోరుకుంటున్నారు. ఈ మార్పునకు జనసేన ఆలంబనగా మిగలాలి'

చదవడం ఆపలేదు..

'నేను ఇంటర్‌తోనే ఆపేసినా చదవడం మాత్రం ఆపలేదు. రోజుకు కనీసం 8 గంటలపాటు చదువుతూనే ఉంటాను. మార్క్స్ నుంచి కాన్షీరాం వరకూ, నక్సలిజం, మండల్ రిజర్వేషన్లు, రామజన్మభూమి వివాదం, సోవియట్ పతనం, సైన్స్-టెక్నాలజీ వంటి అనేక విషయాలను క్షుణ్ణంగా అవగాహన చేసుకున్నాను. నా ఆలోచనలూ అనుభవాల నుంచి పుట్టినవే జనసేన ఏడు మూల సిద్ధాంతాలు. రాత్రికిరాత్రి పార్టీ నిర్మాణం చేయడం సాధ్యం కాదు. జనసేన నాయకుడిగా నా నడక ఎలా ఉంటుందో కార్యకర్తలకు తెలియజేసిన తర్వాత నా దారిలో నడవాలని చెప్పడానికి నాలుగేళ్ల సమయం తీసుకున్నాను. మన భావజాలం ప్రజల్లోకి వెళ్లాలంటే కనీసం రెండు దశాబ్దాల సమయం పడుతుంది. అందుకే 25 ఏళ్లు పోరాడేందుకు వచ్చాను. ఒక దేహానికి ఒక రక్తనాళం ఎలా సరిపోదో.. ఒక దేశానికి ఒక నది ఎలా సరిపోదో.. ఒక పార్టీకి ఒక నాయకుడు సరిపోడు. కృష్ణాజిల్లా రాజధాని సంబంధిత ప్రాంతం కాబట్టి నేతలు ఇంకా బలంగా పనిచేయాలి' అన్నారు.

యువతలో మార్పు..: 'నాయకులు మాట్లాడుతున్న మాటలకు, యువత మాట్లాడుతున్న మాటలకూ తేడా కనిపిస్తోంది. జగన్ 30 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉండాలని కలలు కంటారు. మళ్లీ తానే రావాలని చంద్రబాబు పోస్టర్లు వేయించుకుంటారు. వారలా అడుగుతుంటే.. మాకు 25 కిలోల బియ్యం అవసరం లేదు.. 25 ఏళ్ల భవిత కావాలని యువత అడుగుతోంది. అందరి సమస్యలకూ పరిష్కారమార్గం చూడాలంటే రాజకీయ ప్రక్రియ ద్వారానే చేయగలమనిపించింది. 2009లో ప్రజారాజ్యం పార్టీ వైఫల్యం తర్వాత నేను నిలబడగలనా లేదా అన్న ఆలోచన వచ్చినా, రాష్ట్ర విభజన తర్వాత వ్యవస్థలో మార్పు కోసం నిలబడి తీరాలనిపించింది. గతంలో జనసేనకు అసెంబ్లీ స్థానాలు రావని చెప్పినవారే ఇప్పుడు కలసి రావాలని ఆహ్వానిస్తున్నారు. టీఆర్ఎస్ నేతలతో మాట్లాడిస్తున్నారు. ఇది మన బలానికి నిదర్శనం' అన్నారు.

ఆ ఎమ్మెల్యేపై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టరేం?

'దెందులూరు నియోజకవర్గం నుంచి కొందరు దళితులు వచ్చి ఇప్పుడే కలిశారు. స్థానిక టీడీపీ ఎమ్మెల్యే వేధిస్తున్నాడని వారి ఆరోపణ. అలాంటి వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు పెట్టాలి. ప్రభుత్వం ఆ పనెందుకు చేయడం లేదు? ఇటువంటి రాజకీయాలతో విసుగొచ్చే జనసేన స్థాపించాను' అని పవన్ అన్నారు.

● ఆ 9 సీట్లను జేడీఎస్‌కు ఇవ్వం: కాంగ్రెస్

బెంగళూరు, జనవరి 11: పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి కర్ణాటకలో మిత్రపక్షాలు కాంగ్రెస్, జేడీఎస్‌ల మధ్య సీట్ల కేటాయింపు విషయంలో రోజుకో వివాదం తెరమీదకి వస్తోంది. గత 2014 ఎన్నికల్లో తాము గెలుచుకున్న 9 పార్లమెంటు స్థానాల్లో ఏ ఒక్కదాన్నీ జేడీఎస్‌కు ఇవ్వబోమని కాంగ్రెస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఈశ్వర ఖాండ్రే వెల్లడించారు. 2014లో దేశవ్యాప్తంగా మోదీ ప్రభావం కనిపించినా.. కర్ణాటకలోని 9 స్థానాల్లో మాత్రం కాంగ్రెస్ విజయం సాధించిందని శుక్రవారం ఆయన మీడియాకు వెల్లడించారు. ఈ నేపథ్యంలో సహజంగానే ఆ 9 సీట్లను తమకే కేటాయించాలని కాంగ్రెస్ నాయకులు పట్టుబడతారని, అది వారి డిమాండ్ అని చెప్పారు. గత ఎన్నికల్లో బీజేపీ 17, కాంగ్రెస్ 9, జేడీఎస్ 2 పార్లమెంటు స్థానాల్లో విజయం సాధించాయి. కాగా, మొత్తం 28 పార్లమెంటు స్థానాల్లో తమకు 12 కేటాయించాలని జేడీఎస్ డిమాండ్ చేస్తోంది. అయితే, ఆయా నియోజకవర్గాల్లో పార్టీల హవాను పరిగణనలోకి తీసుకున్నాకే సీట్ల కేటాయింపు జరగాలని కాంగ్రెస్ నేతలు పట్టుబడుతున్నారు.

నేడు మాయా-అఖిలేశ్ పొత్తు ప్రకటన!

కనౌజ్, జనవరి 11: ఉత్తరప్రదేశ్‌లో ఎస్పీ, బీఎస్పీ కలిసి పోటీ చేయబోతున్నాయని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ ప్రకటించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ, యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ ప్రాతినిధ్యం వహిస్తున్న అమేథీ, రాయ్‌బరేలీ లోక్‌సభ స్థానాలను వారికే వదిలేయనున్నట్లు ప్రకటించారు. ఆ పార్టీతో పొత్తు ఉంటుందా? లేదా? అన్నది చెప్పలేమన్నారు. కాంగ్రెస్ 29 ఏళ్లుగా రాష్ట్రంలో అధికారానికి దూరంగా ఉందని, మెల్లగా దాని స్థానాన్ని ప్రాంతీయ పార్టీలు ఆక్రమించాయని చెప్పారు. శనివారం లఖ్‌నవూలో బీఎస్పీ అధినేత మాయావతి కలిసి మీడియా ముందు మహాగఠ్‌బంధన్ ప్రకటన చేయనున్నట్లు వెల్లడించారు. ఇతర పార్టీలతో పొత్తు గురించి కూడా ఇంకా ఆలోచించలేదన్నారు.

బీజేపీ, టీడీపీలను భూస్థాపితం చేస్తాం

- ఏపీకి నేనే సీఎం: కేఏ పాల్



ఒంగోలు (కార్పొరేషన్), నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 11: "అరాచక పాలన సాగిస్తున్న బీజేపీ, టీడీపీలను రాబోయే ఎన్నికల్లో భూస్థాపితం చేయడమే ధ్యేయం" అని ప్రజాశాంతి పార్టీ జాతీయ అధ్యక్షుడు కేఏ పాల్ అన్నారు. ఒంగోలు, నెల్లూరులో హిప్నో కమలాకర్‌తో కలసి విలేకరులతో ఆయన మాట్లాడారు. "మోదీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక పాలనతో అంతటా అశాంతి నెలకొంది. నాడు నా సంస్థకు రావాల్సిన విదేశీ నిధులను కాంగ్రెస్ నిలిపివేసింది. అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని పునరుద్ధరిస్తామని చెప్పిన బీజేపీ నమ్మకద్రోహం చేసింది. టీడీపీ కూడా నన్ను అనేక ఇబ్బందులు పెట్టింది. కేంద్రంలో బీజేపీని, రాష్ట్రంలో టీడీపీని వచ్చే ఎన్నికల్లో ఓడిస్తాం. వైసీపీ, టీడీపీలకు ప్రత్యామ్నాయం ప్రజాశాంతి పార్టీనే. ఆంధ్రప్రదేశ్‌కు నేనే కాబోయే ముఖ్యమంత్రిని. 10వేల మంది క్రియాశీలక కార్యకర్తలను పార్టీలో చేర్పిస్తే వారికి టికెట్టు ఖాయం" అన్నారు.

మోదీతో జగన్ లాలూచీ

- జనసేన, వామపక్షాలతో రాజకీయ ప్రత్యామ్నాయం
- 18 నుంచి సీట్లపై చర్చ... 20 తరువాత ప్రకటన: మధు



జగదాంబ సెంటర్(విశాఖపట్నం), జనవరి 11: "ప్రధాని మోదీతో వైసీపీ అధ్యక్షుడు జగన్ లాలూచీ పడ్డారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విశాఖకు రైల్వేజోన్, కడపకు స్టీల్‌ప్లాంట్ ఇవ్వకపోయినా మోదీని జగన్ పల్లెత్తు మాటనడం లేదు. వారిరువురి మధ్య అవగాహన ఉందనడానికి ఇంతకన్నా రుజువు ఇంకేం కావాలి" అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు ప్రశ్నించారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. "విభజన సమయంలో ఇచ్చిన హామీలను బీజేపీ అమలు చేయకపోవడంతో రాష్ట్రం అధోగతి పాలైంది. రాష్ట్రానికి 11 జాతీయ విద్యాసంస్థల కోసం రూ.12 వేల కోట్లు అవసరం కాగా, కేంద్రం ఈ నాలుగున్నరేళ్లలో కేవలం రూ.820 కోట్లు మాత్రమే విడుదల చేసింది. విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ ఇచ్చేందుకు కుంటిసాకులు చెబుతోంది. కడపకు స్టీల్‌ప్లాంటు, అనంతపురానికి సెంట్రల్ యూనివర్సిటీ విషయంలోనూ మోసం చేసింది. బీజేపీని బలపరిచి టీడీపీ అధినేత చంద్రబాబు రాష్ట్రాన్ని దెబ్బతీశారు. రాష్ట్రంలో అధికార, ప్రతిపక్షాల మధ్య ప్రజలు బందీ అయ్యారు. వీరిని బయటకు తెచ్చేందుకు జనసేన, సీపీఎం, సీపీఐ కలిసి రాష్ట్రంలో నూతన రాజకీయ ప్రత్యామ్నాయానికి కృషి చేస్తున్నాయి. 18 నుంచి 20 వరకూ మూడు పార్టీలు చర్చించుకుని 2019 ఎన్నికల్లో ఎవరు ఎక్కడి పోటీ చేసేదీ వెల్లడిస్తాం" అని మధు ప్రకటించారు.

కొడనాడు 'మిస్టరీ'లో ఎడప్పాడి హస్తం

- 'తెహల్కా' ఇంటర్వ్యూలో నిందితుడి వెల్లడి
- రాష్ట్రంలో తీవ్ర సంచలనం.. కేసు వేస్తామన్న అన్నాడీఎంకే

చెన్నై, జనవరి 11(ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలితకు సొంతమైన వేసవి విడిది కేంద్రం నీలగిరి జిల్లాలోని కొడనాడు ఎస్టేట్‌లో జరిగిన అనుమానాస్పద మృతుల మిస్టరీ వెనుక సీఎం ఎడప్పాడి పళనిస్వామి హస్తం ఉందని ఈ మిస్టరీలో నిందితుడిగా ఉన్న కేరళకు చెందిన సయాన్ సంచలన ఆరోపణ చేశాడు. 'తెహల్కా' మాజీ ఎడిటర్ మాథ్యూ శామ్యూల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సయాన్ కొడనాడుపై పలు విషయాలు వెల్లడించాడు. అయితే, ఈ ఇంటర్వ్యూ తాలూకు వీడియోను తెహల్కా విడదల చేసింది. దీంతో ఈ వీడియో రాష్ట్రంలో కలకలం రేపుతోంది. జయలలిత మరణించిన తర్వాత కొడనాడు ఎస్టేట్ వద్ద జరిగిన దోపిడీలో కాపలాదారు మృతి చెందాడు. ఆ కేసులో అరెస్టయిన జయలలిత మాజీ కారు డ్రైవర్ కనకరాజ్ రోడ్డు ప్రమాదంలో మరణించాడు.



మరో కీలకనిందితుడు సయాన్ కేరళలో తన కుటుంబ సభ్యులతో కారులో వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో భార్య విష్ణుప్రియ, కుమార్తెని కోల్పోయాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సయాన్ ఆసుపత్రిలో చికిత్స పొంది కోలుకున్నాడు. తర్వాత కొడనాడు ఎస్టేట్‌లో సీసీటీవీ కెమెరాలను పరిశీలించే యువకుడు ఒకరు ఉన్నట్టుండి ఉరేసుకుని ప్రాణాలు తీసుకున్నాడు.

ఈ వరుస మరణాల వెనుక సీఎం ఎడప్పాడి ప్రమేయం ఉందని 'తెహల్కా' మాజీ ఎడిటర్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో సయాన్ బాంబు పేల్చాడు. కొడనాడుని దోచుకునేందుకు సయాన్, కనకరాజ్ ఆదేశాల మేరకు 10 మంది ప్రయత్నించారని స్థానిక డీఎంకే నాయకుడు ముబారక్ ఇటీవల ఆరోపించారు. ఈ క్రమంలో సయాన్ ఇంటర్వ్యూ సంచలనంగా మారింది. ఇదిలావుంటే, తెహల్కా వీడియోపై మత్స్యశాఖ మంత్రి జయకుమార్ శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. ఇది కుట్రపూరితమైన చర్య అని, నిందితుడిని ఇంటర్వ్యూ చేసిన తెహల్కా మాజీ ఎడిటర్‌పై కేసు వేస్తామని హెచ్చరించారు.

● జర్నలిస్ట్ హత్యకేసులోనూ డేరా బాబా దోషి



పంచ్‌కుల, జనవరి 11: పాత్రికేయుడు రామ్ చందర్ ఛత్రపతి హత్య కేసులో డేరా బాబా.. గుర్మీత్‌రామ్ రహీమ్ సింగ్‌ను దోషిగా సీబీఐ ప్రత్యేకకోర్టు తేల్చింది. ఆయనతో పాటు మరో ముగ్గురు- కుల్దీప్ సింగ్, నిర్మల్ సింగ్, కిషన్‌లాల్‌లను కూడా దోషులుగా చేస్తూ పంచ్‌కులలోని సీబీఐ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి జగ్‌దీప్ సింగ్ తీర్పు వెలువరించారు. వీరికి ఈనెల 17న శిక్షలు ఖరారు చేస్తారు. తన ఆశ్రమంలో ఇద్దరు మహిళలను రేప్ కేసులో ప్రస్తుతం గుర్మీత్ 20 ఏళ్ల జైలుశిక్షను అనుభవిస్తున్నారు. హరియాణాలోని రోహతక్ సొనారియా జైలులో ఉన్న ఆయన- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ కేసు విచారణకు హాజరయ్యారు.

● రైలులో అరగంట ముందే బ్లాంకెట్ ఇచ్చేయాలి

న్యూఢిల్లీ, జనవరి 11: సుదూర ప్రయాణికులకు రైల్లో అందిస్తున్న బెడ్ షీట్లు, బ్లాంకెట్లు, టవళ్లు, దిండు తదితర వస్తువులను గమ్యానికి చేరుకునే 30 నిమిషాల ముందే తిరిగి ఇచ్చేయాల్సి ఉంటుంది. వీటిని సేకరించడం మరిచిపోయినా, వస్తువులు కనిపించకపోయినా.. వీటి ధరను సిబ్బంది లేదా కాంట్రాక్టరు కట్టాల్సి ఉంటుంది. కాగా, ఇక నుంచి రైలు కదిలాక కూడా ఖాళీ బెర్తుల వివరాలు తెలుసుకునేందుకు రైల్వే శాఖ హ్యాండ్ హెల్డ్ టర్మినల్స్(హెచ్‌హెచ్‌టీ) వ్యవస్థను రూపొందించింది. సికింద్రాబాద్ నుంచి వెళ్లే 4 ఎక్స్‌ప్రెస్ రైళ్లలోని సిబ్బందికి 40 హెచ్‌హెచ్‌టీ పరికరాలు అందజేశారు. మున్ముందు రైల్వేశాఖలో కొన్ని ఉద్యోగాలకు మహిళలు దరఖాస్తు చేయలేరేమో! డ్రైవర్లు, పోర్టర్లు, గార్డులు, గ్యాంగ్‌మెన్ (ట్రాక్‌మెన్) ఉద్యోగాల్లో కేవలం పురుషులనే నియమించేందుకు అనుమతివ్వాలని కోరుతూ సిబ్బంది, శిక్షణ విభాగానికి (డీవోపీటీ) భారతీయ రైల్వే లేఖ రాసింది.

● ఉగ్రదాడుల్లో అమరులైన మేజర్, జవాను

న్యూఢిల్లీ, జనవరి 11: జమ్మూకశ్మీర్‌లోని రాజౌరీ జిల్లా నౌషేరా ప్రాంతంలో జరిగిన పేలుడులో ఓ ఆర్మీ మేజర్ అమరుడయ్యారు. గస్తీ దళాలే లక్ష్యంగా కాలిబాట వద్ద ఉగ్రవాదులు శక్తిమంతమైన ఐఈడీ(ఇంప్రొవైజ్‌డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజ్)లు పెట్టారని ఆర్మీ అధికారులు చెప్తున్నారు. ఈ ప్రమాదంలో మేజర్‌తో పాటు ఓ జవాను తీవ్రంగా గాయపడ్డారని, వారిని వెంటనే ఆస్పత్రికి తరలించామని తెలిపారు. చికిత్స పొందుతూ వారిద్దరూ ప్రాణాలు వదిలినట్లు వెల్లడించారు.

గ్రామీణ రోడ్లకు రూ.1742 కోట్లు

▸▸ మరమ్మతులు.. పునర్నిర్మాణానికి బ్యాంకుల నుంచి రుణం

అమరావతి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పంచాయతీరాజ్ రోడ్లకు మహర్దశ పట్టింది. రాష్ట్రంలో దెబ్బతిన్న 5515 బీటీ రోడ్లను పునర్నిర్మించడంతోపాటు మరమ్మతులు చేపట్టేందుకు రాష్ట్ర గ్రామీణ రోడ్ల అభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఆర్ఆర్‌డీఏ) శ్రీకారం చుట్టింది. తొమ్మిది జిల్లాల్లోని 16,031 కిలోమీటర్ల రోడ్లను రూ.1742.89 కోట్లతో మరమ్మతు చేయనున్నారు. ఇందుకోసం ఆంధ్రాబ్యాంకు నుంచి రూ.1500 కోట్లు రుణం పొందేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. దీనికి రాష్ట్ర ప్రభుత్వం పూచీకత్తుగా ఉంటుంది. మిగిలిన రూ.242.89 కోట్లను 2019-20 బడ్జెట్ నుంచి సమకూర్చనున్నారు. అనంతపురం, చిత్తూరు, తూర్పుగోదావరి, కర్నూలు, ప్రకాశం, నెల్లూరు, విశాఖపట్నం, విజయనగరం, కడప జిల్లాల్లో ఈ నిధులు ఖర్చు చేయనున్నట్లు పంచాయతీరాజ్ శాఖ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఎన్ఎస్ఎఫ్‌డీఎస్ రుణానికి ప్రభుత్వం పూచీకత్తు

అమరావతి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సంస్థలైన జాతీయ షెడ్యూల్డ్ కులాల ఆర్థిక అభివృద్ధి సంస్థ (ఎన్ఎస్ఎఫ్‌డీసీ), జాతీయ సఫాయి కర్మచారి ఆర్థిక అభివృద్ధి సంస్థ (ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ)ల నుంచి రుణం పొందేందుకు ఎస్సీ కార్పొరేషన్‌కు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో ఎస్సీలకు స్వయం ఉపాధి యూనిట్లు మంజూరు చేసేందుకు కేంద్ర ప్రభుత్వ సంస్థల నుంచి ఎస్సీ కార్పొరేషన్ రుణం తీసుకుంటోంది. ఈ ఏడాది ఎన్ఎస్ఎఫ్‌డీసీ నుంచి 208.12 కోట్లు, ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ నుంచి 90.91 కోట్లు రుణం పొందేందుకు ఎస్సీ కార్పొరేషన్ ప్రతిపాదనలు పంపింది.

అమరావతిలో లీగల్ సర్వీసెస్ అథారిటీ

అమరావతి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): హైకోర్టు విభజన నేపథ్యంలో హైదరాబాద్‌లో ఉన్న లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యాలయాన్ని అమరావతికి తరలించారు. ఈ కార్యాలయానికి తాత్కాలిక ప్రాతిపదికన విజయవాడ ఎంజీ రోడ్డులోని ఆర్అండ్‌బీ కార్యాలయంలో గదిని కేటాయించారు.

విశాఖ జోన్ కోసం కోర్‌లో డిమాండ్

▸▸ అది బీజేపీ ఎన్నికల ప్రచార హామీ: విష్ణుకుమార్ రాజు



విశాఖపట్నం, న్యూఢిల్లీ, జనవరి 11(ఆంధ్రజ్యోతి): "ఏపీకి అనేకం ఇచ్చిన బీజేపీ రైల్వే జోన్ కూడా ఇవ్వాలి. ఇదే విషయాన్ని కోర్ కమిటీ సమావేశంలో ప్రస్తావిస్తాను. రైల్వే జోన్ కోసం డిమాండ్ చేస్తాను" అని బీజేపీ బీజేపీ శాసనసభాపక్ష నేత, విశాఖ ఉత్తరం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఇటీవల కొద్దికాలంగా కోర్ కమిటీ సమావేశాలకు గైర్హాజరవుతున్న విష్ణుకుమార్ రాజు శనివారం జరిగే సమావేశంలో పాల్గొంటున్నారు. ఢిల్లీ వెళ్లడానికి ముందు ఆయన ఆంధ్రజ్యోతి ప్రతినిధితో మాట్లాడారు. "రాష్ట్ర విభజన చట్టంలో రైల్వే జోన్‌ను పరిశీలించాలని ఉంది. అయితే, విశాఖకు రైల్వేజోన్ ఇస్తామని 2014లో జరిగిన ఎన్నికల ప్రచారంలో బీజేపీ హామీ ఇచ్చింది" అని విష్ణుకుమార్ రాజు అన్నారు. కాగా, 'వచ్చే ఎన్నికల్లో విశాఖ ఉత్తర నియోజకవర్గం నుంచే మళ్లీ పోటీ చేస్తాను. ఐదేళ్లు టీడీపీ, జనసేన పార్టీలతో కలిసి పనిచేయాలని ప్రజలు తీర్పిచ్చారు. ఆ మేరకు ఐదేళ్లూ పదవీ బాధ్యతలు నిర్వర్తిస్తాను. అసెంబ్లీని రద్దు చేసిన తరువాత, లేదంటే ఎన్నికల ప్రకటన వచ్చాక... ఏ పార్టీలో ఉండాలనేది ప్రజల సూచన మేరకు నిర్ణయం తీసుకుంటా" అని విష్ణుకుమార్ రాజు అన్నారు.

కన్నా ఒంటెత్తు పోకడ: చినబాబు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి పనితీరుపై అసంతృప్తి క్రమంగా బయటపడుతోంది. పార్టీ సీనియర్ చినబాబు ఏకంగా ఢిల్లీలోనే కన్నాపై విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టారు. "బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ ఒంటెత్తు పోకడలకు పోతున్నారు. సీనియర్ నేతలను సంప్రదించకుండా కమిటీలు వేశారు. పార్టీకి నష్టం కలిగించే వారిపై చర్యలు తీసుకోకుండా నా రాజీనామాను ఆమోదించారు. ఇది దారుణం. త్వరలో అమిత్ షాను కలిసి పరిస్థితిని వివరిస్తాం" అని చినబాబు అన్నారు.

సమావేశాలకు భారీగా తెలుగు నేతలు

బీజేపీ జాతీయ మండలి సమావేశాలకు తెలంగాణ నుంచి దాదాపు 280 మంది, ఆంధ్ర నుంచి 200 మంది వరకూ వచ్చారు.

టీడీపీని వీడే ప్రసక్తే లేదు: అఖిలప్రియ




కర్నూలు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): "మా నాన్న భూమా నాగిరెడ్డి చనిపోతే సీఎం చంద్రబాబు మా కుటుంబానికి అండగా నిలిచారు. ఆళ్లగడ్డ అభివృద్ధి కోసం రూ.1000 కోట్లు నిధులు ఇచ్చారు. నన్ను మంత్రిని చేసి మా కుటుంబానికి రాజకీయంగా చేయూతనిచ్చారు. అలాంటి చంద్రబాబును, టీడీపీని వీడాల్సిన అవసరం నాకు లేదు" అని మంత్రి భూమా అఖిల ప్రియ స్పష్టం చేశారు. కర్నూలు జిల్లా రుద్రవరంలో ఆమె ఏబీఎన్-ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. "జనసేనలో చేరుతున్నానని వస్తున్న పుకార్లు నమ్మవద్దు. నమ్మి కార్యకర్తలు మోసపోవద్దు. ఆ పార్టీలో చేరాల్సిన అవసరం నాకు లేదు. రేటింగ్స్ కోసం ఓ చానెల్ దుష్ప్రచారం చేస్తోంది. నేను, మా అన్న నంద్యాల ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి రానున్న ఎన్నికల్లో ఊహించని మెజారిటీతో గెలుస్తాం. ఆ విజయాలను సీఎం చంద్రబాబుకు బహుమతిగా ఇస్తాం. గన్‌మెన్‌ను ఉపసంహరించుకున్న విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి కూడా తీసుకెళ్లాను" అని అఖిల ప్రియ పేర్కొన్నారు.

ప్రభుత్వ నర్సుల సంఘం అధ్యక్షురాలిగా నిర్మల

తిరుపతి (వైద్యం), జనవరి 11: ఏపీ ప్రభుత్వ నర్సుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలిగా నిర్మలాకుమారి ఎన్నికయ్యారు. తిరుపతిలో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల్లో.. రాష్ట్ర అధ్యక్షురాలిగా ఎంఎస్ నిర్మలాకుమారి (విశాఖ), కోశాధికారిగా రాధమ్మ (తిరుపతి) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా సుభాషిణి ఆశీర్వాదం (కర్నూలు) ఎన్నికయ్యారు.

కాన్పులో నిర్లక్ష్యం.. ముక్కలైన శిశువు

బలవంతంగా లాగడంతో గర్భంలోనే తల.. మిగతా భాగం బయటకు.. రాజస్థాన్‌లో ఘోరం



జైపూర్, జనవరి 11: రాత్రివేళ పురిటి నొప్పులతో బాధపడుతున్న మహిళను ఆస్పత్రికి తీసుకొస్తే డ్యూటీ డాక్టర్ లేరు. అక్కడ సరైన శిక్షణ లేని ఇద్దరు మగ నర్సులు.. పైగా తప్పతాగి ఉన్నారు. వారే గర్భిణికి పురుడు పోసేందుకు ప్రయత్నించారు. శిశువును బలవంతంగా బయటకు లాగడంతో బిడ్డ శరీరం ఛిద్రమైంది. మెడ నుంచి కింది భాగం వరకు బయటకు రాగా.. తల గర్భంలోనే ఉండిపోయింది. బయటకొచ్చిన భాగం నుంచి కాలేయం వేరుపడింది. శిశువు రెండు కాళ్లు విరిగిపోయాయి. మగ నర్సుల ఈ నిర్లక్ష్యం శిశువు ప్రాణం తీయడమే కాదు.. ఆ తల్లినీ ప్రాణాపాయ స్థితిలోకి నెట్టింది. రాజస్థాన్‌లో ఆలస్యంగా వెలుగుచూసిందీ ఘోరం. ఈ నెల 6న జైసల్మేర్‌లోని రాంగఢ్ ప్రభుత్వాస్పత్రికి దీక్షా కన్వర్ అనే మహిళను కాన్పు కోసం తీసుకొచ్చారు. కాన్పు సమయంలో అమృత్‌లాల్, జుంజిహార్ సింగ్ అనే మగ నర్సులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించారు. బయటకు వచ్చిన భాగాన్ని మార్చురీలో పెట్టి.. బిడ్డ చనిపోయిందని, మెరుగైన వైద్యం కోసం బాధితురాలిని జోధ్‌పూర్‌లోని ఆస్పత్రికి తీసుకెళ్లాలని కుటుంబీకులకు చెప్పారు. పైగా జోధ్‌పూర్ ఆస్పత్రి వైద్యులనూ తప్పుదోవ పట్టించారు. తాము కాన్పును పూర్తిచేశామని.. మాయ (ప్లెసెంటా)లోపల ఉండిపోయిందని వారితో అబద్ధం చెప్పారు. అక్కడి వైద్యులు ఆపరేషన్ చేయగా శిశువు తల భాగం బయటపడింది. తన 30 ఏళ్ల కెరీర్‌లో ఇలాంటి ఘటనను చూడలేదని ఆపరేషన్ చేసిన వైద్యురాలు ఉష తెలిపారు. ప్రస్తుతం బాధితురాలు దీక్ష పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఘటనపై బాధితురాలి భర్త తిలోక్ భాటి.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా ఈ ఘటనను వైద్యాధికారులు తీవ్రంగా పరిగణించారు. కాన్పులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన రాంగఢ్ ఆస్పత్రి నర్సులు అమృత్‌లాల్, జుంజిహార్ సింగ్‌లను సస్పెండ్ చేశారు. ఆస్పత్రి ఇన్‌చార్జి నిఖిల్ శర్మను బాధ్యతల నుంచి తప్పించారు. అటు ఈ ఘటనపై రాజస్థాన్ సర్కారు విచారణ జరిపేందుకు ప్రత్యేక కమిటీని నియమిస్తూ.. వారంలోగా నివేదికను సమర్పించాలని ఆదేశించింది. పోస్టుమార్టం నివేదికను వైద్యులు ఇప్పటికే పోలీసులకు పంపారు.

ఇది మూడో పానిపట్ యుద్ధం

▸▸ మా వైపు మోదీ.. మీ వైపు ఎవరు?

▸▸ రామమందిరం నిర్మించే బాధ్యత మాదే..

▸▸ బీజేపీ చీఫ్ అమిత్ షా వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): వచ్చే లోక్‌సభ ఎన్నికలు మూడో పానిపట్ యుద్ధమని బీజేపీ అభివర్ణించింది. "1761లో మొదటి పానిపట్ యుద్ధం జరిగింది. మరాఠాలు ఓడిపోయాక దేశం 200 ఏళ్లపాటు బ్రిటిష్‌వారి చేతుల్లోకి వెళ్లిపోయింది. ఆనాడు జరిగిన యుద్ధం నిర్ణయాత్మకమైనది. ఇపుడు దేశం అదే పరిస్థితుల్లో ఉంది. 70 ఏళ్ల పాటు ఎన్నో ఒడిదుడుకులు చూసిన ఈ దేశం మళ్లీ అరాచకంలోకి జారిపోరాదు. నిర్ణయాత్మకైన 2019 పోరులో బీజేపీ గెలవాలి..గెలుస్తుంది. ఇది మనకంటే దేశప్రజలకే ఎక్కువ అవసరం. ఎందుకంటే అభివృద్ధి ఆగిపోరాదు.. 2014లో కంటే అత్యధిక సీట్లు సంపాదించి ఎన్‌డీఏ తిరిగి అధికారంలోకి వస్తుంది" అని బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా శుక్రవారం ప్రారంభమైన పార్టీ జాతీయమండలి సమావేశాలను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో అన్నారు. "2019 ఎన్నికల్లో నరేంద్ర మోదీకి, నాయకుడు లేని ఒక కూటమికీ మధ్య పోరాటం జరగబోతోంది. మహాకూటమి ఓ కంటితుడుపే. ఇది సైద్ధాంతిక యుద్ధం. మోదీని రాజకీయంగా దింపేయడం అంత సులువేమీ కాదు. ఒకప్పుడు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా అంతా ఏకమయ్యేవారు. ఇపుడు మోదీకి వ్యతిరేకంగా అంతా ఏకమవుతున్నారు. మోదీని తొలగించడం అసాధ్యమని వారు భావించడమే మోదీ బలాన్ని అంగీకరించినట్లు లెక్క' అని ఆయన అన్నారు. 'మా వైపు మోదీ ఉన్నారు. మీ వైపు ఎవరున్నారు' అని ప్రశ్నించారు. అయోధ్యలో రాముడు జన్మించిన చోట భవ్యమైన మందిరం నిర్మించాలని బీజేపీ కోరుకుంటున్నదని, అక్కడ మందిరం నిర్మించాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు.



బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశంలో అమిత్‌షాతో మోదీ కరచాలనం

దేశ దిశనే మార్చేశాం

నాలుగున్నరేళ్లలో మోదీ ప్రభుత్వం దేశ రూపురేఖల్నే మార్చేసే నిర్ణయాలను తీసుకున్నదని అమిత్ షా ప్రశంసించారు. తక్షణ తలాక్ నుంచి హజ్ సబ్సిడీ వరకు, జీఎస్టీ నుంచి పెద్ద నోట్ల రద్దు వరకు బృహత్తర మార్పునకు నాంది పలకామని చెప్పారు. పొరుగుదేశాల్లో వేధింపులకు గురై భారత దేశానికి తిరిగి వచ్చిన హిందువులు, సిక్కులు, క్రైస్తవులు, జైన్లను అక్రమ వలసదారులుగా భావించకుండా పౌరసత్వ బిల్లు ప్రవేశపెట్టామన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ నెరవేరిందని అన్నారు. ఈ దేశంలో అవినీతికి నాయకత్వం వహించింది కాంగ్రెసేనని, కాంగ్రెస్ హయాంలో దేశం అభద్రతా భావంలో జీవించిందని ఆయన అన్నారు.

ఎస్పీ-బీఎస్పీ కలిస్తే...?

"మేనత్త- మేనల్లుడు (మాయావతి- అఖిలేశ్ యాదవ్) పొత్తు పెట్టుకుంటే ఒరిగేదేంటి? మొత్తం అంతా మారిపోతుందా? ఏళ్ల తరబడి వారు ముఖాముఖి కూడా చూసుకోలేదు. ఇపుడు బీజేపీ మీద వ్యతిరేకతతో కలిశారు. ప్రజలు తెలివైనవారు' అని వ్యాఖ్యానించారు. "రాజకీయాలంటే ఫిజిక్స్ కాదు.. కెమిస్ట్రీ.. రెండు పదార్థాలు కలిసినపుడు ఊహించని కొత్త పదార్థం ఉత్పన్నమవుతుంది. అనుకోని విపరిణామాలుంటాయి" అని వ్యాఖ్యానించారు. గతంలో బీజేపీ కేవలం ఆరు రాష్ట్రాల్లో అధికారంలో ఉంటే ఇపుడు ఆ రాష్ట్రాల సంఖ్య 16కు పెరిగిందన్నారు. బెంగాల్, కేరళల్లో సైతం చొచ్చుకుపోతామన్నారు.

జయహో మోదీ!

న్యూఢిల్లీ, జనవరి 11(ఆంధ్రజ్యోతి): 2019 ఎన్నికలకు ముందు రాంలీలామైదాన్‌లో జరిగిన బీజేపీ చివరి జాతీయ మండలి సమావేశాలు మోదీ చుట్టే తిరిగాయి. స్టేజ్‌పై కట్టిన బ్యానర్ మీద 'అబ్ కీ బార్ ఫిర్ మోదీ సర్కార్' (ఈ సారి మళ్లీ మోదీ సర్కార్)తో రాసిన అక్షరాలు నేతల మాటల్లోనూ ప్రతిధ్వనించాయి. సమావేశాలు సాగుతున్నంత సేపూ మోదీ.. మోదీ అంటూ నినాదాలతో సభా ప్రాంగణం దద్దరిల్లింది. మళ్లీ మోదీ సర్కార్ తిరిగి వచ్చేందుకు సంకల్పం తీసుకోవాలని 12వేల మంది ప్రతినిధులతో రెండు చేతులెత్తి ప్రమాణాలు చేయించారు. వ్యాఖ్యాతగా వ్యవహరించిన ప్రధాన కార్యదర్శి, తెలంగాణ నేత మురళీధర్ రావు మోదీని ప్రపంచానికే ఇష్టమైన జన నేతగా అభివర్ణించారు.

హెచ్1బీతో పౌరసత్వం!

▸▸ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన

వాషింగ్టన్, జనవరి 11: భారతీయ టెకీలకు శుభవార్త. ఇన్నాళ్లూ నిబంధనల చట్రంలో ఇరుక్కున్న హెచ్-1బీ వీసాలు ఇకమీదట సరళతరం కానున్నాయి. అంతేకాదు.. హెచ్-1బీ వీసాలతో అమెరికా పౌరసత్వం పొందడానికి కూడా వీలు కల్పించనున్నారు. వలస విధానంపై ఉక్కుపాదం మోపిన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వయంగా ఈ విషయం ప్రకటించడం విశేషం. "హెచ్1 బీ వీసా వ్యవస్థలో మార్పులు తీసుకురాబోతున్నాం. నిబంధనలు సరళీకరిస్తున్నాం. మీరు (వీసాదారులు) అమెరికాలోనే ఉండేవిధంగా అవకాశాలు కల్పించబోతున్నాం. దేశ పౌరసత్వం పొందేందుకు కూడా మార్గం ఏర్పరచబోతున్నాం. మంచి ప్రతిభ, విశేష నైపుణ్యం ఉన్నవారు అమెరికాలో తమ విద్యా, ఉద్యోగావకాశాలు కొనసాగించుకోవాలన్నది మా అభిలాష" అని ట్రంప్ ఓ ట్వీట్‌లో పేర్కొన్నారు. హెచ్1 బీ అనేది నాన్-ఇమ్మిగ్రెంట్ వీసా. అమెరికన్ కంపెనీలు విదేశీ నిపుణుల్ని పనిలో పెట్టుకోడానికి ఉపకరించే మార్గం. దీనికి విశేషమైన డిమాండ్ ఉంది. 2018లో ఈ వీసా కోసం దరఖాస్తు చేసిన వారి సంఖ్య ఏప్రిల్ నాటికే పరిమితిని అంటే 65,000 ను దాటిందంటే దీనికున్న డిమాండ్‌ను అర్థం చేసుకోవచ్చు. కానీ హెచ్1బీ ద్వారా పౌరసత్వం పొందే అవకాశాలు ఇన్నేళ్లూ లేవు. ఇపుడు తొలిసారిగా ట్రంప్ ప్రతిపాదిస్తుండడం విశేషం. మేధో పునరాగమనం (రివర్స్ బ్రెయిన్ డ్రెయిన్ జరగొచ్చన్న హెచ్చరికలు కూడా ట్రంప్ ఆలోచనలను మార్చి ఉంటాయని అంటున్నారు. ట్రంప్ తన ట్వీట్‌లో వివరాల్లోకి వెళ్లలేదు గానీ దాన్ని నిశితంగా పరిశీలిస్తే- నైపుణ్యం ఉన్న వారందరికీ -అంటే అమెరికా ఆర్థిక ప్రగతి దోహదపడేవారికీ- పౌరసత్వం కల్పించడానికి ఆయన సుముఖంగా ఉన్నట్లు స్పష్టమవుతోంది. అధ్యక్ష ఎన్నికల ప్రచారం నాటి నుంచి ట్రంప్- వలస విధానంలో మార్పుల్ని ప్రధాన ఎజెండాగా చేసుకున్నారు. పదవి చేపట్టాక- అమెరికా ఫస్ట్ నినాదంతో భారతీయ టెకీల గుండెల్లో గుబులు రేపారు. అయితే తాజా ట్వీట్ల ప్రకారం- ఆయన నైపుణ్యం ఉన్న వారి హెచ్1బీ పట్ల సానుకూలత వ్యక్తం చేసినట్లు వారు అంగీకరిస్తున్నారు.

ప్రజల మనసు మాట వినండి!

▸▸ 'మన్‌కీ బాత్'పై రాహుల్ వ్యంగ్యాస్త్రాలు



దుబాయ్, జనవరి 11: భారత ప్రధాని మోదీ తన మనసులో మాటను(మన్‌కీ బాత్) చెబుతున్నారని, ప్రజలు తమ మనసులో ఏమనుకుంటున్నారో ఆయన వినాలని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అన్నారు. రెండు రోజుల యూఏఈ పర్యటన నిమిత్తం తొలిసారి దుబాయ్ వచ్చిన రాహుల్ భారతీయ కార్మికులను ఉద్దేశించి ప్రసంగించారు. "నేనిక్కడికి వచ్చింది నా మాటలు మీకు చెప్పడానికి కాదు. మీ మనసులోని మాటలను నేను వినేందుకే" అని అన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ నిర్వహిస్తున్న మన్‌కీ బాత్‌పై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. దుబాయ్‌లో కనిపిస్తున్న అభివృద్ధి వెనుక కచ్చితంగా మీ కృషి ఉందని ఇక్కడి భారతీయులను కొనియాడారు. "యుద్ధం మొదలైంది. మనమే విజయం సాధించనున్నాం" అని సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ విజయంపై రాహుల్ ధీమా వ్యక్తం చేశారు. 1984లో జరిగిన సిక్కుల ఊచకోతకు సంబంధించి దోషులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాల్సిందేనని రాహుల్ అన్నారు. భారత్‌లోని మైనారిటీల్లో అభద్రతా భావం నెలకొందని, మైనారిటీలకు హాని తలపెట్టేవారిని కఠినంగా శిక్షించాలని నొక్కి చెప్పారు.

మోదీ ఓ మోనార్క్

▸▸ ఆయనకు అసలు సిన్మా చూపిస్తాం

▸▸ పాదయాత్ర సభలో సీఎంని జగన్ గంట తిట్టి..మోదీపై పూర్తి మౌనం: లోకేశ్

పిఠాపురం/పెద్దాపురం రూరల్, జనవరి 11: ప్రధాని మోదీ మోనార్క్‌లా వ్యవహరిస్తూ, ప్రత్యేక హోదా అడిగిన ముఖ్యమంత్రి చంద్రబాబుపై కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి నారా లోకేశ్ మండిపడ్డారు. "తెలుగుజాతితో ఎవరు పెట్టుకున్నా మాడిమసైపోతారు. బీజేపీ మొన్న కర్ణాటక ఎన్నికల్లో ట్రైలర్ మాత్రమే చూసింది. అసలు సినిమా త్వరలోనే రాష్ట్రంలో చూపిస్తాం" అని హెచ్చరించారు. వచ్చే రాష్ట్ర ఎన్నికల్లో తిరిగి టీడీపీ విజయం తథ్యమని స్పష్టం చేశారు. తూర్పుగోదావరి జిల్లా పిఠాపురంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ కళాశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన జన్మభూమి ముగింపు కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. పాదయాత్ర ముగింపు సభలో జగన్ గంటనలభై నిమిషాలు మాట్లాడితే, అందులో గంట పాటు చంద్రబాబుని తిట్టారని, మోదీని మాత్రం ఒక్క మాట అనలేదన్నారు. ఇది మోదీ, జగన్ జోడీకి నిదర్శనం కాదా అని ప్రశ్నించారు.



తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురం మండలం కట్టమూరులో జలధార ట్యాప్‌ను ప్రారంభిస్తున్న నారా లోకేశ్

వైదొలగిన అలోక్ వర్మ!

ఉద్యోగానికి రాజీనామా.. అగ్నిమాపక డీజీగా అర్హుడిని కానని వివరణ

▸▸ తప్పుడు ఆరోపణలతో తొలగించారని ధ్వజం



న్యూఢిల్లీ, జనవరి 11: సీబీఐ మాజీ డైరెక్టర్ అలోక్ వర్మ తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో సీబీఐ డైరెక్టర్‌గా తిరిగి బాధ్యతలు చేపట్టిన 48 గంటల్లోనే మోదీ ప్రభుత్వం ఆయనను అగ్నిమాపక విభాగం డీజీగా బదిలీ చేసింది. ఆయన ఈ బాధ్యతలు చేపట్టకుండానే.. శుక్రవారం రాజీనామా చేశారు. 2017 జూలై 31తోనే ఆయన రిటైర్‌మెంట్ వయసు ముగిసింది. కేంద్ర ప్రభుత్వం ఆయనను అదే సంవత్సరం జనవరిలో సీబీఐ డైరెక్టర్‌గా నియమించింది. నిబంధనల ప్రకారం రిటైర్‌మెంట్ వయసుతో సంబంధం లేకుండా ఆ పదవిలో రెండేళ్లపాటు.. అంటే ఈ నెలాఖరు వరకు ఆయన కొనసాగించాల్సి ఉంది. ఆయన తన రాజీనామా లేఖలో ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ.. "దిగువ సంతకం చేసిన వ్యక్తి రిటైర్‌మెంట్ వయసు దాటినందున.. అగ్నిమాపక శాఖ డైరెక్టర్‌గా అర్హుడు కాడు. రిటైర్ అయినట్లుగా భావించగలరు" అంటూ లేఖ చివర్లో సంతకం చేశారు. "ఒకే ఒక వ్యక్తి.. అది కూడా నన్ను దెబ్బతీయాలనుకునే వ్యక్తి చేసిన తప్పుడు, నిరాధారమైన, చిల్లర ఆరోపణలతో నన్ను బదిలీ చేశారు. ఇది విషాదకరం" అని అలోక్‌వర్మ.. ఓ ప్రకటనలో వ్యాఖ్యానించారు.

ఉద్వాసన ఎందుకు?

ప్రధాని మోదీ, జస్టిస్ సిక్రీ, విపక్ష నేత మల్లికార్జున ఖర్గేలతో కూడిన ఉన్నతస్థాయి కమిటీ భేటీలో అసలేం జరిగింది? విశ్వసనీయ సమాచారం ప్రకారం.. సెంట్రల్ విజిలెన్స్ కమిషన్(సీవీసీ) నివేదిక ఆధారంగానే వర్మకు ఉద్వాసన పలకాలని ప్రధాని మోదీ, జస్టిస్ సిక్రీ తీర్మానించారు. ఈ నివేదికలో వర్మపై పది ఆరోపణలున్నాయి. వీటిలో ఏడు ఆరోపణలు నిరాధారం కాగా.. మూడు మాత్రమే 'పరిగణన'లోకి తీసుకోదగ్గవి. కానీ.. వాటికీ ఆధారాల్లేవు. అందులో ముఖ్యమైనది.. సతీశ్ సానా నుంచి వర్మ రూ.2 కోట్లు ముడుపులు తీసుకున్నారని 'మాజీ' స్పెషల్ డైరెక్టర్ రాకేశ్ అస్థానా చేసిన ఆరోపణ! బంగారం స్మగ్లింగ్ కేసు నిందితులపై చర్యలు తీసుకోలేదని, ఐఆర్‌సీటీసీ కేసు నిందితుల్లో ఒకరి పేరును తప్పించారనేవి మిగతా ఆరోపణలు.

సీబీఐలో బదిలీలాట!

సీబీఐ తాత్కాలిక డైరెక్టర్ ఎం.నాగేశ్వరరావు మొదటిసారి బాధ్యతలు చేపట్టగానే డజను మంది అధికారులను తలోచోటికి బదిలీ చేశారు. వారిలో... అలోక్‌వర్మ అనుకూలురే ఎక్కువమంది! సుప్రీంకోర్టు ఆదేశాల తర్వాత ఈ నెల 9న మళ్లీ సీబీఐ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన వర్మ ఆ బదిలీలను రద్దు చేశారు. తర్వాతి పరిణామాల నేపథ్యంలో గురువారం రాత్రి మళ్లీ నాగేశ్వరరావు సీబీఐ తాత్కాలిక డైరెక్టర్ అయ్యారు! ఆ మరుసటి రోజునే వర్మ ఉత్తర్వులను రద్దు చేశారు.

అస్థానాకు ఎదురుదెబ్బ

సీబీఐ ప్రత్యేక డైరెక్టర్ రాకేశ్ అస్థానాకు ఢిల్లీ హైకోర్టులో శుక్రవారం గట్టి ఎదురుదెబ్బ తగిలింది. అవినీతి ఆరోపణలపై ఆయన విచారణను ఎదుర్కోవాల్సిందేనని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ వ్యవహారంలో నమోదైన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలంటూ అస్థానాతో పాటు సీబీఐ డీఎస్పీ దేవేందర్ కుమార్, మధ్యవర్తి మనోజ్ ప్రసాద్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టేసింది. క్రిమినల్ దర్యాప్తు నుంచి అస్థానాకు ఊరట కల్పిస్తూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను కూడా జస్టిస్ నజ్మీ వజీరీ కొట్టివేశారు. దీంతో అస్థానాను అరెస్ట్ చేసే అవకాశం ఉంది. ఈ కేసులో నిజానిజాలను పరిగణనలోకి తీసుకుంటే అస్థానా, కుమార్‌ను ప్రాసిక్యూట్ చేయడానికి ముందస్తు అనుమతి తీసుకోవాల్సిన అవసరం కూడా లేదని వ్యాఖ్యానించిన న్యాయమూర్తి... ఈ కేసు దర్యాప్తును 10వారాల్లోగా పూర్తి చేయాలని సీబీఐని ఆదేశించారు.

తెలంగాణ హైకోర్టు సీజే రాధాకృష్ణన్ బదిలీ

హైదరాబాద్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్ కలకత్తా హైకోర్టు సీజేగా బదిలీ కానున్నారు. కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఇంతకాలం పనిచేసిన జస్టిస్ డీకే గుప్తా నిరుడు డిసెంబరు 31న పదవీ విరమణ చేయడంతో ఆ స్థానానికి జస్టిస్ రాధాకృష్ణన్‌ను బదిలీ చేయాలని సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది. సీజేఐ రంజన్ గోగోయ్ నేతృత్వంలోని ఐదుగురు సీనియర్ న్యాయమూర్తులతో కూడిన కొలీజియం గురువారం సమావేశమై ఈ మేరకు కొన్ని సిఫారసులు చేసింది. హైదరాబాద్‌లోని ఉమ్మడి హైకోర్టు విడిపోయి ఈనెల 1న తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ఆవిర్భవించిన తర్వాత తొలి సీజేగా టీబీఎన్ రాధాకృష్ణన్ పదవీ బాధ్యతలు చేపట్టారు. నిరుడు జూలై నుంచి డిసెంబరు 31వరకు హైదరాబాద్‌లోని ఉమ్మడి హైకోర్టుకు కూడా ఆయన సీజేగా సేవలందించారు. ఇదిలావుండగా, సుప్రీంకోర్టుకు ఇద్దరు కొత్త న్యాయమూర్తులు నియమితులు కానున్నారు. కర్ణాటక హైకోర్టు సీజే దినేశ్ మాహేశ్వరి, ఢిల్లీ హైకోర్టులోని న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నాలకు సుప్రీంకోర్టు జడ్జిలుగా పదోన్నతి కల్పిస్తూ కొలీజియం సిఫారసు చేసింది. జస్టిస్ మాహేశ్వరి రాజస్థాన్, అలహాబాద్ హైకోర్టుల్లో జడ్జిగా పనిచేశాక మేఘాలయ హైకోర్టు సీజేగా పదోన్నతి పొందారు. నిరుడు ఫిబ్రవరిలో కర్ణాటక హైకోర్టు సీజేగా బాధ్యతలు చేపట్టారు. జస్టిస్ ఖన్నా 2005 జూన్ నుంచి ఢిల్లీ హైకోర్టు జడ్జిగా పనిచేస్తున్నారు. సుప్రీంకోర్టులో మొత్తం 31 మంది జడ్జి పోస్టులు ఉండగా, ప్రస్తుతం 26 మంది పనిచేస్తున్నారు.

రోదసిలోకి మహిళ!

▸▸ ఏప్రిల్ రెండో వారంలో చంద్రయాన్-2 ప్రాజెక్టు మొదలు

▸▸ 2021 డిసెంబరు నాటికి అంతరిక్షంలోకి..: ఇస్రో చైర్మన్ శివన్



బెంగళూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): చంద్రునిపై రహస్యాలను ఛేదించేందుకు చేపడుతున్న ఈ చంద్రయాన్-2 ప్రాజెక్టుకు ఈ ఏడాది ఏప్రిల్ రెండో వారంలో శ్రీకారం చుడతామని, 2021 డిసెంబరు నాటికి మన వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఇస్రో చైర్మన్ కె శివన్ వెల్లడించారు. గగన్‌యాన్‌లో ప్రయాణించే బృందంలో మహిళా వ్యోమగాములు కూడా ఉంటారన్నారు. బెంగళూరులో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పది వేల కోట్ల రూపాయల ఈ ప్రాజెక్టు తుది రూపుకొచ్చిందని చెప్పారు. మహిళా వ్యోమగాములను కూడా స్పేస్‌లోకి పంపాలని తాము భావిస్తున్నామని, అయితే ఎంతమంది అనే దానిపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందని చెప్పారు. ఇందులో పాల్గొనే వారికి ప్రాథమిక శిక్షణను భారత్‌లో, అధునాతన శిక్షణను రష్యాలో ఇప్పిస్తామని తెలిపారు. ముగ్గురితో కూడిన వ్యోమనౌక ఏడు రోజులపాటు స్పేస్‌లో గడపనుందని భావిస్తున్నా వ్యోమగాముల సంఖ్యపై శివన్ స్పష్టతనివ్వలేదు.శ్రీహరికోట నుంచి ప్రయోగించే ఈ వ్యోమనౌకను భారీ రాకెట్ జీఎస్ఎల్వీ ఎంకే-3 ద్వారా ప్రవేశపెట్టాలని ఇస్రో భావిస్తోంది. పదేళ్ల క్రితం చంద్రయాన్-1 ప్రాజెక్టును విజయవంతంగా పూర్తి చేశామని, చంద్రయాన్-2ను మార్చి 25 నుంచి ఏప్రిల్ చివరిలోగా ప్రారంభించాలనే సంకల్పంతో ఉన్నామని శివన్ చెప్పారు. ఈ ఏడాది 32 ఉపగ్రహాల ప్రయోగానికి సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు.

ఇస్రోతో హాల్, ఎల్ అండ్ టీ ఒప్పందం

పీఎస్ఎల్వీలను పారిశ్రామికంగా తయారు చేసేందుకు హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్), ఎల్‌అండ్‌టీతో ఒప్పందం కుదుర్చుకున్నట్టు ఇస్రో శుక్రవారం తెలిపింది. పీఎస్ఎల్వీలను తయారు చేసేందుకు హాల్, ఎల్ అండ్ టీ సిద్ధంగా ఉన్నాయని.. తమ ప్రయాణంలో ఇదో కీలక మైలురాయి అని ఇస్రో చైర్మన్ కె శివన్ తెలిపారు.

సీఎంకు కృతజ్ఞతాభిషేకం

సామాజిక భద్రత పింఛన్ మొత్తాన్ని పెంచుతూ సీఎం వెల్లడించిన నిర్ణయంపై ఆయా వర్గాలలో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. ఒంగోలులో దివ్యాంగులు ఆనందోత్సవాలు వ్యక్తం చేస్తూ సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.





పెన్షన్ 2 వేలు!

వచ్చే నెల నుంచే ఇస్తాం.. జనవరిదీ కలిపి ఒకేసారి 3 వేలు.. వృద్ధులకు నేనిచ్చే సంక్రాంతి కానుక

ఏప్రిల్ నుంచి వైద్యానికి 5 లక్షలు.. మీ కన్నీళ్లు తుడిచే బాధ్యత నాదే

అగ్రవర్ణాలకు రిజర్వేషన్లు సరే.. కాపులు, మత్స్యకారులు, రజకుల కోటా ఏదీ?

రాష్ట్రంపై ముగ్గురు మోదీల కన్ను..బోగోలు సభలో బాబు

నెల్లూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు శుభవార్త. కొత్త సంవత్సరంలో వారికి సంతోషాన్ని కలిగిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు సంక్రాంతి కానుక ప్రకటించారు. ఫిబ్రవరి నుంచి రూ.2వేల చొప్పున పెన్షన్ ఇవ్వనున్నట్లు ప్రజల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. జనవరి నెలది కూడా కలిపి ఫిబ్రవరిలో ఒకేసారి రూ.3 వేలిస్తామని వెల్లడించారు. ఆర్థిక బలహీన వర్గాలకు పది శాతం రిజర్వేషన్ ప్రకటించిన ప్రధాని మోదీ.. ఆంధ్రలోని కాపుల కోటా బిల్లును ఎందుకు ఆమోదించలేదని ప్రశ్నించారు. వాల్మీకులు, మత్స్యకారులు, రజకులను వేరే వర్గాల్లోకి ఎందుకు చేర్చలేదని నిలదీశారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా బోగోలులో శుక్రవారం ఆరో విడత 'జన్మభూమి-మా ఊరు' ముగింపు సభలో చంద్రబాబు ఉద్వేగభరితంగా ప్రసంగించారు. ఏమన్నారో ఆయన మాటల్లోనే.. 'నిన్నా మొన్నా గ్రామసభలకు వెళ్లి చూశాను. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులను చూస్తే బాధేసింది. మళ్లీ ఆలోచించాను. వారికి మరింత భరోసా ఇవ్వాలని సంకల్పించాను. ఇప్పుడిస్తున్న పింఛనును రూ.2 వేలు చేసి ఇస్తానని సభాముఖంగా మాటిస్తున్నా. ఇది మీ అందరికీ నూతన సంవత్సర కానుక.. సంక్రాంతి కానుక. ఎంత ఖర్చయినా ఫర్వాలేదు. నాకు కావలసింది పేదవాళ్లే. జనవరి నెల రూ.1,000 కూడా కలిపి ఫిబ్రవరిలో మూడు వేలిస్తా. తర్వాతి నుంచి రూ.2 వేల చొప్పున ఇస్తా. సంతోషమా..? నేను కష్టపడేదే మీ కోసం. ఇంకా కష్టపడతా. సంపద సృష్టిస్తా.. సంపాదించింది తిరిగి మీకే ఇస్తా. నాకూ ఇబ్బందులున్నాయి. డబ్బులు లేవు. అయినా మీ కష్టాలు తీర్చే బాధ్యత, మీ కంట నీరు తుడిచే బాధ్యత నాది. తెలుగుదేశం ప్రభుత్వం అంటే నమ్మకం. జగన్ అంటే భయం. రాష్ట్రంపై ముగ్గురు మోదీలు కన్నేశారు. ఒక మోదీనే భరించలేకపోతున్నాం. ఇక ఆ ముగ్గురు కలిస్తే ఎంత భయంకరంగా ఉంటుందో ఊహించుకోండి. సంక్షోభ పరిస్థితుల్లో సుస్థిర ప్రభుత్వం అవసరం. ప్రపంచదేశాల ప్రజలు ఇలాంటి తీర్పు ఇవ్వడం వల్లే అమెరికా, జర్మనీ సహా పలు దేశాలు అభివృద్ధిలో దూసుకుపోతున్నాయి.'

మీ నమ్మకాన్ని వమ్ముచేయలేదు..

'నేనైతేనే రాష్ట్రాన్ని కాపాడుతానని నమ్మి 2014లో నాకు ఓట్లు వేసి అధికారంలో కూర్చోబెట్టారు. మీ నమ్మకాన్ని వమ్ము చేయలేదు. రేయింబవళ్లు కష్టపడుతున్నా. రాజధాని రాష్ట్ర ప్రజల కల. దానికి సహకరిస్తామని చెబితే ఎన్డీఏతో జత కట్టాను. ఏదైనా ఇస్తాడని ప్రధాని మోదీని రాజధాని శంకుస్థాపనకు పిలిచాను. ఆయన మట్టి..నీళ్లు తెచ్చి మన ముఖాన కొట్టేసిపోయారు. అయినా నేను వెనక్కి తగ్గలేదు. రాజధాని ప్రాంత రైతులకు పిలుపిచ్చా. నన్ను నమ్మి 34 వేల ఎకరాల భూమి ఇచ్చారంటే అదీ నా ప్రభుత్వంపై ఉన్న నమ్మకం. సింగపూర్‌కు వెళ్లాను. రాజధాని నిర్మాణానికి సహకరించమని అడిగాను. వాళ్లు పైసా కూడా తీసుకోకుండా కేబినెట్‌లో పెట్టి మనకు మాస్టర్ ప్లాన్ ఇచ్చారు. ఇదీ నాపై ఉన్న నమ్మకం. రామాయపట్నం పోర్టుకు శంకుస్థాపన చేస్తే అక్కడ భారీ పరిశ్రమలు పెట్టడానికి పలు కంపెనీలు ముందుకు వచ్చాయి. ఒకే రోజు లక్ష కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఇది నమ్మకం వల్ల జరిగింది కాదా? నమ్మకం లేకపోతే జరిగేవేనా..? వైసీపీ అధినేత జగన్ అంటే అందరికీ భయం. ఆయనతో జైలుకు తీసుకుపోతాడనే భయంతో పెట్టుబడులు పెట్టడానికి భయపడుతున్నారు. పారిశ్రామికవేత్తలు వాళ్ల జీవితాలనే నాశనం చేసుకున్నారు. కొంతమంది అధికారులు ఈయన మాటలు విని జైలుకు పోయే పరిస్థితి వచ్చింది. మనం ఏ పనిచేసినా నీతిగా చేస్తాం. అదీ వాళ్లకు, మనకు ఉన్న తేడా.'

కుక్కలు చింపిన విస్తరి కాకుండా..

'ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సోషల్ మీడియాలో చాలామంది మెసేజ్‌లు చేస్తున్నారు. ఒకతను రాశాడు. 'మీకేం సార్. మీరు బాగానే ఉంటారు. మేం నాశనమైపోతాం. అందుకే మళ్లీ మీరే (చంద్రబాబు) రావాలి. 135 కోట్ల మంది ప్రతినిధిగా ఉన్న ప్రధాని కూడా స్థాయి మరచి మీపై కత్తి కట్టారు.. రాష్ట్రం మీద కత్తి కట్టారు. మీరింకే పదవీ కోరుకోరు.. కానీ మా పిల్లల భవిష్యత్ కోసం మీరే రావాలి సార్.. దేశంలో నాశనం అవుతున్న వ్యవస్థలను తిరిగి గాడిలోపెట్టాలంటే మీరు రావాలి. అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్న రాష్ట్రాన్ని అవినీతి, అరాచక, అటవిక పాలనవైపు వెళ్లకుండా ఉండాలంటే మీరే రావాలి సార్.. అని ఇలా చాలామంది మెసేజ్‌లు పెడుతున్నారు. నేను నాలుగున్నరేళ్లు రాత్రింబవళ్లూ మీ కోసం కష్టపడ్డాను. రాష్ట్రం కుక్కలు చింపిన విస్తరి కాకూడదంటే మళ్లీ టీడీపీయే రావాలి. ఈ ప్రభుత్వానికి అండగా ఉండే బాధ్యత మీది. మిమ్మల్ని అన్ని విధాలా ఆదుకునే బాధ్యత, కష్టాలు లేకుండా చూసే బాధ్యత ఈ ప్రభుత్వానిది. అండగా నిలవండి. ఆశీర్వదించండి. విభజన హామీలను నెరవేర్చండని మోదీని అడిగాం. ప్రత్యేక హోదా కోరాం.. అడుక్కున్నాం.. గట్టిగా అడిగాం.. ఏమీ చేయకుంటే విధిలేక విడిపోయాం. దీనికి మోదీ కక్ష కట్టారు. నియంతలా వ్యవహరిస్తున్నారు. మన వాళ్లపై సీబీఐ దాడులు చేయించారు. మరోఅడుగు ముందుకేసి మన టెలిఫోన్లన్నీ ట్యాప్ చేస్తున్నారు. మన కంప్యూటర్లలోకి ప్రవేశించి సమాచారం దొంగిలించబోతున్నారు. దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ అమలు చేస్తున్నారు.'

మీ ఆరోగ్యమే మా భాగ్యం

'పేదలపై వైద్యం ఖర్చులు భారాన్ని తగ్గించేందుకు ఏప్రిల్ నుంచి ఎన్టీఆర్ వైద్య సేవల పరిమితిని రూ.5లక్షలకు పెంచుతున్నాం. వైద్య ఖర్చులు తగ్గించడం కోసం ఇప్పటికే చాలా చర్యలు తీసుకున్నాం. ఆస్పత్రుల్లో వైద్య పరీక్షల ఖర్చులు, మందుల ఖర్చులు తగ్గించాం. ప్రజలు ఒక విషయం ఆలోచించాలి. ప్రజల కష్టాలు గమనించి ఎప్పటికప్పుడు కొత్త కొత్త సంక్షేమ పథకాలు అమలు చేసుకుంటూ వెళ్తున్నాం. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఏ ఒక్క కార్యక్రమాన్నీ నిలిపివేయలేదు. కిలో రూపాయికే బియ్యం ఇస్తున్నాం. సంక్రాతి కానుక, చంద్రన్న బీమా, చంద్రన్న పెళ్లికానుక ఇస్తున్నాం. మన ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న నాయకులు అభివృద్ధి, సంక్షేమాల్లో మన దరిదాపుల్లో అయినా ఉన్నారా..?'

60,590 మంది రైతులకు పట్టాల పంపిణీ..

జన్మభూమి ముగింపు సభ పేదలు, వృద్ధుల్లో మరపురాని మధురానుభూతి కలిగించింది. పింఛన్ల పెంపు ప్రకటనతో వారి ఆనందానికి అవధుల్లేవు. వేదికపైన ఉన్న నాయకులు, సభాప్రాంగణంలోని ప్రజలందరూ లేచి నిలబడి కరతాళ ధ్వనులు చేశారు. నెల్లూరు జిల్లా పరిధిలోని 66,276 ఎకరాల సీజేఎఫ్ఎస్ భూమిని 60,590 మంది ఎస్సీ, ఎస్టీ రైతులకు సీఎం పట్టాలుగా పంపిణీ చేశారు. పట్టాలన్నీ మహిళల పేర్లపై ఇవ్వడం గమనార్హం. పసుపు-కుంకుమ కింద ఈ పట్టాలు ఇస్తున్నానని, ఇది తన అదృష్టంగా భావిస్తున్నానని సీఎం అన్నారు. రూ.8వేల కోట్ల విలువైన భూములు తమ పేర్ల మీద పట్టాలు చేతికి అందడంతో ఎస్సీ, ఎస్టీ మహిళలు ఆనందపడ్డారు. పదే పదే పట్టా కాగితాలను చూసుకుంటూ మురిసిపోయారు.

ఏడాదికల్లా దామవరం!

- **దగదర్తి సమీపాన ఎయిర్‌పోర్టుకు సీఎం శంకుస్థాపన**
- **దీనితో కృష్ణపట్నం రేవు మరింత అభివృద్ధి**
- **రామాయపట్నం పోర్టు 20 నెలల్లో పూర్తి: చంద్రబాబు**

కావలి/నెల్లూరు, జనవరి 11: రాష్ట్రంలో రైల్వే, రోడ్డు, వాయు, జల మార్గాలు అభివృద్ధి చేసి అనుసంధానం చేస్తే అభివృద్ధి సాధ్యపడుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. నెల్లూరు జిల్లా దగదర్తి మండలం దామవరంలో 'నెల్లూరు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు లిమిటెడ్ (ఎన్ఐఏఎల్)' విమానాశ్రయానికి శుక్రవారం మధ్యాహ్నం ఆయన శంకుస్థాపన చేశారు. పైలాన్‌ను ప్రారంభించిన అనంతరం జరిగిన సభలో సీఎం మాట్లాడారు. 'దేశంలో 1000 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉన్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. బకింగ్‌హాం కెనాల్‌ను అభివృద్ధి చేసుకుని జల మార్గాన్ని కూడా రూపొందించుకుంటే వస్తువుల రవాణాకు అనుకూలంగా ఉంటుంది. సముద్ర రవాణాలో మనం రెండో స్థానంలో ఉన్నాం. మొదటి స్థానంలో ఉన్న గుజరాత్‌ను అధిగమించాలి. దామవరం వద్ద ఎయిర్‌పోర్టు నిర్మాణంతో ఇక్కడున్న కృష్ణపట్నం రేవు మరింత అభివృద్ధి చెంది దేశంలోనే నంబర్ వన్ అయ్యేందుకు అవకాశం ఉంది. రామాయపట్నం పోర్టు కూడా 20 నెలల్లో నిర్మాణం పూర్తికానుంది. ఈ రెండు రేవుల మధ్య జాతీయ రహదారి పక్కనున్న దామవరం విమానాశ్రయానికి మంచి భవిష్యత్ ఉంటుంది' అని తెలిపారు. దామవరం విమానాశ్రయ నిర్మాణం 12 నెలల్లో పూర్తిచేస్తామని.. మళ్లీ తానే వచ్చి ప్రారంభోత్సవం చేస్తానని ప్రకటించారు.

అమరజీవి స్వగ్రామంలో..

ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు జన్మించిన జువ్వలదిన్నె గ్రామాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని సీఎం ప్రకటించారు. పర్యాటకులను ఆకర్షించేలా పార్కును నిర్మించి దానికి పొట్టిశ్రీరాములు పార్కుగా నామకరణం చేస్తామని హామీ ఇచ్చారు. ఇక్కడ ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి కృషి చేస్తున్నామని, త్వరలోనే కేంద్రం నుంచి అనుమతులు సాధించి పనులు ప్రారంభిస్తామని ప్రకటించారు. రూ.25 కోట్లతో నిర్మించిన చిప్పలేరు వాగు వంతెనను ప్రారంభించారు. అనంతరం పొట్టిశ్రీరాములు స్మారక భవనం వద్ద.. రూ.110 కోట్లతో చేసిన అభివృద్ధి పనులకు ప్రారంభ సూచికగా పైలాన్‌ను ఆవిష్కరించారు. అదే ప్రాంగణంలో అమరజీవి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పించారు. 8, 9, 10 తరగతులు చదివే విద్యార్థినుల కోసం ఉచితంగా శానిటరీ న్యాప్‌కిన్స్ కిట్లు అందించే 'రక్ష' పథకాన్ని బోగోలులో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో సీఎం ప్రారంభించారు. 6లక్షల మంది విద్యార్థినులకు ఈ పథకం వర్తిస్తుంది.



దామవరం విమానాశ్రయ నిర్మాణానికి పైలాన్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం



జన్మభూమి సభలో సీజేఎఫ్ఎస్ భూముల పట్టాలు అందుకుని వస్తున్న వృద్ధులు

పింఛన్... పెంచెన్!

- **అన్ని సామాజిక పెన్షన్లు రెట్టింపు..**
- **వృద్ధాప్య, వితంతువులకు 2వేలు**
- **దివ్యాంగులకు రూ.3 వేలు**
- **డయాలసిస్ రోగులకు 3500**
- **ఈ నెల నుంచే అమలు**
- **54 లక్షల మందికి 'భరోసా'**

ఎందరు లబ్ధిదారులు

వృద్ధాప్య పింఛన్లు	24,22,444
వితంతువులు	20,13,808
దివ్యాంగులు	6,41,820
చేనేత కార్మికులు	1,07,992
కల్లుగీత కార్మికులు	28,011
ఎయిడ్స్ పింఛన్లు	32,979
ట్రాన్స్‌జెండర్	1,665
మత్స్యకారులు	45,358
ఒంటరి మహిళలు	1,12,471
డయాలసిస్ రోగులు	8,044
మొత్తం:	54,14,592

అమరావతి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): 'రెట్టింపు పింఛనుతో రెట్టింపు ఆనందం' అంటూ రాష్ట్ర ప్రభుత్వం సుమారు 54 లక్షల మందికి తీపి కబురు వినిపించింది. గతంలో రూ.200 ఉన్న వృద్ధాప్య పింఛనును ఒకేసారి వెయ్యి చేసిన సీఎం చంద్రబాబు.. ఇప్పుడు దానిని ఏకంగా రూ.2వేలకు పెంచారు. దీంతోపాటు సామాజిక పింఛన్లను రెట్టింపు చేశారు. ఈ పెంపు ఈ నెలనుంచే అమలులోకి వచ్చినట్లే! జనవరి పింఛను ఇప్పటికే లబ్ధిదారుల ఖాతాలో జమ చేసినందున.. ఫిబ్రవరిలో పెరిగిన పింఛనుతోపాటు, జనవరి తాలూకు సగం కలిపి జమ చేస్తారు. ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా కింద సామాజిక పింఛన్లను అందిస్తోంది. వృద్ధాప్య, వితంతు, చేనేత, నేత కార్మికులు, మత్స్యకారులు, కళాకారులు, డప్పు కళాకారులు, ఒంటరి మహిళలకు ఇప్పటిదాకా రూ.వెయ్యి పింఛను ఇస్తోంది. ఇకపై వీరందరికీ రెండు వేలు అందుతుంది. ఇక.. ట్రాన్స్‌జెండర్లు, దివ్యాంగులకు ఇస్తున్న రూ.1500ని రూ.3వేలకు పెంచారు. కిడ్నీ రోగులకు ఇస్తున్న రూ.2500ను 3500కు పెంచారు. "దేశంలో మరే రాష్ట్రంలోనే ఈ స్థాయిలో సామాజిక పింఛన్లు చెల్లించడంలేదు. ప్రభుత్వం రూ.15,600 కోట్లను పింఛన్ల కోసం వెచ్చిస్తుంది. అంటే... ఐదేళ్లకు రూ.78 వేల కోట్లు. ఇది అసాధారణ సాయం"అని టీడీపీవర్గాలు పేర్కొన్నాయి.

పసుపు.. కుంకుమా...
పది వేలు అందుకోమ్మా!

- **ఇప్పటికే మూడు విడతల్లో జమ**
- **పండగ కానుకగా మరోసారి సాయం!!**
- **ఒకేవిడతలో పది వేలు ఇచ్చేలా సన్నాహాలు**
- **94 లక్షల మంది మహిళలకు లబ్ధి**

అమరావతి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రభుత్వం మరో వరం ప్రకటించాలని యోచిస్తోంది. 'పసుపు కుంకుమ' కింద పెట్టుబడి నిధిగా డ్వాక్రా మహిళలకు ఇప్పటికే రూ.10వేల చొప్పున చెల్లించగా... 'సంక్రాంతి కానుకగా మరో దఫా అంతే మొత్తాన్ని, అదికూడా ఒకే విడతలో చెల్లించాలని భావిస్తున్నట్లు తెలిసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు డ్వాక్రా సంఘాలను తన మానస పుత్రికలుగా అభివర్ణిస్తుంటారు. వాటికి మొదటి నుంచీ అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇప్పటికే ఒక్కో గ్రామంలో ప్రతి 30 కుటుంబాలకు ఒకరిని చొప్పున సాధికార మిత్రను డ్వాక్రా సంఘాల నుంచి ఎంపిక చేశారు. ఆ 30 కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకున్నారు. ప్రతి కుటుంబానికి నెలకు కనీస ఆదాయం రూ.10వేలు ఉండాలని లక్ష్యంగా పెట్టుకున్న రాష్ట్ర ప్రభుత్వం... డ్వాక్రా మహిళల ద్వారానే ఈ ఆర్థిక సాధికారత లభిస్తుందని నమ్ముతోంది. అందుకు అనుగుణంగా అనేక పథకాల లబ్ధిదారులుగా మహిళలనే ఎంపిక చేస్తోంది.

మేనిఫెస్టో అమలులో భాగంగా.....

డ్వాక్రా సంఘాలకు రుణాలను రద్దు చేస్తామని ఎన్నికల సమయంలో టీడీపీ హామీ ఇచ్చింది. అయితే... దీనివల్ల అప్పు తీసుకుని ఇంకా చెల్లించని వారికే లబ్ధి చేకూరుతుందని, కష్టపడి రుణం తీర్చిన వారికి నష్టం జరుగుతుందని భావించారు. ప్రతి డ్వాక్రా మహిళకు ప్రయోజనం అందేలా నిపుణులతో చర్చించి రూపకల్పన చేసిన పథకమే 'పెట్టుబడి నిధి'! దీనినే 'పసుపు కుంకుమ' పేరిట ప్రతి డ్వాక్రా మహిళకు రూ.10వేల చొప్పున అందించారు. 86 లక్షల మందికి... మూడు విడతల్లో రూ.8600 కోట్లు జమ చేశారు. దీంతోపాటు డ్వాక్రా రుణాలపై 2014 ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ 2015 వరకు 15 నెలల వడ్డీ రూ.1338 కోట్లను బ్యాంకులకు ప్రభుత్వమే చెల్లించింది. ఇప్పుడు మరో విడత పసుపు కుంకుమ కింద రూ.10వేలు చెల్లించాలని భావిస్తున్నట్లు సమాచారం. ఈ పెట్టుబడి నిధి డ్వాక్రా మహిళల 16 నెలల పొదుపు మొత్తంతో సమానం. కార్పస్ నిధి పెరగడంవల్ల స్వయం సహాయక సంఘాలకు బ్యాంకుల ద్వారా ఎక్కువ మొత్తంలో రుణం లభిస్తుంది. రాష్ట్రంలో ప్రస్తుతం 94 లక్షల మంది స్వయం సంఘాల సభ్యులున్నారు.



పట్టుదలతో పనిచేస్తా

- **ఇది 'అభివృద్ధి సంక్రాంతి': సీఎం.. జన్మభూమిపై టెలికాన్ఫరెన్స్**

పింఛన్ల దరఖాస్తుల వివరాలు

మొత్తం అందిన ఫిర్యాదులు	1,57,185
సత్వరం పరిష్కరించినవి	2,607
పరిశీలించి, మంజూరు చేయనవి	88,543
పరిశీలించాల్సినవి	38,887
రెండో సారి వచ్చిన అర్జీలు	17,146
తిరస్కరణకు గురైనవి	27,148

అమరావతి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): 'గతంలో తొమ్మిదేళ్ల సీఎంగా నేను ఒక్కడినే పరుగెత్తాను. ఇప్పుడు ఆ విధంగా కాదు. ఒక బృందంగా పరుగులు తీస్తున్నాం. అందుకే ఫలితాలు గొప్పగా సాధిస్తున్నాం. మన కంటే ఇతర రాష్ట్రాలు ముందుకు పోతే నాకు అసూయ. ఆ అసూయనే కసిగా మార్చుకుని మరింత పట్టుదలతో పనిచేస్తాను' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. 'జన్మభూమి-మాఊరు' చివరి రోజు నిర్వహణపై కలెక్టర్లు, నోడల్ అధికారులు, ప్రజాప్రతినిధులతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. 'విభజన రోజు దిక్కుతోచని స్థితి. ఇప్పుడు అద్భుత ప్రగతి సాధించాం. ఇది నిజమైన సంక్రాంతి. ఇది రాష్ట్ర అభివృద్ధి సంక్రాంతి.40 ఏళ్లలో ఎప్పుడూ లేనంత ఆనందం, సంతృప్తి' అని సీఎం అన్నారు. రాజధాని నిర్మాణంలో వచ్చినంత ఆనందం దేనిలోనూ రాదని చెప్పారు. '2014లో కొందరు రాష్ట్రానికి రావడానికి ఆసక్తి చూపలేదు. కొంత మంది మాత్రమే వచ్చేందుకు ఆసక్తి చూపారు. మన బృందాన్ని బలహీన బృందం అన్నారు. అదే బృందంతో అద్భుతాలు సృష్టించాం. 4 ఏళ్లలో 670 అవార్డులే మన కృషికి నిదర్శనం. మీ త్యాగాల ఫలితంగానే ఈరోజు రాష్ట్రం ఈ స్థాయికి చేరింది. అధికార, ఉద్యోగ బృందాన్ని చూసి గర్విస్తున్నా' అని పేర్కొన్నారు. 16 వేల గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించడం, వాటి అభివృద్ధి ప్రణాళికలను అప్‌లోడ్ చేయడం ఒక చరిత్రగా అభివర్ణించారు. పోలవరం కాంక్రీటు పనుల్లో గిన్నిస్ రికార్డు సాధించామన్నారు. మొదటి జన్మభూమికి 40 లక్షల వినతులు వచ్చాయని.. ఈ దఫా ఇప్పటి వరకు 4.57లక్షల వినతులు అందాయని.. ప్రజల్లో సంతృప్తి శాతానికి ఇదే రుజువని చెప్పారు.

'ఎన్టీఆర్'లో బాలకృష్ణ నటన భేష్

ఎన్టీఆర్ బయోపిక్‌ను దర్శకుడు క్రిష్ అద్భుతంగా తీశారని సీఎం అభినందించారు. ఎన్టీఆర్ పాత్రలో బాలకృష్ణ బ్రహ్మాండంగా నటించారని, స్వర్గీయ ఎన్టీఆర్ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శం, స్ఫూర్తిదాయకమని చెప్పారు. గురువారం రాత్రి విజయవాడ ట్రెండ్‌సెట్ మాల్‌లో ఈ బయోపిక్ చిత్రాన్ని సీఎం వీక్షించారు.

జన్మభూమిలో 5.25లక్షల అర్జీలు

ఆరో విడత 'జన్మభూమి-మాఊరు' కార్యక్రమంలో భాగంగా 1,68,735 సభలు నిర్వహించగా, 5.25,219అర్జీలు అధికారులకు అందాయి. జన్మభూమి వెబ్‌సైట్ లింక్ ద్వారా17,465 వీడియోలను ప్రజలు అప్‌లోడ్ చేశారు.5,54002 గ్రామసభల ఫోటోలను అధికారులు డ్యాష్ బోర్డులో అప్‌లోడ్ చేశారని ఆర్టీజీఎస్ అధికారులు శుక్రవారం రాత్రి తెలిపారు.

ఆటోలపై పన్నుల్లేవ్!

- **5.66 లక్షల మందికి లబ్ధి**
- **త్రైమాసిక, జీవిత కాల పన్ను ఎత్తివేత**
- **వ్యవసాయ ట్రాక్టర్లపైనా పన్నులు రద్దు?**

అమరావతి,, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఆటోవాలాలకు చంద్రబాబు ప్రభుత్వం సంక్రాంతి కానుక అందజేసింది. ఆటోలపై పూర్తిగా పన్ను రద్దు చేసింది. దీంతోపాటు రాష్ట్రంలో రెండు లక్షల మంది ట్రాక్టర్ ఓనర్ కమ్ డ్రైవర్లకు సైతం శుభవార్త చెప్పింది. వాటిపైనా పన్నులు రద్దు చేయాలని నిర్ణయించింది. ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 5.66లక్షల ఆటోలున్నాయి. వీటికి ప్రతి నెలా రూ.110 చొప్పున ఏటా రూ.1320 రోడ్డు ట్యాక్స్ చెల్లించాల్సి ఉంది. ప్రతి నాలుగు నెలలకొకసారి రూ.440 చొప్పున ఆర్టీఏ ఆఫీసుకు వెళ్లి పన్ను చెల్లించాల్సి ఉంది. దీనిని పూర్తిగా రద్దు చేసి... జీవితకాల పన్ను (లైఫ్ ట్యాక్స్) మాత్రమే తీసుకోవాలని ప్రభుత్వం తొలుత నిర్ణయించింది. నిరుపేదలైన ఆటో కార్మికుల నుంచి ఆ మొత్తం తీసుకోకూడదని తాజాగా నిర్ణయించినట్లు తెలిసింది. వెరసి... ఆటోలపై ఎలాంటి పన్నూ ఉండదు. ఆటో కొనుగోలు సమయంలో కట్టే రెండు శాతం పన్ను మాత్రమే అమలులో ఉంటుంది. దీనివల్ల ప్రభుత్వంపై రూ.100 కోట్ల భారం పడనుంది. రాష్ట్రంలోని 2లక్షలకు పైగా వ్యవసాయ ట్రాక్టర్లపైనా అన్నిరకాల పన్నులు రద్దు చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది.



నారావారిపల్లెకు.. నారా, నందమూరి కుటుంబాలు

- **సంక్రాంతి సంబరాలు అక్కడే**

చంద్రగిరి, జనవరి 11: సీఎం చంద్రబాబు స్వగ్రామమైన చిత్తూరు జిల్లా చంద్రగిరి మండలం నారావారిపల్లెకు సంక్రాంతి కళ వచ్చేసింది. నారా, నందమూరి కుటుంబ సభ్యులు శనివారం నారావారి పల్లెకు చేరుకోనున్నారు. సీఎం చంద్రబాబు ఏటా సంక్రాంతి పండుగను కుటుంబ సమేతంగా స్వగ్రామంలో జరుపుకొంటున్నారు. శనివారం మధ్యాహ్నం సీఎం సతీమణి భువనేశ్వరి, కుమారుడు లోకేశ్, కోడలు బ్రహ్మణి, మనవడు దేవాన్ష్ నారావారి పల్లెకు రానున్నారు. చంద్రబాబు మాత్రం 14వ తేదీన అక్కడకు చేరుకొంటారు. చంద్రబాబు వియ్యంకుడు, నటుడు నందమూరి బాలకృష్ణ కుటుంబ సభ్యులు శనివారమే నారావారి పల్లెకు చేరుకోనున్నారు.

పాడికి బీమా ధీమా!



- **పశువులకు సైలేజ్, దాణామృతం**
- **చనిపోతే రూ.30వేలు పరిహారం**
- **కొత్త పశువును కొనేందుకు సహాయం**

అమరావతి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పాడి పంటలు బాగుంటే... రైతు బాగుంటాడు! పంటకు ఇప్పటికే బీమా ఉంది. ఇప్పుడు... పాడి పశువులకూ బీమా కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రైతు పెంచుకునే పశువులు ఏవైనా చనిపోతే.. ఒక్కోదానికి రూ.30వేలు పరిహారంగా చెల్లిస్తారు. ఈ మొత్తంతో రైతు మరో పశువును కొనుగోలు చేయవచ్చు. రాష్ట్రవ్యాప్తంగా జిల్లాకు లక్ష చొప్పున పశువులకు బీమా పథకంలోకి తీసుకొస్తారు. అవసరాన్ని బట్టి కొన్ని జిల్లాల్లో 1.5 లక్షల పశువులను చేరుస్తారు. బీమా పరిధిలోకి వచ్చిన ప్రతి పశువు చెవికి ఒక ఎలక్ట్రానిక్ ట్యాగ్ వేస్తారు. ఈ ట్యాగ్‌ను తొలగించడం కుదరదు. ఒకవేళ పోయినా మరొక ట్యాగ్ వేస్తారు. ఈ పథకం కింద... పశు పోషణ కోసం సైలేజ్ గడ్డి, దాణామృతం సరఫరా చేస్తారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సంక్రాంతి సందర్భంగా ఈ పథకంపై అధికారిక ప్రకటన చేసే అవకాశాలున్నాయి.

'స్మార్ట్' అయిపోండి!

- **పేద కుటుంబాలకు ఉచితంగా స్మార్ట్ ఫోన్లు**

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఇప్పుడు మొబైల్ ఫోన్ అంటే... స్మార్ట్ ఫోన్! మాట్లాడుకోవడానికి మాత్రమే కాదు... సినిమా టికెట్ల బుకింగ్ నుంచి బ్యాంకు లావాదేవీల దాకా అన్నీ అరచేతిలోనే జరిగిపోతున్నాయి. అయితే... ఇప్పటికీ చాలా మంది పేదలు మామూలు మొబైల్ ఫోన్లే వాడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రతి పేద కుటుంబానికి స్మార్ట్‌ఫోన్ ఇచ్చే ఆలోచన చేస్తున్నట్లు గతంలోనే చంద్రబాబు ప్రకటించారు. ఇప్పుడు దానిపై దాదాపుగా నిర్ణయం తీసేసుకున్నారు. తాజాగా టెలికాన్ఫరెన్స్‌లో ఈ అంశాన్ని ప్రస్తావించినట్లు తెలిసింది. స్మార్ట్‌ఫోన్లతోపాటు ఇంటింటికీ ఫైబర్ నెట్ కనెక్షన్‌తో మేలు జరుగుతుందని, ఇది కొత్త ఆదాయ మార్గాలకు దారిచూపుతుందని చంద్రబాబు భావిస్తున్నారు. స్మార్ట్ ఫోన్లను డ్వాక్రా సంఘాలకే ఇవ్వాలా? లేక... రాష్ట్రంలో తెల్ల రేషన్‌కార్డులు ఉన్నవారందరికీ ఇవ్వాలా? అనే దానిపై తర్జనభర్జనలు జరుగుతున్నాయి. డ్వాక్రా సంఘాలకు ఇవ్వాలనుకుంటే... 92 లక్షల ఫోన్లు అవసరం. అదే... కుటుంబాలకు ఒకటిగా లెక్కిస్తే ఈ సంఖ్య తగ్గుతుంది. తెల్లరేషన్‌కార్డుల లెక్క తీస్తే... 1.40 కోట్ల మంది స్మార్ట్ ఫోన్లు అవసరం. మరోవైపు... స్మార్ట్‌ఫోన్లకు నగదు ఇస్తే, తమకు నచ్చిన ఫోన్ కొంటారని కొందరు అధికారులు సూచించారు.



తయారీ ధరకే ఇచ్చేలా...

స్మార్ట్‌ఫోన్ల పంపిణీకి కనీసం ఏడెనిమిదివేల కోట్ల రూపాయలు అవసరమవుతాయి. కంపెనీలను నేరుగా సంప్రదించి... తయారీ ధరలకే ఇవ్వాలని అడుగుతున్నారు. రాష్ట్రంలోనే తయారవుతున్న మొబైల్ కంపెనీల నుంచి వీటిని కొనుగోలు చేయాలని భావిస్తున్నారు. సెల్‌కాన్‌తోపాటు పలు కంపెనీలతో దీనిపై చర్చలు చేసినట్లు తెలిసింది.



ఫుడ్ ఫెస్టివల్‌ను తిలకిస్తున్న పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేశ్ కుమార్ మీనా

తెలుగు వంటల పండగ ప్రారంభం

విజయవాడ, జనవరి 11(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగ నేపథ్యంలో రాష్ట్రానికి చెందిన 66 వంటలతో ఆహార పండగ (ఫుడ్ పెస్టివల్) మొదలయ్యింది. విజయవాడలోని నోవాటెల్ హోటల్‌లో ఏర్పాటు చేసిన ఈ ఆంధ్రా ఫుడ్ ఫెస్టివల్‌ను శుక్రవారం పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేశ్ కుమార్ మీనా ప్రారంభించారు. తెలుగు ప్రజల ప్రత్యేక వంటకాలకు బ్రాండింగ్ కల్పించి, భౌగోళిక గుర్తింపు తీసుకురావడమే లక్ష్యంగా ఈ ప్రదర్శన ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

'సెట్స్'కు ఏపీ ఆన్‌లైన్ సేవలు

అమరావతి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): 2019-20 విద్యా సంవత్సరానికి సంబంధించి వివిధ సాంకేతిక, వృత్తివిద్యా కోర్సుల్లో అడ్మిషన్ల కోసం కంప్యూటర్ ఆధారితంగా నిర్వహించే 'ఉమ్మడి ప్రవేశ పరీక్షల(సెట్స్)'కు ఏపీ ఆన్‌లైన్ సేవలను వినియోగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2018-19 విద్యాసంవత్సరంలో నిర్వహించిన సెట్స్‌కు ఏపీఆన్‌లైన్-టీసీఎస్ సేవలను వినియోగించుకున్న ప్రభుత్వం... 2019-20లో నిర్వహించనున్న సెట్స్‌కు కూడా వాటి సేవలను పొడిగించింది. సెట్స్‌కు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు చెల్లించాల్సిన ఫీజులపై ఏపీ ఆన్‌లైన్‌తో సంప్రదింపులు చేసిన తర్వాతే రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఒక అవగాహన ఒప్పందం కుదుర్చుకోనుంది. ఈ మేరకు ఉన్నత విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి కె.దమయంతి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు.

ఈడబ్ల్యూఎస్‌లో చేర్చేస్తారేమో?

▸▸ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల్లో అనుమానాలు: యనమల

అమరావతి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): కేంద్రం చెబుతున్న ఆర్థిక వెనుకబాటు విధానంపై ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీల్లో అనుమానాలున్నాయని ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు వ్యాఖ్యానించారు. వాళ్లను కూడా ఈడబ్ల్యూఎస్ పరిధిలోకి తెస్తారని భయపడుతున్నారని, బీజేపీ అంటేనే బలహీనవర్గాల్లో భయం పట్టుకుందని శుక్రవారమిక్కడ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాంఘిక వెనుకబాటుతనం ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వాలని అంబేడ్కర్ చెప్పారని.. ఆర్థిక వెనుకబాటు గురించి ఆయన చెప్పలేదని తెలిపారు. నిలబడదని తెలిసీ రిజర్వేషన్లు పెట్టడం ఈడబ్ల్యూఎస్‌లకు ద్రోహం చేయడమేనని అభిప్రాయపడ్డారు. 'రెండు నెలల్లో ఎన్నికలున్న నేపథ్యంలో మోదీ ఎన్ని జిత్తులు, జిమ్మిక్కులు చేసినా ప్రజలు నమ్మరు. ఈడబ్ల్యూఎస్‌లకు పది శాతం రిజర్వేషన్లు తాజా జిమ్మిక్కు. ఎన్నికలకు రెండు నెలల ముందు హామీలను ఎలా నమ్ముతారు? పైగా ఇది వచ్చే జూలై నుంచి అమల్లోకి వస్తుందని చెబుతున్నారు. అప్పటికి ఎన్నికలు అయిపోతాయి. మోదీ ఉండరు. ఓడిపోతామన్న భయంతోనే వీటిని బయటకు తీస్తున్నారు తప్ప ఆర్థిక వెనుకబడిన వర్గాలపై మోదీకి ప్రేమ లేదు' అని విమర్శించారు. 'పాత మిత్రులతో దోస్తీకి సిద్ధం అనడంలోనే మోదీ దివాలాకోరుతనం తెలిసిపోతోంది. భాగస్వామ్య పక్షాల విశ్వసనీయతను ఆయన కోల్పోయారు. గేట్లు తెరుచుకుని భాగస్వామ్య పార్టీలే వెళ్లిపోయాయి. పరిస్థితి బాగోలేకే ఇప్పుడు పాత మిత్రులు గుర్తుకు వచ్చారు' అని పేర్కొన్నారు. ఏపీకి రూ.32వేల కోట్లు ఇస్తామని కేంద్ర అధికారులు అంటున్నా దానికి మోదీ సమ్మతి ఉండాలని కోరుకుంటున్నారని, అసలు సమస్య మోదీలోనే ఉందనిఅన్నారు. కేంద్రం ఇవ్వాల్సిన నిధులపై జగన్ నోరు తెరవరని, రాష్ట్రానికి న్యాయం జరగడం ఇష్టం లేక మౌనం వహిస్తున్నారని విమర్శించారు.

ఈడబ్ల్యూఎస్ కోటాతో ముప్పేమీ లేదు: జైట్లీ

న్యూఢిల్లీ, జనవరి 11 : ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యా సంస్థల్లో ఆర్థిక బలహీన వర్గాలకు (ఈడబ్ల్యూఎస్) పదిశాతం కోటాతో రాజ్యాంగ మౌలిక స్వరూపానికి వచ్చిన ముప్పేమీ లేదని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అన్నారు. ఈబీసీలకు కోటా కేటాయించినంత మాత్రాన రాజ్యాంగాన్ని ఉల్లంఘించినట్లు కాదని స్పష్టం చేశారు. ఈ రాజ్యాంగ సవరణ బిల్లుకు కాంగ్రెస్ అయిష్టంగా, తిట్టుకుంటూ మద్దతు ఇచ్చిందని ఆయన విమర్శించారు.

మిచెల్‌కు దౌత్యసాయానికి భారత్ అనుమతి

న్యూఢిల్లీ, జనవరి 11:అగస్టా వెస్ట్‌ల్యాండ్ హెలికాప్టర్ల కుంభకోణంలో దళారి క్రిస్టియన్ మిచెల్‌కు దౌత్యపరమైన సాయానికి అవకాశమిచ్చామని భారత్ తెలిపింది. విదేశాంగ శాఖ ప్రతినిధి రవీశ్ కుమార్ ఈ విషయం చెప్పారు. బ్రిటన్ జాతీయుడు మిచెల్(54) తిహార్ జైల్లో ఉన్నారు. తమ దౌత్య సిబ్బంది మిచెల్‌ను కలిసి యోగక్షేమాలు తెలుసుకున్నారని ఢిల్లీలోని భారత హైకమిషన్ పేర్కొంది.

రాఫెల్ డీల్‌పై 'పెన్సిల్ బాక్స్' థియరీ!

▸▸ ఎనిమిదేళ్ల బాలిక విశ్లేషణకు నిర్మల ప్రశంస

న్యూఢిల్లీ, జనవరి 11 : రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందం గురించి 'కట్టె, కొట్టె, తెచ్చె' అన్నట్లుగా అతి సులువుగా విశ్లేషించింది ఎనిమిదేళ్ల చిన్నారి. రెండుపెన్సిల్ బాక్స్‌లను పోల్చుతూ విశ్లేషించిన వీడియో శుక్రవారం ట్విటర్‌లో వైరల్ అయింది. ఒక ఖాళీ పెన్సిల్ బాక్స్‌ను చూపిస్తూ.. 'ఇది రాహుల్‌గాంధీ అనుకుంటున్న రాఫెల్ విమానం. దీని ఖరీదు రూ.720 కోట్లు' అని బాలిక వివరించింది. వివిధ వస్తువులతో ఉన్న మరో పెన్సిల్ బాక్స్‌ను చూపిస్తూ.. 'ఇది మోదీ చెబుతున్న రాఫెల్ విమానం. ఆయుధ సంపత్తితో ఉన్నందున దీని ధర రూ.1600 కోట్లు' అంటూ పోల్చి చెప్పింది. ఆ బాలిక ఎవరో తెలియలేదు. ఈ వీడియోను రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ రీట్వీట్ చేశారు. 'రాఫెల్ డీల్‌పై కాంగ్రెస్‌కు అర్థమయ్యేలా వివరించావు. శుభాకాంక్షలు. భవిష్యత్తులో నిన్ను రాఫెల్ జెట్ పైలట్‌గా చూడాలని ఉంది' అంటూ ప్రశంసల వర్షం కురిపించారు.

వ్యవసాయశాఖలో బదిలీలు

అమరావతి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖలో 10మంది జేడీలు/ఆత్మాపీడీలను బదిలీ చేస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కృష్ణా జేడీఏగా పనిచేస్తున్న కడప జేడీఏ డి.ఠాగూర్‌నాయక్ కర్నూలుకు, విజయనగరం జేడీఏ జీఎస్ఎస్ లీలావతిని విశాఖపట్నం ఆత్మాపీడీగా, విశాఖపట్నం ఆత్మా పీడీ కేసీహెచ్ అప్పలస్వామిని శ్రీకాకుళం జేడీఏగా నియమించారు. శ్రీకాకుళం జేడీఏ జి.రామారావును గుంటూరు ఆత్మా పీడీగా మార్చారు. ప్రకాశం జిల్లా జేడీఏగా ఓడీ ప్రాతిపదికన పనిచేస్తున్న అనంతపురం జేడీఏ పీవీ శ్రీరామమూర్తిని ప్రకాశం జేడీఏగా, కడపలో ఓడి ప్రాతిపదికన పనిచేస్తున్న ప్రకాశం జేడీఏ జె.మురళీకృష్ణను కడప జేడీఏగానే పోస్టింగులు ఇచ్చారు. నెల్లూరు జేడీఏ బి.చంద్రానాయక్‌ను విజయనగరం జిల్లాకు బదిలీ చేశారు. కర్నూలు జేడీఏ ఉమామహేశ్వరమ్మ అదే జిల్లాలో ఆత్మా పీడీగా బదిలీ అయ్యారు. వ్యవసాయ కమిషనర్ కార్యాలయంలో జేడీఏగా ఉండి, ఓడీలో గుంటూరు జేడీఏగా పనిచేస్తున్న విజయభారతి గుంటూరు రెగ్యులర్ జేడీఏగా పోస్టింగ్ పొందారు. గుంటూరు ఆత్మా పీడీ వి.సత్యనారాయణను నెల్లూరు జేడీఏగా బదిలీ చేశారు.

ఆక్వా రైతులకు విద్యుత్ రాయితీ విడుదల

అమరావతి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆక్వా రైతులకు రూ.2కే యూనిట్ విద్యుత్ సరఫరా చేస్తున్న ప్రభుత్వం దీనికి సంబంధించిన రాయితీ సొమ్మును శుక్రవారం విడుదల చేసింది. 2018 ఆగస్టు, సెప్టెంబరు నెలలకు రీయింబర్స్‌మెంట్ మొత్తం రూ.46.47 కోట్లను విడుదల చేసింది. యూనిట్ రూ.3.86పడుతున్న విద్యుత్‌ను ఆక్వా రైతులకు గత ఆగస్టు నుంచి రూ.2కే ప్రభుత్వం అందిస్తోంది. ఈ వ్యత్యాసాన్ని తానే భరిస్తోంది.

ధాన్యం నిల్వలకు కొత్త గోదాములు నిర్మించాలి

అమరావతి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లాలో ధాన్యం దిగుబడులు పెరిగినందున హనుమాన్‌జంక్షన్‌లో 35వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంగల గోడౌన్‌ను వెంటనే నిర్మించాలని తెలుగు రైతు సంఘం అధ్యక్షుడు చలసాని ఆంజనేయులు కేంద్ర ఆహార శాఖ కార్యదర్శికి లేఖ రాశారు. హనుమాన్‌జంక్షన్‌లోని ఎఫ్‌సీఐ గోడౌన్ దగ్గరే 45 ఎకరాల స్థలం అందుబాటులో ఉందని, పక్కనే రైల్వే వసతి కూడా ఉందని, అందువల్ల కొత్తగా 35వేల మెట్రిక్ టన్నుల గోదామును నిర్మించాలని కోరారు.

మరియమ్మా.. నీ జీసస్‌ను వచ్చాను!



▸▸ చికిత్సకు నిరాకరిస్తున్న రోగి చెవిలో చెప్పిన డాక్టర్

▸▸ ఆ తర్వాతే వైద్యానికి సహకరించిన కీళ్లవాతం బాధితురాలు

గుంటూరు (మెడికల్) జనవరి 11: కీళ్లనొప్పులు వేధిస్తున్నా.. నమ్మిన దైవం యేసుక్రీస్తు తన బాధలు తొలగిస్తాడని విశ్వసించింది. 20ఏళ్లుగా చికిత్స తీసుకోకుండా జీసస్‌పైనే భారంవేసి కాలం వెళ్లదీస్తోంది. వ్యాధి ముదరడంతో ఆస్పత్రికి తీసుకెళ్లినా చికిత్సకు సహకరించలేదు. దేవుని పట్ల ఆమె పెంచుకున్న ప్రగాఢమైన నమ్మకాన్ని గుర్తించిన డాక్టర్ తానే జీసస్ అనిచెప్పి చికిత్స అందిస్తున్నారు. గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చోటుచేసుకున్న ఘటన వివరాలిలా ఉన్నాయి. గుంటూరు జిల్లా మేడికొండూరు మండలం కొత్తపాడుకు చెందిన పుల్లగూర మరియమ్మ(55) క్రీస్తుని నమ్మి నిత్యం ప్రార్థనా మందిరానికి వెళుతుంది. ఆమె 20ఏళ్లుగా కీళ్లవాతంతో బాధపడుతోంది. వ్యాధి తీవ్రతతో మోకాళ్లు, మోచేతులు బిగుసుకుపోవడంతో.. భర్త బాలశౌరి ఆమెను జీజీహెచ్‌కు తరలించారు. అక్కడా ఆమె చికిత్సకు నిరాకరించింది. విషయం తెలుసుకున్న న్యూరాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గాజుల రామకృష్ణ ఆమె వద్దకెళ్లి 'మరియమ్మా లే.. నేను నీ యేసును వచ్చాను! నీ భక్తికి మెచ్చి ఈ డాక్టర్ రూపంలో చికిత్స చేసేందుకు వచ్చాను. బుద్ధిగా మందులు వేసుకో..' అంటూ ఆమె చెవిలో చెప్పారు. ఇంకేముంది.. తనకోసం ఏకంగా జీసస్ వచ్చాడని భావించిన బాధితురాలు చక్కగా చికిత్సకు సహకరిస్తోంది. కాగా, న్యూరాలజీ విభాగాధిపతి ఎస్వీ సుందరాచారి నేతృత్వంలో రామకృష్ణ, పీజీ విద్యార్థిని మైత్రి ఆమెకు పరీక్షలు చేయించి కీళ్లవాతం తీవ్రస్థాయిలో ఉందని నిర్ధారించారు. ప్రస్తుతం ఆమెకు చికిత్స అందిస్తున్నారు. 'మరియమ్మకు కీళ్లు, ఎముకలు బిగుసుకుపోవడంతో ఆపరేషన్ చేసి కదలికలు తేలికచేసేందుకు ఆర్థోపెడిక్ వార్డుకు తరలిస్తాం' అని రామకృష్ణ తెలిపారు.

పాట్లు వద్దు ప్లాట్లు తీసుకోండి!

▸▸ కీచులాటలతో అసలుకే మోసం

▸▸ 6 నెలల్లో స్థలాలు కేటాయించాలి

▸▸ హైకోర్టు ఉద్యోగుల సొసైటీకి ఆదేశం

▸▸ ఇదే ఆఖరి అవకాశమని హెచ్చరిక

▸▸ అన్ని పిటిషన్లను కొట్టివేసిన బెంచ్

▸▸ జడ్జిలతో పర్యవేక్షణ, మార్గదర్శకాలు

▸▸ హైకోర్టు విభజనకు 3 రోజుల ముందు కీలక తీర్పు

హైదరాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి హైకోర్టు ఉద్యోగులకు న్యాయస్థానం తీపి కబురు వినిపించింది. ఏపీ హైకోర్టు ఉద్యోగుల పరస్పర సహకార హౌసింగ్ సొసైటీ వివాదాలన్నింటికీ తెర దించింది. "కీచులాటలు వద్దు. పరస్పరం సహకరించుకోండి. సొంతింటి కలను సాకారం చేసుకోండి' అంటూ పోటాపోటీ వ్యాజ్యాలు వేసుకున్న వారికి హితవు పలికింది. ఆరు నెలల్లోపు ప్లాట్ల కేటాయింపులు పూర్తి చేయాలని ఆదేశించింది. హైకోర్టు విభజన జనవరి 1వ తేదీ నుంచి అమలులోకిరాగా... అంతకుమూడు రోజులముందే, అంటే డిసెంబరు 28వ తేదీన ఉమ్మడి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్, జస్టిస్ ఎస్వీ భట్‌తో కూడిన బెంచ్ 74 పేజీల తుది తీర్పు వెలువరించింది. వివరాల్లోకి వెళితే...

హైదరాబాద్‌లోని శేరిలింగంపల్లి మండలం గోపనపల్లి గ్రామ పరిధిలో హైకోర్టు ఉద్యోగుల హౌసింగ్ సొసైటీకి ఉమ్మడి ఏపీ ప్రభుత్వం 39 ఎకరాలు కేటాయించింది. ఇందులో దాదాపు 1100 మంది సభ్యులు ఉన్నారు. కేటాయించిన భూమి స్వాధీనం చేయకమునుపే కొందరు సొసైటీ సభ్యులు, సభ్యులు కాని ఉద్యోగులు వేర్వేరుగా పిటిషన్లు వేశారు. ఈ సమస్య జటిలం కావడంతో... ప్రభుత్వం హైకోర్టు ఉద్యోగులకు కేటాయించిన స్థలాన్ని రద్దు చేసింది. ప్రభుత్వ ఉత్తర్వులపై హౌసింగ్ సొసైటీ హైకోర్టును ఆశ్రయించింది. ఈ వివాదంపై అనేక విడతల్లో అనేక పిటిషన్లు పడ్డాయి. తాజాగా... సొసైటీ సభ్యులు పరస్పరం వేసుకున్న పలు వ్యాజ్యాలను హైకోర్టు కొట్టివేసింది. "సొసైటీకి ఇదే చివరి అవకాశం. ఒకరిపై ఒకరు కీచులాడుకుని అసలుకే మోసం తెచ్చుకోవద్దు" అని సూచించింది. ఇక సొసైటీలో నిధుల దుర్వినియోగంపై చర్యలు తీసుకునేందుకు ఎంఏసీఎస్ చట్టం ప్రకారం సంబంధిత అధికారులకు అన్ని అధికారాలు ఉంటాయని స్పష్టం చేసింది. హైకోర్టు ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పరిగణించాలని 2003లో హైకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం సొసైటీ కార్యకలాపాలు ఉండాలని నిర్దేశించింది.



ఇవీ మార్గదర్శకాలు

- హౌసింగ్ సొసైటీ కార్యకలాపాల పరిశీలనకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఏ.రాజశేఖర్‌రెడ్డి, జస్టిస్ చల్లా కోదండరాం, జస్టిస్ పి. కేశవరావులతో కమిటీ.
- సొసైటీ ఖాతాలను ఆడిట్ చేసి రెండు నెలల్లోగా జడ్జిలకు నివేదిక ఇచ్చేలా న్యాయవాది వేదుల శ్రీనివాస్, ఎస్. మమతలతో కమిటీ.
- సొసైటీ నిధులు దుర్వినియోగం చేసినట్లు రుజువైతే... బాధ్యులపై ఐపీసీ/క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ లేదా ఎంఏసీఎస్ చట్టం కింద కోర్టు ఆదేశాలు అందిన మూడు నెలల్లోగా చర్యలు తీసుకోవాలి.
- సిటీ సివిల్ కోర్టు చీఫ్ జడ్జి స్వాధీనంలో ఉన్న రికార్డులను తాజాగా హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ నియమించిన అధికారికి స్వాధీనపర్చాలి.
- అనుమతించిన లే-అవుట్‌పై చర్చించేందుకు సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయాలని జడ్జీల కమిటీని సొసైటీ అభ్యర్థించవచ్చు. ప్లాట్లు కేటాయించడానికి అనుసరించే విధి విధానాలు, డెవలప్‌మెంట్ చార్జీల కింద సభ్యులు చెల్లించాల్సిన వాయిదాలను విశదీకరించాలి. జడ్జీల కమిటీ చేసే సూచనల ప్రకారం నడుచుకోవాలి.
- హైకోర్టు ఉద్యోగుల హౌసింగ్ సొసైటీ ఐదువేలకు మించిన నగదు లావాదేవీలు చేయరాదు.
- లే-అవుట్ అభివృద్ధికి సంబంధిత ఏజెన్సీల నుండి కొటేషన్లు తీసుకోవాలి. జడ్జీల కమిటీ ఆమోదించిన కాంట్రాక్టర్/ఏజెన్సీకి పనులు అప్పగించాలి.
- కేటాయించిన ప్లాట్ల వినియోగం, గృహాల నిర్మాణం తదితర అంశాలను సభ్యుల స్వేచ్ఛకే వదిలిపెట్టాలి.
- హౌసింగ్ సొసైటీ నిర్వహణకు హైకోర్టు ప్రాంగణంలో కేటాయించిన కార్యాలయాన్ని దుర్వినియోగం చేయరాదు. సొసైటీలో తలెత్తే వివాదాలు పరిష్కారానికి వినియోగించాలి.
- హైకోర్టు ఉద్యోగులుగా ఉండి హౌసింగ్ సొసైటీలో సభ్యత్వం తీసుకుని లేదా తీసుకోక ఇళ్ల స్థలాలు పొందలేని వారికోసం కొత్త స్థలం ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరవచ్చు.

మరో సాంకేతిక వర్సిటీ!

▸▸ సీఆర్‌డీఏ పరిధిలో 150-200ఎకరాల్లో

▸▸ కొత్త కోర్సులు, అత్యున్నత ఫ్యాకల్టీ

▸▸ జేఎన్‌టీయూకే పరిధి తగ్గింపు!

▸▸ త్వరలోనే కేబినెట్ ముందుకు డీపీఆర్

అమరావతి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్రప్రదేశ్‌లో మరో సాంకేతిక విశ్వవిద్యాలయం ఏర్పాటు కానుంది. రాజధాని అమరావతి ప్రాంతంలో దాదాపు 150-200 ఎకరాల్లో ఈ కొత్త వర్సిటీ రూపుదిద్దుకోనుంది. ఐఎస్‌బీ తరహాలో అత్యున్నత ప్రమాణాలతో ప్రపంచ స్థాయి వర్సిటీగా దీన్ని తీర్చిదిద్దేందుకు సర్కారు సమాయత్తమవుతోంది. ప్రస్తుతం శ్రీకాకుళం నుంచి ప్రకాశం జిల్లా వరకు మొత్తం 8జిల్లాలకు కలిపి జేఎన్‌టీయూకే ఒక్కటే టెక్నాలజీ వర్సిటీగా పని చేస్తోంది. కళాశాలల పరిధి ఎక్కువగా ఉండటం, దీని పరిధిలో 250కి పైగా అనుబంధ ఇంజనీరింగ్ కాలేజీలు ఉండటంతో పరిపాలనా పరమైన ఇబ్బందులు తలెత్తుతున్నాయన్న అభిప్రాయాలు ఉన్నాయి. ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకోవడానికి విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో జేఎన్‌టీయూకే పరిధిని తగ్గించి మరో సాంకేతిక వర్సిటీ నెలకొల్పేందుకు ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఈ మేరకు ఉన్నత విద్యామండలి ఐదుగురు సభ్యులతో ఓ కమిటీని నియమించింది. ఆర్‌జీయూకేటీ వీసీ రామచంద్రరాజు, డైరెక్టర్ సుదర్శనరావు, జేఎన్‌టీయూ మాజీ రిజిస్ట్రార్ ప్రసాదరాజు, ఏఎన్‌యూ లా ప్రొఫెసర్ రంగయ్య, ఎం.వి.ఎన్. శర్మ దీనిలో సభ్యులు. శుక్రవారం తాడేపల్లిలోని రాష్ట్ర ఉన్నత విద్యామండలిలో సమావేశమైన ఈ కమిటీ, కొత్త వర్సిటీ ఏర్పాటుకు సంబంధించిన డీపీఆర్ రూపకల్పనకు కసరత్తు ప్రారంభించింది. కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలోని ఇంజనీరింగ్ కాలేజీలను కొత్త వర్సిటీ పరిధిలోకి తెచ్చే అవకాశం ఉంది. అందుబాటులో ఉన్న కోర్సులతో పాటు భావి తరాల విద్యార్థులకు ఉపాధినిచ్చే కోర్సులు ప్రవేశపెట్టాలని ప్రాథమికంగా నిర్ణయించారు. ఆర్కిటెక్చర్, ఫార్మసీ, పెట్రోలియం, ఏరోనాటిక్స్, విండ్ టెక్నాలజీ, శాటిలైట్ టెక్నాలజీ, లాజిస్టిక్స్, వాటర్ మేనేజ్‌మెంట్, ఫుడ్ టెక్నాలజీ, అగ్రికల్చర్ ఇంజనీరింగ్, ఆధునిక వ్యవసాయ సాంకేతిక కోర్సులను కమిటీ ప్రతిపాదించనుంది. ఫ్యాకల్టీ నియామకాలూ ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఉండాలని సూచించనుంది. అలాగే ప్రముఖ ఐఐటీల నుంచి సబ్జెక్టుల వారీగా విజిటింగ్ ఫ్యాకల్టీని తీసుకోవాలని, కొత్త వర్సిటీలో కేవలం ఆచరణాత్మక విధానంలో మాత్రమే శిక్షణ ఇప్పించాలని భావిస్తున్నారు. విశ్వవిద్యాలయ చట్టంలో ఉన్న లోపాలను సవరిస్తూ కొత్త చట్టం రూపొందించాలని కమిటీ సిఫారసు చేయనుంది. త్వరలోనే ఈ కమిటీ సమర్పించే డీపీఆర్ కేబినెట్ ముందుకు రానుంది. అన్నీ కుదిరతే 2019-20 విద్యా సంవత్సరం నుంచే కొత్త వర్సిటీ ప్రారంభించేలా కసరత్తు జరుగుతోంది.

అమరావతి టూరిజం సిటీతో 2 లక్షల మందికి ఉపాధి

▸▸ ప్రపంచ స్థాయి ప్రమాణాలతో నిర్మాణం

▸▸ రాష్ట్రంలో మరో ఆరు టూరిస్టు హబ్‌లు

▸▸ పెట్టుబడులకు ఆహ్వానం.. అన్నింటా భరోసా

▸▸ ఢిల్లీలో సీఆర్‌డీఏ సదస్సు

న్యూఢిల్లీ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని అమరావతిలో అభివృద్ధి చేస్తున్న టూరిజం సిటీతో 2.2 లక్షల మందికి ఉపాధి లభిస్తుందని సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ ఎస్. షాన్‌మోహన్ స్పష్టం చేశారు. 2.7 లక్షల జనాభాకు సరిపడేలా 11573 ఎకరాల విస్తీర్ణంలో టూరిజం సిటీని నిర్మిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సీఆర్‌డీఏ, సెంటర్ ఫర్ స్ట్రాటజీ డెవలప్‌మెంట్ లీడర్‌షిప్ (సీఎస్ఎల్) సంయుక్తంగా టూరిజం సిటీపై సదస్సు నిర్వహించాయి. ఇందులో షాన్‌మోహన్ మాట్లాడుతూ... రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్, హెల్త్, వెల్‌నెస్, సంస్కృతి, వారసత్వం ఆధారంగా సిటీని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ సంస్కృతి ఉట్టిపడేలా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనలను అనుగుణంగా ప్రపంచ స్థాయి ప్రమాణాలతో నిర్మిస్తున్నట్లు స్పష్టం చేశారు. కేంద్ర టూరిజం శాఖ సంయుక్త కార్యదర్శి సుమన్ బిల్ల మాట్లాడుతూ...అభివృద్ధి, సందర్శకుల భద్రతలో ఏపీకి ఢోకా లేదని, అనతికాలంలోనే అంతర్జాతీయ పర్యాటకుల స్వర్గధామం (టూరిస్ట్ డెస్టినేషన్)గా నిలుస్తుందని ఆకాంక్షించారు. ఏపీ టూరిజం శాఖ డైరెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ... విశాఖపట్నం, తిరుపతి, విజయవాడలో మెగా కన్వెన్షన్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. రైల్, రోడ్డు నెట్‌వర్క్‌ను అనుసంధానం చేయడంతో పాటు బీచ్ కారిడార్‌లో మరిన్ని జాతీయ రహదారులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. సందర్శకులను ఆకర్షించడానికి రాష్ట్రవ్యాప్తంగా ఆరు టూరిస్ట్ హబ్‌లను సృష్టిస్తున్నామని, అవి విశాఖ, శ్రీశైలం, రాజమహేంద్రవరం-కోనసీమ-కాకినాడ, విజయవాడ-అమరావతి, తిరుపతి, అనంతపురం-పుట్టపర్తి అని వివరించారు. రాష్ట్రంతో భాగస్వాములు కావడానికి పెట్టుబడిదారులు ముందుకు రావాలని ఆహ్వానించారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధి బోర్డు ప్రత్యేక కమిషనర్ భావన సక్సేనా మాట్లాడుతూ.. పెట్టుబడులు పెట్టేవారికి ప్రోత్సాహకాలు, పూర్తి మద్దతు ఉంటాయని భరోసా ఇచ్చారు. హోటల్స్, రిస్టార్స్, ఎంఐసీఈ కేంద్రాలు (మీటింగ్స్, ఇన్సెంటివ్స్, కాన్ఫరెన్సెస్, ఎగ్జిబిషన్స్), థీమ్ పార్కులు, సాంస్కృతిక కేంద్రాల్లో పెట్టుబడులకు మంచి అవకాశాలున్నాయని పేర్కొన్నారు.సదస్సులో ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్ ప్రకాశ్, ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్స్ ఇన్ ఇండియన్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ చైర్మన్, ఐటీసీ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నకుల్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.


అడ్రస్ గల్లంతు

▸▸ పత్తాలేని 35లక్షల కార్డుదారులు

▸▸ సాధికార సర్వేకి వీరంతా దూరం

▸▸ రాష్ట్రంలో లేరన్న అనుమానాలు

అమరావతి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లక్షల రేషన్ కార్డుల చిరునామాలు దొరకడం లేదు. పేరుకి లక్షలాది కుటుంబాలకు కార్డులు ఇస్తున్నా, అందులో ఎన్ని రాష్ట్రంలో ఉన్నాయి? ఎన్ని లేవు? అనే వివరాలు మాత్రం లభించడం లేదు. ప్రభుత్వం అన్ని పథకాలను దాదాపుగా ప్రజాసాధికార సర్వేతో అనుసంధానం చేసింది. క్షేత్రస్థాయిలో పరిస్థితి చూస్తే దాదాపు అందరూ సర్వేలోకి వచ్చినట్లుగానే కనిపిస్తోంది. కానీ తెల్ల రేషన్ కార్డుల విషయంలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. రాష్ట్రంలో 1.46 కోట్ల రేషన్ కార్డులు ఉంటే, అందులో 35 లక్షల కార్డులు ఇప్పటికీ సర్వేలో నమోదు చేసుకోలేదు. ప్రభుత్వం పదే పదే చెబుతున్నా సర్వేలో నమోదు కాలేదంటే అసలు ఆ కుటుంబాలు ఎక్కడుంటున్నాయో యంత్రాంగానికి అంతుపట్టడం లేదు. సాధికార సర్వేలో నమోదుచేసుకోని వారిలో ఎవరు రేషన్ తీసుకుంటున్నారు, ఎవరు తీసుకోవడం లేదు అనే విషయంలో కూడా స్పష్టత రావడం లేదు. సాధికార సర్వేలోకి 35 లక్షల కుటుంబాలు రాకపోవడం వల్ల రాష్ట్రంలో ఎన్ని కుటుంబాలు ఉన్నాయనేది గందరగోళంగా మారింది. రాష్ట్రంలో 1,46,85,241 కుటుంబాలకు రేషన్ కార్డులు ఉన్నాయి. రెండేళ్లుగా సర్వే చేసినా ఇప్పటివరకూ గుర్తించిన కుటుంబాలు 1,42,28,995 మాత్రమే. అంటే సర్వేను ఆధారంగా చేసుకుంటే ఇప్పటికే 4 లక్షల కార్డులు అదనంగా ఉన్నాయి. కుటుంబాల్లోని వ్యక్తుల గణన వివరాలు దీనికి భిన్నంగా ఉన్నాయి. రేషన్ కార్డుల్లో ఉన్న యూనిట్లు (వ్యక్తులు) 4,20,12,714 కాగా, సర్వేలో నమోదైన వారు 4,46,30,030. దీని ప్రకారం చూస్తే వాస్తవంగా ఉన్న జనాభా కంటే తక్కువ మందికే రేషన్ అందుతోంది. ఆ 35 లక్షల కుటుంబాలను కూడా గుర్తించి, వారిలోని అనర్హులను తొలగించగలిగితే ఇంకా భారీగా సంఖ్య తగ్గుతుందని అంచనా. ప్రభుత్వం మాత్రం చర్యలు చేపట్టడం లేదు. శుక్రవారంతో ముగిసిన జన్మభూమిలో కొత్తగా 15వేల మందికి కార్డులు జారీచేశారు. అందులో 10 వేలు కొత్తవి కాగా, 5వేలు స్ప్లిట్ కార్డులు(కుటుంబాల విభజనతో ఇచ్చే కార్డులు) ఉన్నాయి.



ఒకే చిత్రంలో భూమి, చంద్రుడు

11 కోట్ల కిలోమీటర్ల నుంచి చూస్తే భూమి ఎలా ఉంటుంది? చందమామ ఎలా ఉంటాడు? అంటే.. ఇదిగో ఈ చిత్రం చూడండి. ఎడమ వైపు కింది భాగాన వెలుగుతున్న రెండు చుక్కల్లో ఒకటి భూమి.. ఇంకోటి చంద్రుడు. నాసాకు చెందిన వ్యోమనౌక ఈ చిత్రాన్ని తీసింది. - వాషింగ్టన్

అది అబద్ధాల పుస్తకం

▸▸ ప్రజల సొమ్ముతో జగన్ రాజభోగాలు

▸▸ వైసీపీ ఓ సర్కస్ కంపెనీ.. ప్రతిపక్ష నేతపై మంత్రుల ధ్వజం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): 'రాఫెల్ కుంభకోణంలో ప్రధాని మోదీపై వస్తున్న ఆరోపణల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే జగన్ అబద్ధాల పుస్తకం విడుదల చేశాడు. అది అరిగిపోయిన టేప్ రికార్డర్‌లా ఉంది' అని ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి కర్నూలులో విమర్శించారు. 'జగన్ నీతిపరుడైతే సీబీఐ నిర్ధారించిన రూ.43వేల కోట్ల అక్రమాస్తులు ప్రజలకు పంచాలి. దోచుకున్న ప్రజల సొమ్ముతో జగన్ రాజభోగాలు అనుభవిస్తున్నారు. చేసిన పాపాల నుంచి జగన్ తప్పించుకోలేరు' అని ధ్వజమెత్తారు. శ్రీకాకుళం జిల్లా లావేరులో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కిమిడి కళావెంకట్రావు మాట్లాడుతూ 'మోదీ ముసుగులో జగన్, కేసీఆర్ ఉన్నారు. రాష్ట్రంలో వైసీపీ సర్కస్ కంపెనీలా పనిచేస్తోంది' అన్నారు. చిత్తూరులో మంత్రి అమరనాథరెడ్డి మాట్లాడుతూ 'పాదయాత్ర ముగించుకున్న జగన్ త్వరలో బస్సు యాత్ర ప్రారంభిస్తున్నారు. ఎన్నికల తరువాత కాశీ యాత్రకు వెళ్లేందుకు కూడా సిద్ధం కావాలి" అని ఎద్దేవా చేశారు.

పవన్... పొత్తుపై ఆలోచించు

'2014లో మద్దతిచ్చిన పవన్ ఊహించని విధంగా నిందిస్తున్నారన్న ఆవేదనే తప్ప ఆయనపై మాకు వ్యతిరేకత లేదు. టీడీపీతో కలిసి వస్తే బాగుంటుంది. ఈ విషయంలో ఆయన పునరాలోచించుకోవాలి. మద్దతిచ్చినా, పొత్తు పెట్టుకొన్నా సిద్ధమే' అని మంత్రి అమరనాథరెడ్డి అన్నారు.

స్వామి సన్నిధిలో అహంకార ప్రదర్శనా!

'వెంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లిన జగన్ తిరుమల ఆలయ ప్రాంగణంలో తన కార్యకర్తలతో అత్యుత్సాహాన్ని, అహంకారాన్ని ప్రదర్శించారు. శ్రీవారి సన్నిధిలో ఉన్నామని మరిచి అనుచరులతో జై కొట్టించుకోవడం జగన్‌కే చెల్లింది' అని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సాదినేని యామిని శర్మ విజయవాడలో అన్నారు. 'పాదయాత్ర పేరుతో రోజుకోలా ప్రవర్తిస్తూ ప్రజలను ఏడిపించిన జగన్.. శ్రీవారి దర్శనానికి వెళ్లి భక్తులను ఇబ్బందులకు గురిచేశారు. జగన్, ఆయన అనుచరణగణం స్వామివారి ప్రాంగణంలో ఇష్టానుసారంగా ప్రవర్తించి హిందువుల మనోభావాలు దెబ్బతీశారు' అని సాదినేని విమర్శించారు.

మధ్యప్రదేశ్ అసెంబ్లీలో హైడ్రామా

▸▸ డిప్యూటీ స్పీకర్ పదవి సైతం కాంగ్రెస్ వశం

▸▸ అధికారపక్షంలో చీలికకు బీజేపీ యత్నం

భోపాల్, జనవరి 11: మధ్యప్రదేశ్ అసెంబ్లీలో హైడ్రామా చోటుచేసుకుంది. స్పీకర్, డిప్యూటీ స్పీకర్ పదవులు రెండూ ఎగరేసుకుపోడానికి ప్రయత్నించి బీజేపీ భంగపడింది. స్పీకర్ పదవి అధికార పక్షానికి, డిప్యూటీ పదవిని విపక్షానికి ఇవ్వడం 29ఏళ్లుగా వస్తున్న ఆనవాయితీ. డిప్యూటీ స్పీకర్ పదవికి బీజేపీ తరఫున మాజీ మంత్రి జగదీశ్ దేవ్‌డాను దింపింది. అయితే కాంగ్రెస్ తరఫున నలుగురు ఎమ్మెల్యేలు తమ అభ్యర్థిగా హీనా లఖీరామ్ కావ్డేను ప్రతిపాదించారు. సభ సమావేశం కాగానే- స్పీకర్ నర్మదా ప్రసాద్ ప్రజాపతి లేచి ఐదు ప్రతిపాదనలు వచ్చాయనీ, మొదటి నాలుగూ హీనా పేరిట ఉన్నాయని, ఐదోది మాత్రమే జగదీశ్ దేవ్‌డా పేరున దాఖలైందనీ, అంచేత హీనాను డిప్యూటీ స్పీకర్ చేయడమే కరెక్టనీ అన్నారు. దీనికి విపక్ష నేత గోపాల్ భార్గవ అడ్డుచెప్పారు. అరుపులు, కేకలతో సభ రెండుమార్లు వాయిదాపడింది. మూడోసారి సమావేశమయ్యాక నినాదాల మధ్యే హీనా డిప్యూటీ స్పీకర్‌గా ఎన్నికైనట్లు ప్రజాపతి ప్రకటించారు. స్పీకర్ ఎన్నిక విషయంలోనూ బీజేపీ భంగపడింది. సాధారణంగా స్పీకర్‌ను అధికార పక్షానికి వదిలేసి ఏకగ్రీవం చేయడం సంప్రదాయం. దీన్ని కాదని బీజేపీ తమ తరఫున కున్వర్ విజయ్ షా పేరును ప్రకటించింది. దీంతో 52ఏళ్ల చరిత్రలో ఎన్నిక ద్వారా ప్రజాపతి నియమితులయ్యారు. స్పీకర్ పదవికి బీజేపీ ఇంత చేసినపుడు తాము మాత్రం ఎందుకు ఊరుకోవాలని భావించి డిప్యూటీ పదవిని కూడా కాంగ్రెస్ ఎగరేసుకుపోయింది. 'వారికి వారి భాషలోనే జవాబు చెప్పాలనుకున్నాం. మేమూ అసంతృప్తిగానే ఉన్నాం. కానీ ఏం చేస్తాం? పోటీ మొదలుపెట్టినదే వారు" అని సీఎం కమల్‌నాథ్ వ్యాఖ్యానించారు.



ఆస్ట్రేలియన్ ఓపెన్ మెయిన్ డ్రాకు ప్రజ్నేష్

మెల్‌బోర్న్: భారత టెన్నిస్‌లో కొన్నాళ్లుగా సూపర్‌ఫామ్‌తో ఆకట్టుకుంటున్న యువ ఆటగాడు ప్రజ్నేష్ గుణేశ్వరన్ మరోసారి సంచలన ప్రదర్శన చేశాడు. ఈ చెన్నై కుర్రాడు సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో పురుషుల సింగిల్స్ మెయిన్ డ్రాకు దూసుకెళ్లి అదరహో అనిపించాడు. క్వాలిఫయింగ్ చివరిరౌండ్లో ప్రజ్నేష్ 6-7(5), 6-4, 6-4తో యొసుకె వటానుకి (జపాన్)పై విజయం సాధించి కెరీర్‌లో తొలిసారి మేజర్ టోర్నీలో మెయిన్ డ్రాకు అర్హత సాధించాడు. దీంతో.. గత ఐదేళ్లలో గ్రాండ్‌స్లామ్‌లో పురుషుల సింగిల్స్ మెయిన్ డ్రాకు క్వాలిఫై అయిన మూడో భారత ఆటగాడిగా ప్రజ్నేష్ నిలిచాడు.

పాండ్యా, రాహుల్ ఇంటికి

ఇద్దరిపై వేటు ● వన్డే సిరీస్‌కు దూరం





న్యూఢిల్లీ/సిడ్నీ: భారత క్రికెటర్లు హార్దిక్ పాండ్యా, కేఎల్ రాహుల్‌లపై బీసీసీఐ వేటు వేసింది. మహిళలపై ఓ టీవీ చాట్ షోలో వీరిద్దరు ఇష్టానుసారంగా మాట్లాడడం తీవ్ర ప్రకంపనలు సృష్టించింది. దీంతో ఆగ్రహంతో ఉన్న బోర్డు ముందుగా వీరిని సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించింది. అంతే కాదు.. వెంటనే ఆస్ట్రేలియా నుంచి స్వదేశానికి రావాల్సిందిగా ఆజ్ఞాపించింది. త్వరలో వీరిపై విచారణ జరపనున్నారు. ఈ వేటుతో పాండ్యా, రాహుల్ ఆసీస్‌తో శుక్రవారం నుంచి జరిగే మూడు వన్డేల సిరీ‌స్‌కు దూరం కానున్నారు. విచారణ పూర్తయ్యేదాకా వీరు ఎలాంటి క్రికెట్ కార్యకలాపాల్లో పాల్గొనడానికి వీల్లేదు. పాండ్యా, రాహుల్‌లను సస్పెండ్ చేసినట్టు పరిపాలక కమిటీ (సీఓఏ) చీఫ్ వినోద్ రాయ్ ప్రకటించిన కొన్ని గంటల్లోనే ఆటగాళ్లిద్దరినీ భారత్‌కు రప్పించాలని నిర్ణయం తీసుకున్నారు. అలాగే విచారణ ప్రారంభించడానికి ముందే మరోసారి ఈ ఇద్దరికీ షోకాజ్ నోటీసులు జారీ చేయనున్నారు. ఇదిలావుండగా ఈ సస్పెన్షన్ అనేది ఎంతకాలమని తెలియకపోయినా ఆసీస్‌తో పాటు కివీస్ టూర్‌కు కూడా వీరు దూరమైనట్టే. అంతకుముందు ఇద్దరు క్రికెటర్లపై రెండు మ్యాచ్‌ల నిషేధం విధించాలని భావించారు. సీఓఏ సభ్యురాలు ఎడుల్జీ ఈ విషయమై బీసీసీఐ లీగల్ సెల్‌ను కూడా సంప్రదించింది. అయితే వారి వ్యాఖ్యలు బీసీసీఐ నిబంధన ఉల్లంఘన పరిధిలోకి రాదని వారు తెలపడంతో ప్రస్తుతానికి సస్పెండ్ చేశారు. వీరి స్థానంలో రిషబ్ పంత్, మనీష్ పాండేలకు జట్టులో చోటిచ్చే అవకాశం ఉంది.

ఆ వ్యాఖ్యలు సరికావు: కోహ్లీ

పాండ్యా, రాహుల్ వ్యాఖ్యలపై కెప్టెన్ కోహ్లీ కూడా అసంతృప్తి వ్యక్తం చేశాడు. భారత క్రికెట్ జట్టు వీటిని ఎంతమాత్రం సహించదని తేల్చాడు. అయితే వారి వ్యక్తిగత వ్యాఖ్యలతో జట్టుకు సంబంధం లేదన్నాడు. ఇక, తాను ఓసారి రిటైర్మెంట్ ప్రకటించాక తిరిగి బ్యాట్ పట్టనని విరాట్ స్పష్టం చేశాడు. ఎలాంటి టీ20 లీగ్‌లో ఆడనన్నాడు.

82 ఏళ్లలో తొలిసారి

భారత క్రికెట్ జట్టులో ఆటగాళ్లపై వేటు వేసి స్వదేశానికి రప్పించడం గత 82ఏళ్లలో ఇదే తొలిసారి కావడం గమనార్హం. 1936లో ఓసారి జట్టు ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లినపుడు అప్పటి కెప్టెన్ విజయ్ ఆనంద గజపతి రాజు (విజ్జీ)తో ఏర్పడిన విభేదాలు తీవ్రస్థాయికి చేరడంతో లాలా అమర్‌నాథ్‌ను స్వదేశానికి రప్పించారు. 1996లో నవ్‌జ్యోత్ సింగ్ సిద్ధూ అప్పటి కెప్టెన్ అజరుద్దీన్‌తో గొడవపడి ఎవరికీ చెప్పకుండానే భారత్‌కు తిరిగొచ్చాడు. దీంతో అతడి రూమ్మేట్ గంగూలీ లార్డ్స్ టెస్టులో అరంగేట్రం చేసి జట్టులో సుస్థిర స్థానం దక్కించుకున్నాడు. ఆ తర్వాత సిద్ధూ మరో రెండేళ్లు జట్టుకు ఆడాడు.

టెన్నిస్‌కు ఆండీ మర్రే గుడ్ బై

ఆస్ట్రేలియన్ ఓపెన్ చివరిదని ప్రకటన

ఈ బాధతో ఇక ఆడలేను



మెల్‌బోర్న్: బ్రిటన్ దిగ్గజం ఆండీ మర్రే అనూహ్యంగా టెన్నిస్‌కు గుడ్‌బై చెప్పాడు. వచ్చే వారం ప్రారంభమయ్యే ఆస్ట్రేలియన్ ఓపెనే తన చివరి టోర్నీగా ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఈమేరకు శుక్రవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడిన మర్రే.. తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని కన్నీటి సుడుల నడుమ వెల్లడించాడు. వాస్తవానికి స్వదేశంలో, తనకెంతో ఇష్టమైన వింబుల్డన్ అనంతరం వైదొలగాలనుకున్నానని, కానీ తుంటి గాయం రేపుతున్న బాధను తట్టుకోలేక తక్షణం రిటైర్మెంట్ ప్రకటిస్తున్నట్టు వివరించాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో అన్‌సీడెడ్‌గా బరిలోకి దిగుతున్న ఆండీ.. తొలి రౌండ్‌లో స్పెయిన్‌కు చెందిన 22వ ర్యాంకర్ రాబెర్టో బౌటిస్టాను ఢీకొనాల్సి ఉంది. 'వింబుల్డన్ వరకూ ఆగాలనుకున్నా. కానీ తుంటి గాయం తీవ్రంగా భాదిస్తుండడంతో మరో 4,5 నెలలు ఆడలేని పరిస్థితి ఏర్పడింది. అందుకే రిటైర్మెంట్ నిర్ణయం తీసుకున్నా' అని 31 ఏళ్ల మర్రే బోరుమన్నాడు.

ఆ త్రయం ఎరాలో నెంబర్ వన్..



రోజర్ ఫెదరర్, రఫెల్ నడాల్, నొవాక్ జొకోవిచ్‌ల దిగ్గజ త్రయం ప్రపంచ టెన్నిస్‌ను శాసిస్తున్న కాలంలో ఆండీ మర్రే నెంబర్ వన్‌గా నిలిచాడంటే అతడి సత్తా ఏపాటిదో అర్థమవుతుంది. మూడేళ్ల ప్రాయంలో టెన్నిస్ ర్యాకెట్ చేతబట్టిన అతడు 14 ఏళ్ల కెరీర్‌లో ఎన్నో మైలురాళ్లను చేరుకున్నాడు. విద్యార్థి దశలో ఫుట్‌బాల్ అంటే పిచ్చి అభిమానం కలిగిన మర్రే..15 ఏళ్ల వయస్సులో తల్లి జూడీ ప్రోద్బలంతో ప్రఖ్యాత బార్సిలోనా క్లబ్‌లో చేరి శిక్షణ కూడా పొందాడు. కానీ..తర్వాత టెన్నిస్‌లో అడుగుపెట్టి 2005లో ప్రొఫెషనల్‌గా మారాడు. 2008లో యూఎస్ ఓపెన్ ఫైనల్‌కు చేరినా..ఫెడరర్ చేతిలో ఓడాడు. 2010 ఆస్ట్రేలియన్ ఓపెన్ తుది సమరంలో, 2012 వింబుల్డన్ టైటిల్ ఫైట్‌లో మళ్లీ ఫెడెక్స్ చేతిలో ఓడడంతో ఇక తనకు గ్రాండ్‌స్లామ్ దక్కే యోగం లేదని మర్రే ఎంతో బాధపడ్డాడు. తర్వాత మేటి ఆటగాడు ఇవాన్ లెండిల్ శిక్షణలో రాటుదేలిన ఆండీ.. 2012లో యూఎస్ ఓపెన్ ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ జొకోవిచ్‌ను కంగుతినిపించి కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్ అందుకున్నాడు. తద్వారా 1936లో ఫ్రెడ్ పెర్రీ తర్వాత యూఎస్ ఓపెన్ గెలిచిన తొలి బ్రిటన్ ప్లేయర్‌గా చరిత్ర సృష్టించాడు. 2013, 2016లో వింబుల్డన్ కిరీటాన్ని మర్రే సొంతం చేసుకొని సొంతగడ్డపై గ్రాండ్‌స్లామ్ కలను నెరవేర్చుకున్నాడు. 2012 (లండన్), 2016 (రియో) ఒలింపిక్స్‌లో స్వర్ణాలు గెలుచుకున్న ఆండీ.. 2016లో నెంబర్ వన్ ర్యాంక్ చేజిక్కించుకున్నాడు. 2017లో తుంటి గాయంతో టెన్నిస్‌కు దూరమైన మర్రే తన నెంబర్ వన్ ర్యాంక్‌నూ ఫెడరర్‌కు కోల్పోయాడు. మర్రే హఠాత్తు రిటైర్మెంట్ నిర్ణయంతో విస్మయం చెందిన పలువురు ఆటగాళ్లు అతడి ప్రతిభను వేనోళ్ల కీర్తించారు.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

కోహ్లీ, శాస్త్రిలకు ఎస్‌సీజీ సభ్యత్వం

సిడ్నీ: క్రికెట్ రంగానికి చేసిన సేవలకు గుర్తింపుగా భారత కెప్టెన్ విరాట్ కోహ్లీ, రవి శాస్త్రిలకు శుక్రవారం సిడ్నీ క్రికెట్ గ్రౌండ్ గౌరవ సభ్యత్వం అందజేశారు. సచిన్ టెండూల్కర్, బ్రయన్ లారాల తరువాత ఈ గౌరవం అందుకున్న ఆస్ట్రేలియేతర క్రికెటర్లు కోహ్లీ, శాస్త్రినే.



శభాష్.. ధనుష్

ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో స్వర్ణం

సుప్రియ, దీప్తి, సాహితి, యశ్‌లకు పతకాలు



యశ్



సుప్రియ, దీప్తి,

పుణె: ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో తెలుగు క్రీడాకారులు సత్తాచాటారు. హైదరాబాద్‌కు చెందిన 16 ఏళ్ల ధనుష్ శ్రీకాంత్ షూటింగ్‌లో స్వర్ణంతో మెరిశాడు. ఇతడు జూనియర్ ప్రపంచకప్ పతక విజేతను ఓడించి మరీ పతకం కొల్లగొట్టడం విశేషం. శుక్రవారం జరిగిన బాలుర అండర్-21 విభాగంలో పది మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో ధనుష్ ఫైనల్లో 248.9 పాయింట్లు స్కోరు చేసి అగ్రస్థానంతో పసిడి పతకాన్ని దక్కించుకున్నాడు. ధనుష్ జోరుతో పంజాబ్‌కు చెందిన రెండుసార్లు జూనియర్ ప్రపంచకప్ పతక విజేత అర్జున్ బబుత (225.6) కాంస్య పతకానికి పరిమితమయ్యాడు. గోవా షూటర్ యశ్ యోగేశ్ (247.6)కు రజతం దక్కింది. సికింద్రాబాద్‌లోని తిరుమలగిరికి చెందిన ధనుష్ గతేడాది వరకు వినికిడి లోపంతో బాధపడేవాడు. శస్త్రచికిత్స తర్వాత ఇప్పుడు ఆ సమస్య నుంచి బయటపడ్డాడు. ఇక అథ్లెటిక్స్‌లో అండర్-21 మహిళల 100 మీటర్ల రేసులో ఏపీ అమ్మాయి సుప్రియ రజతం నెగ్గగా.. అండర్-17 మహిళల 100 మీటర్లలో తెలంగాణకు చెందిన దీప్తి రజతం గెలుచుకుంది. ఇక వెయిట్‌లిఫ్టింగ్‌లో తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థిని సాహితి 59 కిలోల విభాగంలో కాంస్య పతకం దక్కించుకుంది. స్విమ్మింగ్‌లో 400 మీటర్ల మెడ్లేలో తెలంగాణ కుర్రాడు యశ్ వర్మ కాంస్య పతకం గెలిచాడు.



వన్డే సిరీస్ ట్రోఫీతో కెప్టెన్లు ఫించ్, విరాట్

అవును.. ఇది ప్రపంచ కప్ నామ సంవత్సరమే. మరో నాలుగున్నర నెలల్లో జరిగే ఈ ప్రతిష్ఠాత్మక ఈవెంట్‌కు ముందు భారత్ 13 వన్డేలు ఆడనుంది. తమ అస్త్రశస్త్రాలను సరిచూసుకునేందుకు ఈ మ్యాచ్‌లన్నీ జట్టుకు కీలకమే.. ముందుగా 'మిషన్ వరల్డ్‌కప్'లో భాగంగా విరాట్ సేన ఆసీస్‌తో మూడు వన్డేల సిరీస్ ఆడబోతోంది. శనివారమే తొలి మ్యాచ్. ఏడు దశాబ్దాల తర్వాత ఆసీస్ నేలపై చరిత్రాత్మక టెస్టు సిరీస్ నెగ్గిన జోష్‌లో ఉన్న భారత జట్టు ఇప్పుడు సిడ్నీలో వన్డే సిరీస్ ఆరంభ మ్యాచ్ కూడా ఆడనుంది. తమకు మధురానుభూతిని మిగిల్చిన ఎస్‌సీజీలో బోణీ కొట్టి ఆధిక్యం సాధించాలని చూస్తోంది.

ఆసీస్‌లో విజయాలు అంతంతే

ఆస్ట్రేలియా గడ్డపై వన్డే ఫార్మాట్‌లో భారత్‌కు పేలవ రికార్డే ఉంది. ఎప్పుడో 1985లో వరల్డ్ చాంపియన్‌షిప్‌ను నెగ్గడంతో పాటు 2008 సీబీ సిరీస్‌ను దక్కించుకుంది. ఇక ఇక్కడ ఆడిన మొత్తం 48 వన్డేల్లో 35 మ్యాచ్‌లను ఓడిపోయింది. దీంతో పాటు ధోనీ కెప్టెన్సీలో 2016లో చివరిసారిగా ఇక్కడ పర్యటించిన భారత జట్టు ఐదు వన్డేల సిరీస్‌లో 1-4తో చిత్తుగా ఓడింది. రోహిత్ (441), కోహ్లీ (381) మెరుగ్గా రాణించారు. అయితే ఈసారి స్మిత్, వార్నర్‌తో పాటు కీలక బౌలర్లు కూడా ఆసీస్ జట్టులో లేకపోవడంతో భారత్ పైచేయి సాధించాలనుకుంటోంది.

ఉదయం 7.50 గం.నుంచి సోనీ సిక్స్‌లో..

మిషన్ వరల్డ్‌కప్

నేటి నుంచి ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్ ● ఫేవరెట్‌గా భారత్



1 పేసర్ భువనేశ్వర్ మరో వికెట్ తీస్తే వన్డేల్లో వంద వికెట్ల క్లబ్‌లో చేరతాడు.

2 సిడ్నీలో ఇరుజట్ల మధ్య 16 వన్డేలు జరగగా, భారత్ రెండు మాత్రమే గెలిచింది. ఆసీస్ 13 నెగ్గింది. ఇక్కడ చివరిగా భారత జట్టు 2016లో 331 లక్ష్యాన్ని ఛేదించింది.

65 వన్డేల్లో 5 వేల రన్స్ కోసం ధవన్ 65 పరుగుల దూరంలో ఉన్నాడు.

సిడ్నీ: ఆస్ట్రేలియా జట్టు ప్రపంచకప్ చాంపియన్.. ఇప్పుడు భారత్‌తో వన్డే సిరీస్ ఆడబోతోంది. అదీ సొంతగడ్డపై. మామూలుగా ఇలాంటి స్థితిలో ఆసీస్‌నే ఫేవరెట్‌గా చెప్పవచ్చు. కానీ పరిస్థితి అలా లేదు. శనివారం జరిగే తొలి డే అండ్ నైట్ మ్యాచ్‌లో ఆతిథ్య జట్టు అండర్‌డాగ్స్‌గా కనిపిస్తుండగా, పటిష్ఠమైన బ్యాటింగ్ లైనప్ కలిగిన భారత్‌దే పైచేయిగా ఉంది. టెస్టుల్లోలాగే వన్డే ఫార్మాట్‌లోనూ ఆ జట్టు పరిస్థితి ఏమీ బాగాలేదు. తమ చివరి 24 వన్డేల్లో ఆ జట్టు గెలిచింది మూడు మ్యాచ్‌లే. ఇక సిరీస్‌కు ముందే పాండ్యా, రాహుల్ రూపంలో అనవసర తలనొప్పిని ఎదుర్కొంటున్న భారత్.. తమ ప్రదర్శనపై ఆ ప్రభావం పడకుండా ఉండాలని చూస్తోంది.

మిడిలార్డరే సమస్య: ఓపెనర్లుగా రోహిత్, ధవన్‌ల ఫామ్‌తో పాటు వన్‌డౌన్‌లో కోహ్లీ ధమాకా విషయంలో ఎలాంటి అనుమానం లేదు. కానీ మిడిలార్డర్ బ్యాటింగ్ ఆందోళనపరుస్తోంది. నాలుగు నుంచి ఏడు స్థానాల్లో మెరుపులు కనిపించడం లేదు. ప్రపంచకప్ సమయానికి ఈ బలహీనతను అధిగమిస్తామని ప్రతీ సిరీస్‌కు ముందు టీమ్ మేనేజ్‌మెంట్ చెబుతూనే ఉన్నా సమస్య తీరడం లేదు. నెంబర్ 4లో అంబటి రాయుడు ఇటీవలి కాలంలో ఆశలు రేపుతున్న బ్యాట్స్‌మన్. ఇప్పుడు అతడికి ఈ సిరీస్ చాలా కీలకం. ఇక ఎంఎస్ ధోనీ తన మేజిక్‌ను కోల్పోతున్నాడు. గతేడాది ఆడిన 20 వన్డేల్లో ఒక్క అర్ధ సెంచరీ లేకుండా 275 పరుగులు చేశాడు. మంచి వ్యూహకర్తగా తిరుగులేని స్థాయిలో ఉన్నా బ్యాటింగ్ మెరుగైతే జట్టు విజయాలకు దోహదపడతాడు. ఈ మూడు మ్యాచ్‌ల్లోనూ విఫలమైతే ధోనీపై విమర్శల దాడి మరింత పెరుగుతుంది. ఇక పాండ్యాపై వేటు కారణంగా 10 ఓవర్లపాటు బౌలింగ్ చేయడంతో పాటు బ్యాటింగ్ కూడా చేయగల ఆటగాడిని కోల్పోయినట్టయింది. అతడి స్థానంలో జడేజాను బరిలో దించనున్నారు. గాయాల కారణంగా కేదార్ జాదవ్ నిలకడగా జట్టులో చోటు దక్కించుకోలేకపోతున్నాడు. ఏదిఏమైనా మిడిలార్డర్‌లో చోటు పక్కా చేసుకోవాలనుకుంటున్న ఆటగాళ్లకు ఈ సిరీస్ సవాల్. బౌలింగ్‌లో బుమ్రా లేకపోవడంతో భువనేశ్వర్ బాధ్యతలు తీసుకోనున్నాడు. ఖలీల్ అహ్మద్, షమి ఇతర పేసర్లు కాగా కుల్దీప్ స్పిన్‌తో ఇబ్బందిపెట్టనున్నాడు.

తీవ్ర ఒత్తిడిలో...: 1980వ దశకంలో తమ ఆటగాళ్లు వేసుకున్న రెట్రో జెర్సీతో బరిలోకి దిగుతున్న ఆసీస్ జట్టు తమ ఆటలోనూ మార్పు రావాలనుకుంటోంది. టెస్టు సిరీస్‌లోలాగే స్మిత్, వార్నర్ లేకపోవడం ఇప్పటికీ జట్టుకు లోటే. దీనికి తోడు పేస్ త్రయం స్టార్క్, కమిన్స్, హాజెల్‌వుడ్‌కు విశ్రాంతినివ్వడంతో బౌలింగ్ కూడా బలహీనంగా మారింది. దీంతో ఎనిమిదేళ్ల తర్వాత పేసర్ పీటర్ సిడిల్ జట్టులోకి వచ్చాడు. మరో పేసర్ బెహ్రెన్‌డార్ఫ్ వన్డే అరంగేట్రం చేయనున్నాడు. నాథన్ లియాన్ ఏకైక స్పిన్నర్‌గా ఉన్నాడు. వికెట్ కీపర్ అలెక్స్ క్యారీ తొలిసారిగా ఓపెనింగ్ చేయబోతుండగా అతడికి జతగా ఫించ్ బరిలోకి దిగుతాడు. ఖవాజా, షాన్ మార్ష్, హ్యాండ్స్‌కోంబ్ మిడిలార్డర్ బాధ్యతలు తీసుకుంటారు. ఆఖర్లో స్టొయినిస్, మ్యాక్స్‌వెల్ మెరుపులు జట్టుకు అవసరం.

జట్లు

భారత్ (అంచనా): రోహిత్ శర్మ, శిఖర్ ధవన్, విరాట్ కోహ్లీ (కెప్టెన్), అంబటి రాయుడు, ఎంఎస్ ధోనీ, కేదార్ జాదవ్, రవీంద్ర జడేజా, భువనేశ్వర్ కుమార్, కుల్దీప్ యాదవ్, ఖలీల్ అహ్మద్, మహ్మద్ షమి.

ఆస్ట్రేలియా: ఫించ్ (కెప్టెన్), క్యారీ, ఖవాజా, షాన్ మార్ష్, హ్యాండ్స్‌కోంబ్, స్టొయినిస్, మ్యాక్స్‌వెల్, పీటర్ సిడిల్, రిచర్డ్‌సన్, లియాన్, బెహ్రెన్‌డార్ఫ్.

పిచ్, వాతావరణం

నాలుగో టెస్టును వర్షం రెండు రోజుల పాటు వెంటాడినా.. ఈ మ్యాచ్‌కు ఇబ్బందేమీ లేదు. శనివారం 30 డిగ్రీల ఉష్ణోగ్రత ఉండనుంది. పిచ్‌పై పచ్చిక కనిపిస్తున్నా భారీ స్కోరుకు అవకాశముంది.

● ఏకైక టీ20 కివీస్‌దే

ఆక్లాండ్: శ్రీలంకపై టెస్ట్, వన్డే సిరీస్‌లు గెలిచిన ఆతిథ్య న్యూజిలాండ్ ఏకైక టీ20లోనూ ఘన విజయం సాధించింది. డౌగ్ బ్రేస్‌వెల్ (44), స్కాట్ కుగ్లెజిన్ (35 నాటౌట్), రాస్ టేలర్ (33) రాణించడంతో.. కివీస్ 35 పరుగులతో లంకను ఓడించింది. తొలుత ఆతిథ్య జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 179 పరుగులు చేసింది. ఛేదనలో ఫెర్గూసన్ (3/21), సోధీ (3/3) దెబ్బకు.. లంక 16.5 ఓవర్లలో 144 రన్స్‌కే ఆలౌటైంది.

● దక్షిణాఫ్రికా 262

జోహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికాతో శుక్రవారం ప్రారంభమైన మూడో టెస్టులో పాకిస్థాన్ బౌలర్లు విశేషంగా రాణించారు. వీరి ధాటికి ఓ దశలో 229/3తో పటిష్ఠంగా కనిపించిన సఫారీలు మరో 33 రన్స్‌కు మిగిలిన 7 వికెట్లను కోల్పోయారు. దీంతో తొలి ఇన్నింగ్స్‌లో ఆ జట్టు 262 పరుగులకు కుప్పకూలింది. మార్క్రమ్ (90) రాణించాడు. అష్రాఫ్‌కు మూడు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఆట ముగిసేసరికి పాక్ తొలి ఇన్నింగ్స్‌లో 9 ఓవర్లలో 17/2 స్కోరు సాధించింది.

మ. 1.30 నుంచి సోనీ-ఈఎస్‌పీఎన్‌లో..



శ్రీకాంత్

ఫైనల్లో బెంగళూరు

బెంగళూరు: తెలుగు షట్లర్లు కిడాంబి శ్రీకాంత్, సాయి ప్రణీత్ అదరగొట్టడంతో బెంగళూరు రాప్టర్స్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన ప్రొ బ్యాడ్మింటన్ లీగ్ తొలి సెమీస్‌ఫైనల్లో బెంగళూరు 4-2తో అవధె వారియర్స్‌ను చిత్తు చేసి వరుసగా రెండోసారి తుదిపోరుకు చేరింది. తొలుత జరిగిన మిక్స్‌డ్ డబుల్స్‌ను అవధె ట్రంప్ మ్యాచ్‌గా ఎంచుకుంది. ఈ పోరులో అశ్విని పొన్నప్ప-క్రిస్టియన్‌సెన్ జోడీ 15-7, 15-10తో ఎల్లిస్, మిల్స్ ద్వయంపై విజయం సాధించి అవధెకు శుభారంభం అందించింది. రెండోదైన పురుషుల సింగిల్స్‌లో సాయి ప్రణీత్ 15-9, 15-4తో లీ డాంగ్ (అవధె)ను ఓడించి ఆతిథ్య జట్టును రేసులోకి తీసుకొచ్చాడు. మూడోదైన పురుషుల సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్ 15-7, 15-10తో ప్రపంచ మాజీ నెంబర్ వన్ సన్ వాన్ హో (అవధె)పై అద్భుతమైన విజయం సాధించి ఇరు జట్ల స్కోరును సమం చేశాడు. ఆఖరి మ్యాచ్‌ను బెంగళూరు ట్రంప్‌గా ఎంచుకుంది. నిర్ణయాత్మకమైన ఈ పోరులో మహమ్మద్ ఎహ్‌సాన్-హింద్రా సెటియవాన్ జోడీ 15-14, 15-9తో యాంగ్ లీ-క్రిస్టియన్‌సెన్ జంటను ఓడించి బెంగళూరును ఫైనల్ చేర్చింది.

పీబీఎల్‌లో నేడు

రెండో సెమీఫైనల్

హైదరాబాద్ x ముంబై (రా. 7 గం)

స్టార్ స్పోర్ట్స్-1 స్టార్ స్పోర్ట్స్ సెలెక్ట్-1లో

వచ్చేనెల 28 నుంచి విశాఖలో బీచ్ వాలీబాల్ వరల్డ్ టూర్

విశాఖపట్నం (స్పోర్ట్స్): అంతర్జాతీయ టోర్నీకి వైజాగ్ నగరం ఆతిథ్యమివ్వనుంది. ఇక్కడి రామకృష్ణా బీచ్‌లో వచ్చేనెల 28 నుంచి మార్చి 3 వరకు బీచ్ వాలీబాల్ వరల్డ్ టూర్ టోర్నీ జరగనుంది. ఈ మేరకు శుక్రవారం జరిగిన కార్యక్రమంలో టోర్నీ లోగో, మస్కట్‌ను ఆవిష్కరించారు. టోర్నీలో 32దేశాల నుంచి క్రీడాకారులు పాల్గొంటున్నట్టు భారత వాలీబాల్ సమాఖ్య సెక్రటరీ జనరల్ రామావతార్ సింగ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ద్రోణాచార్య, అర్జున అవార్డు గ్రహీత రమణయ్య, జీవీఎంసీ కమిషనర్ హరినారాయణన్, లీజర్ స్పోర్ట్స్, ఎండీ దాస్ గుప్తా, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.



బాల్ బ్యాడ్మింటన్‌లో ఏపీ హవా

నెల్లూరు (క్రీడలు): జాతీయస్థాయి పాఠశాల క్రీడా సమాఖ్య బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు సత్తాచాటింది. ఈ పోటీల్లో ఆతిథ్య ఏపీ జట్టు అండర్-14, 17, 19 విభాగాల్లో చాంపియన్‌గా నిలిచి అదరగొట్టింది.



శ్రీనివాసరావును కోర్టుకు తరలిస్తున్న పోలీసులు

ఎన్ఐఏ కస్టడీకి కోడికత్తి నిందితుడు

- వారంపాటు ప్రశ్నించేందుకు అనుమతి
- విజయవాడ కోర్టుకు నిందితుడు
- జిల్లా జైలుకు తరలింపు, ప్రత్యేక బ్యారక్ ఏర్పాటు

విజయవాడ/ఆరిలోవ(విశాఖపట్నం), జనవరి 11(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు జగన్‌పై విశాఖ విమానాశ్రయంలో కోడికత్తితో దాడి చేసిన నిందితుడు శ్రీనివాసరావును ఎన్ఐఏ కస్టడీకి అప్పగిస్తూ విజయవాడ కోర్టు శుక్రవారం ఆదేశాలిచ్చింది. అతడిని వారంపాటు ప్రశ్నించేందుకు అనుమతిచ్చింది. దీంతో శనివారం ఉదయం 10 గంటలకు ఎన్ఐఏ అధికారులు నిందితుడిని అదుపులోకి తీసుకోనున్నారు. ఎన్ఐఏ కోర్టుగా ఉన్న విజయవాడలోని ప్రిన్సిపాల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టుకు ఈ కేసు విచారణ బదిలీ అవడంతో నిందితుడు శ్రీనివాసరావును శుక్రవారం విశాఖ నుంచి కట్టుదిట్టమైన భద్రత నడుమ తీసుకొచ్చారు. న్యాయమూర్తి ఈ నెల 25 వరకూ రిమాండ్ విధించడంతో గాంధీనగర్‌లో ఉన్న జిల్లా జైలుకు తరలించారు. నిందితుడికి రిమాండ్ ఖైదీ నంబరు 87 కేటాయించి, ప్రత్యేక బ్యారక్‌లో ఉంచారు. అంతకుముందు అతడిని కస్టడీకి అప్పగించాలని ఎన్ఐఏ అధికారులు కోర్టులో పిటిషన్ వేశారు.

హైకోర్టులో ఆరా!

కోడికత్తి దాడి కేసును ఎన్ఐఏకు అప్పగించడంపై అసంతృప్తితో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం.. తదుపరి కార్యాచరణపై న్యాయనిపుణులను సంప్రదిస్తోంది. అయితే వైసీపీ శ్రేణులు సుప్రీంకోర్టు, హైకోర్టులో కేవియట్ పిటిషన్లు దాఖలు చేశాయి. కేంద్రం నిర్ణయాన్ని ఎవరైనా సవాల్ చేస్తే ఆదేశాలిచ్చే ముందు తమ వాదనలు కూడా వినాలని ఆ పిటిషన్లలో కోరాయి. ఈ నేపథ్యంలో అప్పీలుపై ఆరా తీసేందుకు వైసీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి హైకోర్టుకు వచ్చారు.

చర్చి ప్రహరీలకు ప్రభుత్వ నిధులే

- బాలికల డైట్‌చార్జీ రూ.9.50 పెంపు

అమరావతి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మైనారిటీ సంక్షేమ శాఖ ద్వారా రాష్ట్రంలోని చర్చిల ప్రహరీల నిర్మాణం కోసం ఇక నుంచి రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి సహకారం అందించనుంది. గతంలో చర్చిల ప్రహరీ నిర్మాణాల కోసం స్థానికులు 10% భాగస్వామ్యం వహిస్తే.. మిగిలిన 90% మైనారిటీ సంక్షేమశాఖ భరించేది. క్రిస్మస్ సందర్భంగా ముఖ్యమంత్రి ఆ 10% కూడా ప్రభుత్వమే భరిస్తుందని హామీ ఇవ్వడంతో ప్రభుత్వం ఆ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. అదేవిధంగా ఐసీడీఎస్ పథకం ద్వారా కౌమార బాలికలకు ఇచ్చే పోషకాహార డైట్ చార్జీలను పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో 257 ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లో 11-14 ఏళ్ల బాలికలకు రోజుకు రూ.9.50కు డైట్ చార్జీలు పెంచారు. గురుకులాల్లో 296 కొత్త మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటుకు గిరిజన సంక్షేమశాఖ ఉత్తర్వులు జారీచేసింది. కొత్త ఆర్వో ప్లాంట్లతో పాటు ఇప్పటికే ఉన్న 405 వాటర్‌ప్లాంట్ల నిర్వహణకు రూ.17 కోట్లు మంజూరు చేసింది.

వివాదాల 'బరి'..

రాజుకుంటోంది!

- పందేలకు అనుమతి లేదన్న పోలీసులు
- డింకీ పందేలను ప్రారంభించిన నేతలు

భీమవరం, జనవరి 11: కోడి పందేల క్రీడ మళ్లీ మొదలయ్యింది. పందేలు నిర్వహించరాదంటూ పోలీసులు ప్రచారం చేస్తున్నారు. అక్కడక్కడా కేసులు కూడా నమోదు చేస్తున్నారు. పందేల రాయుళ్లూ బహిరంగంగానే పందేలు వేస్తున్నారు. వారం రోజులుగా పశ్చిమ గోదావరి జిల్లాలో కోడి పందేల వ్యవహారం గరంగరంగా మారింది. జిల్లాలో ఏటా 400 ప్రాంతాల్లో కోడిపందేలు జరుగుతుంటాయి. గతానుభవాల దృష్ట్యా మళ్లీ న్యాయస్థానం జోక్యం చేసుకుంటుందనే ఉద్దేశంతో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. వీరవాసరం, కాళ్ల, మొగల్తూరు, జంగారెడ్డిగూడెంలో కొన్నిచోట్ల బరులను పోలీసులు అడ్డుకున్నారు. అయితే ఎన్నికల ఏడాది కావడంతో భోగి నాటికి పందేలను ఎవరూ ఆపలేరన్న ధీమా అందరిలోనూ వ్యక్తమౌతుంది. పారిశ్రామికవేత్త, టీడీపీ నాయకుడు కనుమూరి రఘురామకృష్ణంరాజు ఇప్పటికే సంప్రదాయ కోడిపందేలను నందమూరు గరువులో ప్రారంభించి స్థానికులను ఉత్సాహపరిచారు.



పందేలను ప్రారంభిస్తున్న మంత్రి పితాని


పందేలు ప్రారంభించిన పితాని

పోడూరు: పోడూరు జడ్పీ హైస్కూల్ గ్రౌండ్‌లో శుక్రవారం మంత్రి పితాని సత్యనారాయణ అనంతలక్ష్మి దంపతులు సంక్రాంతి సంబరాలను ప్రారంభించారు. బోగిమంటలు వేసి, గోవులకు పూజలు చేశారు. బుట్టబొమ్మలు, బొమ్మల కొలువు, హరిదాసు కీర్తనలతో సంక్రాంతి సంబరాలు హోరెత్తాయి. సంక్రాంతి సంబరాలకు తన ఇంటి నుంచి రెండెడ్ల బండిపై సంప్రదాయ దుస్తుల్లో వచ్చిన మంత్రి.. చిన్నారులతో కలిసి డ్యాన్సులు వేశారు. సంప్రదాయ కోడి పందేలను ప్రారంభించారు.

రాష్ట్రంలో ఒంటరి పోరే!

- టీడీపీతో పొత్తుపై కాంగ్రెస్‌లో భిన్నాభిప్రాయాలు
- తెలంగాణ ఫలితాలతో అధికుల్లో మారిన స్వరం

అమరావతి, హిందూపురం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కలిసి పోటీ చేసినా.. జాతీయ స్థాయిలో బీజేపీకి వ్యతిరేకంగా చేతులు కలుపుతున్నా.. రాష్ట్రంలో మాత్రం టీడీపీ, కాంగ్రెస్ వేర్వేరుగానే పోటీ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాష్ట్ర కాంగ్రెస్ నేతల స్వరంలో వస్తున్న మార్పే ఇందు కు కారణం! అయితే, పొత్తులపై పార్టీ అధిష్ఠానానిదే తుది నిర్ణయం. ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ గురువారం 29 రాష్ట్రాల పీసీసీ చీఫ్‌లతో ఢిల్లీలో సమావేశమయ్యారు. ఇతర రాష్ట్రాల పరిస్థితి ఎలా ఉన్నా... ఆంధ్రలో పరిస్థితి భిన్నంగా ఉందని రాష్ట్ర నేతలు చెబుతున్నారు. రాష్ట్ర విభజన కాంగ్రెస్ పార్టీవల్లే జరిగిందని ప్రజలు ఆగ్రహించడంతో 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్లు కూడా దక్కలేదు. అయితే.. ప్రధాని మోదీ రాష్ట్రానికి అన్యాయం చేశారని ప్రజలు ఇప్పుడు కోపంతో ఉన్నారని, కాంగ్రెస్ పార్టీపై 2014లో ఉన్నంత వ్యతిరేకత, ఆగ్రహం తగ్గి... ఇప్పుడు ఆదరణ పెరుగుతోందని అంటున్నారు. అయితే ఈ పెరిగిన ఆదరణ ఓటు బ్యాంకుగా మారుతుందో లేదో అన్న తర్జనభర్జన కాంగ్రెస్‌లో ఉంది. బీజేపీకి వ్యతిరేక కూటమిని కట్టేందుకు సీఎం చంద్రబాబు ప్రయత్నాలు ముమ్మరం చేస్తూ రాహుల్‌గాంధీతో పలు దఫాలు సమావేశమయ్యారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీతో కలిసి ఎన్నికలకు వెళ్లాలనే నిర్ణయానికీ వచ్చినట్లు వార్తలొచ్చాయి. అయితే.. తెలంగాణలో మహాకూటమిగా ఏర్పడి టీఆర్ఎస్‌పై పోటీ చేసిన వ్యూహం వికటించిందని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. రాష్ట్ర నేతల్లోనూ ఇదే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో... తెలంగాణ ఎన్నికలకు ముందు ఏపీలో నిర్వహించిన సర్వే నివేదికతో పాటు, తెలంగాణ ఎన్నికల ఫలితాల తర్వాత మరో దఫా టీడీపీతో పొత్తుపై నేతల అభిప్రాయాలను పీసీసీ సేకరించింది. మొదటిసారి సేకరించిన అభిప్రాయ సేకరణలోనే పొత్తులపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. రెండోసారి చేసిన అభిప్రాయ సేకరణలో అత్యధికులు టీడీపీతో పొత్తు వద్దని అన్నారు. ఏపీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి ఇదే విషయాన్ని రాహుల్ గాంధీకి వివరించారు. దీంతో, రాష్ట్రంలో టీడీపీతో పొత్తుపై అధిష్ఠానమే నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఈ నెల 20లోగా ఈ విషయంపై స్పష్టత వచ్చే అవకాశముందని అంటున్నారు. అయితే, 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ ఒంటరిగానే బరిలోకి దిగే అవకాశాలున్నాయని ముఖ్య నేతలు చెబుతున్నారు.



ప్రత్యేక హోదా కావాలా? వద్దా?: రఘువీరా

'విభజన హామీల అమలు, ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వడంలో మోదీ విఫలమయ్యారు. వచ్చే ఎన్నికల్లో ప్రత్యేక హోదా కావాలా? వద్దా? అనే విషయం ఆధారంగానే పోటీ ఉంటుంది' అని పీసీసీ చీఫ్ రఘువీరారెడ్డి అన్నారు. శుక్రవారం అనంతపురం జిల్లా హిందూపురంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ... రాహుల్‌గాంధీ ప్రధాని అయితే ప్రత్యేక హోదాపై తొలిసంతకం చేస్తారని, హామీ నెరవేర్చిన తర్వాతే రాష్ట్రంలోకి అడుగుపెడతారని అన్నారు.

'హోదా' ఇస్తాం: రాహుల్

దుబాయ్, జనవరి 11: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా విషయంలో తమది ఒకటే మాట అని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మరోసారి స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ అధికారంలోకి వస్తే ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఏపీకి ప్రత్యేకహోదా ఇస్తామని ఉద్ఘాటించారు. ఈ మేరకు రెండురోజుల పర్యటన నిమిత్తం యూఏఈ వచ్చిన రాహుల్ దుబాయ్‌లోని భారతీయ కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. ఏపీకి ప్రత్యేక హోదా కోసం గత ఏడాది మార్చిలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న వారితో తాను స్వయంగా మాట్లాడినట్టు రాహుల్ వెల్లడించారు. 'ఏపీకి ప్రత్యేక హోదా మేం ఇస్తాం. 2019 ఎన్నికల్లో అధికారంలోకి రాగానే చేసే మొట్టమొదటి పని అదే' అని ఆనాడు తాను హామీ ఇచ్చినట్టు చెప్పారు.



డీఆర్ఎం కార్యాలయం ఎదుట భోగి మంట

రైల్వే జోన్ మంట!

- విశాఖలో భోగిమంటతో వినూత్న నిరసన

విశాఖపట్నం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): విశాఖ రైల్వేజోన్ ఏర్పాటుపై కేంద్రం వైఖరిని ఆక్షేపిస్తూ నాన్ పొలిటికల్ జేఏసీ శుక్రవారం వినూత్న రీతిలో నిరసన వ్యక్తంచేసింది. వాల్తేర్ డీఆర్ఎం కార్యాలయం ఎదురుగా భోగి మంట వేసి.. జోన్‌కు సంబంధించి విభజన చట్టం 13వ షెడ్యూల్‌లో పేర్కొన్న అంశాల ప్రతులను దహనం చేసింది. తెలుగు ప్రజల గుండె మంట ప్రధాని మోదీకి తగిలేలా ఈ భోగి మంటలు వేశామని జేఏసీ ప్రతినిధులు ప్రకటించారు. ఈ సందర్భంగా మంత్రి గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల చిరకాల కోరిక.. రైల్వే జోన్ ఇస్తారని నాలుగున్నరేళ్లుగా ఎదురుచూశామన్నారు. ఈ నెల 9వ తేదీతో పార్లమెంట్ సమావేశాలు ముగించడంతో జోన్ ప్రస్తావన మరుగున పడినట్లయిందన్నారు. జోన్ తీసుకువస్తామని, లేకపోతే తమ ఓటమిగా భావించాలని విశాఖ ఎంపీ కంభంపాటి హరిబాబు చెప్పారని, అయినా ఫలితం లేకపోయిందని ఆక్షేపించారు. విభజన చట్టంలోని అంశాలను అమలు చేయకపోతే ఆ కాగితాలకు విలువ లేనందున భోగి మంటల్లో వేశామని మంత్రి చెప్పారు. విశాఖలో పాదయాత్ర చేసిన విపక్ష నేత జగన్, కనీసం జోన్ గురించి ప్రస్తావించలేదని విమర్శించారు.

ప్రాణాలు తీసిన పందేలు

- కోడి పందేలపై పోలీసులు దాడి
- పారిపోతూ నేలబావిలో పడి ఇద్దరు మృతి.. చిత్తపూరులో విషాదం



శ్రీనివాసరావు, చెన్నకేశవరావు

చాట్రాయి, జనవరి 11: కోడి పందేలకు పోలీసుల అనుమతి లేదు. అలాగని ఎక్కడా ఆగడం లేదు. పందేలు యథేచ్ఛగా జరిగిపోతుండగా.. అక్కడక్కడా పోలీసులు దాడులు చేస్తున్నారు. ఈ దాగుడుమూతలే.. ఇద్దరి యువకుల ప్రాణాలు తీశాయి. కృష్ణా జిల్లా చాట్రాయి మండలం చిత్తపూరు గొల్లగూడెంలో గత కొన్ని రోజులుగా పందేలు జరుగుతున్నాయి. పగలూ రాత్రీ తేడా లేకుండా ఫ్లడ్ లైట్ల వెలుతురులోనూ పందేలు వేస్తున్నారు. గురువారం రాత్రి కూడా కోడి పందేలు జోరుగా సాగుతుండగా చాట్రాయి పోలీసులు హఠాత్తుగా దాడి చేశారు. దీంతో పందేల రాయుళ్లంతా తలోదిక్కుకూ పరుగులు తీశారు. పారిపోతున్న వారిలో చిత్తపూరు శివారు వీరయ్యనగర్‌కు చెందిన చిట్టూరి శ్రీనివాసరావు, విస్సన్నపేట మండలం కొండపర్వకు చెందిన కుక్కల చెన్నకేశవరావు (26) ఆ చీకట్లో నేల బావిలో పడిపోయారు. బావిలో పడిపోయి కేకలు వేస్తున్న ఆ యువకులను రక్షించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. నీరు నిండుగా ఉండటంతో ఇద్దరూ నీటిలో మునిగిపోయి, చనిపోయారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మృతదేహాలను వెలికితీశారు. మృతుల్లో చిట్టూరి శ్రీనివాసరావు అవివాహితుడు కాగా కుక్కల చెన్నకేశవరావుకు వివాహం అయ్యింది. ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107
Editor : K. Srinivas, RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.**